గాంధి - గాంధీతత్వము

(రెండవ సంపుటము)

1346

రచయిత:

డాక్టరు, భోగరాజు పట్టాభిసీతారామయ్య

అనువాదకులు:

కొడాలి ఆంజనేయులు

ప్రభాత ప్రచురణ సమితి
ఖమ్మంమెట్టు (నైజాం)

ప్రభాశ ప్రచురణము 5

10351

ప్రథమ ముద్రణము

2000 ప్రతులు

మే 1947

వెల రు 4-0-0

ముద్రాపకులు :

రామా ప్రెస్ శికింద్రాబాద్.

విషయసూచిక

అధ్యాయము		పేజి
10	గాంధీజం-సోషలిజం	1
11	భారతదేశ గ్రామము	62
12	ఆర్థికాభివృద్ధి	84
13	అఖిలభారత గ్రామపరిశ్రమల సంఘం	130
14	విద్యాపునర్నిర్మాణం	172
15	సంఘన్యాయ్యం	200
16	సాంఘిక సామగస్యం	215
17	నైతికౌన్నత్యము-మద్యనిషేధము	233
18	స్వరాజ్యంలో ఇండియాదృశ్యం	269
19	ముగింపు	282
	అనుబంధము ౧	321
	అనుబంధము ౨	327

గాంధి - గాంధీ తత్వము

సంపుటము 2

అధ్యాయము 10

గాంధీజం - సోషలిజం

సోషలిజం

ప్రపంచ పరిణామంలో ఏక జీవకణ సూక్ష్మాతిసూక్ష్మ జంతువు మొదలు సర్వాంగసుందరమైన మానవుని వరకునూ గల దశా పరివర్తనాలను విచారించిన యెడల, సృష్ట్యాదిని జలచర జంతువులును, తరువాత జలచర, భూచరములును, పిదప కేవల భూచరములు, పిమ్మట చతుష్పాద మృగములు, అటుపిమ్మట ద్విపాద మానవాకార జంతువులు, తుదకు మానవుడు జనించినట్లుగా తేలగలదు. ఆకాశంలో తిరిగే పక్షులకు గూళ్ళు, పొలాలలో తిరిగే జంతువులకు బొర్రెలు, ఉన్నట్లే మానవులకు చిన్న చిన్న గుడిసెలో లేక ఆకాశాన్ని అంటే పెద్ద పెద్ద మేడలో వున్నవి. అడవిమృగాలాహారంకోసం రాత్రిళ్ళు సంచారం చేసి, పగలు పొదలలోనో, బిలాలలోనో, గుహాలలోనో నివసిస్తూన్నవి. అవి ఒకదానిమీద ఒకటి వైరముతో తమ బలా

ధిక్యతవల్ల జీవిస్తూన్నవి. బలం లేని జంతువులు నశించి పోతూన్నవి. మనిషి పరస్పర సహకారబుద్ధిని పెంపొందించుకొన్నాడు. కాని పశ్చిమ దేశాల యంత్ర నాగరికతలో ఆ పూర్వపు స్పర్ధాయుగమునాటి చిహ్నాలింకా మిగిలి ఉన్నవి. ముఖ్యంగా ఐరోపా అమెరికా ఖండాలలో, ఒక మనిషికి నష్టదాయకంగా మరొకడు జీవించవలసి ఉండగా, ఒక జాతిని మఱొక జాతి దోచుకొని తినేపద్ధతికూడా నడుస్తూన్నది. పాశ్చాత్య దేశాలు ప్రాచ్యదేశాలతో పోటీ పడడమేగాక తమలో తాముకూడా పోటీపడి నిరంతర సంగ్రామాలకు పాల్పడుతూన్నవి. ఈనిరంతర సంగ్రామ యుగంలో దేశాలమధ్య ఏర్పడిన తగవులను పరిష్కరించుకోవడానికి యుద్ధాలు ధర్మమార్గాలుగా పరిణమించినవి. అందువల్ల మనిషి తన సాహచర్య భావాన్ని విచ్ఛిన్నం చేసుకొని మానవసంహారం నిమిత్తం సంచరిస్తూ, తిరిగీ బొక్కెలలో, గోతులలో, కందకాలలో, నేల అడుగున నివసించవలసిన అవస్థ పట్టింది. ఈ విధంగా నాగరికత మూలమట్టానికి కదిలిపోతూన్నది. కాలం ఒక విధంగా వెనుకటి అనాగరికత వైపుకు తిరిగి పోతూన్నదా అన్నట్లు కనిపిస్తూన్నది.

భారతదేశంలోని విపరీత పరిణామం

ఒక జాతి మరొకజాతిని జయించినప్పుడు, ముఖ్యంగా ఆ విజయం సర్వతోముఖ విజయమైనప్పుడు, పరాధీన జాతి న ప్రధాన సంస్కృతి, నాగరికత, శిల్పకళాకౌశలం, పరి

శ్రమలు, జాతీయ జీవితోద్దేశాలు, ఆదర్శాలు ఈ అన్నిటినీ అచిరకాలంలోనే విస్మరించి, ప్రతివిషయంలోనూ పాలక జాతిని అనుసరిస్తుంది. ఇందుకు తార్కాణం భారత దేశం. మొదటి భారత స్వాతంత్ర్య సమరం జరిగిన ఎనభై ఏండ్లలో పాశ్చాత్య సంస్థల సంపర్కంవల్లను, పాశ్చాత్య జీవిత భాషా ప్రభావముల వల్లను, హిందూ దేశంలో సంఘ స్వరూపమే సంపూర్ణముగా మారిపోయింది. కళాశాలలు, న్యాయస్థానాలు, శాసనసభలు- వీటి ద్వారా విద్యా, న్యాయ, శాసన వ్యవహారములలో కలిగిన పరివర్తన మలా ఉండగా పణ్య ప్రదేశములలోకూడ పరరాజ్య ప్రభావం ప్రస్ఫుట మయింది. ప్రజల వేషాచారాలు, పాశ్చాత్య దేశాలనుండి ఒక్కుమ్మడిగా దిగిన పారిశ్రామిక ప్రభువులు పెంపొందించిన యంత్ర వ్యామోహము, గ్రామాలను క్షీణింపజేసి పట్టణాల నభివృద్ధి కావించడమే దీనికి కారణం. భారత దేశము పేదరికంతో కుంగిపోతూన్నప్పటికీ, గ్రామస్థుల నెత్తురు పిండి సంపాదించిన ధనమును పట్టణాలలోని కొన్ని వ్యాపారసంస్థ లలో నిలవజేయడం మూలకంగా పెట్టుబడి సమకూరింది. ఈ పెట్టుబడితో యంత్రాలు, యంత్రాలయాలు స్థాపింప బడ్డవి. ఇంతకుపూర్వం పాశ్చాత్య యంత్ర నిర్మిత సామగ్రుల దిగుమతితో ప్రారంభమైన గ్రామకళా కౌశల వినాశనం వీటి స్థాపనతో పరిసమాప్తి అయింది. ఎంత కాలంనుండో అధికారైశ్వర్యాలను సమభావంతో ఉచితరీతిని నియమించు కొని పెంపొందుతూ, నిరుద్యోగ సమస్యకు తావు లేకుండా

చేసుకొన్న హిందూసంఘం, శతాబ్దాల తరబడి విదేశీ పాలనకు లోనయి పాశ్చాత్య దేశాల నెదుర్కొన్న గడ్డుసమస్యలకు తానుకూడ గురికావలసివచ్చింది. పెట్టుబడిదారీవిధానం పాశ్చాత్య దేశాలలో వ్యాపించినంత ప్రమాదకరంగా ఇండియాలో వ్యాపించి ఉండకపోవచ్చును. కాని, పాశ్చాత్య దేశాలలోని పెట్టుబడిదారీ పద్ధతికి కారణభూతమైన జమీందారీ విధానమే ఇండియాలోకూడా ప్రవేశించి కొద్దిమంది ప్రభువులచేతుల్లో ఐశ్వర్యమంతా ఉండిపోవడమున్నూ, అధికసంఖ్యాకులైన రైతులకు భూమిని ఆక్రమించుకొనే హక్కులు లేక దాస్యజీవితం గడపవలసిరావడమున్నూ తటస్థిస్తూన్నవి. పశ్చిమ దేశాలలో పెట్టుబడిదారీ విధానానికి విరోధంగా ప్రారంభమయిన ఉద్యమమే సోషలిజం. అక్కడి ధనవంతులు తమ రక్షణకోసం తొడుగుకొన్న కవచంగాదది. నిరంతరం విజృంభిస్తూన్న పెట్టుబడిదారీ యత్నాలవలన తటస్థించే చెడుగులను చక్కజేసేనిమిత్తము ద్దేశింపబడిన నూతన సంఘవ్యవస్థ. హిందూదేశపునగరాలు కొంతవరకు పాశ్చాత్య పారిశ్రామిక పద్ధతులనే అనుకరించినవి. ఈ దేశంలోని అన్ని యంత్రాలయ కేంద్రాలలోనూ పనిచేసే కూలీ లందరూ కలసి ఇరవైలక్షలకు మించక పోయినప్పటికీ, వాళ్ల కిళ్ళు కట్టడం, వాళ్లపిల్లలను పెంచడం, వాళ్లచదువు, ప్రసూతి చికిత్సాలయాలు, లాభాలకూ కూలికీ గల పరస్పర బాంధవ్యం, కూలికీ - పనికీ ఉన్న సంబంధం, పనిజేసే గంటలు, సెలవులు ఇవన్నీ ప్రాముఖ్యత వహించి, వీటిముందు

గ్రామాలలో లెక్కకు రాని లక్షలాది ప్రజల నిరుద్యోగ సమస్య మఱుగు పడిపోయింది. పాశ్చాత్య సంస్కారమును, తత్సంబంధములైన ఆర్థిక సిద్ధాంతాలను, సూత్రాలను పరం పరాగతంగా జీర్ణించుకొంటూన్న విద్యావంతులైన యువకులు, పెట్టుబడిదారీ విధానాన్ని వెంబడించివచ్చే సోషలిస్టు భావాలయందు కూడా సహజ పక్షపాతం వహిస్తూన్నారు.

ఇండియాలో సోషలిజం పరుగు

భారత రాజకీయాలలో సోషలిస్టు భావపరివర్తన మిటీవలనే ప్రారంభమైనప్పటికీ, ఒక్క దశాబ్దంలోనే అతివేగంగా అభివృద్ధిపొంది, కాంగ్రెసులో తీవ్రవిభేదాలకు కారణమయింది. కాని, గాంధీ సిద్ధాంతానికి మూలకందమైన అహింస వలన కలిగిన అద్భుత ఫలితా లా భావాలను వెనుకకు నెట్ట గలిగినవి. అహింసా బలాన్ని ఒక్కసారి మనం ఒప్పుకొన్నట్లయితే, ఒక అనంత నూతనశక్తి మన కళ్ళయెదుట ప్రత్యక్షమాతుంది. ఈ సిద్ధాంతంపైన వర్ధిల్లిన సాంఘిక సంస్థ ఒక విద్యుత్పరిశ్రమాలయమై (Electric power house) గాంధీ ప్రవర్తకుడై (Operator) ఆయన అహింసా సత్యములనే విద్యుచ్ఛక్తియంత్రం (Dynomo) ద్వారా పర్వతములను కదిలించగల, సామ్రాజ్యములను పెకలించగల, అంతులేని శక్తిని ఉత్పత్తి చేస్తూన్న సంగతి మనము చూస్తూన్నదే. ఆ శక్తి భూకంపములోవలె, కూలి పూడిపోయిన పూర్వ జాతీయ నాగరిక లక్షణాలను, మోటారు యంత్రములతో త్రవ్వినట్లు త్రవ్వి పైకి లేవనెత్తినది. గాంధీ సోషలిజం కేవలం

భౌతికశక్తిగాదు. ఉపేక్షవల్ల నిస్సారములై కటికిబాఱిన జాతీయ సంస్కార క్షేత్రాలను తిరిగి ఫలవంతాలుగా చేసే నైతిక శక్తి అది. కాని, దాని కాయన త్రికరణ శుద్ధియైన అహింసనే పునాదిగా ఉండాలంటాడు. మన కాంగ్రెస్ వాళ్లు సోషలిస్టు ప్రభుత్వ స్థాపన కావాలంటారు. కాని వారు హింసాపద్ధతివలన దానిని స్థాపించగోరుతున్నారో అహింసా పద్ధతినే అవలంబించ గోరుతూన్నారో మనకు చెప్ప డానికి వెనుకంజ వేస్తారు. అందువలన వారిలో చాలామంది క్రమంగా అహింసా సిద్ధాంతంచేత ఆకర్షింపబడి గాంధీ వర్గంలోనైనా చేరిపోయినారు; లేదా బహిరంగంగా కమ్యూని స్టు తత్వాన్ని చేపట్టి హింసావాదులైనా అయిపోయినారు. వారు సంఘవ్యవస్థలో రెండు భిన్నపద్ధతులను వెల్లడిచేస్తూ న్నారు. సాంఘిక, ఆర్థిక పద్ధతులమీద విభజింపబడి, వివిధ వర్గాల మధ్యను, నిరంతర సమానాధికార ప్రాబల్యముగల సంఘవ్యవస్థ ఒకటి. స్పర్థాహింస లనే నిప్పులపైన, జీవితమనే కాగులో కళపెళలాడే వేడి పొంగులవలన, అట్టడుగు పొరలు నిరంతరం పైపైకి లే ప్రయత్నించడంచేత, ఎప్పటికీ నిలకడ కుదరని సంఘవ్యవస్థ రెండోది.

ప్రభుత్వం సర్వాధికార సంపన్నంగా ఉండవలెనా లేక మానవ వ్యక్తిత్వానికి స్థానమున్నదా, స్పర్థ ప్రధానమా, సహకారం మంచిదా, మానవోన్నతికి దోహదంచేసేది భౌతిక విషయమా ఆధ్యాత్మిక విషయమా, ధనమా, సేవా, అగ్రస్థానం వహించ వలసింది; గృహపరిశ్రమల్లా,

యంత్రపరిశ్రమలా, అభివృద్ధి పొందవలసిందనే విషయాల పైననే నిజంగా ఈనాడు జరుగుతూన్న పోరాటమంతాను.

కాలస్థితి

కాలం మారిపోతున్నప్పుడు కాలానుగుణంగా అతిపురాతన పవిత్రవ్యవస్థలు, ఆచారాలుకూడా మారిపోక తప్పదు. కాని ఎంత ఆకర్షవంతంగా ఉండే మార్పయినప్పటికీ, ప్రజలు గునియకుండా ఆమోదింపజాలరు. ఇవి కేవలం చప్పిడి మాటలుగా కనపడవచ్చును. కాని ఈ చప్పిడి మాటలలోకూడ మానవప్రవర్తనమునకు మార్గదర్శకమైన నిజంలేక పోలేదు. అందువల్లనే ఇప్పుడు హిందూదేశం నూటయాభై సంవత్సరాలనాటి పారిశ్రామిక విప్లవ ఫలితంగా కలిగిన చెడుగులను తుడిచివేయడానికి పాశ్చాత్య దేశాలవారు నిర్ణయించిన మార్గాలను 'తూ' 'చా' తప్పకుండా అవలంబించవలెనా, లేక పురాతన సంఘవ్యవస్థను, దాని కార్యవిధానాన్ని, దాని ధర్మ విభాగమును, దాని గ్రామ నిర్మాణమును సానుభూతితో పునర్విచారణచేసి, తత్ఫలితంగా ౧. జాతీయతా అంతర్జాతీయతలకు ౨. వైశ్యులచే అవలంబింపబడుతూన్న పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక పద్ధతికిన్ని, సోషలిస్టు సిద్ధాంతానికీ, గ్రామసంఘము, సమష్టి కుటుంబము, శ్రమజీవనకులము వీరందటి కాయకష్ట విధానమునకున్నూ 3. జీవితంలో ఆధ్యాత్మిక దృక్పథాన్ని పెంపొందించే మతానికి, భౌతిక వైఖరిని అభివృద్ధిచేసే వైజ్ఞానిక శాస్త్రానికీ ౪. మనుష్యుల నియంతృత్వం కాని ధర్మ నియంతృత్వమునకు, ఆచరణలో కాక వైశా

ల్యంలో పెరిగి పోతూన్న ప్రజాపాలన పద్ధతికి ని. అహింస అనే యజమానికీ బలప్రయోగమనే సేవకునకూ సమన్వయం కుదుర్చుకుంటూ ఉచిత జీవితమును నడపవలెనా, అనే విషయం ఆలోచించుకోవలసిన తరుణం వచ్చింది. పరస్పర విరోధ విషయాల నీ విధంగా ఉచితరీతిని సంవిధాన పరచుకొన్నందువల్ల ప్రస్తుతానికీ భవిష్యత్తుకూ, సిద్ధాంతానికీ అవసరానికీ, ఐహికానికీ పారలౌకికానికి, ఆనందదాయకమైన సామరస్యం కుదురుతుంది. కాబట్టి పాతదైనంతమాత్రాన ఏ పరిష్కారపద్ధతినీ తృణీకరించరాదు. కొత్తదైనంతమాత్రాన ఏ సమస్యనూ పరిష్కరించడానికి వీలు లేనిదిగా భావించకూడదు. ఈపని ఎంత కష్టమో అంత స్వస్థమైనది. కాబట్టి ఈ ధర్మ నిర్వాహణంలో మనం ఉపశమన పద్ధతుల నవలంబించేకంటె, నివారణ విధాన మవలంబించడం మంచిది. ఉపశమనము ఉత్తమమైనదే; కాని నివారణ ముత్తమతరం, ఈ సిద్ధాంతం శరీర రుగ్మత విషయంలోనూ, రాజకీయ రుగ్మత విషయంలోనూ కూడా సరిగా వర్తిస్తుంది. కాబట్టి హిందూ సంఘ నిర్మాణమునకు, దాని ధర్మములకు మూలములైన సిద్ధాంతాలను పరిశీలించవలెననీ, పేదరికాన్ని తొలగించలేక పోయినప్పటికీ, ఐశ్వర్యం ఒకేచోట రాశీభూతంకాకుండానూ, తగినంత పని చూపలేకపోయినప్పటికీ నిరుద్యోగ సమస్య లేకుండానూ, ఆ పూర్వ్వ లేపద్ధతుల నవలంబించి చేయగలిగిరో ఆ పురాతన పద్ధతులను పరీక్షించవలెననీ మాత్రమే మేము కోరుతున్నాము.

రెండు తరహాల నాగరికత

ప్రపంచంలోని నాగరికతను మొత్తంమీద రెండు తరగతు లుగా విభజింప వచ్చును. ఒకటి ఐశ్వర్యంపైన ఆధార పడిన నాగరికత. రెండోది సంస్కృతి లేక పాండిత్యంపైన ఆధారపడిన నాగరికత. లక్ష్మీదేవి చంచలస్వభావం కలదనీ, సరస్వతి అటువంటిది కాదనీ సాధారణంగా అంటూంటారు. హిందూ సంప్రదాయ ప్రకారం లక్ష్మీసరస్వతులకు చాలా కాలంనుండీ తగాదా ఉందని ప్రతీతి. ఈ తగాదాయే భార తీయ నాగరికతకు మూలంగా పరిణమిస్తూన్నది. ఐశ్వర్యము, పాండిత్యము ఇక్కడ వేరువేరుగా ఉంటవి. అలా ఉండడం వల్లనే సంఘంలో అధికారం సరిగా విభజింపబడి సంఘ నియతి చక్కగ నడుస్తూన్నది. ఈ విధంగా పెంపొందిన నాగ రికత, పాశ్చాత్య నాగరికతా దండయాత్రలకు హఠాత్తుగా గురియైనది. పాశ్చాత్య నాగరికతతో పాండిత్యం కంటె ఐశ్వర్యానికి ఉన్నతస్థాన ముంది. అంతేకాక పాండిత్యం ఐశ్వర్య సంపాదనకు పరికరంగా ఉపయోగింపబడుతూన్నది. పాశ్చాత్య నాగరికతా ప్రభావం కిందకు వచ్చిన భారతీయ నాగరికత అపజయం పొందినట్లుగా నేడనేక తార్కాణాలు కనబడుతూన్నవి. చూడండి!

రైతులు పండించి ఉపవాసం చేస్తున్నారు.

సాలీలు బట్టలు నేసి దిగంబరులుగా ఉంటూన్నారు.

సహకారోద్యోగులు అప్పు తీసికొని తిరిగి చెల్లించరు.

డాక్టర్లు రోగులయి చనిపోతూన్నారు.

లాయర్లు వ్యాజ్యాలకోరులై ఓడిపోతూన్నారు.

ఇంజనీయర్లు కట్టుకొన్న ఇళ్లు పడిపోతూన్నవి.
ఉపాధ్యాయుల కొడుకులు చదివి పరీక్ష తప్పుతూన్నారు.
ప్రజాసేవకులని పేరుపెట్టుకొన్న ప్రభుత్వోద్యోగులు జీతాలుపుచ్చుకొని పనిచేయరు.
బ్యాంకులు డిపాజిట్లు పుచ్చుకొని దివాళాతీస్తున్నవి.
ఇన్‌కంటాక్సుఉద్యోగుల్ని కొడుకులు ఇనూరెన్సుఏజంట్లవుతున్నారు.
తల్లి బిడ్డలకు విషం పెడుతూన్నది.
తండ్రి కొడుకులను కొడుతూన్నాడు.

ఏమి చెప్పగలం! కంచె చేను మేస్తూన్నది. నిజానికి ఈనాడు సహచరభావమూ సానుభూతీ నశించి దురాశ పెచ్చుపెరిగింది. వ్యాపారం ఋజువర్తనం లేని జూదంగా మారింది. ధర్మనిష్ఠ మాయమై మోసం హెచ్చింది. యుక్తాయుక్త వివేకజ్ఞానమూ సహజప్రేమాకూడ, క్రోధోద్రేకం ముందు కూలిపోతూన్నవి. పాండిత్యం ఐశ్వర్యానికి దాస్యంచేసే పనిముట్టుగా ఉపయోగ పడుతున్నది. ప్రపంచ సాంఘిక ఆర్థికాభ్యుదయంలో వ్యష్టి, సమష్టి భావాలొకదానికంటె ఒకటి ఆధిక్యత సంపాదించవలెనని ప్రయత్నిస్తూన్నవి. మొదటిది పచ్చి స్వేచ్ఛా వ్యాపార పద్ధతి కావాలంటుంది. రెండోది పూర్తిగా ప్రభుత్వ సోషలిజం కావాలంటుంది. పచ్చి స్వేచ్ఛావ్యాపార పద్ధతిలో యే ఒక్కనికీ సంపూర్ణాధికారాలుండవు. ప్రభుత్వం ప్రత్యేక హక్కుల నీయదు. ప్రత్యేక ధనసహాయం చేయదు. కార్మిక సంఘా లుండవు. సాంఘిక శాసనా లుండవు. వస్తువులను స్వేచ్ఛగా కొనవచ్చు అమ్మవచ్చు. ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడుతూంటుంది; అంతే. 'చౌకగా కొను -

ప్రియంగా అమ్మ' ఇదే దాని నినాదం. లాభాలు వీధులుకట్టి విస్తళ్లు వేయడానికంటారు, కాని, నిజానికి వాటి నెవరూ అంటుకోవడానికి హక్కు లేదు. పూర్తి స్టేటుసోషలిజంలో అద్దె, వడ్డీ, ప్రత్యేక మిరాసీహక్కులు, లాభంకోసం చేసే వ్యాపారం, తేరగా వచ్చే ఆదాయం - ఇవన్నీ ఉండవు. పొలం, ఇళ్ళు, పరికరాలు, ప్రయాణసౌకర్యాలు అన్నీ ప్రభుత్వాధికారంకిందఉంటవి. కూలీలను ప్రభుత్వమేనియమిస్తుంది. అసలు ఖరీదుకే కొంటుంది అద్దెకిస్తుంది. పనిచేస్తామన్నవాళ్ళందరికి పని చూపిస్తుంది. తిని కూర్చుండే భాగ్యవంతులు కనిపించరు. ఎవడూ ధనవంతుడు కాడు. ఎవడూ పేదవాడు కాడు. కష్టఫలమంతా తిరిగి ఉత్పత్తి చేసినవారికే పోతుంది. కాని, నిజం ఆలోచిస్తే సత్యం దీనికి మధ్యగాఉంది.

ఈ విభేదాలకు మూలకారణం ఐశ్వర్యకాంక్ష. ఇది వ్యక్తికీ ఉంది, జాతికీ ఉంది. డబ్బు సంపాదించిన పెట్టుబడిదారింకా డబ్బు కావాలనే అంటాడు. రాజ్యం సంపాదించిన సామ్రాజ్యాధికారి ఇంకొక రాజ్యం కావాలంటాడు. కాబట్టి వెంటనే ఆస్తి, కుటుంబము - ఈ రెంటినీ లేకుండా చేయడం మంచి మందనిపిస్తున్నది. కాని ఆస్తి, వివాహము, మతము ఈ మూటినీ రద్దు చేయ ప్రయత్నించిన రష్యా, ఇరవై రెండేండ్లు గట్టి అనుభవం సంపాదించినమీదట వాటిని పునరుద్ధరించవలసివచ్చింది. ఒక సినీమా బొమ్మలోని అంగ విక్షేపం, సరియైన భావస్ఫురణ కలిగించాలంటే దానితో పాటు నూరు బొమ్మలను చూపించవలసిఉంటుంది. వాటిలో

ఏ ఒక్కటీకూడా ప్రత్యేకంగా ఆభావాన్ని ఫరిస్ఫుటం చేయలేదు. ఆలాగే మనం రష్యా విప్లవాన్నిగూర్చి సమగ్రంగా ఆలోచించాలి కాని, వివిధదశలనూ వేరు వేరుగా చూడకూడదు. వ్యక్తిగత హక్కులు సంఘక్షేమంకోసం వినియోగపడుతూన్నవా లేదా అని యోజించడమే చివరి పరీక్షగా ప్రపంచమంతా ఇంకా ఒప్పుకోవడంలేదు. సెంటు అంబ్రోజ్ ఇలా అన్నాడు.

> భూమండలం అంతా మనుష్యులందరికీ ఉమ్మడి ఆస్తిగా ఉండాలనీ దాని ఫలసాయం అందరూ అనుభవించాలనీ దేవుని కోరిక. దురాశ ఆస్తిపైన అధికారాన్ని సృజించింది, కాబట్టి మానవజాతికి ఉమ్మడిగా ఈయబడిన భూమిపైన సొంతహక్కు కావాలనే వాడు కొంతయినా పేదలకు పంచిపెట్టాలి. సొంతఆస్తి సమష్టిక్షేమంకోసం కాకపోతే దానిని సమర్థించడానికే వీలులేదు. సమష్టి సౌభాగ్యానికి సొంత ఆస్తి దోహదం చేస్తుంటేనే దాని ఉపయోగం. లోకంలో దేవుని శాసనానికి లోబడక యెవ్వడూ యే ఆస్తికీ సంపూర్ణ హక్కుభుక్తాలు గలిగి ఉండడానికి వీలులేదు. అందువల్ల తనహక్కులను చలాయించుకొంటూన్నందుకు ప్రతిఫలంగా దేవునికి తానేమీ ఋణపడి ఉండలేదనుకోవడం తప్పు.

సెంట్ థామస్ ఎక్వినాస్ ఇలా అన్నాడు.

> దేవుడు మానవుని కిచ్చిన ఐహికపదార్థాలతని స్వాధీనంలో ఉంచుకోవడానికి హక్కున్నది. కాని, ఆయన అనుభవించగలిగినదానికంటె ఎక్కువగా ఉన్నప్పుడు, వాటి ప్రయోజనం పొందగలవారికే అవి పోవాలి.

కాబట్టి ఆ స్త్రీగలవాని కతని అవసరాలను తీర్చుకోనేటంత వఱకే ఆ ఆస్తిపైన హక్కున్నది. కాని న్యాయంగా తనకు కావలసిం దనుభవించిన పిమ్మట తక్కినవారి అవసరాలను ఆయన తీర్చాలి. "కలవానికి ధర్మాలు, లేనివానికి హక్కులు" అని చెప్పిన మాట చాలా సమంజసం.

•

"పేదవాళ్ళ కీయడం దాతృత్వం కాదు న్యాయ్యం"_ సంఘన్యాయ్యం - ఇవి ధర్మకాలంలో మాటలు. మనకాలంలో "న్యాయ్యం చేయకపోవడం అయుక్తం. దానం చేసినంత మాత్రాన న్యాయ్యం చేసినట్లు కాదు." అన్నాడు పోప్ పియస్ xi (Pope Pius xi) న్యాయ్యం చేయనివాళ్ళు దానమూ చేయరు.

"సోషల్ ఆర్డరు" పత్రికలో ఒక విలేఖకు డిలా వ్రాస్తూన్నాడు.

> ఈకాలంతో తమ జీవనం గడపడానికి తగినంత ప్రైవేటు ఆస్తియైనా యెంతమందికో లేదు. అంటే బహుతక్కువ ప్రైవేటు ఆస్తి మాత్రమే ఉందన్నమాట. ఇది గొప్ప లోపం. నైతికంగా ఆలోచిస్తే నిజానికి ప్రైవేటు ఆస్తి మాయమైపోయిందని చెప్పవచ్చు. ఎందువల్ల ననగా యే ఆ స్తిమీద ప్రజలు జీవిస్తూన్నారో ఆ ఆస్తి పైన వారికి హక్కులేదు. అంతేకాదు, పాలకులకు ఉండవలసిన జవాబుదారీకూడా వారికి ఉన్నట్లుగా ఎవ్వరూ గుర్తించడంలేదు. అధికైశ్వర్యంగలవారు ప్రైవేటు ఆస్తిని ప్రజలక్షేమంకోసం వినియోగించకపోతే వారి క్షేమాన్ని వారే గుర్తించలేకపోతున్నారు. వారార్తులను దరిచేరనీయరు. వారెన్నడూ పిల్లికి బిచ్చం పెట్టరు. ఇందు

వల్లనే ప్రభుత్వం జోక్యం కలిగించుకోవడం తప్పనిసరి అవుతుంది. ప్రభుత్వం ఆ ర్తరక్షణను పూనుకోక వీలు లేదు. వ్యక్తులకు నైతిక బాధ్యతగా ఉండేది ప్రభుత్వానికి ధర్మం అవుతుంది. ప్రభుత్వ మా ధర్మాన్ని నిర్వర్తించక తప్పదు. ఆస్తికలవాళ్ళు ప్రజారక్షణ బాధ్య తను వహించకపోతే, ఆస్తిమీద అధికారం నశించితీరాలి.

ఇందువల్లనే గాంధీ ఆస్తి కలవాళ్లు కేవలం సంఘానికి ట్రస్టీలని నిరంతరం జ్ఞాపకం చేస్తూంటాడు. అంటే ఆస్తిపైన ఆస్తి కట్టుకోవడం, ఉన్న ఆస్తిని భోగలాలసులై వెచ్చించడం, వారికి కూడని పనులని గాంధీ అభిప్రాయం. తిరువాన్కూరు మహారాజావారు తిరువనంతపురం (త్రివేం డ్రం) పద్మనాభస్వామివారి ట్రస్టీగా రాజ్యపాలనం చేస్తూన్న సంగతి చాలామందికి తెలియకపోవచ్చును.

ప్రభుత్వ సామ్యవాద పద్ధతి

సమష్టియాజమాన్యాన్నిగూర్చి మన మొక్కొక్కప్పు డెక్కడలేని పొగడ్తలనూ వింటూంటాము. కాని పరిపాల నలో పరిశ్రమలలో, విద్యావిషయంలో కనిపిస్తూన్న అధి కారభావమూ, ఒకే మూస్తరు పద్ధతీ, వీటితో సమష్టి యాజ మాన్యసిద్ధాంతం ఎలా సమన్వయం కాగలదో ఆ సంగతి మాత్రం మనకు తట్టడంలేదు. ప్రభుత్వానికిగల మొట్ట మొదటి అండ పోలీసు బలం, ఉద్యోగస్థులబలం. రెండో అండ పత్రికలపైన పెత్తనం. ఈ రెండూ అందులోనూ ఉన్నవి, ప్రజల అనుభవంకోసం కాక ఎగుమతిచేసేటందుకు మాత్రమే ఉత్పత్తి కావించే, పెద్ద పెద్ద పారిశ్రామిక ప్రభు

వులతో నిండిన పెట్టుబడిదారీ సంఘంలోని నిగూఢ బాని సత్వంవంటి ప్రచ్ఛన్నదాస్య భావమే, ప్రభుత్వ సోషలిజ మని పేరు పెట్టుకొన్న దానిలో కూడా ఉంది. వ్యక్తులవి సూదిపోట్లు, సంస్థలవి సమ్మెటపెట్లు. ఇంతే భేదం. ఆల్డస్ హాక్స్లీ(Aldaus Huxley) ఇలా అన్నాడు:

> ప్రభుత్వ సామ్యవాదపద్ధతి పరిపూర్ణంగా స్థాపించబడినప్పుడు, దానం చేయడం కేవలం అనవసరమే కాదు, అపరాధంకూడాను. ప్రభుత్వం సహాయపడవలసిన సందర్భాలలో ధైర్యంచేసి, తాము కల్పించుకొని తమకు తోచినట్లు దయజూపిన తప్పిదానికి, మంచి దాతలుకూడా శిక్షింపబడతారు.

కేవల ప్రజాపాలన పద్ధతికూడా ఈ సాంఘిక దురాచారా లన్నిటికీ చికిత్స కాజాలదు. ఉత్పత్తి చేయడం ధనంకోసమా లేక సేవకోసమా అనేదే మనం నిర్ణయించవలసిన ముఖ్య విషయం. ప్రభుత్వ యాజమాన్యం ఫాసిస్టు పద్ధతికి దారి తీస్తే ప్రజాపాలన విధానం తన ముసుగుకింద సామ్రాజ్య తత్వాన్ని దాచిపెడుతుంది. అప్పుడు ప్రజాపాలన పద్ధతి దానికి సహాయకారి మాత్రమే అవుతుంది. ఇంగ్లాండులో నున్న జ్యేష్ఠానుక్రమణశాసనమును బట్టి, మిల్లులు, ఉద్యాన వనాలు, మృగయా విహారభూములు, ఎస్టేట్లు, అన్నిఆస్తులూ కూడా పెద్దకొడుకుకే సంక్రమిస్తవి. ఇక చిన్నకొడుకులు మిల్లు యేజెంట్లుగానూ, వలస రాష్ట్రాలలో, అధినివేశాలలో స్వాధీనరాజ్యాలలో, గవర్నరులుగానూ ఉండి, వ్యాపారం తమ చేతుల్లో పెట్టుకొంటూరు. ఇక మేనల్లుళ్ళు, అల్లుళ్ళూ టోకు

వ్యాపార ప్రతినిధులుగానో, చిల్లర వ్యాపారస్థులకు సరుకులు సప్లయిచేసే వారుగానో ఉంటారు, బ్రిటనులో నూటికి 8 మంది మాత్రమే వ్యవసాయంవల్ల జీవించేవారు. తక్కినవారంతా పరిశ్రమలవల్లనే జీవిస్తూన్నారు, ఇంగ్లాండు స్కాట్లండు దేశాలు బ్రిటన్ అగంతా ఒక లిమిటెడ్ కంపెనీ. దీనిపేరు బ్రిటిష్ ఎంపైర్ లిమిటెడ్. ఈ కంపెనీ నియమ నిబంధనావళి ప్రకారం దీని ఆదర్శాలు, సామ్రాజ్య విధులు: ముడివస్తువుల సంపాదన, తయారైన వస్తువుల అమ్మకం, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, నైతిక, మానసిక, ప్రాదేశిక యాజమాన్యములను సర్వతోముఖంగావహించి వాటిద్వారా కావలసినన్ని రాజకీయ, సైనికాధికారాలను చేతులలో ఉంచుకోవడం. ప్రభుత్వం గ్యారంటీలు, గ్రాంటులు, బోనస్సులు ఇచ్చి గుంపులు గుంపులుగా కార్మిక వర్గాన్ని సమకూర్చి మంచిపతకం వేసి పని సాగించినప్పుడు, దోపిడి మరీ యథాక్రమంగా నడుస్తుంది. ప్రతి దేశము తన అభ్యుదయాని కవసరమైనపద్ధతి నవలంబించవచ్చును. కాని అది బయటి దేశాలలో కల్లోలం కలిగించేదిగా ఉండకూడదు. అలా ఉన్నట్లయితే ఆ పద్ధతి అంతర్జాతీయ దోపిడీవిధానానికి దారితీస్తుంది.

ఒక పద్ధతిలోఉన్న సంఘాన్ని ఇంకొక పద్ధతిలోకి మార్చాలంటే కన్నుమూసి కన్ను తెరిచేసరికి సాధ్యమయ్యే పనికాదు. అలా సాధ్యం కావాలంటే దౌర్జన్యం రాకతప్పదు. దౌర్జన్యం ద్వారా కలిగిన అభివృద్ధి శరీరంలో పెరిగిన కణితివంటిది. అంతే గాని ఆహారంవల్ల పట్టిన బలంవంటిది కాదు. మొద

టిది అస్వాభావికము రెండోది స్వాభావికము. వెంట వెంటనే ఫలితాలు కలగవలె ననేవాళ్ళు యుద్ధ ప్రియులవలెనే సాహస కార్యాలకు పురికొల్పుతూ పెద్దపెద్ద ఉపన్యాసా లిస్తుంటారు. కాని తాత్కాలికోద్రేకం చల్లారేసరికి ఆ మనుష్యులు మళ్లీ మనకు కనబడరు, వారికి నిర్మాణకార్యవిధాన మంటే గిట్టదు. అందులో చాలా కష్టముందని తలంచి దానినిగూర్చి ఆలోచించనుకూడా ఆలోచించరు. ఇదివరకే హిందూ సంఘం తీవ్ర పరివర్తనాలకు గురియైనది. ప్రజాసేవను పరమధర్మంగా భావించే జాతి మనది. కాని నేడది అధో గతికి పోయింది.

సేవకు బదులుగా ఐశ్వర్యం అగ్రస్థానం వహించడం సంఘానికి మరీ వినాశకరం. మన భారతీయ పురాతన సంఘం సేవకు ప్రాముఖ్య స్థానమిచ్చింది. పాశ్చాత్యు లెప్పుడూ ధనాన్ని పూజిస్తూంటారు. యంత్రాలందుకు కారణం. డబ్బు సంపాదించడానికి వేసేఎత్తులు జూదపు ఎత్తుల వంటివి. నీ చేనుకు న్యాయంగా రావలసినదానికంటె ఎక్కువనీరు, చెరువుకు దొంగతూములుపెట్టి నీవు తీసుకొంటే, నీపక్కవాడూ, నీ ఎదటిచేనువాడూకూడా నీకు తెలియకుండా అదేపని చేస్తాడు, కాబట్టి నీవు చేసినమాయ ఎందుకూ పనికిరాకుండా పోతుంది. కావలసిన దానికంటె దేశంలో డబ్బు తక్కువ చేయడం వల్ల ఎగుమతి వ్యాపారం ఎక్కువగా సాగుతుంది. కాని ప్రతిదేశమూ అంతులేకుండా ఎగుమతులు చేయలేదు. నీదేశంలో ఎంతవరకు ఎగుమతు లెక్కువవుతున్నయ్యో నీ

సరుకులను దిగుమతిచేసుకొనే దేశంలో అంతవరకు ఉత్పత్తి తక్కువవుతూన్నదని అర్థం. అందువల్ల ఈ పద్ధతి చిరకాలం సాగడానికి వీలులేదు. జాతీయత నేడు యుద్ధాలకు కారణమవుతూన్నది. అలా కాకూడదు. అది శాంతికి మూలమవ్వాలి. మన దేశాభివృద్ధికర కార్యక్రమంవల్ల మనకు లాభం కలగాలి నిజమే కాని ఇతర దేశాలకు హాని కలుగకూడదు. కాబట్టి ప్రతి దేశమూ తన క్షేమం తాను చూచుకోవాలి ముందు. రష్యాగానీ ఇటలీ జర్మనీ దేశాలు కాని మనకు వరవడిగా ఉండకూడదు.

•

మన దేశపరిస్థితులను బట్టి మన మాలోచించుకోవాలి. అదే గాంధీ చెప్పేది. ఇండియాకు అనుగుణమైన సోషలిజమూ, అనుకూలమైన అభ్యుదయ కార్యక్రమమూ మనకు కావాలి. అందుకోసం మన సంఘ నిర్మాణమూ దాని ధర్మాలూ తెలుసుకోవాలి. వాటిలో ఇంత వరకు కలిగిన పరివర్తనాలను గ్రహించాలి. సంఘం ఎక్కడికక్కడికి స్వయం సంపూర్ణంగా ఉండే పూర్వ పద్ధతికి పోవాలి మనం. శాంతి కాలంలో అది అభివృద్ధి కారణమౌతుంది. శాంతి కాలమని ఎందుకంటూన్నామంటే, యుద్ధకాలంలో ఎక్కడెక్కడి పరిశ్రమలూ ఒకచోట కేంద్రీకరిస్తేనే గాని వీలు లేదు. ప్రజాపాలనము, సైనిక సన్నాహాలు కలిసిమెలిసి జరగడం అసంభవం. వాటి రెంటికీ బొత్తిగా పడదు. యుద్ధం ప్రారంభం కాగానే ప్రజాపాలనం గాలి కెగిరిపోతుంది. అలా మనం చూస్తూండగానే జరిగింది. ప్రజాపాలనమే పోకపోతే యుద్ధ ఫలితాలు పాడయి

పోతయి. చిన్నచిన్న స్వయం సంపూర్ణ స్వావలంబన ప్రదేశాలు కలసిన సమాఖ్యయే నిజమైన ప్రజాపాలన మనిపించు కుంటుంది. పూర్వం హిందూదేశంలో ఉన్న పద్ధతి అదే ♦

విశ్రాంతి - పని

మన దేశంలో ఇదివరకు నశించిన ఇప్పుడు నశిస్తూన్న చేతి పనులనూ, గృహ పరిశ్రమలనూ పునరుద్ధరిస్తే అందరికీ పని కల్పించవచ్చు నన్నప్పుడు, "పని కల్పించడ మొక్కటే ప్రధానం కాదు, అది తగినంత ప్రతి ఫలమిచ్చేదిగా కూడా ఉండాలి. అలా ఉండకపోతే ఆపని చేయనక్కర లేదు. అందరికీ ఆహారమూ, స్వస్థతా కలిగించి తద్వారా విశ్రాంతిని పెంపొందించడం మాత్రమే ముఖ్యాశయంగా ఉండాలి." అంటారు సోషలిస్టులు, యల్. పి. జాక్సు విశ్రాంతిని ఇలా వ్యాఖ్యానం చేస్తూన్నారు.

> మనిషి ఆత్మను స్వాధీనపఱచుకోవడానికి తెల్లదొరలమధ్య నల్లవాళ్ళ మధ్య, ఎప్పుడు తీవ్రతమమైన పోరాటం జరుగుతూంటుందో ఆ సమయమే విశ్రాంతి అతని జీవితంలో.

విశ్రాంతి వలన మనస్సుకు, శరీరానికీ కూడా సోమరితనం కలుగుతుంది. అది అనేక దుర్బుద్ధులకు హేతువౌతుంది. అదీ అసలు చిక్కు. శరీరకష్టానికి రెండుగంటలు, బుద్ధితో చేసేపనికి ఆరు గంటలూ ఏర్పాటుచేస్తే బాగుండునని ఒక్కొక్కప్పుడు కొందఱు సూచిస్తూంటారు. అయితే బుద్ధితో చేసే పనిని

♦ ఈ విషయాలు 11 వ అధ్యాయంలో వివరంగా ఉన్నవి.

స్వలాభం కోసం వినియోగించుకోవచ్చునా లేక జాతీయ ప్రయోజనంకోసం వినియోగించాలా? అనే ప్రశ్న వస్తుంది. శరీర కష్టంతో చేసేపని లాభంకోసం చేయదలచుకొంటే రెండు గంటలు చేసినందుకు ప్రభుత్వం బాగా మజూరీ యిస్తేనే గాని లేకపోతే సాగనే సాగదు. నిరంతరం శరీర కృషి చేస్తూన్నందువల్ల చెడు ఊహాలు కలగడానికి వీలుండదు. కేవలం శరీర కృషిగాని, కేవలం మానసిక కృషిగానీ విద్య అని చెప్పడానికి వీలు లేదు. వట్టి దాస్యభావంతో అభిరుచిలేని పని చేస్తూన్న కొద్దీ మనిషిలోని సున్నిత భావాలు నశిస్తయి. ఈ విధంగా చూస్తే గ్రామస్థుల జీవితం, జంతు జీవితం కంటె కనా కష్టమనిపిస్తుంది. చేస్తూన్నపనిలో మానసికానందం లేకపోతే, ఆపని పశువు చేసినట్లు చేయడమవుతుంది. కాబట్టి పనీ, బుద్ధి వికాసం - ఈ రెండూ కలిసి ఉండాలి. మానసికోత్సాహం కలిగి చేసే నిరంతర శరీరకృషి- ముఖ్యంగా కళా సృష్టిని ప్రదర్శించే చేతిపనులను చేయడం- బుద్ధిని మొద్దు బారకుండా చేస్తుంది. ఈ సందర్భంలో యంత్రంమీద పనిచేసే పాశ్చాత్య కార్మికునికంటె ఇండియాలోని శిల్పకారు డెక్కువ అదృష్టవంతుడు.

సరియైన కాలంలో సరియైన సమస్యకోసం పనిచేస్తే మన ఉద్యమానికి అది యెక్కువ సహాయకారి అవుతుంది లేదా తప్పుదారిని పడి మన గమ్యస్థానమును చేరలేము. మనము పెట్టుబడిదారీ పద్ధతికి వ్యతిరేకంగా పోరాడుచున్నాము, పోరాడ వలసిందే. మన ఇండియాలో ఉన్న

నేటి పెట్టుబడిదారీ విధానం పాశ్చాత్య వర్తకం సృష్టించింది. దీనికి వెనుక పాశ్చాత్య ప్రభుత్వ సైన్యాలు అండగా ఉన్నవి. భారతీయ పెట్టుబడిదారీ విధానంతో మనం ఎంత తీవ్రంగా పోరాడుతూంటామో, అంత తీవ్రంగానూ దానికి వెనుకనున్న పాశ్చాత్య పెట్టుబడిదారుల విశాల ప్రయోజనాలకు కూడా దెబ్బ తగులుతూంటుంది. కాబట్టి మనకు విదేశీ ప్రభుత్వంతో విరోధం వచ్చి తీరుతుంది. దేశీయ వర్తకునికి తన ప్రయోజనాల కోసం, విదేశీ ప్రభుత్వంతోనూ విదేశీ వర్తకుడితోనూ కూడా చేతులు కలపాలనే బుద్ధి పుడుతుంది. ఈవిధంగా మనం ఏనుగు వంటి బ్రిటిష్ పెట్టుబడిదారుకూ, దోమవంటి ఇండియన్ పెట్టుబడిదారుకూ కూడని సఖ్యం కల్పించి స్వరాజిస్టునూ, సోషలిస్టునూ కూడా నలిపివేయడానికి తగిన బలం వారికి చేకూరుస్తున్నాము. ఇది కష్టజీవులకు చాలానష్టం. స్వరాజిస్టు సోషలిస్టు లిరువురూ వారికి స్నేహితులుగా ఇంతవరకూ వ్యవహరిస్తూన్నారు. కాని విదేశీ ప్రభుత్వాధికారం పూర్తిగా పోకపోయినప్పటికీ కొంత బిగువు తగ్గిపోతూన్న సమయంలో సరిగా పేదలకు క్షేమం కలగబోయేటప్పుడు ఇలా జరగడం మంచిది కాదు. ఇందువల్ల మనం బలహీన పఱచ దలచుకొన్న పక్షం బలపడుతూన్నది. కాబట్టి మన పద్ధతులు మన ఉద్దేశాలను భగ్నపరచేవి కాకూడదు. విదేశీయులతో వ్యవహారం తేలిన తరువాత స్వదేశీ పెట్టుబడిదారుతో తేల్చుకోవడానికి తగిన బలమూ అవకాశమూ లేక పోతుందా మన సోష

లిస్టుకు. కాలం పరిపక్వస్థితికి వచ్చినప్పుడు సోషలిస్టు సత్యాగ్రహ పద్ధతుల నవలంబించినా, లేక పరంపరాగతములైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ విగ్రహ పద్ధతుల నవలంబించినా, అతని బలాని కెదురుండదు.

సోషలిజమును ఇండియా కనుగుణంగా చేయాలి

మన దేశాని కనుగుణంగా ఉండే సామ్యవాద సిద్ధాంతాన్ని మన మవలంబిద్దాము. జమీందారుల దురాశనూ వారసత్వం వల్ల వంశానుగతంగా సంక్రమిస్తూన్న వారి నిరంకుశాధిపత్యాన్ని కూడా మన మిక సహించ లేము. పుట్టుక వల్లనే గొప్పవాడుగానూ, నీచుడుగానూ పరిగణించే భేదాలిక ఎంత మాత్రమూ పనికిరావు. ప్రపంచంలోని అయిదోభాగం జన సంఖ్య దాస్య భావంలో ఉండడం అసలే అంగీకరించడానికీ వీలు లేదు. మనం తాగుడును రూపుమాపి అంటరానితనాన్ని కనపడకుండా చేయాలి. అంతేకాదు, వీరందరికీ సంవత్సరం పొడుగునా కడుపునిండా అన్నం దొరికేటట్లు చేయాలి. గ్రామ కళలను, చేతిపనులను అభివృద్ధి చేయాలి. సోషలిజం పేరుతో పెద్ద పెద్ద కేకలు పెట్టి మన జీవితంలో ఎప్పుడూ విదేశీ వస్తువులనో, యంత్రముల మీద తయారైన వస్తువులనో కొంటూంటే పేదవాని కది ఏవిధంగా ప్రయోజనం కలుగుతుంది? నినాదాలతోనూ సానుభూతి తీర్మానాలతోను పాపం మన పేద సోదరులను పాతిపెట్టక, కొన్ని అణాలో అధమం కొన్ని కానులో సంపాదించుకోవడానికి సహాయపడి, వాళ్ళను ప్రాణాలతో ఉండనిద్దాము.

పేదవాళ్ళకు ప్రత్యక్షంగా ఉపకరించే రోజువారీ కార్య
క్రమం ఉంటే సోషలిస్టుకి నాడే జయం కలుగుతుంది. "ప్రజ
లలో తిరుగుబాటు భావం కలిగించి విప్లవం లేవదీయడానికి
వాళ్ళ ఆకలి బాధను అంతకంత ఎక్కువ చేయాలి." అనే
కమ్యూనిస్టు నినాదం క్రూరమేగాక అన్యాయం కూడాను.
కాబట్టి ఖద్దరుకూ గ్రామ పరిశ్రమలకూ వ్యతిరేకంగా
ప్రచారంచేస్తూ మిల్లు బట్టనో లేక విదేశీ వస్త్రమునో ఉప
యోగించవలసిందని సోషలిస్టులు కోరుతూండడం విషాద
కరం. "ప్రపంచ కార్మికులారా! ఏకము కండు! మీ సంకెళ్లు
తప్ప మీకు పోయేదేమీ లేదు" అనే నినాద ముత్త
మోత్తమమైనది. కాని ప్రపంచంలోని సగం మంది కార్మి
కులు తక్కిన సగం మందిని ఆర్థిక పారిశ్రామిక దాస్య శృంఖ
లాలలో గట్టిగా బంధించడానికి ఏకమవుతూన్నారు. దానికి
మన మేమనాలి! సోషలిస్టు ఉద్దేశం మంచిది. కాని భాగ్య
వంతుణ్ని ఇంకా భాగ్యవంతుడుగానూ పేదవాణ్ని ఇంకా
పేదవాడుగానూ చేసే పనికి దేనికీ ఆయన పాల్పడకుండు
గాక! సోషలిస్టులు గానీ, కాంగ్రెసు వాదులు గానీ ప్రజల
సహకారం లేనిది యేమీ ఉపకారం చేయలేరు. మనస్సులో
కలిగిన విశ్వాస భావాన్ని క్రియారూపంగా ప్రదర్శించడమే
సహకారం. చిరకాలం శ్రమపడి చేసిన సేవాఫలితంగా
ప్రజాసామాన్య హృదయంలో కలిగిన ఆ కాస్త నమ్మకాన్ని
పోగొట్టే పనిని దేనినీ మనం చేయవద్దు. వోట్లతోనూ వట్టి
నినాదాలతోనూ పొట్టలునిండవు. సోషలిజంజయప్రదం కావా

లంటే దానిని వర్తింపచేసే సంఘంయొక్క పునాదులకూ, దేశసంప్రదాయాలకూ అది అనుగుణంగా ఉండి, అంగాంగీ భావంతో పనిచేయాలి. అంతేకాదు, దారిద్ర్యం తాండవ మాడుతూన్న ఈ పురాతన భారత దేశపు కుటీరాలలోని దుఃఖాన్నీ బాధనూ తొలగించే క్రియారూపకమైన కార్య క్రమం కలిగి ఉండా లది.

గాంధీజం: సోషలిజం

సోషలిజం అందరికీ సమానావకాశాలను కల్పించాలంటుంది. గాంధీజం ప్రతిమనిషికీ ఉన్న కాలాన్నీ అవకాశాలనూ ఉదా రాశయాలకోసం వినియోగించ మంటుంది. చాలా ఎక్కువ పన్నులను విధించి, అపరాధాలను అధికంగా వసూలుచేసి, హక్కులను తొలగించి, బలాన్ని ప్రయోగించి, ఆస్తిని విచ్ఛిన్నం చేస్తుంది సోషలిజం. ధనంకంటె దారిద్ర్యాన్నీ, ఐశ్వర్యంకంటె విద్యా విశేషాన్నీ ఉన్నతశ్రేణిలో చేర్చిన మన పూర్వ సంప్రదాయాల కనుగుణంగా మనస్సులకు నచ్చేటట్లుపదేశిస్తుంది గాంధీజం. సోషలిజం తన పనిని చక్క పెట్టుకోవడానికి ప్రభుత్వ సహాయం కావాలంటుంది. గాంధీజం తన విజయంకోసం ప్రజల సంస్కారాభివృద్ధిపైనా, విశుద్ధాంతఃకరణంపైనా ఆధారపడి ఉంటుంది. పైనుండి తెచ్చి, ప్రజలమీద బలవంతంగా రుద్దిన సోషలిజం ఫలితాలు ప్రదర్శన యోగ్యములుగా కనిపించ వచ్చును. కాని అవి శాశ్వతంగా నిలిచేవికావు. హానికరములు కూడాను.

గాంధీజంవలన కలిగే ఫలితాలు చిన్నవిగా కనపడ్డప్పటికీ ప్రజల ప్రేమ భావాలలో శాశ్వతంగా వేళ్లు నాటుకొని ఉంటవి. సోషలిజం కళ్ళముందు సోషలిస్టు నాయకులు సొంత సిద్ధాంతాలు, సొంత అధికారం, చెక్కు చెదరకుండా ఉంచుకోవడానికి నియంతలయినారు. గాంధీజం స్వార్థత్యాగ సిద్ధాంతాన్ని బుద్ధిపూర్వకంగా అవలంబించమంటుంది. కనుకనే గోపాల్దాసు దేశాయి, ఠాకూర్ ఆఫ్ రాయిసంగ్లీ; దర్బార్ ఆఫ్ ధస్సా, కలకంకర్ రాజాల (సం. రా.) ఔన్నత్యాన్ని చూడగలిగిం దాసిద్ధాంతం. వీరందఱు బుద్ధిపూర్వకంగా ఐశ్వర్యాన్ని త్యజించి దారిద్ర్యాన్ని స్వీకరించినవారు - లేదా తమ భాగ్యాన్ని పేదలకోసం వినియోగించినవారు. చాలా మందికి సోషలిజం ఒక భావం, ఒక ప్రవృత్తి, అంతే. కాని గాంధీజం కళ్ళకు కట్టినట్లు కనపడే ప్రత్యక్ష నిదర్శనం, సేవాత్యాగములతో గూడిన రోజువారీ కార్యక్రమ విధానము. సోషలిజంలో నాయకులితరులు చేయవలసిన పనులను ఉపదేశిస్తూంటారు. గాంధీజం ప్రతివాడూ యేమి చేయవలసి ఉంటుందో ఆకార్యక్రమమే నివేదిస్తుంది. సోషలిజం, ప్రజలలోని పారుష్యాన్ని రెచ్చగొట్టి మానవాభ్యుదయం కలిగించవలెనని ప్రయత్నిస్తుంది. సోషలిజం, కొన్ని భాగాలు ఊషరక్షేత్రాలుగా ఉన్న దేశంలో, పండిన పంటంతా ఒకచోట కూడబెట్టి పునర్విభజన చేస్తుంది. గాంధీజం చదునులో, సారంలో, శీతోష్ణస్థితిలో, తదితర పరిస్థితులలో, యే లోపమూ లేని విశాల భూమిగల దేశంలో ఎవనికి కావలసిన

అన్నం. వస్త్రం, వానినే ఉత్పత్తి చేసుకోమంటుంది. సోషలిజంలో పనిచీ ట్లిచ్చి అందఱూ ప్రభుత్వానికి పని చేసే టట్టు నిర్బంధిస్తారు. గాంధీజం, స్త్రీ పురుషులు సంప్రదాయ సిద్ధంగా తమ తమ జట్టులలో కలసి పని చేస్తూన్నందువల్ల అందులోని ప్రతి ఒక్కరూ ఎలా ఉపకారశీలు రవుతున్నారో ప్రపంచానికి వెల్లడిచేస్తుంది. సోషలిజం, కుటుంబాలలో సైతం సమత్వం లేని సంఘంలో ఇంగ్లండులో జ్యేష్ఠానుక్రమ శాసనం వలన పెద్దవానికితప్ప తక్కిన వాళ్ళకు ఆస్తిలో భాగం లేదు, హిందువులలో మగబిడ్డలకు తప్ప ఆడపిల్లలకు భాగం లేదు. మహమ్మదీయులలో కొడుకులకు సమానభాగము, కూతుళ్లకు న్యాయ్యభాగము-ఇట్టి విపరీత భేదాలుగల సంఘంలో, ఆస్తిని సమంగా పంచిపెట్ట కోరుతుంది. సోషలిజం పాశ్చాత్య నాగ రిక సంస్థలోని వ్యాధికి చికిత్స కావచ్చును. గాంధీజం వేల కొలదీ సంవత్సరాలకిందట మహర్షులు రూపమిచ్చిన సంఘ నిర్మాణమునకు, ధర్మములకూ వ్యాఖ్యానం. నేడాసంఘాన్ని మఱియొక మహర్షి పునఃప్రతిష్ఠింప పునరుద్ధరింప, పునరుజ్జీవింప జేయ ప్రయత్నిస్తున్నాడు. అందువల్లనే కరాచీలో "గాంధీ మరణించవచ్చును. గాంధీజం మరణించదు" అన్నాడుగాంధీ. ఆరోగ్యం, ఐశ్వర్యం, అభ్యుదయం - ఇవి మానవ వ్యవ హారాలలో అగ్రస్థానం వహిస్తవి. ఇవి అనుభవరహితమైన వట్టి సిద్ధాంతంతో నియమించ తగినవి కావు. వెనుక జరిగిన పని, నేడు కలిగిన చిక్కు, భవిష్య త్ప్రయోజనం - ఇవన్నీ సమగ్రంగా పరిశీలించి నియమించాలి వీటిని. ఇంతకు మించిన

ఉత్తమ రాజనీతిశాస్త్రం లేదు. ఏ పేరుతోనైనా పిలవండి దీనిని. ఆరోగ్యమే ఐశ్వర్యమనండి; నూతన సంఘ వ్యవస్థ అనండి; కమ్యూనిస్టు ఆర్థికనిర్మాణ మనండి. ఈ అన్నీకూడా ఒకే ప్రధాన సూత్రాన్ని సూచిస్తవి. సత్యం పునాదిగానూ అహింస శిఖరంగానూ కట్టబడిన జాతీయ సౌధమును క్రమ పద్ధతిలోఉంచే సూత్రమది. హక్కులకంటె ధర్మాలు అగ్రస్థానం వహించాలనే సూత్రం.

గాంధీజం బోధిస్తూన్న విషయాలను బట్టి, అది అపజయం పొందినట్లుగా భావించవచ్చును కాదా అని కొందరు ప్రశ్నిస్తూంటారు. అవుననీ చెప్పవచ్చు, కాదనీ చెప్పవచ్చు. దానికి జవాబు మన ఆలోచనా విధానంపైన ఆధారపడి ఉంటుంది. ప్రపంచంలోని ప్రత్యక్ష విషయాలను గమనించకుండా కేవలం ఆదర్శాలనుబట్టి ఆలోచిస్తే, యథార్థం ఎప్పుడూ అప జయం పొందిందనే అనవలసి వస్తుంది. ఆదర్శం యథార్థంగా మారుతూన్నప్పు డది సంపూర్ణ విజయ మనిపించుకోదు. కాబట్టి యథార్థ మెప్పుడూ ఆదర్శంకంటె పలచగా ఉంటుంది. కనుక విజయము, అపజయము అనే పదాలు, ఆదర్శంకంటె యథార్థం ఎంత తక్కువ పల్చగా ఉన్నదో దాని పరిమాణాన్ని తెలియచేస్తవి. ఆదర్శం మరీ పలచ బడిపోయినప్పుడు, అందులో కక్తి ఉందంటాము. మధ్యస్థంగా ఉన్నప్పుడు పరవాలేదంటాము. ఇవన్నీ తోసిపారేసి రాజీ లేదనుకొంటే అప్పుడది అపజయం పొందిందంటాము. కాబట్టి ఇటువంటి విషయాలను చర్చించేటప్పు డనేక రాజీపద్ధతుల

కొప్పుకొని - రాజీపద్ధతుల కే గాదు - అనుకోకుండా అనేకం జరుగుతయి. వాటికి కూడా ఒప్పుకొని, క్షమించ తగిన తప్పులకు క్షమార్హములుగాని తప్పులకూ భేదం గమనించాలి.

మని - షియంత్రము

మనిషి - యంత్రము ఒకరిస్థానంలో ఒకటి మారి పనిచేయు డానికి వీలుండా లేక పరస్పర సహాయ కారులుగా ఉండాలా అనేదే నేటి పోరాటా లన్నిటికీ మూలమైన జీవిత సమస్య. దీనినే మరొక విధంగాకూడా అడగనచ్చును. యంత్రం మనుష్య ప్రయత్నానికి తోడుగా ఉండి, మానవునికి ప్రయో జనకారియైన పరికరంగా ఉండవలెనా? కొనకు మానవ కృషితో నిమిత్తం లేకుండా పని జరిగేటంత వరకూ అది అభివృద్ధి కావలెనా అని. ఇందులో ఏది ప్రపంచాభ్యుదయా నికి దారితీయగలదో మనమాలోచించాలి. పాశ్చాత్య దేశాల వారు మానవశరీర మొక యంత్రమనీ, సంఘం సంహిత యంత్రమనీ, (Composite Machine) ప్రభుత్వం మిశ్రమ యంత్ర (Complex) మనీ భావిస్తారు. ఇంతవరకు కనిపెట్టిన యంత్రా లన్నిటిలోకీ మనిషి అత్యంత శక్తివంతమైన యంత్రం. కాబట్టి ఈ విషయాన్ని బాగా పరిశీలించడంలో పాశ్చాత్య మానవునికెంతో శ్రద్ధ. ఈ రోజున యంత్రం కూడికలు, తీసివేతలు, ఎచ్చవేతలు, భాగారాలు చేస్తూ న్నది. రైళ్ళు, విమానాలు, నడిపిస్తూన్నది. రోడ్లమీద పోలీసువానివలె రాకపోకలను నియమిస్తూన్నది. పేజీలకు

నెంబర్లు వేస్తూన్నది. పత్రికలను అచ్చుగుద్ది, మడతలు పెట్టి కట్టలు కడుతూన్నది, వార్తలను మోస్తూన్నది. దూరపు నగరాలలోనుండి వచ్చిన వార్తలను బైపుచేస్తూన్నది. దూర శ్రవణం దూరదృష్టియంత్రాలు చేసే పనిచూస్తే, ఏదో ఒక స్వప్నప్రపంచంలో ఉన్నట్లు తోచి, మానవ విజ్ఞాన భావ వికాసములలో నూతనప్రభావం రేకెత్తుతూన్నది. పారి శ్రామిక నాయకులు పరంపరగా తెలియకుండా వచ్చి పడు తూన్నారు. ఐశ్వర్యం అంతులేకుండా ఒక్కచోట పెరిగి పోతూన్నది. వ్యక్తులమధ్యా సంఘాలమధ్యనే కాదు, జాతుల మధ్యకూడా సోదరభావం పైకి కనపడుతూన్నది. కాని నిజా నికి స్వార్థపరత్వమనే పెనుభూత మొకటి పుట్టింది. దానికి తోడుగా స్పర్థ అనే దానివంటి భూతమే మరొకటి తాండవ మాడుతూన్నది. ఇందువలన ఆర్థిక వాణిజ్య వ్యవహారాలలో చాలా పరివర్తనం కలిగి, మధ్య విక్టోరియన్ యుగంలో మిత వాదులచే ఉద్ఘాటింపబడిన స్వేచ్ఛా వ్యాపారసిద్ధాంతం ఆచర ణలోకి వచ్చింది పెట్టుబడిదార్లు ఐశ్వర్యంఅభివృద్ధి చేసుకోవ డానికి పరికరంగా వినియోగించుకొంటూన్న కార్మికవర్గంలో చైతన్యం కలిగి, ట్రేడ్ యూనియను ఉద్యమం ప్రారంభ మయింది. అదే సోషలిస్టు ఉద్యమంగా పరిణామం పొంది చివరకు హింసమీద ఆధారపడ్డ కమ్యూనిస్టు ఉద్యమంగా పరమావధిని పొందింది, యంత్రం, మనిషిసుఖాలను కొంత వరకు పెంపొందించిన మాట వాస్తవమే. కాని ఆ సుఖాలతో పాటు చాలా దుఃఖాలనుకూడా తెచ్చిపెట్టింది. కార్మికులకు

వోటింగు అధికారమిచ్చి, కూలినీ, బోనస్సులను పెంచీ, భీమా సదుపాయాలు చేసి, దినబత్తె మిచ్చి, ఇంకా అనేక ప్రయోజనాలు కల్పించి రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘి కంగా వారి దుఃఖాలను కొంతకొంత నివారిస్తూన్నమాట నిజమే. కాని ఇవేవీకూడా ఐశ్వర్యాన్ని ఉత్పత్తిచేసే ఆ అసలు మనుష్యులను వ్యామోహ పెట్ట లేకపోతూన్నాయి. సమ్మెలు కట్టడం, గేట్లుమూయడం (Lock-out) పనిముట్లు పాడుచేయడం, తుపాకులు కాల్చడం-ఇవన్నీ యంత్రాలతోనే ప్రారంభమైనవి. కాబట్టి మేము యంత్రాలను నిరసించడం మూఢవిశ్వాసం వలన కాదు. గ్రామాలను దాస్యానికి గురిచేసి, మానవ వ్యక్తిత్వ కళాకౌశలములను నాశనంచేసి, పేదవాణ్ని మరీ పేదవాడుగాను, ధనవంతుణ్ని ఇంకా ధన వంతుడుగానూ చేసే స్వార్థపరత్వాన్ని పెంచి, దేశమంతటా గృహస్థులను, కుటుంబాలను ధర్మభ్రష్టులనుగా చేసి, జాతు లకు జాతులకూ నిరంతర సాంగ్రామిక పరిస్థితులను కల్పించి, జీవితంపైన దండయాత్ర సాగిస్తూన్న యంత్రయుగపు అంతు లేని అధికారాన్ని మాత్రమే మేమిక్కడ నిజంగా నిరసి స్తూన్నది.

యంత్రాలనుగూర్చి గాంధీ

పారిశ్రామిక సభ్యతనుగూర్చీ, యంత్రాలనుగూర్చీ గాంధీకి నిశ్చితాభిప్రాయాలున్నవి. మిల్టన్ "నాజూకు లేనిముత్యాలూ బంగారం" భారత దేశంలో మూలుగుతూన్నవి అన్న నాటి ఐశ్వర్యాన్ని నేడు కూటికి లేక కుంగిపోతూన్న పేదరిక స్థితికి

తీసుకొనివచ్చిన బ్రిటిష్ ప్రభుత్వపు అమానుష పద్ధతినిగూర్చి గాంధీ అనేకసార్లు విపులంగా వ్రాశాడు. ఈరోజున ఈ దేశం లోని అయిదవవంతు జనులు దాదాపు పస్తులు చేస్తున్నారు. తక్కినవారు తగిన ఇళ్ళు, తగిన తిండి తగినబట్టా లేక బాధ పడుతూన్నారు. ఇక్కడ లక్షలాది ప్రజల కిదివరకు ఉండడా నికి యిల్లు, తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట ఈయగలి గిన ప్రకృతి సౌభాగ్యం, నేడు కొరవడినందువలన ఈదుస్థితి పట్టిందని చెప్పడానికి కారణాలేవీ కనుపించవు. పూర్వఋషు లచే వేలకొలది సంవత్సరాలకిందట నిర్మితములైన వర్ణాశ్రమ ధర్మాలవలన, గ్రామములు ముఖ్యజీవితావసరముల విషయ ములో స్వయం సంపూర్ణములు, స్వావలంబనములుగా నుండి అధికారైశ్వర్యములు రెండునూ ఉచితరీతిని విభజింపబడి సంఘశాంతికి భంగము లేకుండెను. గ్రామీణులు తమపంట లను తాము పండించుకొని భుజించేవారు. నూలు వడుకు కొని బట్టలను నేసుకొనేవారు. తమయిళ్ళు తాము కట్టుకొని నివసించేవారు అందువల్ల భారతీయాదర్శముల ప్రకారం సంసారం గుట్టుగా నడవడానికి వీలుండేది. కుటుంబజీవితం శిథిలం గాకుండా ఉండేది. అట్టివారి సర్వసాధారణ హస్త కౌశలం పోయి, ఇప్పుడది మరొక కొత్తమార్గంపట్టింది. అందు వల్ల లక్షలాది గ్రామస్థులు తమ గ్రామాలు, ఇళ్ళు, పొలా లను, పచ్చికబయళ్ళు, పచ్చని చెట్లు, కొలిమిపొయ్యి, మగ్గం రాట్నం, సుత్తి, ఉలి, ఆరోగ్యం, ఆనందం, అభ్యుదయం, సంతృప్తి, చల్లనివాగులు, సత్తువ కలుగజేసే గాలి, పెంచు

కొనే ఆవులు, ఎడ్లు, గొఱ్ఱెలు, మేకలు, కోళ్లు, బాతులు, చెఱువులు, తోటలు—ఈ అన్నిటినీ విడచి, రోగంతో, తాగుడుతో, క్రిక్కిరిసి కల్లోలంగా కనిపించే నగరాలకు చేరి, నానారకాల కూలిజనంతో కలసి ఇంగ్లీషు పెట్టుబడిదారుల కోసమో, భారతీయ పెట్టుబడిదారుల లాభాలకో చెమటోడ్చి పనిచేసేటందుకు అమ్ముడుపోవలసివచ్చింది. నేడు భారతీయ గ్రామశిల్పుల, కర్మకారుల కళాకౌశల్యాన్ని తెలియజేసే అంగళ్ళెక్కడా కనిపించవు. అంతేకాదు; ఇదివరకున్న సమష్టిభావంపోయి స్పర్థ హెచ్చింది. స్వార్థం పెఱిగి సమష్టి ఐశ్వర్యోత్పత్తిభావాన్ని చంపివేసింది. కాబట్టి సమష్టికుటుంబంలో ఇదివరకున్న సహకార, సౌభ్రాతృత్వభావాలు, నేటి యంత్రయుగములోని వైషమ్యవైఖరివలన నాశనమైపోయినవి. భారతజాతీయతా పునర్నిర్మాణమునకై అప్పుడప్పుడూ ప్రకటింపబడే పథకాలన్నీ పారిశ్రామిక ధనస్వామిక పద్ధతుల మీద ఆధారపడిఉన్న పాశ్చాత్యదేశాల ఆర్థిక సాంఘిక నిర్మాణాల పదవ తరగతి అనుకరణాలు మాత్రమే. ఇవి సామ్రాజ్యవాదుల వ్యవహారములకు తోడ్పడుతూ, వారిచేత దోహదం చేయబడుతూన్నవి. సామ్రాజ్యవాదానికి బ్రిటిష్ జర్మను సైనిక సన్నాహపద్ధతులు సహాయకారులుగా ఉంటవి. కనుకనే ఈ రెండు దేశాలమధ్యా నిరంతర స్పర్ధ. ఈరెండూ ఎప్పుడూ ఒకదానితో ఒకటి యుద్ధానికి తయారుగా ఉండడానికి కూడా కారణమదే. భారతదేశంలోని ఆర్థికశాస్త్రనిపుణులు, ఆచార్యులు, మంత్రులు, రాజకీయ

వేత్తలు అంతా పాశ్చాత్య విద్యాపద్ధతివలన ఉత్పత్తిఅయిన వారు. మార్షల్, ఫాసెట్టుల గురుపీఠాలను పూజించి దశాబ్దాలకొలది విద్యాభ్యాసంచేసినవారు. అందువల్ల హిందూ దేశంలో పారిశ్రామిక విప్లవం కావాలని కోరేవారుగా తయారయినారు. కాబట్టి వారు భారతదేశ పునరుజ్జీవనానికి జాతీయ పారిశ్రామిక ప్రణాళిక, కాలపరిమితి పథకము కావాలంటున్నారు. ఈ సర్వసాధారణ చికిత్సలను నిర్దేశించడంలో మన సాంఘిక, ఆర్థిక వ్యవహారకోవిదమ్మన్యులు రోగినీ, చికిత్సాసిద్ధాంతక్రమాలనూ అశ్రద్ధచేసి, రోగచిహ్నలకుమాత్రమే వైద్యంచేస్తున్నారు. ఈ అశాస్త్రీయ చికిత్సాపద్ధతి ఆచరణలోకివచ్చి ప్రజామోదం పొందజూడడానికి కారణం కేవలం పారిశ్రామికాభివృద్ధియే గాదు. నేటివరకూ నడుస్తున్న ఇక్కడి విద్యాపద్ధతిలో విద్యకంటె విద్యావంతులను అచ్చుగుద్ది తయారుచేయడం ఎక్కువ. ఈ దేశంలో ఆచార్యపీఠానికి ఆభరణాలయినవారంతా, విషమ, విదేశీయ జీర్ణపద్ధతులపైన నడపబడుతూన్న విశ్వవిద్యాలయాలలో ఉత్పత్తిఅయినవారు కావడమే దీనికింతకూ ముఖ్యకారణం. నూటికి 67మంది వ్యవసాయకులుగల ఈ దేశంలో ప్రభుత్వ వ్యవసాయశాఖలు కేవలం భూసారం, శీతోష్ణస్థితులనుబట్టి పశువులు, క్రీడపురుగులు మొక్కల విషయమునేగాక, పూర్వచరిత్రనూ, ప్రస్తుత పరిస్థితినీబట్టి మానవుని విషయంకూడా పరిశీలించవలసి ఉంటుందని ఐ. సి. యస్. ఉద్యోగి మన శాంతి రామమూర్తిగారు చెప్పినమాట యథార్థం "భారతీయవ్యవసాయపద్ధతిలో మానవసంబంధం తెగిపోయిం"

దన్నా రాయన. ఒక వ్యవసాయంలోనేకాదు, విద్యలో, పరిశ్రమలలో, గృహపరిశ్రమలో, ప్రభుత్వ నిర్మాణంలో, దాని ప్రధానోద్దేశ నియమాలలో — అన్నిటిలోకూడా మానవ సంబంధం తెగిపోయింది.

ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాలు ప్రపంచవాణిజ్య పరిశ్రమలపైన ఆధిక్యత సంపాదించి తమ దేశాని కెక్కువ వర్తక లాభాలను చేకూర్చేటందుకే తమ యావచ్ఛక్తినీ వినియోగిస్తూన్నవి. అందువల్లనే అభివృద్ధిపొందుతూన్న దేశాలలో పరస్పర వైషమ్యం నిరంతరం పెచ్చుపెరిగిపోతూండడం. ప్రపంచంలోని అన్నిదేశాలకూ తా మెగుమతిచేసే వస్తువుల విలువ ఎక్కువగానూ, దిగుమతిచేసుకొనే వస్తువుల విలువ తక్కువగానూ ఉండాలంటే ఎలా సాధ్యమౌతుంది? ఈవిధంగా కొందఱికి లాభిస్తే మఱికొందఱికి నష్టం వచ్చి తీరాలి. కొందఱు కొడుకులకు కట్నాలు పుచ్చుకొనేవారుంటే అల్లుళ్ళకు కట్నాలిచ్చి పెళ్ళిచేయగల ఆడపిల్లల తండ్రులు కూడా కొంద రుండాలి. ప్రపంచంలోని అందఱి తండ్రులూ కట్నాలు తీసుకొనేటందుకు సాధ్యమౌతుందా? ఎవ రిస్తారు? అదేవిధంగా ప్రతిజాతికి తమ ఎగుమతుల విలువ దిగుమతుల విలువకంటె ఎక్కువగానుండి లాభంచేకూరవలెనంటేసాధ్యం కాదు. ముడివస్తువులకోసం, తయారైన వస్తువుల అంగళ్లకోసం, నిరంతరం పోటీపడతూండడమే దేశాలమధ్యజరిగే ఈ యుద్ధాలకు కారణమై, యుద్ధపద్ధతియే పూర్తిగా మారిపోయింది. జరిగిన ఐరోపాయుద్ధంలో నిలబడి యుద్ధంచేయడం

కనపడింది. ఇప్పటి యుద్ధం ఆకాశంలోనూ, నీళ్ళపైనా, నీళ్ళలోనూ జరుగుతూన్నది. బాంబింగుతో, బ్లాకౌటుతో, బ్లాకేడు (వస్తువుల రాకపోకలను ఆపడం)తో జరుగుతూన్నది. వెనుకటి యుద్ధాన్నిగూర్చి మాకు తెలిసిన విషయా లివి:—

వెనుకటి యుద్ధంలో ప్రత్యక్షంగా అయిన ఖర్చులు 186,000,000,000 డాలర్లు. పరోక్షంగా అయిన ఖర్చులు 151,000,000,000 డాలర్లు. మొత్తం 337,000,000,000 డాలర్లు. అనగా షుమారు లక్షకోట్ల రూపాయలు. జరిగిన ఆ యుద్ధంలోనే 60,000,000 సైనికులు యుద్ధసన్నద్ధు లయినారు. రంగస్థలంలో దెబ్బతిన్నవాళ్లు 33,000,000. వారిలో హతులుకానీ, రోగంవచ్చికానీ చనిపోయినవాళ్లు 8,000,000, గాయపడినవారు రాదాపు 19,000,000 ఖయిదీలుగాతీసుకోబడ్డవారు 7,000,000. అందరిలోకీ ఈ విషయాల్లో ఎక్కువ దెబ్బతిన్నది రష్యా. అక్కడ హతుల సంఖ్య 9,000,000. జర్మనీలో 6,000,000. ఫ్రాన్సులో 4,500,000, బ్రిటిష్‌సామ్రాజ్యం 3,000,000. అమెరికాలో హతులయినవారిసంఖ్య చాలాతక్కువ. 3,000,000 మాత్రమే; కేవలం యుద్ధంవల్ల చచ్చిపోయినవారి సంఖ్య 40,000,000; యుద్ధంవల్ల తగ్గిపోయిన జననాలనుకూడా కలిపితే మొత్తంసంఖ్య 50,000,000 అవుతుంది. ఇంకొక దురదృష్టకర విషయ మేమంటే యుద్ధంలో చచ్చిపోయిన సిపాయి ఒకడైతే సాధారణ పౌరు లయిదుగురు చనిపోయినారు యుద్ధకారణంగా. మరియొక దుఃఖకర విషయ మేమంటే, యూరపులో 15,000,000 కుటుంబాలు నిరుద్యోగ భరణాలను తీసుకొంటూన్నట్లు నిరుద్యోగకమిటీ నివేదిక తెలియచేస్తూన్నది. ఇందులో చాలావరకు కరెన్సీని నిరంతరం హెచ్చించుటమూలకంగానే చెల్లింపబడుతూన్నవి. యూరపు జన సంఖ్యలో, దిగుమతులు లేకుండా జీవించడానికి వీలులేని ఎక్కువ జన సంఖ్య అధమం 100,000,000

మంది ఉన్నట్లు లెక్కల వలన తెలుస్తూన్నది. కాబట్టి వారు జీవించా లంటే కొత్తగా ఉత్పత్తిచేసి ఎగుమతులను ఆయా దేశాలకు పంపాలి. యంత్రంద్వారా ఎక్కువ ఉత్పత్తిచేయగలము కాని తుదకా యంత్రమే బెడిసికొడుతుంది.

ఇండియాలోని రైతు, సాలీ, విద్యార్థి, పండితుడు, సరుకులను సప్లయిచేసే వ్యాపారస్థుడు, రాజకీయవేత్త - వీరెవరు యంత్ర యుగము యొక్క ప్రయోజనాలను పొందకూడదని మేము సూచించడంలేదు. అలా అయితే గాంధీ నిత్యజీవితం, ఆయన సిద్ధాంతాలకు వాస్తవంలో విరుద్ధంగా ఉన్నట్లు భావించవలసి వస్తుంది. ఆయన టార్చిలైటు ఉపయోగిస్తాడు. లైపు మెషీనుప యోగిస్తాడు. మోటారులో ప్రయాణంచేస్తాడు. (గంటకు 40 మైళ్లు నడుస్తూన్న మోటారువేగం చాలదంటాడు.) రైలు, పోస్టు, టెలిగ్రాఫ్‌లు ఆయనకు నిత్యమూ అవసరమే. ఆయన నిజంగా అసహ్యించుకొనే విషయ మేమంటే మనిషిని యంత్రంతో సమానంగా చేయడంనిజంగా మనిషి యంత్రా లలో పనిచేస్తూన్నప్పుడు ప్రాణంలేని యంత్రాలకు తాము చేస్తూన్న పనినిగూర్చి ఎంత తెలుసునో ఆతనికికూడా అంతే తెలుస్తూంది వాటికీ స్వతంత్ర సృజనశక్తిలేదు; వాటిలో పని చేసే ఈ మనిషికీలేదు. యంత్రాలలో తక్కిన లోహ భాగాల వంటివాడే ఈతడూను. మనిషి కూడా ఒక పనిముట్టు. మహా ఐతే "ఒక చెయ్యి" అయితే భారతీయ శిల్పులుకానీ, కర్మ కారులుగానీ అలాకాదు. కళానైపుణ్యం చూపించే పనులు చేస్తూన్నారు వారు. అంతేకాదు; కూలికి పనిచేయక వారు

చేసిన పనికి వారే హక్కుదారు లౌతూన్నారు. వారి ఇళ్లలో కూచొని కలకలలాడే భార్యాబిడ్డలతో గలసి పవిత్రకుటుంబ వాతావరణంలో సంపూర్ణహృదయంతో పనులు చేసుకొంటూన్నారు. స్త్రీల ప్రత్యేకత పోషింపబడుతూన్నది. నానా రకాల స్త్రీపురుషులు కలసి ఒకేచోట పనిచేయవలసిన అవసరం లేదు.

భారతీయ శిల్పి

భారతీయ శిల్పిచేసే పనిని వృత్తి అనిగానీ వ్యాపారం అనిగానీ పిలవడంకంటె 'కృషి' అని పిలవడం మంచిది. ఎందువల్లననగా అతడు తన అభిరుచులనుబట్టి భవిష్యత్తును నిర్ణయించుకొంటూన్నాడు. అతడు కేవలండబ్బు ప్రధానంగాపనిచేయుడు. మనస్సుకు ఉత్సాహం కలిగించే హితకరమైన పనిని చేస్తాడు. అతనిపనివల్ల నిత్యజీవితం ఆందోళన లేకుండా నడుస్తుంది. అవినీతికరమైనపోటీతో అవసరంలేదు తనపనికి సరియైన మజూరీ నిర్ణీతమయ్యే ఉండడంచేత ధైర్యంగా ఉంటాడు. పెట్టుబడిదారులుగానీ, కళాపోషకులమని చెప్పుకొనేవారుగానీ, తదితర మధ్యదళారీలుగాని తన శిల్పనైపుణ్యాన్ని వారి సొంతలాభం కోసం వినియోగించుకోవడం లేదనే సంతృప్తి ఉంటుంది. అంతేకాక సంఘంలోవచ్చే పేరుప్రతిష్ఠలు, ఆత్మోన్నత్యమూ-ఇవికూడా అతనికి పనిచేయుడానికి మానసికోత్సాహాన్ని కలిగిస్తవి. భారతీయ శిల్పికి ఇన్నిగంటలు పనిచేయాలి, ఇంత కూలి ఇస్తామంటే అర్థంకాదు. నేటి కార్మికోద్యమ భాష

అతనికి తెలియదు. అత నిష్టంవచ్చినప్పుడు వచ్చి, ఇష్టంవచ్చినప్పుడు పోతూ, అతని కెంత పనిచేయాలని ఉత్సాహం ఉంటే అంతవరకే చేసిపోతాడు. అతని కేమీ నిర్బంధం లేదు. అతనిపని జీతంకోసం లెక్క చూపించ తగినదికాదు. అటువంటి శిల్పకళలో వినియోగించే జీవితానికి సంఘంలో తగిన స్థానం లభించితీరాలి. అతడేరోజు కా రోజు పొట్టకోసం దేవులాడవలసిన వాడు కాడు; ఇంగ్లండులోని కార్మికుని జీవితం అందువల్లనే కుంగిపోయి అతని ఆత్మ నలిగిపోతూన్నదని సర్ జార్జిబర్డు ఉడ్ అన్నాడు. ఎప్పుడూ ఏదో ఒక ఆందోళనలో మునిగి తేలుతూండవలసిన అవసరం భారతీయ శిల్పికి లేదు. అతనుచేసే పని మతధర్మంగా తలుస్తాడు. అందువల్ల అతనికి సంతృప్తి ఉంటుంది. అతనికి కావలసినంత విశ్రాంతి. కేవలం తనవృత్తిని తాను నిలబెట్టుకోవలెనని చేసేపనిగనుక మనస్సు కానందంగా ఉంటుం దతనికి. ఇవన్నీ అతని కళాకౌశలానికి దోహదం చేసితీరతయి. చిన్నతనంనుండీ, పెద్దవాడై పనిలో నైపుణ్యం సంపాదించేటంతవరకూ, భారతీయ శిల్పి నేర్చుకొనేది వృత్తివిద్యయే. అతనికి గురువతని తండ్రిగానీ, అన్నగారుగానీ. అతను సంపాదించే విద్య పుస్తకాలలోనుండి కాదు. అతని తాత తండ్రులు సంపాదించిన అనుభవంనుండి. రంగులు కలపడం, వార్నిష్‌లు తయారుచేయడం, సున్నం, సిమెంటు సరియైన దామాషాలో కలపడం, ఇవన్నీ తన కుటుంబంలోనుండే కానువాయిగా తెలుసుకొంటా డతడు. ఎనీమాగానీ, ఇంజెక్షనుసూదిగానీ, మూత్రంతీసే గొట్టంగానీ ఎప్పుడూ సొంతంగా ఉపయోగించకుండానే వైద్యవిద్యార్థి

అయిదు సంవత్సరాలు వైద్యకళాశాలలో చదువుకొనివచ్చి నట్టుండ దతని నేర్పు. భారతీయ శిల్పవిద్యార్థి కాలక్షేపం కోసమో, కేవలం ఉబుసుపోకకో విద్యాభ్యాసం చేయడు. అతను పొందే శిక్షణ అంతా అతని ఇంటిలోనే. కనుక పని నేర్చుకొంటూనే సంపాదించుకొంటూంటాడు. పాఠశాలకు పోనక్కరలేదు. పరాయి గురువుకు జీతాలు కట్టనక్కరలేదు. ఎవరి పనికి సరిపోయే శిల్పసూత్రాలు ఆపనివాళ్ల గృహాలల్లో ఉంటవి. రాజప్రాసాదాలు కట్టవలసివచ్చినప్పటికీ, గదియెంత వెడల్పుండాలో, కిటికీ లెక్కడెక్కడ ఉండాలో, స్తంభా లెలాఎలా ఉండాలో, అవి ఎంత యెత్తు ఉండాలో, దూలాలు స్తంభపుకొనలు ఎక్కడెక్కడ ఉండాలో ఈఅన్నిటినీ సరిగా, వారి దగ్గరఉన్నశాస్త్రం నిర్దేశిస్తూనే ఉంటుంది. ఈ నియమా లకు భిన్నంగా నడిస్తే శిల్పికి గొప్ప చెఱుపు కలుగుతుంది. బృహత్సంహితలో గృహనిర్మాణాన్నిగూర్చిన శాస్త్రం సమ గ్రంగా ఉన్నది. ఇటువంటి పరిస్థితులలోనున్న శిల్పిని తన ఇచ్ఛవచ్చిన భావాలను వెల్లడించే వ్యక్తిఅని తలంచకూడదు. దైవనిర్మితములైన చెట్లూ, పూవులూ, సహజసౌందర్య మునూ అకృత్రిమరచనా విలాసమునూ ప్రదర్శిస్తూన్నట్లే, శిల్పి అనంతసౌందర్యమునూ అవికార ధర మునూ నిర్దేశించే విశ్వాంశ సంభూతుడని తలంపవలెను.'' అన్నారు ఆనంద కుమారస్వామి. భారతీయ శిల్పికి ''విశ్వకర్మ'' ఉపాస్య దైవం. "సౌందర్యం, లయ ప్రమాణం, భావం - ఇవన్నీ ఆదర్శ తలంలో పరిశీలిం- దలచుకొన్నవాళ్ళకు సుస్థిరంగా కనిపిస్తూనే ఉంటవి

"వస్తువుల వాస్తవికత మనస్సుకు గోచరమైనంతగా కంటికి కనిపించే చిన్న చిన్న వివరాలలో గోచరం" అని కూడా ఆ గ్రంథకర్తే వ్రాశాడు. శిల్పిచేసే పనిలో కొంత నిగూఢత ఉన్నది. దానిని వృత్తి అనడంకంటె మతధర్మ మనడం ఎక్కువ సమంజసంగా ఉంటుంది. కాకపోతే పూర్వ గ్రంథంలో చిత్రకారుని కుండవలసిన గుణాలను వర్ణిస్తూ అతడు "మంచివాడుగా ఉండాలి. సోమరిగా ఉండకూడదు· క్రోధి కాకూడదు, మతశాస్త్రంలో పండితుడుగా ఉండాలి· ఆత్మనిగ్రహం కలిగి ఉండాలి; భక్తుడుగానూ, దాతగానూ ఉండాలి. ఆశపాతకుడుగా ఉండకూడదు" అని ఎందుకు వ్రాస్తాడు? హిందూ శిల్పి ప్రతిసంవత్సరమూ దసరా పండుగ నాడో, వినాయక చవితినాడో ఆయుధపూజ చేస్తాడు. తానొక కర్మకార సంఘ సౌభ్రాతృత్వంలో-అనగా ప్రత్యేక హక్కులతో పాటు బాధ్యతలనుకూడా స్వీకరించినకులంలో ఒక సభ్యుడననే సంగతి మొట్టమొదట గుర్తించినవాడు భారతీయశిల్పి. తన పనిని తాను సరిగా నిర్వర్తించినందువలననే ప్రతి మనిషీ ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందగలడని నిర్దేశింపబడినది.

"శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః"

(భగవద్గీత 3. 35.)

నేటి పోటీ విధానం పూర్వాదర్శాలనూ పూర్వప్రమాణాలనూ పాడుచేసింది. అప్పుడప్పుడూ ప్రజల దేశాభిమాన

భావో ద్రేకాలవల్ల ఆకస్మికంగా చేతితో తయారైన వస్తువులకు కలిగే గిరాకీ (demand) మూలకంగా ఆవస్తువుల నాణ్యము, ప్రమాణము తగ్గిపోతూండడం జరుగుతూన్నది. చేతితోవస్తువుల నుత్పత్తి చేయడంలో గొప్పనైపుణ్యము, నాజూకుదనమూ చూపించవలసి ఉంటుంది. ఈవస్తువులకు ఎక్కువగిరాకీఉన్నప్పుడు తొందరగానూ చౌకగానూ తయారుచేస్తామని సాంప్రదాయసిద్ధంగా ఆపనులు చేయని ఇతరకులాలవారు పోటీపడి చేస్తూండడమే, వాటిలోని నాణ్యము ప్రమాణములు తగ్గిపోవడానికి కారణం. ఖద్దరు ఉత్పత్తి విషయంలో గానీ, లక్నోలో ఎక్కువ అభివృద్ధి పొందిన బంగారు జిలుగు పని సందర్భంలో కానీ ఇదే విధంగా జరుగుతూన్నది.♦ యంత్రం బెడిసికొట్టి సహజ మానవసామర్థ్యాన్ని స్తంభింపచేసింది: జాతీయ జీవనాళాలలో రక్తసంచాలనం నిలిపివేసింది. సంఘసభ్యతలో కల్లోలం కలిగించింది. ప్రజల హృదయాలలో వ్యాకులత హెచ్చించింది. అందువల్ల జాతీయ ప్రకృతికీ కృత్రిమోద్వేగానికీ లయ కలియడం లేదు. ఇలా శిధిలమైనజాతి అచిరకాలంలోనే జబ్బుపడి చివరకు మరణిస్తుంది కూడాను. అటువంటి జాలికరమైన చావుకు సంసిద్ధంగా ఉంది ఇప్పటికే మనదేశం. ఇంకా కొనఊపిరితో ఉండగానే గాంధీ అవతారమూర్తివలె ఈ నశించిపోతూన్న లోకంలోకి దిగిరావడం మన అదృష్టం. ఆయన, ఐశ్వర్యం వలన కలిగే అరిష్టా

♦ అనుబంధం 2 లో సర్ జార్జిబర్డ్వుడ్, హావెల్‌గార్లు వ్రాసిన వ్యాసాలు కలవు.

లను తొలగించి, సేవవలన కలిగే సుగుణాలను పునరుద్ధరించి, స్పర్థను నాశనమొనర్చి, సహకారాన్ని పునరుజ్జీవింప చేసి, మానవ హృదయాలలోని ద్వేషాన్ని నిర్మూలించి, ప్రేమను పునఃస్థాపనచేసి, ప్రపంచ కల్యాణానికి తోడ్పడ గలదు.

యంత్రం-కొట్టిన ఈ ఎదురు దెబ్బవలన సంఘంలో కలుగుతూన్న అంతిమ పరిణామం మఱొకటి ఉన్నది. ఇంతవరకనూ సామ్రాజ్య దృక్పథంతో తమ సరుకులను తూర్పు దేశాలలోకీ ఆఫ్రికాఖండంలోకీ ఒక్కుమ్మడిగా దిగుమతి చేస్తూన్న జాతులు, నేడా దేశాలవారు తమ సరుకులను తీసుకోకపోవడం చేతను, తమకు ముడివస్తువులను సరఫరా చేయకపోవడం చేతను, తమ స్వశక్తిపైన తామాధారపడివలసివస్తూన్న ఆయా దేశ ప్రజలంతా ఇప్పుడు కళ్ళు తెఱిచారు. తూర్పుదేశాల ఈతిరుగుబాటు వలననే యిక ఈ దోపిడీ విధానానికి తగినంత స్థానం లేకుండా పోయింది. జపాన్ పాశ్చాత్య ప్రపంచంలోని పారిశ్రామిక దేశాలలోఅగ్ర స్థానం వహించిన జాతులతో నిర్విఘ్నంగా పోటీచేస్తూన్నప్పుడు, చైనా యుగయుగాలనాటి తన మాంద్యాన్ని దులిపివేసికొన్నప్పుడు, ఇండియా నూతన జాతీయచైతన్యంతో విజృంభించినప్పుడు, ఆఫ్ఘనిస్థానము, పర్షియాలు నేటి అభ్యుదయజాతులతో అడుగు తప్పకుండా నడుస్తూన్నప్పుడు, సిరియా పాలస్తీన్ దేశాలు పాశ్చాత్య దండయాత్రలను తట్టుకొగలిగి జీవిస్తూన్నప్పుడు, టర్కీ 'ఐరోపాఖండపు రోగి'

అనే అపఖ్యాతిని పోగొట్టుకొన్నప్పుడు, ఈజిప్టు విదేశీయుల ఆటవస్తువుగా ఉపయోగింపబడనప్పుడు, పాశ్చాత్యులదోపిడీ విధానానికి స్థలమూ, సావకాశముఃకూడా చాలా తక్కువై పోయినమాట నిజము. పారిశ్రామిక, వ్యావసాయిక జీవితాలను ఉచితప్రమాణంలో నడుపుకొంటూన్న ఫ్రాంసు అదృష్టం మంచిది. ఇటలీ పారిశ్రామికంగాకంటె వ్యావసాయికంగా ఎక్కువ అభివృద్ధి పొందిఁది. కాని ఇటీవల ఆ దేశం పారిశ్రామికంగాకూడా అభివృద్ధిపొంది తన లోటును భర్తీచేసుకొని స్వయంపోషకంగానుండ ప్రయత్నిస్తూన్నది. రష్యా ఈ దేశాలన్నిటితోనూ ఒంటరిగా పోరాడి తన యంత్రాలకూ, యంత్రాలయాలకూ, తన యితర జీవితావసరములకు కావలసిన సామగ్రిని తయారుచేసుకోవడమేకాక, మాంసంకూడా యితర దేశాలనుండి దిగుమతిచేసుకోవలసిన అవసరం పట్టకుండా మొదటి ఐదుసంవత్సరాలలోనే కోటి కుందేళ్లను పెంచింది. విదేశీవ్యాపారం దేశంలోకి చొరబడకుండా తలుపులు బిగించి గట్టిగా గడియవేసుకొంది రష్యా. ఏ కొంచెం సరుకైనా ఎప్పుడైనా వస్తే అది వెల (barter) పెట్టి కొనుక్కోవలసిందే. ఎంతో తప్పనిసరియైతేనేగాని డబ్బుపెట్టి కొనుక్కునే పద్ధతిలే దా దేశానికి.

ఈవిధంగా పాశ్చాత్యదేశా లితరదేశాలమీద ఆధారపడకుండా కాలక్షేపం చేయవలసిన స్థితికి వచ్చినయి. జర్మనీ ఎగుమతులు దిగుమతులకు సరిపోయేటంత ధర తేలేకపోవడం చేత, ఆ దేశంలో వాడుకొనే వస్తువులకు రేషన్ ఏర్పాటు

చేయబడిందని తెలియవస్తూన్నది. కాబట్టి తూర్పు దేశాలలో తమ వస్తువులను కొనేవారు లేకపోయినప్పుడు, తమ దేశాలలో తాము పరస్పరము తమ వస్తువులను విక్రయించుకోవడానికి వీలు లేనప్పుడు, పాశ్చాత్య దేశాలన్నీ స్వయంసంపూర్ణములుగాగానీ లేక స్వయంపోషకములుగాగానీ ఉండితీరాలి. ఆపరిపక్వస్థితి తటస్థించినప్పుడు ఎగుమతులకోసం చేసే ఉత్పత్తి ఆగిపోతుంది. ఎవరో ఒక మనిషి ఉత్పత్తిచేసేవాడుగానూ, లక్షలాదిగాఉన్న తామందఱూ తమ అవసరాలకు వానిపైన ఆధారపడి, వానికి లాభాలు, ఐశ్వర్యం, మేడలూ కట్టిపెట్టి తాము గుడిసెలలోనూ, గాలీ వెలుతురూ రాని మురికి కూపాలలోనూ ఉండి కాలక్షేపంచేయడానికి ప్రజలొప్పుకోరు. పెద్దఉత్పత్తివారు మాయంకాగానే యంత్రములలో పనిచేసే కార్మికులకు పనిలేకుండా పోవచ్చును. అప్పుడు సహకారోత్పత్తి సంఘాలద్వారా గానీ, తదితర సంఘపద్ధతుల ద్వారాగాని కూలిజనానికి పని కల్పించి లాభాలలో భాగమీయవలసివస్తుంది; లేదా వారు తిరిగీ పురాతన కుటీరపరిశ్రమలను అవలంబించవలసివస్తుంది. బహుశా మేము చాలా దూరం ఆలోచిస్తూన్నట్లు తోస్తుంది. జాతుల భాగధేయాలను, వాటి భవిష్యత్కార్యవిధానములనూ చూపించేటప్పుడు హ్రస్వదృష్టి కలిగిఉండడంకంటె దూరదృష్టి కలిగిఉండడమే యెక్కువ మేలు.

యంత్రం నౌకరు - యజమాని కాదు

యంత్రం పాశ్చాత్య దేశాలలో నౌకరుగా లేదు. యజమాని అయింది. కేవలం యజమానియే కాదు. చండశాసనాధికారి అయింది. పెనుభూతంగా పరిణమించింది. రాక్షసి తిన్నట్లు తిని, రాక్షసిచాకిరీచేసి ఉత్పత్తిచేస్తున్నది. గాంధీ దానిని ఇండియాకు దాసీగా చేయదలచుకొన్నాడు. ఎక్కువగా ఉత్పత్తి చేయడంవల్ల వస్తువులు చౌకయి, పోటీకి సావకాశం కలుగుతూన్నది. పోటీపడి తయారుచేసిన వస్తువుల అమ్మకానికి అంగళ్లు కావాలి. అంగళ్లు కావాలంటే రాజకీయంగా ఆయా దేశాలపైన పలుకుబడి రావాలి. ఆ పలుకుబడిని కాపాడుకోవడానికి సైనికబలం ఉండితీరాలి. అధికోత్పత్తికి తగిన ముడిసరుకునూ, తగిన అంగళ్ళనూ సంపాదించుకోవలెనన్నా, నిలుపుకోవలెనన్నా సామ్రాజ్యపద్ధతికిందతప్ప సాధ్యంకాదు. శాంతిసమయాలలో అది పారిశ్రామిక తత్వంగానూ, యుద్ధ సమయాలలో సైనికతత్వంగానూ పరిణమిస్తుంది. ఇదంతా కావలసినంత దౌర్జన్యంచేస్తేనేగాని జరగనిపని. అందువల్లనే యంత్రపరిశ్రమ 'హింసాసంచలనం' అని సంక్షేపంగానూ, సంపూర్ణార్థసహితంగానూ నిర్వచింపబడ్డది. ఖద్దరు ప్రధానాంగంగానుండే గ్రామపరిశ్రమలతో, సాంఘికైకమత్యంతో అస్పృశ్యతానివారణతో కూడిఉన్న కాంగ్రెసు నిర్మాణకార్యక్రమంగూడా అంత సంగ్రహంగానూ, అంత పూర్ణార్థయుక్తంగానూ, 'అహింసాచరణం' అని వివరింపబడింది. అయితే గాంధీ ఊహించే సంఘులక్షణం ఏతీరుగా ఉంటుంది అని

అడుగవచ్చును. అదృష్టవశాత్తు ఒకవేళ ముందున్నవాళ్ళను నలగతొక్కకుండా పోగలిగినప్పటికీ వెనుకనున్నవాళ్ళ నోళ్ళలో, ముక్కులలో, చెవులలో కళ్ళలో దుమ్ముకొట్టి పోయే మోటారుకార్లసంఘవ్యవస్థకాదు గాంధిభావిస్తూన్నది. అంతమాత్రంతో అది అతిపురాతనకాలంనాటిదో, మధ్య యుగపునాటిదో అయియుంటుందని ఊహించకండి. 1931లో లండనునుండి అమెరికాకు బ్రాడ్కాస్టు ఉపన్యాసంచేస్తూ ఆయన

“1900 మైళ్లు పొడుగూ, 1500 మైళ్ళు వెడల్పూగల భూభాగంలోని చుక్కలవంటి 700,000 గ్రామాలలో చెల్లాచెదరుగా నివసిస్తూ కడుపునిండా కూడు లేని కోట్లకొలది జనులను గూర్చి అమెరికాకు తెలియపరిచాడు”. అందులో ఆయన చెప్పిందిది.

> నిరాడంబరులైన ఆ గ్రామవాసులు సంవత్సరంలో ఆరుమాసాలు పని లేకుండా ఉండవలసిరావడం మహావిషాదకరమయిన విషయం. అది వారి తప్పిదం కాదు. ఇటీవలివరకు ప్రతిగ్రామమూ అన్నవస్త్రాలకు సంబంధించినంతవరకు స్వయం సంపూర్ణంగా ఉంటూవచ్చింది. మన దురదృష్టవశాత్తు, ఈస్టిండియాకంపెనీవారీదేశంలో అడుగుపెట్టి, నే నిక్కడ వర్ణించడానికి యిష్టపడని పద్ధతులద్వారా, గ్రామస్థుల ఆ ఉపవృత్తి కాస్తా నాశనంచేశారు. అందువల్ల ఇంతవరకే ఆధునిక యంత్రమూ తీయలేనంత నాజూకుగా దారం తీయగలరని కీర్తివహించిన లక్షలాదిగ్రామవాసుల అంగుళీకౌశలం నిరుపయోగమై పోయింది. ఉదారమైన వారి వృత్తి ఆకస్మికంగా మాయమయింది. ఆనాటినుండీ

భారతదేశం క్రమ క్రమంగా దరిద్రవంతమయింది. ఇది కాదని ఎవ రేమి చెప్పినా యేమీ ప్రయోజనం లేదు.

పాశ్చాత్య దేశాలలో

ఇక మనం, పాశ్చాత్య కార్మిక పరిస్థితులలోన్నూ, ఐశ్వ ర్యాన్నిగూర్చిన ఆ దేశ ప్రజల భావాలనోనూ, యంత్రం యేవిధమైన పరివర్తనం కలిగించిందో విచారిద్దాము. చెపితే విస్తారంగా కనిపించవచ్చునుగాని, అక్కడ వినాశకర పద్ధ తుల వల్లనే ఐశ్వర్యం పెరుగుతూన్నది. యంత్రాలలోనూ యంత్రాలయాలలోనూ శ్రమతగ్గించుకోవాలనిచేసే అపూర్వ ప్రయత్నాల మూలకంగా నిరుద్యోగ సమస్య తీవ్రరూపం తాలుస్తూన్నది. వ్యవసాయం, యంత్రపరిశ్రమలముందు ఎందుకూ కొరగాకుండా పోతూన్నది. ఇంగ్లాండులో 91% పరిశ్రమలు. 8% మాత్రమే వ్యవసాయం. ఒకప్పుడు ఎక్కువగా వ్యవసాయ దేశాలుగానున్న ఇటలీరష్యాలు, పారిశ్రామిక దేశా లతో పోటీచేయడానికి జరిగిన ఇరవై సంవత్సరాలలో తమ యావచ్ఛక్తినీ వినియోగించినై. ఇంగ్లండులో ఉత్పత్తిఅయ్యే ఆహారపదార్థాలా దేశంలోని ప్రజలకు సంవత్సరంలో అయిదు వారాలకుమాత్రం సరిపోతవనేసంగతి మనకందరికీ తెలిసిందే. తక్కిన 47 వారాలలో వాళ్ళకుకావలసినమాంసం న్యూజీలాండు ఆస్ట్రేలియా దేశాలనుండీ, గోదుమలు కనడానుండి, గుడ్లు డెన్మార్కునుండి, పాలు పాలద్రవ్యాలు, హాలెండు బెల్జియ ములనుండి, బియ్యం ఇండియా బర్మాలనుండి, కాఫీ సింహళం

నుండీ తెప్పించుకొంటారు. ఈ దిగుమతీ అయిన సరుకులన్నిటికీ గాను ఇంగ్లాండు, బొగ్గూ ఇనుమూ అయినా ఎగుమతి చేయాలి. లేదా విదేశాలనుండి ఆ దేశానికి దిగుమతి అయిన ముడిసరుకులు-పత్తి, పత్తివిత్తులు, తోళ్ళు, చర్మాలు, వేరు సెనగ,జీడిపప్పు-మొదలైన వాటితో తయారుచేసిన వస్తువుల ఎగుమతిద్వారానైనా సొమ్ముసరిపెట్టాలి. వెనుకటి ఐరోపా యుద్ధంనాటి అనుభవాలను, యుద్ధం ముగియడంతోనే మఱచి పోయింది బ్రిటను. యుద్ధంజరిగిన 1914-18 సంవత్సరాలలో ఉద్యానవనాలను, మృగయా విహారభూములను పచ్చిక బీళ్ళనూకూడా కొంతవరకు పంటపొలాలుగా మార్చి యుద్ధం ముగియగానే అనగా 1919-30 సంవత్సరాలమధ్య, 25 లక్షల ఎకరాల పంటపొలాన్ని తిరిగీ పచ్చిక బీడుగా చేసింది ఇంగ్లాండు దేశం. ఇప్పుడది ఆహారంకోసం ఇతర దేశాలపైన ఆధారపడి ఉండవలసిందే.

పెద్దఎత్తున జరుగుతూన్న ఈ ఎగుమతి దిగుమతి వ్యాపారాలను సరిపుచ్చడానికి (International barter) అంతర్జాతీయ వస్తుమారక పద్ధతిద్వారా సాధ్యం కాకపోవడంచేత డబ్బును ఉపయోగించవలసిన అవసరం చాలా ఎక్కువయింది. అందువల్ల నాణెముల ఉత్పత్తి విషయంలో, కరెన్సీ విషయంలో, మారకంవిషయంలో, కృత్రిమ ప్రమాణాలను ప్రవేశపెట్టవలసి వచ్చింది. ప్రచారంలో నున్న కరెన్సీనోట్లను ఎచ్చించడం, కుంచించడం తటస్థించింది. మామూలుగా ఋతువులను బట్టీ పంటల ఎక్కువ తక్కువలను బట్టీ వస్తు

వుల ధరలలో కలుగవలసిన మార్పులు, కొత్తగా పుట్టిన కరెన్సీనోట్ల మూలమునను, ధనోత్పత్తి మూలకము లయిన యితర కారణముల వల్లనూ, కలుగుతూన్నవి. కాబట్టి అంగళ్ళను స్వాధీనపఱచుకొనే నిమిత్తమే యావత్తు ఉత్పత్తి జరుగుతూన్నది. అందువల్లనే ఖరీదులు నియామకం. చేయబడు తూన్నవి. అది కారణంగా అంగడిలోనున్న వస్తువులోని ఆహారమూల్యం కాక దాని ఖరీదు మాత్రమే ఆకర్షిస్తూన్నది ఆయా దేశాల ప్రజలను. వింతగానూ విరుద్ధంగానూ తోస్తే తోచవచ్చును గాని ఆ స్తిని నాశనం చేసుకోవడం వల్లనే ఐశ్వర్యం వృద్ధి అవుతూన్నదనే మాట కివే నిదర్శనాలు.

ఈజిప్టు దేశంలోని ప్రత్తిపండే భూమి విస్తీర్ణమును ప్రతి సంవత్సరం మూడోవంతు చొప్పున మూడేండ్ల వరకూ తగ్గిస్తూండవలసిందని 1926 లో ఈజిప్టు ప్రభుత్వం ప్రజలను కోరినట్లు వింటూన్నాము. అదే విధంగా 1927లో క్యూబా అధ్యక్షుడు 4½ మిలియనుల (45 లక్షలు) టన్నులను మించి పంచదార పండించకూడదని నియమం చేశాడు. బ్రేజిల్ 120 లక్షల బస్తాల కాఫీగింజలు అంటే (185,55,24,000 పౌనులు) 1931 లో నాశనం చేసింది; 1933 నాటికి తగులబెట్టికాని, సముద్రంలో ముంచికానీ 220 లక్షల బస్తాల కాఫీగింజలు నాశనంచేసింది; పాల ఖరీదును ప్రియంగా ఉంచేటందుకు జెర్సీ (Jersey) ఆవులను కృత్రిమంగా ఎండిపోయేటట్లు చేశారు. మెక్సికో అత్తిపళ్లను కుళ్ళ బెట్టిందికూడా అటువంటి కారణాలకోసమే. యునైటెడ్

స్టేట్సులోని రైతులకు కావలసినంత గోదుమపంట ఉన్నది. కాని వంటచెఱకు లేదు. అందువలన గోదుమలనే వంటచెఱకుగా వాడుతూన్నారు.* లక్షలాది బుషెలుల పళ్లను కోయకుండా చెట్లమీదనే విడచివేయడానికి పండించేవాళ్ళు ఒప్పుకొంటూన్నారనీ, ఫెడరల్ ఫారంబోర్డువారు నాలుగుపత్తిచాళ్లకొకటిచొప్పున దున్నిపారేయాలని ఆజ్ఞాపించారనీ, పండిన గోదుమలను నిర్దాక్షిణ్యంగా నాశనంచేస్తూన్నారనీ తెలిసినప్పుడు దేశం అన్నవస్త్రాలకు లోపంలేకుండా సుభిక్షంగా ఉన్నదనుకొంటాము. నిరుద్యోగ సమస్య నిర్మూలమయినట్లు భావిస్తాము. యంత్రాల వత్తిడివల్ల ప్రభుత్వం ఇటువంటి కృత్రిమ విధానాలకు పూనుకొన్నప్పటికీ, ప్రజలకు కడుపునిండా కూడూ, వంటినిండా గుడ్డా లేదు సరికదా చివరకు నిరుద్యోగుల సంఖ్యకూడా తగ్గలేదు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1919-33 సంవత్సరాల మధ్య యంత్రసహాయంతో పనిచేసే కూలీల ఉత్పత్తి నూటికి 71 వంతున పెరిగింది కాని ఆ సంవత్సరాలలోనే నిరుద్యోగులైన వారిసంఖ్య 15 లక్షలనుండి 120 లక్షలకు పెరిగింది. "తరువాత అంతకంటె యెక్కువ శాస్త్రజ్ఞానం" వినియోగించినందుకు ఇంకో 40లక్షల నిరుద్యోగులెక్కువయినారు. ‡

హిందూదేశపు నిరుద్యోగుల సంఖ్య 400 లక్షలు. యంత్రసహాయంతో వ్యవసాయం చేయడం ప్రారంభిస్తే ఇంకా

* 39, 40 పుటలు 'స్వదేశీ ఎందుకు?' కర్త: అగర్వాలా.

‡ Page 36 "Why Swadeshi" by M. R. Agarwala

ఎక్కువమందికి పని లేకుండా పోయి గ్రామాలు విడచి పెట్ట వలసి వస్తుంది. ‡ నిరుద్యోగ సమస్య ఇండియాకు రావలసి నది కాదు. కాని మన అర్థశాస్త్ర విధానం, శ్రమ తగ్గించు కోవడానికి తయారవుతూన్న యంత్రాలు, లంకాషైరు యంత్రనిర్మాణంలో ప్రతిరోజూ జరుగుతూన్న అభివృద్ధి- (ఈ కిటుకు బర్మింగ్ హాం యంత్ర నిర్మాతలకు మాత్రమే తెలుసు) భారత దేశంలో వట్టి భాషాజ్ఞానం తప్ప వృత్తి విద్య లేకపోవడం - ఇవన్నీ నిరుద్యోగసమస్యను సృజించి ఎక్కువ పెంపొందిస్తూన్నవి. ప్రపంచ వ్యాపారం(Markets) లో గలిగే మార్పులు కరెన్సి, మారకం, ఎగుమతి దిగుమతీ, పన్నులు, రైల్వే రేట్లలో అవలంబింపబడే కృత్రిమ విధా నాలు - ఇవన్నీ ఈ సమస్యకు మఱింత దోహదం చేస్తూన్నవి. జనసంఖ్యగానీ, పనిచేసేవాళ్ళ సంఖ్యగానీ పెఱిగినందు వలన పని లేకుండా పోదు. అమెరికా సామ్రాజ్య వ్యతిరేక దేశ మయినట్లుగా బడాయి కొట్టుకొంటుంది. అక్కడి ప్రజలు ప్రజాపాలక, ప్రజాస్వామ్య సిద్ధాంతాలు కలవారంటారు. అయినా ఆదేశంలో గల 130,000,000 జనాభాలో మూడవ వంతుకు సరియైన కూడు, గుడ్డ, ఇల్లూ లేదు. ''చాలాకాలం కిందట పిచ్చిఆసుపత్రిలో చేర్చబడిన ఒక మనిషి నేటి ఫ్యాక్ట రీల ఆరోగ్య పరిస్థితులనుగూర్చి కలగన్నాడంటారు. ఆలాగే నిరంతరం యంత్రాల యశోగానంచేసే మనంకూడా నూతన సంఘ వ్యవస్థనుగూర్చి కల గనే పిచ్చివాళ్ళుగా భావింపబడ

‡ Page 37 Why Swadeshi by M. R. Agarwala

వచ్చును'' యంత్రాలను వాటి హద్దులలో ఉంచండి. ముఖ్యంగా ప్రజలకు కావలసిన కూడు గుడ్డల విషయంలో పనిచేసే గ్రామస్థుల కార్యరంగంలోకి వాటిని చొరనీయకండి. అప్పుడు దేశంలో శాంతి సౌభాగ్యాలకు కొదవ ఉండదు. బ్రతుకుకోసం పోరాడవలసిన అవసరం ఉండదు. గ్రామాలలో నుండి పట్టణాలకూ నగరాలకూ పోయి, గాలిలేని యిరుకు సందులలో కాపురంచేస్తూ, కుటుంబ జీవితాన్ని భగ్నం చేసుకొని వీధులలో తిరుగుతూ రోడ్లమీద పడి నిద్రపోవలసిన దురవస్థ పట్టదు. జీవిత ప్రమాణాన్ని ఎక్కువ చేయాలని నిరంతరం ప్రయత్నిస్తూంటాము. కాని యంత్రాలవల్ల యే కొద్దిమంది జీవిత ప్రమాణమో పెరిగేమాట నిజమే. అయితే అందుకు బదులుగా నిస్సహాయులైన అనేక మంది జీవిత ప్రమాణం తగ్గిపోతుంది. ఇండియాలో జీవిత ప్రమాణం హెచ్చు చేయాలనే మాట ఒప్పుకోని తీరాలి. కాని అది ఎంతవరకు ? ప్రతిమనిషికీ తగిన కూడు, గుడ్డ ఇల్లు లభించే టంతవరకే. యంత్రంవల్ల తగిలిన ఎదురుదెబ్బతో రక్తనాళాలలో నెత్తురు గూడుకట్టి గ్రామమనే హృదయ కేంద్రానికి ఉద్వేగ మెక్కువై దౌర్బల్యం కలిగింది. అందువల్ల శరీరాన్ని వలె 35 కోట్ల జనసంఖ్యనూ పోషించగల రక్తవాహినీక్రమం (Arterial Sistem) పాడయిపోయింది. కాళ్ళలో నంజు, మొగంలో వాపూ ఉన్నమనిషి పైకి బాగా కనిపించవచ్చును. కాని అతడు జీవించడంకష్టం. అలాగే అత్యంతమైన ఐశ్వర్యం ఒకచోట గూడు కట్టుకొనిఉండి తక్కినచోట్ల

దరిద్రము తాండవమాడుతూంటే ఆ జాతికూడా జీవించదు.

యంత్రంవల్ల ఉపయోగాలనేకంఉండవచ్చును గాక. కాని అది ప్రజలను బానిసలనుగా చేసింది. మానవనైపుణ్యాన్ని నాశన మొనర్చింది. సంసారంలో గుట్టు చెడగొట్టింది. కుటుంబనీతులను ధ్వంసం చేసింది శిల్పకారుని సృజనశక్తిని కుంచపరిచింది. అతని వ్యక్తిత్వాన్నీ స్వాతంత్ర్యాన్నీకూడా చంపివేసింది. దేశాలపరస్పరసంబంధాలలో సహకారభావం పెంపొందింప చేయుడానికి బదులుగా స్పర్థాభావాన్ని పెంచి అంతర్జాతీయకల్లోలానికి కారణమయింది. అంతేకాదు, పారిశ్రామికతత్వ, సైనిక తత్వాల భయంకర దృశ్యములతో గూడిన సామ్రాజ్యతత్వాన్నికూడా రేకెత్తించిం దది. కాలాన్నీ, దూరాన్నీ మాయంచేసి ప్రపంచంలోని దేశాలను దగ్గరకు తీసుకొనివచ్చినమాట నిజమే. కాని జాతులనుమాత్రం ఎంతోదూరం చేసింది. అది మనుష్యశరీరాలను దగ్గరకుచేర్చి ఆత్మలనూహృదయాలనూ దూరదూరంగావిసిరివేసింది. క్రైస్తవమతదృక్పథాన్ని సంకుచితపఱచి సామ్రాజ్యతత్వానికితోకగాచేసింది. పాశ్చాత్యపద్ధతులలో తయారైసోషలిస్టు, విశ్రాంతిఅని భారతీయసమస్యను మఱింత చిక్కు పఱుస్తున్నాడు. భారతదేశపు శిల్పకారుడు తాను చేసేపనిలో మునిగిపోతాడు. అంతేకాని గంటలనుబట్టీ, కూలినిబట్టీ పని చేయుడు. ఇక్కడ విశ్రాంతిసమస్య లేనేలేదు. పనీ, విశ్రాంతీ రెంటికీ యిక్కడ ఒక్కటే అర్థం. శిల్పి పట్టి బండరాతిపైన జగన్మో

హిన్సీ కేశవస్వాముల బొమ్మలను, మనోహరంగానూ మహో న్నతంగానూ చెక్కుతూన్నప్పుడు, ఈతగాడుఉత్తుంగసముద్ర తరంగాలపైన ఈదుతూన్నప్పుడు పొందే ఆనందం పొందు తూంటాడు. ఇండియాలో పనే విశ్రాంతి. విశ్రాంతియే పని. పనియే శిల్పం. పని ఆనందమూ, వినోదము. శిల్పికి పని ఆత్మసాక్షాత్కారం. అదిఅతనికిఆత్మశాంతి. ఇండియాలో నిజ మైన సమస్య విశ్రాంతి ఉన్నవాళ్ళకు పని చూపించడం. అంతేగాని పనివాళ్లకు విశ్రాంతిచూపించడం కానేకాదు.

ఇంగ్లాండులో విశ్రాంతి ఉపయోగమునుగూర్చి విచారణచేసే నిమిత్తం, 200 పై చిలుకు స్వతంత్ర సంస్థల ప్రతినిధులు, విద్యా శాఖాధికారులు, పారిశ్రామిక వ్యవస్థాపకులూ కలసి ఇటీవల ఒక కమిటీని ఏర్పాటు చేశారు.

సర్ విందం డీడ్స్ అధ్యక్షతవహించి ఇలా అన్నాడు: ''పారిశ్రామి కులైన సోమరులుగా గాక, మానవులుగా తమ కిష్టమైన పని చేయ డానికి వీలుకలిగించే స్వతంత్ర కాలమే'' విశ్రాంతి. పనిచేసే కాలం తక్కువే కాని లక్షలాది ప్రజల విషయంలో విశ్రాంతి అంటే పట్టి వెక్కిరింత అయిపోయింది.

పారిశ్రామిక మనస్తత్వ శాస్త్ర జాతీయ సంస్థలకు (National institute of Industrial Psychologe) చెందిన క్రైగ్ జె. హెచ్. బ్లాస్కీ, జనసంఖ్యలో నూటికి 90 మంది తమ మేధా శక్తికి తక్కువయిన పనినే చేస్తూన్నారన్నాడు. ఇంకొక ఉపన్యాస కుడు ఇలా అన్నాడు: మనలో 10/₀ మంది తప్ప తక్కిన వాళ్ళు తమమేధాశక్తికి తగినంత పని చేయడంలేదు. దీని భావమేమో ఆలో చించండి. 6 వ ఫారం చదివే విద్యార్థిని 4 వ ఫారం వాడితోనో

సమర్థుడై అనుభవంగల డాక్టరును వైద్యవిద్యార్థితోనో కలసి పని చేయమంటే ఎలా ఉంటుందో యోజించండి.

సజీవంగా ఉన్న ప్రతి మనిషీ నేర్చుకొని అభివృద్ధి పొందుతూ ఉండాలి. ఒకచోట నిలబడి పోయినట్లయితే ఆయనలో యేదో మృతి పొందేమాట నిజము.

ఈ అధికోత్పత్తి పద్ధతులు కొంతకాలమైన పిమ్మట మనిషిలో ఇటువంటి పరివర్తనాన్నే కలిగిస్తయి. అవి అతనిని అచేతనుణ్ణిగా చేస్తయి. అతని మానసికాభివృద్ధిని నిరోధిస్తయి. "కాని యువకు లిలా క్రమంగా హత్యకావడానికే అలవాటు పడుతూన్నారు." అన్నాడు మటోకాయన.

కొంతమంది యంత్రం దుష్టవస్తువనుకొన ప్రారంభించారు. క్రిష్టమస్ పండుగ ఆనందాన్ని అనుభవించేవాని బైసికిల్ కంటె అది ఎక్కువ దుష్టవస్తువని అనకోము. ఒక్కొక్క పై తెలియకుండా ప్రవర్తించే మనస్థితియే దీనికంతకూ కారణ. మన కేమి తటస్థిస్తూన్నదో మనం గ్రహించలేక పోతూన్నాము. యంత్రం మనను గోతిలోకి తోసే టట్టుగా చేసుకొంటున్నాము. అదీ మన చావుకు కారణం. పనిలేక పోతే జీతంలేదనే నియమం వలన కూలీల శ్రమ ఆత్మవినాశ హేతువైన విసుగుగా పరిణమిస్తుంది. విశ్రాంతి కాల మొక ఫార్సు అవుతుంది. ఇక విశ్రాంతి? ఈమాట చెబితే భయంవేస్తున్నది. నల్లమందు భాయీలు కలలు గనవలసిందే. కాని వాస్తవం గ్రహించలేరు. ఆలోచించుకొనేటందుకు మనకు సావకాశం మీయకపోవడమే మంచిది. నకనకలాడే కడుపుతో ఎక్కువ ధ్యానం చేయడం ఆధ్యాత్మికాభివృద్ధికికూడా కొఱగాని పని అని సెంటు కేథరైన్ చెప్పినాడు. మనిషి తినాలి. తినాలంటే పని చేస్తేనే ఉండాలి.

విష చక్రాలు

ఆధునిక నాగరిక పరిస్థితులలో సేవకంటె ఐశ్వర్యానికి ఎక్కువ ఆధిక్యత ఇస్తున్నాము. కాలాన్ని ధనంగా మార్చ ప్రయత్నిస్తున్నాము. కార్యకారణాలు రెండూ ఒకదాన్ని ఒకటి బలంచేసుకొంటూన్న దుష్టచక్రాల గొలుసు అయిపోయింది జీవితం. ఉదయం మొదలు సాయంకాలం వరకూ, సాయంకాలం మొదలు ఉదయంవరకూ తప్పులు చేయడం, దిద్దుకోవడంతో సరిపోతూన్నది. కాలం ధనంగా మారిన వెంటనే వేగగమనం, ఆధునికయుగంలో ఒక ముఖ్యశిల్పంగా తయారయింది. వేగగమనంవలన రోడ్లపైన దుమ్ము లేవడం ఎక్కువయింది. దుమ్ము లేవకుండా చేయడానికి రోడ్లకు తారు వేయవలసివచ్చింది. తారుకైన ఎక్కువ ఖర్చులను పూడ్చడానికి రేట్లూ, పన్నులూ పెరుగుతూన్నాయి. ఇది అసంతృప్తికీ, అధర్మానికీ కారణాలయినయి. ఈ రెండూ సాహచర్యాన్నీ, సుహృద్భావాన్నీ లోపింపచేసి దురాశనూ, లోభిత్వాన్నీ పెంచుతూన్నాయి. అందువల్ల మళ్ళీ మొదటికే వస్తున్నాము. అప్పుడు తిరిగీ వేగగమనం కావాలి. అది ఆకస్మికాపాయాలకు దారి తీస్తున్నది. వాటిని తప్పించుకోవడానికి పక్కని నడవలు వేయవలసివస్తుంది. ఆ ఖర్చులకోసం మళ్ళీ పన్నులెక్కువచేయాలి. తిరిగీ ఎప్పటాటే కాటన్నా, వెనుక వల్లించిన పాతపాట మళ్ళీ పాడాలి.

ఇక రెండోది:-

పైకం కరెన్సీనోట్ల రూపంలోనో నాణెముల రూపంలోనో

ఉంటుంది. ఉత్పత్తిలోని పోటీవలన మీ ఎగుమతులు పాడయి
పోతయి. మీ మారకపు విలువ తగ్గించుకొని అంగళ్ళను ఆక
ర్షించుకొంటారు. కట్టకు దొంగతూము పెట్టి చెరువులోని నీ
రంతా తీసుకొన్నట్లే ఉంటుం దీపద్ధతి. మారకపుధర తగ్గితే
ఎగుమతు లెక్కువ అయ్యేమాట వాస్తవమే కాని, అందుకు
బదులుగా మీరీయవలసిన అంతర్జాతీయ ఋణాలు పెరుగు
తయి. కాబట్టి మళ్ళీ మారకపుధరను పెంచవలసివస్తుంది.
వెంటనే తిరిగి ఎగుమతులు పడిపోతయి. అప్పుడు ప్రతిష్టం
భన ఏర్పడుతుంది. ఫ్రాన్సు అమెరికాకు చేసినట్లుగా అప్పు
లెగబెట్టవలసివస్తుంది.

మూడో విషచక్రం:-

యుద్ధాలవల్ల సృజింపబడింది. యుద్ధాలలో చిక్కుకొన్న
దేశాలలోని బంగారం అంతా అయిపోయింది. అందువల్ల
వారు బంగారుప్రమాణాన్ని తీసివేస్తారు. బంగారం కరెన్సీ
నోట్లకు వెనుక హామీనిధిగా ఉండడమేగాక, అంతర్జాతీయ
వ్యాపారంలోని ఎచ్చుతగ్గులను చదునుచేయడానికి కూడా
వినియోగిస్తుంది. అమెరికా ఫ్రాన్సు దేశాలు బంగారం బాగా
కూడబెట్టుకొన్నాయి. కాని బంగారుప్రమాణాన్ని విరమించు
కొన్నవారు అమెరికాయొక్క విదేశవ్యాపారానికి బలిష్ఠులైన
పోటీదార్లయినారు. కాబట్టి అమెరికా ఎగుమతులు తగ్గిపో
యినయి. అందువల్ల ఆదేశం తన దిగుమతులకుగాను బంగా
రంలో సొమ్ము చెల్లించవలసివచ్చింది. కనుక అమెరికా
కూడబెట్టిన బంగారురాసులు వాటంతటవే హరించిపోయి

నయి. బ్రిటను బంగారుప్రమాణాన్ని తీసివేసి నాలుగోచక్రాన్ని సృష్టించింది.

ఆ దేశం తన వర్తకాన్నీ, బడ్జెట్టునూ సరిపుచ్చుకొంది. ఆంతరంగికంగా అభివృద్ధి పొందుతూన్నట్లు చూపించింది. అంగళ్ళల్లో ఆ దేశపుకరెన్సీకి విలువ హెచ్చుగానే ఉంది. ఇదంతా నిజమేకాని మరొక కొత్త అపాయం వచ్చింది. కరెన్సీని దేనికీ ముడిపెట్టకుండా గాలిలో వదలివేశారు. అందువల్ల మనీమార్కెటులో సాహసవ్యాపారస్థుల ఆట బాగా సాగింది. వాళ్లసదుపాయాన్నిబట్టి కరెన్సీకి ధర తగ్గించడమో హెచ్చించడమో చేయగలిగినారు. దానితో జాతీయకరెన్సీ జారవిడువబడింది.

అయిదోచక్రం బ్యాంకురేటు:- బ్యాంకురేటు తగ్గిస్తే డబ్బు చౌకవుతూన్నది. పరిశ్రమలభివృద్ధి పొందుతూన్నయి. కాని డిపాజిట్లు తగ్గిపోతూన్నయి. డబ్బెక్కువయినకొద్దీ కోరికలెక్కువవుతూన్నయి. కాబట్టి డబ్బుమీద వత్తిడిని తగ్గించడానికి బ్యాంకురేటు హెచ్చుతూన్నది. ఇంతలో జాతీయఋణం చెల్లించవలసిన వాయిదా ఒకటి వస్తుంది. అప్పుడు బ్యాంకురేటు పేపరురేటుకంటె తగ్గించబడుతుంది. దానిఫలితంగా సెక్యూరిటీల రేట్లు పేపరురేట్లు తగ్గించి అచ్చువేస్తారు. తిరిగీ అప్పుడు మళ్ళీ బ్యాంకురేటు హెచ్చింపబడుతుంది.

ఆరోచక్రం: పన్ను లెంతవరకెచ్చుచేయడానికి వీలుంటుందో అంతవరకూ హెచ్చుచేసి, బడ్జెట్టును సరిపుచ్చుతూంది. ఇంగ్లాండు అప్పుడు పన్నులను తగ్గించాలని ఆందోళన బయలు

దెరుతుంది. తగ్గింపు బడ్జెట్టును భగ్ననంచేస్తుంది. స్టెర్లింగు విలువ మరీతగ్గిందా అది పతనచిహ్నం. అది మతీపెఱిగిందా మతిభ్రంశానికి దారితీసే జ్వరతీవ్రతకు సూచన అది. రెండూ మరణహేతువులే.

అట్టావా ఒడంబడిక ఏడో చక్రానికి కారణమయింది. ఇంగ్లాండు తనకు కావలసిన గోదుమ ధాన్యమంతా అధినివేశ రాజ్యాలనుండి కొనగోరుతూన్నది. అంతకుపూర్వం రష్యా బ్రిటనునుండి యంత్రసామగ్రిని కొనుక్కొని గోదుమలను బ్రిటనుకు పంపేది. అట్టావా బడంబడికవలన ఇంగ్లాండుకు విదేశాల నుండి దిగుమతులు తగ్గిపోయినయి. పోనీ వెన్నవిషయం ఆలోచించండి. ఇంగ్లాండు సామ్రాజ్యంలోని దేశాలనుండి పౌ 23,000,000 వెన్న కొంటుంది. పరాయి దేశాలనుండి పౌ 24,000,000 ల వెన్నకొంటుంది. (మొత్తం 70 కోట్లరూపాయిలది.) బెల్జియం, హాలెండు దేశాలనుండి వెన్న కొనడం లేదు. కాబట్టి తన సామానులను నెదర్లాండుకు అమ్మకం చేయడంలేదు. అందువల్ల ఎగుమతులవిషయాలో చాలా దెబ్బతిన్నది.

వెనుకటి యుద్ధంలో జర్మనీని గెలిచినందువలన ఇంగ్లాండుకు ఎనిమిదో విషచక్రం తటస్థించింది. బ్రిటను అమెరికాకు పౌ 2,282,000,000 లు 62 సంవత్సరాలలో తీర్చివేసే పద్ధతిని బాకీపడింది. జర్మనీ ఈయవలసిన నష్టపరిహారాల మొత్తం పౌ 6,576,000,000 లు 58సం॥ రాలలో చెల్లించవలసి ఉండెను. జర్మనీ చెల్లించవలసిన బాకీ వస్తురూపంలో యిచ్చింది ఫ్రాన్సుకు. అందువల్ల బ్రిటను ఫ్రాన్సుకుపంపే ఎగు

మతులు తగ్గిపోయినయి. జర్మను పరిశ్రమాలయాలు జోరుగా పనిచేస్తున్నయి. అక్కడి కార్మికులకు కావలసినంత కూలి లభిస్తూన్నది. యుద్ధం ముగిసినతక్షణం ఇంగ్లాండులో నిరుద్యోగుల సంఖ్య 110 లక్షలకు పెరిగింది. ఇటువంటి విషచక్రాలనే గాంధీ జీవచక్రాలుగా మార్చబలెనని కోరుతూన్నాడు.

రాజకీయం ఒక పెద్ద రైలువంటిది. నాయకుడు ఇంజన్ డ్రైవరు. ఈ రైలుఎక్కడతొందరగానడపాలో, ఎక్కడమందంగా నడపాలో, ఎక్కడ ఆపాలో, ఎప్పుడు బయలుదేరాలో, ఎక్కడ పెట్టెలను తగిలించుకోవాలో, ఎలావిడచిపెట్టాలో, ఎప్పుడుబాటసారులను తీసుకువెళ్ళాలో, ఎప్పుడు సామానులను వేసికొనివెళ్ళాలో ఈ అన్నీ ఆయనకు తెలిసిఉంటవి. బాటసారులూ, సామానులూ కూడా కలిసివుంటే బరువు చాలా ఎక్కువవుతుంది. విడదీస్తే బాటసారులకు విసుగు పుడుతుంది, కాని లంకణాలు చేయడంకంటే నయమేకదా విసుగు పుట్టడం. సామానులు లేకపోతే సప్లయిశాఖ వుండదు. ఈ విధంగా నాయకుడు ఒకప్పుడు వేగంగానూ మఱొకప్పుడు మందంగానూ ఇంకొకప్పుడు నాన్‌కోఆపరేషన్, సివిల్ డిజొబీడియన్సులతో ఎక్స్‌ప్రెస్‌లోనూ, ఇంకొకప్పుడు - హరిజన ఖద్దరు మద్యపాన నిషేధ సాంఘికైక మత్యాలనే సామానుల సరఫరాశాఖతోనూ నడుపుతూన్నాడు మన రైలును. ముందు కొందఱు పాఱలూ, పలుగులూ పుచ్చుకొనిపోయి దుబ్బులు, పొదలు, కంపలు, చెట్లూకొట్టి అడవిలోనుండి దోవచేస్తూన్నారు. మళ్లీమార్గంలోమరణించినైనా వెనుకవాళ్ళుసుఖంగా

నడవడానికి వీలుకలుగిస్తూన్నారు. ఈ విధంగా వ్యాపారం దివ్యసందేశంగానూ, బంగారంపైనఉన్న అత్యాశ దైవాన్వేషణ తత్పరత్వంగానూ పరిణతిపొందింది.

అధ్యాయము 11

భారతదేశ గ్రామము

౧

పరరాజ్యాన్ని స్వరాజ్యంగా మార్చడమే హిందూదేశపు సమస్య. నేటి రాజ్యంలో ఉన్న పరత్వ భావమేమిటి ? దేశీయ సంస్థలన్నిటిలోనూ పాశ్చాత్య భావం నిండి ఉండడమూ లేక ప్రాచ్య తత్వానికి బదులుగా పాశ్చాత్యతత్వం స్థాపింప బడి ఉండడమూ ? ప్రస్తుత పరిస్థితులలో మొదటి దానికంటె రెండోదే ఎక్కువగా కనిపిస్తూన్న మాట వాస్తవం. కాబట్టి మనం తిరిగీ ఇండియాలోని ప్రతి అంగుళమూ, ప్రతిరంగమూ, ప్రతి పరిపాలనాశాఖా, ప్రతిసంఘ విభాగమూ గెలుచుకో ప్రయత్నిస్తూన్నాము. కనుక నేడు ప్రజల కింమకు తగిన నూతన చైతన్యం కలిగించడమే మన ప్రధానకర్తవ్యము. పూర్వ సదాచారాలు పూర్వపద్ధతులు, పూర్వబాంధవ్యాలు, పూర్వ ఆదర్శాలు - వీటిని గూర్చిన వివేకం కలగాలి యిప్పుడు మన దేశీయులకు నూటయాభై యేండ్ల పర పరిపాలనం వలన మనవాళ్ళు, కొత్తపద్ధతులకు, కొత్తవ్యవస్థలకుకో, త్తవేషభాషలకు, కొత్తకోరికలకు, కొత్త, భోగాలకూ అలవాటయినారు. సంఘక్షేమం కంటె వ్యక్తి క్షేమం యెక్కువగా పరిగణింప బడుతూన్నది. ధర్మాలు నశించి హక్కులు విజృంభిస్తున్నాయి. ముందుసంగతి యేమైనా

సరే ప్రస్తుతం విషయం ఆలోచించు కొంటూన్నారంతా. కార్యసాధనోపాయం ముందు సిద్ధాంతం ఎందుకూ పనికి రాకుండా పోతూన్నది. సేవకంటె ఐశ్వర్యానికి ఆధిక్యత చూపిస్తూన్నారు ప్రజలు. పని తీరికగానూ సమగ్రంగానూ చేయడం కంటె తొందర తొందరగా పూర్తిచేయడం ప్రధానము కొంటూన్నారు. అనుకొన్న వేళకు పని పూర్తిచేయడం సుగుణం కావచ్చునుగాని, ఆకాల పరిమితి యెప్పుడూ పని యొక్క విశుద్ధతకు, పరిపక్వస్థితికీ అభ్యంతరం కలిగిస్తూండడం మాత్రం అన్యాయం. అన్నిటిలోకీ కాలపరిమితియే ప్రధానమై నిజాయితీకి గాని సంప్రదాయ సదాచారాలకుగానీ విలువ లేకుండా పోయింది. "వస్తువు చౌకగా ఉంటే సరి పాడుగా ఉన్నా సరే" చలామణీ అవుతుంది ఈకాలంలో. ఇది యంత్రపారిశ్రామిక పద్ధతిలో ఇమిడి ఉన్న అసలు రహస్యం. ఈ దుష్టపరిణామాలన్నిటికీ కారణమైన మూలతత్వాన్ని గ్రహిస్తేనే గాని తిరిగీ మన జాతి, తొలినాటి భారతీయ గ్రామజీవితాన్ని పునరుద్ధరించడానికి తగిన పునాదులను వేయజాలదు. "తిరిగీ గ్రామాలకు పొండి" అని అందఱికీ ఉపదేశిస్తూ ఉంటాము. మనం మాత్రం పట్టణాలలోనూ నగరాలలోనూ మన వృత్తులను చేసుకొంటూనే ఉంటాము. పంచాయితీల స్థాపననుగూర్చి గంభీరోపన్యాసం చేస్తాము. కాని మన దేశాచారాలకు సంబంధించక, అసలు తగాదా జరిగిన ప్రదేశానికి దూరంగా ఉండి, అబద్ధపు సాక్ష్యాలకు అసత్య ప్రమాణాలకూ తావలములైన కోర్టులలో వకీళ్లుగా

పనిచేస్తూంటాము. మానవ సౌభ్రాతృత్వంపైన మనసులు కరిగేటట్లు మాట్లాడుతాము. కాని భర్త చని పోతూండగా సగం పిచ్చి పట్టినట్లు కనిపిస్తూన్న, కాబోయే వితంతువు కడ నుండి పదిరూపాయలు సంపాదించాలని ప్రయత్నించడంలో సిగ్గు పడము. మేడపైన చనిపోయిన వాని కళేబరం బయటికి పోకమునుపే కింద పెళ్ళిళ్లు చేసుకొంటాము. గ్రామ కళాకౌశలాన్నీ కుటీర పరిశ్రమలనూ కీర్తిస్తూనే మన పిల్లలను, ఆత్మరహితమైన, యంత్రాను రూపమైన, విద్యాపద్ధతిలో ప్రవేశ పెడతాము, వితంతువులకు, తలిదండ్రులు లేని బిడ్డలకు సహాయం చేయాలని జాలిమాటలు చెబుతూనే దేశీయ వృత్తులనూ, జీవితాన్నీ నాశనంచేసిన యంత్రాలయాలకు దాసానుదాసులుగా పనిచేస్తూంటాము. భారతీయ గ్రామ జీవితాదర్శాన్ని పరమావధిగా ఉంచుకొని కూడా పట్టణాలలో తమ కాలాన్నీ శక్తినీ వినియోగిస్తూన్న కొంతమంది జీవితంలోని ఈ పరస్పర విరుద్ధభావాన్ని వారు గ్రహించ వలసి ఉంటుంది.

కాబట్టి మన దేశాన్ని తిరిగీ మనం గెలుచుకోవాలంటే ఈ నూతన సంప్రదాయాలకు విరుద్ధంగా చిత్తపరివర్తనం కలగాలి మనకు. మన కుమాళ్ళకు కుమార్తెలకూ యిప్పుడు మనమిస్తూన్న శిక్షణకు వ్యతిరేకంగా దండయాత్ర సాగించాలి. కాని సంఘంలో మనం పెద్ద వాళ్ళనుగాచేసి గౌరవిస్తూన్న మన మంత్రుల, విశ్వ విద్యాలయోపాధ్యక్షుల,

అధ్యాపకుల, ఆచార్యుల, లాయర్ల, డాక్టర్ల, పారిశ్రామిక ప్రధాన పురుషుల, వాణిజ్య ప్రభువుల - భౌతిక ప్రయోజన పరత్వమునుండి బ్రతికి బయట పడగలుగుదుమా ? అనేది నేడు గమనించవలసిన విషాదకర పరిస్థితి. అందువల్ల మన ఆలోచనలనుగానీ అభిప్రాయాలను గానీ వీరి పెద్దరికానికి భయపడి దాచకూడదు. ఇప్పుడు జరుగవలసినపరివర్తనం వెనుకవైపుకు పోవడమే. ఇంగ్లాండులో ఓటింగుఅధికారం విపులం చేయబడినప్పుడు 19 వ శతాబ్ది మధ్యలో రాబర్టులో 'మన గురువులకు చదువుచెప్పాలిమనమిప్పు' డన్నాడు. అదేనిజంగా మనంకూడా నే డవలంబించవలసిన పద్ధతి. ఏకొద్దిమంది సంస్కారులో అశిక్షితులైన అనేకమందికి చదువుచెప్పడం కాదిప్పుడు కావలసింది. గౌరవమందిరాలలో అధికారస్థానాలను అలంకరించి కూర్చున్న కొద్దిమంది వాక్చతురులకు లక్షలాది నోరులేని జనులు పాఠాలు చెప్పవలసిన తరుణమిది. కాబట్టి భారత దేశ గ్రామోద్ధరణం కొండపైకెక్కడం వంటిది. ఆంగ్లేయులు మనదేశాన్నివిడచి వెళ్ళినతరువాత మనసంస్కృతిని పునరుద్ధరించుకోవడానికి, మనసభ్యతను పునరుజ్జీవింపచేసుకోనేటందుకు కొన్ని పురుషాంతరాలవరకూ మన యువకులకు చేతినిండా పనిఉంటుంది. కాబట్టి యీ సమస్యలోని ప్రధానవిషయాన్ని అర్థంచేసుకోనేటంత ఆత్మవికాసం ప్రజాసామాన్యంలో కలిగించటమే మన ముఖ్యకర్తవ్యం. అది జరిగిందా సమస్యాపరిష్కారం దానివెంటనే జరుగుతుంది.

౨

భారతదేశపు గ్రామము - దాని నిర్మాణము

స్వరాజ్యప్రభుత్వంలో, నవ్యభారతవర్షమున గ్రామనిర్మాణం యేస్థితిలో ఉండాలో, దాని ప్రాధాన్యత యేమిటో యోచించ వలెనంటే నూటయాభై సంవత్సరాల క్రిందట మన గ్రామాలెలా ఉన్నవో ఏవిధంగా అభివృద్ధిపొందుతూ వచ్చినవో పరిశీలించ వలసి ఉంటుంది, అందుకు 1814 ఏప్రిల్ 25 వ తేదీని "కోర్టు ఆఫ్ డైరెక్టర్లు" ఇంగ్లాండుకు పంపిన న్యాయవ్యాసభాని వేదిక (Judicial despatch) లోని ఈ భాగం మనకు చాలా సహాయకారి కాగలదు. మనువుకాలంనుండి దాదాపు నేటివరకు భారతీయగ్రామం చెక్కుచెదరకుండా ఎలా నిలచివున్నదో, కొన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టబడిన రైత్వారీపద్ధతి దానినెలా చీకాకుపఱిచిందో ఈ నివేదిక తెలియజేస్తున్నది.

దత్తమండలాలనుండి కల్నల్ మన్రో 1806 మే 15వ తేదీనిపంపిన నివేదికలో మాకిలా వ్రాస్తున్నాడు. "ప్రతిగ్రామము తనపంగ్రెండు(Ayangadues) పాలెములతోనూ ఒక చిన్న ప్రజాస్వామ్యంగా (Republic) నడుస్తూ యున్నది. దానికి నాయకుడు పటేలు. ఇండియాఅంతా అటువంటి ప్రజాస్వామ్యాలతో అల్లుకొనిఉంది. యుద్ధసమయాలలో ప్రజలుముఖ్యంగా వాళ్ళ పటేలుమీద ఆధారపడి ఉంటారు. రాజ్యాలు విచ్ఛిన్నమైపోయినాసరే, విభాజ్యమైపోయినాసరే వారికేమీపట్టదు. వాళ్ళగ్రామం వాళ్ళకు చెక్కుచెదరకుండాఉన్నట్లయితే, అది ఎవరిఅధికారంక్రిందకు పోయినప్పటికీ వాళ్ళకు లెక్కలేదు. దాని ఆంతరంగిక పరిపాలనలో యేమీ మార్పుండదు. ఇప్పటికీ పటేలే కలక్టరు, మేజస్ట్రేటు, పెద్ద కాపూను. మనువుకాలంనుండి యిప్పటివరకు సెటిల్‌మెంట్లు పటేలు ద్వారాగానీ, పటేలుతోనేగానీ, జరుగుతూవచ్చినయి. రాష్ట్రాన్ని

ఎవరు పాలించినప్పటికీ గ్రామ పరిపాలకుడుమాత్రం పటేలే' అని ఆయన మఱియొక నివేదికలో వ్రాశాడు. ఇండియాలోని గ్రామసంఘాలనుగూర్చిన ఈ నివేదికలోనివర్ణన, మా రెవిన్యూబోర్డువారి 1808 ఏప్రిల్ 25వ తేదీ నివేదికలోని అభిప్రాయాలతో సరిపోతున్నది. భూగోళశాస్త్రప్రకారం ఆలోచిస్తే గ్రామమనగా కొన్ని వందలో, వేలో ఎకరాల వైశాల్యంగల పంటపొలముతోనూ, బంజరుపొలముతోనూ ఉండే భూఖండం. రాజకీయంగా ఆలోచిస్తే అది ఒక మున్సిపాలిటీనో, కార్పొరేషనునో పోలిఉంటుంది. దాని ఉద్యోగస్తులు, నౌకర్లు ఈ విధంగా ఉంటారు.

పటేలు లేక గ్రామపెద్ద :- ఈయన గ్రామ వ్యవహారాలన్నిటినీ తనిఖీ చేస్తూంటాడు. పోలీసుపనిచూస్తాడు. ఈ గ్రామంలో రెవిన్యూ వసూలు చేస్తుంటాడు ఈయనకు గ్రామస్థులతోను గ్రామవ్యవహారాలతోనూ సన్నిహిత సంబంధ ముండడంచేత ఈపని కీయన చాలా అర్హుడు.

కరణం:- ఈయన వ్యవసాయానికి సంబంధించిన లెక్కలు వ్రాస్తుంటాడు. రిజిష్టర్లు వ్రాస్తుంటాడు.

తలారి:- ఇతనికి చాలా దూరపు పను లున్నట్లు కనిపిస్తుంది. జరిగిన నేరాల భోగట్టా తెలుసుకోవడం, ఒక గ్రామమునుండి మఱొక గ్రామమునకుపోయే బాటసారులకు తోడుగా వెళ్లుతూ వాళ్ళను కాపాడడం వీని ముఖ్యధర్మాలు.

తోటీ:- ఇతనిపని చాలావరకు గ్రామానికి సంబంధించే ఉంటుంది. ఇతడు పంటలను కావలికాయడం వాటికొలతలలో సహాయంచేయడం.

పొలిమేరకాపు: ఇతను గ్రామాలపొలిమేరలను కాపాడుతూంటాడు తగాదాలు వచ్చినప్పుడు సరిహద్దులనుగూర్చి సాక్ష్యమీయడం ఈతని ధర్మం.

చెఱువులను, పంట కాలవలను తనిఖీచేసే మనిషి:- వ్యవసా

యాకిని కావలసిన నీరు సక్రమంగా వదలి పెడుతూంటాడు.

పూజారి బ్రాహ్మణుడు:- గ్రామ పూజాపురస్కారాలను సర్వహి స్తుంటాడు.

బడిపంతులు:- పిల్లలచేత అసుకలో అక్షరాలు వ్రాయించి చదివిస్తుంటాడు.

పంచాంగం బ్రాహ్మణుడు విత్తనాలు నాటడానికీ, మహానూల్ చేయడానికీ మంచికార్తెలను చెబుతాడు.

కమ్మరి, వడ్రంగి వ్యవసాయానికి కావలసిన పనిముట్లు తయారుచేసి రైతులకు ఇళ్ళు కట్టిపెట్టుతారు.

కుమ్మరి, చాకలి, మంగలి, గొల్ల, వైద్యుడు, దేవదాసి (ఈమె ఉత్స వాలలో హాజరవుతూంది) పాటకుడు, కవి: ఈ ఉద్యోగులూ, నౌకర్లను గ్రామసిబ్బంది అంటే. కాని కొన్నిచోట్ల ఇంతిమంది ఉండరు. పైన చెప్పినపనులు కొన్నికొన్ని ఒక్కమనిషే నిర్వహిస్తుంటాడు. మరికొన్ని ప్రదేశాలలో ఈ పైనచెప్పి వారికన్న ఇంకా ఎక్కువమంది ఉంటారు.

ఈ నిరాడంబరమైన మునిసిపల్ పరిపాలనాపద్ధతిక్రింద గ్రామస్థులు అనాదికాలంనుండీ ఉంటూన్నారు. గ్రామపొలిమేరలలో ఎన్నడూ మార్పురాదు. యుద్ధం, కరువు, రోగాలు వీటివలన గ్రామాలు పీడింపబడినప్పటికీ చివరకుపాడుపడినప్పటికికూడా ఆ పేరులు, ఆ పొలిమేరలు, ఆమిరాసీలు, ఆకుటుంబాలూకూడా అలాగే తరతరాలవఱకూ నిలచిఉన్నాయి. రాజ్యాలు విచ్ఛిన్నంకానీయండి విభాజ్యంకానీయండి తమగ్రామం చెక్కుచెదరకుండా ఉన్నంతవరకు గ్రామస్థులకు చీమ కుట్టదు. ఆ గ్రామం ఎవరిపాలనలోనికి పోయినా వారికి లెక్కలేదు. ఎవరుదానికి ప్రభువైనాఒకటే. దాని ఆంతరంగిక వ్యవహారనీతి కేమీ

> మార్పుండదు. పటేలే ఆగ్రామస్థులకు పెద్దగా ఉంటాడు. వాళ్ళ కాయనే చిన్న జడ్జి, మేజిస్ట్రేటు, కలెక్టరు, పిల్లజమీందారూను.
>
> దేవాలయసిబ్బందికీ, స్థానికగవర్నమెంటు ఉద్యోగులకు, గ్రామనౌకరులకు వారివారి ధర్మాలను నిర్వహించేటందు కొసంగబడిన భూములుగాక గ్రామాలలో పండిన పంటలో కొంతభాగంకూడా ప్రతిసంవత్సరమూ పారితోషికంగా లభిస్తుండేది. ఈ పారితోషికం రైతులు ప్రభుత్వానికి ఈయవలసిన భాగం ఈయకమునుపే ఆ యా ఉద్యోగస్థులకు ప్రత్యేకించి ముట్టచెబుతూండేవారు. కాని ఇటీవల ప్రభుత్వానికి చెల్లించవలసినభాగం చెల్లించబడిన తరువాత యిస్తున్నారు. ముసలితనము వలనగానీ, ఆకస్మికంగా సంభవించిన అపాయంవలనగానీ అశక్తులైన ప్రజాసేవకులకు (Public Servants) పైన ఉదహరింపబడిన పద్ధతి ప్రకార మేదో కొంత జీవనాధారం కల్పించినట్లు కన్పిస్తున్నది. రెవిన్యూఉద్యోగస్థులూ, గ్రామసేవకులూ, వారివారి ఉద్యోగధర్మాలను నిర్వహిస్తున్నందుకు తీసుకొనే ప్రతిఫలంలో కొంత శాయరు (దేశీయ వస్తువులపై సరకులపైపన్ను) సముద్ర భూమార్గాలనుండి దిగుమతియైన సుంకములద్వారానూ లభించిన ద్రవ్యంలోనుంచి ముట్టుతూ ఉంటుంది.

ఇండియాలో అష్టాదశ శిల్పు లున్నట్లు (౧౮) వింటూన్నాము. పారశీకులు 32 మంది ఉన్నట్లు చెబుతూన్నారు. పార్సీ అగ్నులు 33 అనిన్నీ - 32 అగ్నులూ 32 వృత్తులకు సంబంధించినవనీ మిగిలినవి మెఱుపునుండి పుట్టిన మొదటి అగ్నిఅనీ- ఆ మొదటిఅగ్నిని వేయి సంవత్సరాలకిందట ఇండియాకు వచ్చిన మొట్టమొదటి పారశీక యాత్రికులు తెచ్చినారనీ ప్రతీతి. 32 మంది శిల్పులను వరుసగా ఇక్కడ పేర్కొన ప్రయత్నించెదము గాక.

౧. వడ్రంగి ౨. కమ్మరి ౩. రజితకారుడు ౪. స్వర్ణకారుడు ౫. కుమ్మరి ౬. చెప్పులు కుట్టేమనిషి ౭. చాకలి ౮. ముచ్చి ౯. కలంకారీపనిచేసేమనిషి ౧౦. కుట్టుపనిచేసే మనిషి ౧౧. కంచరి ౧౨. రైతు ౧౩. పౌరోహితుడు ౧౪. వైద్యుడు ౧౫. మంగలి ౧౬. కాటికాపరి ౧౭. ముచ్చి ౧౮. తాపీమనిషి ౧౯. కరణం ౨౦. మున్సిఫ్ ౨౧. కోమటి ౨౨. ఈడిగ ౨౩. జ్యోతిష్కుడు ౨౪. నూలువడికేమనిషి ౨౫. పాకీమనిషి ౨౬. నాట్యకత్తె ౨౭. పాటగాడు ౨౮. సాలి ౨౯. ఊరికాపరి ౩౦. నీటికాపరి ౩౧. మల్లు ౩౨. జదుగార్ (Jadugar).

గ్రామాలలో

ఒకక్షణం గ్రామాలలోకి పూర్వ పరిస్థితులనూ, నూతన పరిణామ ప్రభావఫలితంగా కలిగిన నేటి సంఘపరిస్థితులనూ పరిశీలన చేదాము. ఇటీవలివరకు గ్రామ మొక సమష్టిసంఘం. ఇప్పటికికూడా ఒకవిధంగా అంతే. కొన్ని శతాబ్దాల క్రిందట సమష్టిఉత్పత్తి, సమష్టిహక్కులూకూడా ఉండేవి. నేడలా లేకపోయినప్పటికీ గ్రామం ఇప్పటికీ స్వయంసంపూర్ణ స్వావలంబన జాతీయతా కేంద్రంగానే ఉంటూన్నది. భారతజాతి తన వ్యక్తిత్వాన్నీ సంపూర్ణతనూ కోల్పోకుండా ఉండాలంటే గ్రామం ఇదేవిధంగా ఉండితీరాలి, గ్రామాని కవసరమైన సామగ్రి అంతా దాని సరిహద్దులలోనే లభిస్తూండడంచేత దానిని 'సూక్ష్మాకారజగత్తు' అనిచెబితే తప్పుకాదు. వడ్రంగి, కమ్మరి, వాస్తుశాస్త్రజుడు, స్వర్ణకారుడు, చెప్పులుకుట్టేమనిషి,

కాపు, మంగలి, చాకలి, వర్తకుడు, షాహుకారు, నూలు వడికేమనిషి, సాలి, పురోహితుడు, వైద్యుడు- అంతా గ్రామములో ఉండనేఉన్నారని ఇదివరకే చెప్పిఉన్నాము. గ్రామాన్ని తక్కిన ప్రపంచంతో కొంతకాలం సంబంధం లేకుండా చేసినాకూడా పోయేదేమీ లేదు. మనిషికి కావలసిన ప్రధానవస్తువులు- అన్నవస్త్రాలక్కడఎప్పుడూసిద్ధంగాఉంటవి. ఇతర గ్రామాలతో సంబంధం కేవలం సంఘ సంతోషంకోసం తప్ప అవసరం లేదు. ఒక పట్టణాలతో సంబంధంకలగడం, లాయర్లద్వారా, డాక్టర్లద్వారా, కమీషన్ ఏజంట్లద్వారా పల్లెటూళ్ళధనం పట్టణాలలోకి, అక్కడనుండి నగరాలలోకి చివరకు ఖండాంతర దేశాలకూ పోవడానికి మాత్రమే వినియోగపడుతుంది. పూర్వంకూడా మనదేశాలలో పెద్ద పెద్ద నగరా లుండేవి. కాని అవి భారతదేశపు కళాకౌశలాన్ని ప్రదర్శించే విపణివీధులుగానూ ప్రపంచవర్తకులకు వ్యాపార స్థానాలుగానూ ఉండేవి. మనం ఉత్పత్తిచేసిన ఉత్తమోత్తమ వస్తువులను ప్రపంచానికి సప్లయి చేశాము. మన అన్న వస్త్రాలకెన్నడూ మనం ఇతరులపైన ఆధారపడలేదు. దుర దృష్టవశాత్తు అదంతా మారిపోయింది. మనం కేవలం బానిసలంగా తయారయినాము. ఒకప్పుడెంతో గొప్ప సభ్యజాతిగా నుండి బంగారంపండే భారతవర్షం నేడు ఇంగ్లాండు దేశానికి ఉపగృహంగా మారిపోయింది.

జాతిహృదయాలను ఆకర్షించి మనస్సును జయించేటందుకు ఆంగ్లేయులు రెండోకంటివానికి తెలియకుండా నడీచప్పుడూ

లేకుండా, ఇంతపని చేయగలిగారు. సిపాయితిరుగుబాటని ఆంగ్లే యులచేతపిలువబడే భారతస్వాతంత్ర్య ప్రథమసంగ్రామం అప జయంపొందినమాత్రంతో భారతీయ స్వాతంత్ర్యప్రయత్నాలు నిలచిపోలేదని వారికి తెలుసును. కనుక "తిరుగుబాటు" జరిగిన మఱుసంవత్సరమే 1858 లో వారు బొంబాయి, మద్రాసు, కలకత్తానగరాలలో విశ్వవిద్యాలయాలను స్థాపించారు. 1860లో హైకోర్టులను, 1861లో శాసనసభలనూ స్థాపించారు. కళాశాలలు, హైకోర్టులు, శాసనసభలు- ఈ మూడుసంస్థలు ప్రజల దృష్టిని ఆకర్షించి ఇండియాలో బ్రిటీష్ రాజ్యాధికా రానికి అభయహస్తమిచ్చినవి. ఇంగ్లీషుభాష ప్రచారంలోనికి వచ్చింది. ఇంగ్లీషులో చదువుచెప్పడం, ఇంగ్లీషులో పరీక్షలు చేయడం ప్రారంభమయింది. ఉద్యోగస్థులంతా ఇంగ్లీషులోనే వ్యవహరించడం మొదలుపెట్టారు. ఇంగ్లీషున్యాయచట్టం దేశం లోకి దిగుమతీ అయింది. వాది, ప్రతివాది, ఇద్దరిపక్షపు ప్లీడర్లు, జడ్జీ, జ్యూరీ, సాక్షులు ఈ అందరూ తెలుగువారే అయిన ప్పటికీ సాక్షిని ఇంగ్లీషులో అనువాదకునిద్వారా ప్రశ్నలడిగి సమాధానాలు పుచ్చుకోవడం ఆచారమయింది. తీర్పులన్నీ ఇంగ్లీషులోనే వ్రాస్తున్నారు జడ్జీలు. కోర్టులలో "సత్యమే చెబు తాను. అంతా సత్యమే చెబుతాను. సత్యంతప్ప ఏమీ చెప్పను" అని చేస్తున్నప్రమాణం "అసత్యమే చెబుతాను అంతా అసత్యమే చెబుతాను. అసత్యంతప్ప ఏమీ చెప్పను" అనిఅర్థంగా పరిణమిస్తూన్నది. నేరంగానీ, వివాదంగానీ జరి న ప్రదేశానికి పదులకొలదీ మైళ్ళదూరంలో కోర్టులుండటం

చేత, జంకూకొంకూ లేకుండా అబద్ధంచెప్పి స్వేచ్ఛగా తప్పించుకోవడానికి వీలైన జూదపుటిళ్లా అనిపిస్తూంటవవి. మానవుల నిత్యానుభవంలో ఉన్నవిషయాలు, రోజూ కళ్ళారా చూస్తున్న ప్రత్యక్షసందర్భాలూ కూడా కోర్టులో నిస్సంకోచంగా కాదనేస్తారు కొందఱు సాక్షులు. అనేక అప్పీలు కోర్టు లుండడంచేత అదృష్టంమీద ఆధారపడే వ్యాజ్యాల కోరులు తయారవుతూన్నారు. కోర్టులమూలాన కొత్తవర్గమొకటి బయలుదేరింది. వారిని 'టౌట్లు' అంటూరు వ్యాజ్యాల కోర్లకూ ప్లీడర్లకూ సంబంధం కలుపుతూంటారు వారు. వ్యాజ్యం కేవలం ఇద్దరికీ సంబంధించిన వివాదవిషయంగా కాక, కసితీర్చుకోవడానికీ, పగసాధించడానికీ మార్గాంతరంగా పరిణమించింది. దాని దుష్ఫలితాలు చెప్పతరంగాదు. భాగ్యవంతులు పేదవాళ్ళను చావకుండానూ, బతకకుండానూపెట్టే యాతననే వ్యాజ్యమనాలి. స్వరాజ్యంలో ఇటువంటివంతా రూపుమాసిపోవాలి. పంచాయతీలుఆచరణలోకిరావాలి, గ్రామపంచాయతీ, ఊరిఆరోగ్యరక్షణ, సహకారసంఘం, న్యాయవిచారణ- ఈవిషయాలలో పనిచేయదగినదిగా ఉండాలి. అడవులను పంటబోదెలను కాపాడుతూ ఉండాలి. లైబ్రరీని నడిపించాలి. గ్రామపరిశ్రమలను, కళలను పునరుద్ధరించాలి. ~~ఈపైన చెప్పిన~~ అన్ని ప్రయోజనకరములైన పనులు చేస్తూ సర్వతోముఖ కార్యనిర్వహణ సంస్థగా ఉండాలి. ఒకపంచాయితీయే ~~ఈ~~పనులన్నిటినీ ఒక్కసారిగా సాధించలేకపోవచ్చును. ఆసందర్భంలో చాలినన్ని పంచాయితీలను స్థాపించవచ్చును. న్యాయ్యవిచా

రణకు సంబధించినంతవరకు ఏ సందర్భములోనూకూడా గవర్నమెంటుప్లీడరు అంగీకరిస్తేనేగాని అప్పీలు చేయడానికి వీలుండకూడదు.

గ్రామపంచాయతీ సంఘం

గ్రామస్థులు కలహప్రియులు. కక్షలుకట్టి వాటితో కిందా మీదాపడుతూంటారు. అందువల్ల పంచాయతీలు పనికిరావని కొందఱభ్యంతరపెడతారు. గ్రామాలలోకక్షలు పెఱిగిపోయిన మాట కాదనము కాని వాటికి కారణం నేటి కోర్టులు, వాటి న్యాయవిచారణాపద్ధతిని. లాయరువృత్తి విరోధంపెంచడానికేగాని ఐకమత్యం కలిగించడానికి ఉపయోగపడడంలేదు. కోర్టు న్యాయ్యం చేయడానికికాక చట్టాన్ని అమలుపరచడానికి విని యోగిస్తూన్నది. న్యాయ్యం ప్రజామోదకరంగా ఉండాలంటే తొందరగా జరగాలి.; చౌకగా లభించాలి; అసందిగ్ధంగా ఉండాలి; ఇది పంచాయితీలోనే సాధ్యమౌతుంది. మేజస్ట్రీటు కోర్టులుఉండి క్రిమినల్ కేసులు పెట్టడానికివీలవడంవల్లనే సివిల్ క్రిమినల్ వ్యాజ్యాలు పెంచుకొని పరస్పరం పగసాధించుకోవడానికి వాటిని పరికరాలుగా ఉపయోగిస్తూన్నారు కొందఱు. 'లా'రిపోర్టులనుతగులపెట్టి, కేసు'లా'ను గమనించడంమాని వేసి అప్పీళ్ళకు పరిమితి యేర్పాటుచేస్తే అప్పుడు కొత్తయుగం ప్రారంభమవుతుంది. సమాన ప్రతిపత్తిగల గ్రామస్థులారు మంది నేరంకానీ, వివాదంకానీ జరిగినచోట కూచొని న్యాయ్య విచారణ చేయడానికి వీలున్నప్పుడు గ్రామపెద్దలు యే విధమైన కష్టమూ లేకుండా వచ్చి సాక్ష్యమిస్తూంటే,

గ్రామస్థు లందరికీ తెలిసిన విషయంలో అబద్ధం చెప్పడానికి సాధ్యమౌతుందా? అప్పుడు నోటితో చెప్పిన మాట లేదని అనగలడా? అందువల్ల ప్రజల నిజాయితీ తిరిగీ అభివృద్ధి పొందుతుంది. అబద్ధంవల్లనే కలహాలు వస్తున్నాయి. అబద్ధాన్ని ఆపగలిగినప్పుడు వ్యాజ్యాలే ఉండవు. ఈ పనిని చేయగలిగిన సంస్థ పంచాయితీ ఒక్కటే. కొత్తమార్పు వచ్చేటప్పుడు కొన్నిలోపాలు జరిగితే జరుగవచ్చును. ఆ లోపాలురావడం మనరాష్ట్రీయ స్వపరిపాలనలో, మన జిల్లా బోర్డు మున్సిపాలిటీలలో, గ్రామపరిశ్రమల నిర్మాణములో, జాతీయవిద్యా కార్యక్రమంలో, హరిజన ఉద్యమంలో, అన్నిటిలోనూ తప్పనిసరి.

ఇండియాను మనం క్రొత్తగా జయించుకోవాలి. ప్రతి శాఖను పునర్నిర్మాణం చేయాలి. జాతీయ జీవితంలోని ప్రతి విషయాన్ని తిరిగీ ఒక క్రమంలోకి తీసుకొనిరావాలి. జాతీయ విద్యనుగూర్చి ఇంకొక అధ్యాయంలో వ్రాశాము. నిరంకుశాధికార సంస్థలోగాని, ప్రొఫెసర్లు, జడ్జీలు, కార్యనిర్వాహకోద్యోగులు, మంత్రులు - వీరిలోగానీ మనుష్యులు మారినంత మాత్రాన మనకు స్వరాజ్యం రాదు. హృదయంలో, ఉద్దేశ్యంలో, దృక్పథంలో మార్పురావాలి. అప్పుడు సగుణ సంపన్నమైన స్వరాజ్యం మనకు లభించి గ్రామాలు తిరిగీ స్వయంసంపూర్ణా లవుతయి. ఇదే గాంధీజంయొక్క ప్రధానాదర్శం.

ఎదిరి వాదం

మనపూర్వులు కేవలం గ్రామాలలోనే నివసించారేమో విచారిద్దాము. చరిత్ర అందుకు వ్యతిరేకంగా చెబుతూన్న దంటారు. నగరాలు నశించకూడదనీ పైపెచ్చు గ్రామాలు నగరాలుగా అభివృద్ధి కావాలనీ నిశ్చితాభిప్రాయం గలవారు కొంతమంది ఉన్నారు. నగరాలు మురికిగానూ, ఇరుకుగానూ ఉండవని అంగీకరిస్తారు వారు. పల్లెప్రజలు సొమ్ముకు ఆశ పడక నగరాలవైపుకు చూడకుండా ఉంటే మంచిదేనంటారు. కాని అది ఒకవిధమైన మందకొడి వ్యవహారమని వారి దృఢాభిప్రాయం. అది ఆదర్శ మానవజీవితంకాదట; అజ్ఞానం వలనకలిగే ఆనందమట.

"పరాయిరాజుల దండయాత్రల విషయంలోగానీ, ఆంతరంగిక కల్లోలముల సందర్భములోగాని ఆ గ్రామాలు స్వసంరక్షణ చేసుకోలేవు. కాబట్టిఅవి నగరాలు కావాలంటారు" వారు. పూర్వరాజులు గ్రామాలనేఎక్కువశ్రద్ధగా కాపాడుతూ వచ్చారనే సంగతి మేము విశ్వసించము. మనదేశము 'గ్రామాలదేశము' అనేమాట వాస్తవమే. కాని పూర్వం ఎక్కువగా అనేకవస్తువులను నగరాలకు ఎగుమతిచేస్తూఉండేవి మనగ్రామాలు. మనదేశంలో సన్న్యాసులూ, సాధువులే ఉన్నారంటే ఎంతనిజమో- గ్రామాలే ఉన్నవికాని నగరాలు లేవంటే అంతేనిజం. ఋషులు అడవులలో ఆశ్రమాలు కట్టుకొన్నంతమాత్రాన గ్రామముల ప్రాముఖ్యత ఋజువుకాదు.

పూర్వం అడవులూ, గ్రామాలూ, నగరాలూకూడా ఉన్నవి. 'గ్రామ్య' అనేమాట 'నాగరిక' అనేమాటకు వ్యతిరేకంగా నిందాభావంలో ఉపయోగపడుతూన్నదిగనుకనూ 'నాగరికం' అనేమాటసంస్కారార్థంలో ప్రయోగింపబడుటచేతనూ, నగరం నీతిలోగానీ సంస్కృతిలోగానీ గ్రామాలను అతిక్రమిస్తూన్నదని అర్థంచెప్పకూడదు. నగరాలలో పైకి కనుపించే నాజూకు నేటికికూడా గ్రామాలలో కొఱవడి ఉన్నమాట నిజమే కావచ్చును. 'నగరాల చెడుగులను కళ్ళార చూస్తూన్న కారణంచేత గ్రామాలకుపోనలెవనిపించేమాట నిజమే. ప్రకృతి పూజ, పసిబిడ్డల అమాయకత్వము రూసోను ఆకర్షించినట్లుగా మనను పురాణయుగము ఆకర్షించవచ్చును. కాని అది సరియైన దృక్పథం కాదు. అది పసిబిడ్డల విద్యకుమాత్రం ఉపయోగపడుతుందని' అంటారు పైపక్షపువారు. ఋషిదృష్టితో ప్రకృతి సౌందర్యాలను చూడగల శక్తినిస్తుందది. గ్రామాలవైపుకు మనం తిరిగి చూచినప్పుడు వాటికి మనం నిజంగా సహించరానంత గొప్ప అన్యాయ్యం చేశామనీ, తత్కారణంగా అవి కూలిపోయినవనీ అర్థమవుతుంది. ఈసంగతి తెలియచెప్పడం గ్రామాల అజ్ఞానాన్ని తొలగించేటందుకు మనం సహాయపడడం. కాని బుద్ధిమంతులెవ్వరూ రెండు అసత్యాలను పట్టుకొని వాటిమధ్య ఊగులాడుతూ ఉండకూడదు. నిజమెక్కడున్నదో తెలుసుకొని, అక్కడనుండి ఆలోచించి పనిసాగించాలి. గ్రామాలను సమృద్ధములుగా చేయమనడం పట్టణాలను పాడుచేయమనడంకాదు. అలా చేసినట్లయితే తలకా

యని నరుకుకొని కాళ్లమీద నిలబడ ప్రయత్నించినట్లవుతుంది. నిజానికి మంచి గ్రామాలు నగరాలకు పుష్టి కలుగజేస్తాయి. దేశక్షేమంగోరే నగరాలు గ్రామాలరక్తం పీల్చవు. పైపెచ్చు తమ అధికైశ్వర్యంవలన గ్రామాలను తిరిగి సమృద్ధములుగా చేస్తాయి. నేటి నగరాలు విదేశీ వస్తువులను గ్రామాలకు దిగుమతీ జేస్తున్నాయి. అది గొప్పతప్పు. న్యాయ్యానికి గ్రామకళానైపుణ్యం నగర ప్రాసాదాలను అలంకరించాలి. గ్రామాలలో తయారైన చేతి పరిశ్రమలను ఎగుమతీచేయాలి నగరాలు.

సాంఘిక సమస్యలను పరిశీలించి పరిష్కరించాలి కాని విడిచిపెట్టి ఊరుకోకూడదు. సుహృద్భావం గలిగిన సహకార ప్రయత్నాలవలన ఆపని సులభసాధ్యం కావచ్చును. మొట్ట మొదట కొంత నిర్బంధముగా కనుపించినప్పటికీ పోనుపోను, బిడ్డ నడకకు అలవాటు పడ్డట్టుగా బుద్ధిపూర్వకంగా చేసే సహకారప్రయత్నం స్వభావంగా మారిపోతుంది. అందువల్లనే సమష్టి కుటుంబ మొక సహకార సంఘంగానూ, కులం ఒక కో-ఆపరేటివ్ ఫెడరేషన్ గానూ, గ్రామ మొక కో-ఆపరేటివ్ కాలనీగానూ వ్యవహరిస్తూన్నవి. గ్రామాలలో పని సమిష్టి ప్రయత్నంవలన జరుగుతూన్నది. వాణిజ్యం వస్తుమారకంవలన నడుస్తూన్నది. పరస్పర సుహృద్భావంవలన శాంతి ఉన్నది.

గ్రామ పునరుద్ధరణం గ్రామాలను ధనవంతాలుగా చేయడంవలన జరగాలి. ఇందుకు గ్రామస్థులు పట్టణవాసులను అనుకరించడం మాన్పించాలి. కోర్టులు, కళాశాలలు గ్రామా

లకు పట్టణాలకూ సంబంధం కలిగిస్తూన్నవి. వాటిని పునర్ని ర్మాణముచేయాలి. న్యాయ్యము, సంస్కృతీపరిశ్రమలూకూడా రాజకీయాలు పోయినట్లుగానే గ్రామాలకు పోవాలి. క్రొత్త విషవుకోరలుగలఅభిప్రాయాలు దాస్యమునుండితప్పించుకొని గ్రామాలు నూతన భావాలకూ నవచైతన్యానికీ కేంద్రాలు కావాలి. మార్క్స ఇలాఅన్నాడు "సాంఘికవిప్లవం పాత జమీందారీ వ్యవస్థను నాశనం చేసింది. అది హిందూనేత గానిని, వడుకువానినిగూడా రూపుమాపింది". మార్క్సకు గ్రామసంఘవ్యవస్థలంటే అంత సరదా లేదు, ఆయన వాటిని గూర్చి ఇలా అన్నాడు.

"గ్రామం ప్రాచ్యదేశాల నిరంకుశాధికారానికి గట్టి పునాది. మానవ బుద్ధిని సాధ్యమైనంత సంకుచిత పరిధిలో బంధించి మూఢవిశ్వాసాలకు ఎదురులేని పరికరంగా వినియోగిస్తూన్నారు; అంతేకాదు చారిత్రకశక్తులకూ మహావైభవానికీ దూరంచేసి సాంప్రదాయ నియమాలతో దానిని నిరోధిస్తూన్నారు. కాని గ్రామాల కావ్యదృశ్యాలను సాంఘిక విప్లవం నాశనం చేసినందువలన చాలా నష్టము కలిగిందని ఆయన ఒప్పుకున్నాడు.

3
స్వయం సంపూర్ణత

ఈ స్వయం సంపూర్ణత ఆదర్శాన్ని అర్థంచేసుకోవడానికి ముందు మనం హిందూసంఘనిర్మాణాన్నిగూర్చి దాని ధర్మా

లనుగూర్చి పరిశీలించాలి. హిందూసంఘంలోని ప్రతిమనిషికీ అన్నవస్త్రాలను తప్పకుండా అందించే రక్షణాలు, ఆధారాలు నిష్కరుణంగా ఎలా భగ్నం చేయబడినవో యోజించాలి. ఇండియా ఈరోజున ప్రాదేశికంగా, సాంఘికంగా, వృత్తి విషయికంగా (Professionally) చీలిక లేర్పాటు చేయబడి నవి. స్వతంత్ర రాజ్యాలకూ రాష్ట్రాలకూ పడదు. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, సిక్కులు, ఇండియాలో కాపుర మున్న పరదేశీయులు-వీరెవరికీ పరస్పరం పడదు. గ్రామాలకూ పట్టణాలకూ పడదు. గ్రామాలలోని రైతులకూ పట్టణాల లోని కూలీలకూ పడదు. అయితే ఈ పురాతనభూమి ఇలా చీలికలు చేయబడడంవలన కలిగిన అపకారం చాలా తక్కు వని చెప్పాలి. అసలు సంఘపునాదులే అగపడకుండా నాశన మొనర్పబడినప్పుడా అపకారమెంతటిది! జర్మనీని ఉదాహర ణంగా తీసుకొని స్వయంసంపూర్ణత అని చెప్పడం ఒక వేషం అయిపోయింది. కొంతమంది గవర్నరు లర్థంలేకుండా అలా మాట్లాడడం ప్రారంభిస్తూన్నారు. ఇప్పుడువారు చెబుతూన్న స్వయంసంపూర్ణత భారతీయసంఘానికి శతాబ్దాలనుండీ పునా దిగాఉంది. గ్రామం జాతీయ జీవితానికి ప్రమాణంగా ఉంది. ఆ గ్రామం ఎటువంటిది? జీవితాన్ని సంపూర్ణంగానూ, ఆనంద మయంగానూ చేసే అన్ని వృత్తులతోనూ నిండిఉన్న గ్రామం. జీవితానికి ప్రయోజనకరములై సౌందర్య నిలయములైన చేతి పనులూ గల గ్రామం. కాని పాశ్చాత్య నాగరికతాస్పర్శ అటు వంటి గ్రామాన్ని, దాని మనోహరములైన ఉత్పత్తిపదా

ర్థాలను ఎడతెగని వృత్తులను, ప్రధాన జీవితావసర వస్తు నిర్మాణశక్తిని నాశనంచేసింది. ప్రతిరోజూ దేశంలోని మారుమూల గ్రామాలలోకూడా వీధులవెంట అందచందాలు లేక మిడిసిపడుతూన్న చౌకవిదేశీసరుకులను మూటలు వేసికొని అమ్మే చిల్లరవర్తకులు, పట్టణాలలోని టోకువ్యాపారస్థులు గ్రామాలదుస్థితికి కారణమయినారు. చిట్టచివరకు గ్రామంలోని మంగలి జర్మనీదేశపు కత్తినీ, వడ్రంగి విదేశీ మరమేకునూ ఉపయోగించవలసినఅవస్థ రావడంతో ఊళ్లోకమ్మరి వృత్తి వూరేగింది. కమ్మరి విదేశిబట్ట వినియోగించడంతో, సాలీలపని చప్పబడ్డది. సాలి, జపాను చెప్పులుపయోగించడంతో వాని వృత్తి మాయమయింది. చెప్పులుకుట్టే మాదిగ పింగాణీ బొచ్చెలు వాడడంతో కుమ్మరివృత్తి కూలిపోయింది. ఈవిధంగా ఒకరి వృత్తిని మఱొకరు నాశనం చేసుకొన్నారు. పర్యవసానానికి గ్రామమంతా పాడయింది. గ్రామంనాశనంకావడంచేత స్వయంసంపూర్ణత పల్లెలలోనూ పట్టణాలలోనూకూడా లేకుండా పోయింది. నాటినుండీ జాతీయ సామర్థ్యం చచ్చి నిరుద్యోగత హెచ్చింది. ఒకప్పుడు సమష్టిసౌభాగ్యము, సంఘక్షేమములకు పునాదిగా కలిగిన హిందూసంఘం నేడు వ్యక్తిద్వేషాలకు, పరస్పరస్పర్థలకు, నిరంతర సంఘట్టనలకు, తావలమై అవినీతికరమైన, నీచమైన జాతీయ లక్షణానికి యే విధంగా దారి తీస్తున్నదో పైన వివరించిన విషయాలను బట్టి తెలియగలదు.

దేశంలోని ప్రతి భూభాగమూ ప్రతి గ్రామమూ స్వయంసంపూర్ణంగాఉండే పురాతన సంఘనిర్మాణంగల దేశం ఇండియాఅని

ఇంతవరకూ చెప్పిఉన్నాము. పాశ్చాత్య పారిశ్రామిక దండ యాత్రలవలన ఆ సంఘవ్యవస్థ సర్వనాశన మయింది. పోటీ ఖరీదులపైన, అధికోత్పత్తిపైన ఆధారపడిఉందిపాశ్చాత్య పారిశ్రామిక విధానం. కాబట్టి పోటీపడి ఉత్పత్తి చేస్తూన్న జాతుల తగాదాకు ప్రపంచవ్యాపారస్థలాలు కారణాలైనయి. పూర్వపు ఐరోపాఖండ యుద్ధానికీ నేడు జరుగుతూన్న యుద్ధానికీకూడా ఒక కారణమదే. పాశ్చాత్య పారిశ్రామికజాతులకు కావలసిన వ్యాపార స్థలాలు ప్రాచ్యఖండంలో స్థాపించబడినవి. అయితే దేశాల కంత కంత కాత్మస్మృతి గలిగి వాటికి తటస్థించిన బానిసత్వాన్ని గుర్తించినవి. తూర్పుదేశాలు, జపాను మొదలు ఈజిప్టువరకూ తమ అంగళ్లపైన విదేశీవస్తువులు చేస్తూన్న దండయాత్రల కెదురు తిరిగి నిలబడ్డవి. కాబట్టి ఇప్పుడు రెండుపనులు జరగాలి. తూర్పుదేశాలు తమ ఉత్పత్తులను ఎక్కువచేసుకొని కోరికలను తగ్గించుకోవాలి. పశ్చిమ దేశాలు తమ ఉత్పత్తిని తగ్గించుకొని, తమకుకావలసిన ముడి సరుకులను, ఆహారాన్ని ఎక్కువగా పండించుకోవాలి. అప్పుడు తూర్పు పడమరల కలయిక సాధ్యమవుతుంది. ఇప్పుడు రెండూ చెరొక వైపుకూ పోతూన్నవి. ఈసందర్భంలో ముందు తూర్పు దేశాలు వరవడిపెట్టాలి. పడమరదేశాలు గట్టిగా దెబ్బ తింటేనేగాని ఏ సంగతీ నేర్చుకోవు. ఇప్పుడు దెబ్బతిని నేర్చుకోవడం ప్రారంభించినవవి. ఈ ప్రధానసూత్రాలను ఒకసారి అర్థంచేసుకొన్న తరువాత పని ఎలా ప్రారంభించాలి అనే వివరాలలో ఆలస్యముండనక్కరలేదు. ఇండియాలో ఈ పనిని

మొట్టమొదట ప్రారంభించిన జాతీయమహాసంస్థ కాంగ్రెసు. కాంగ్రెసు ఖద్దరు సిద్ధాంతాన్ని ప్రతిపాదించిననాడే జాతీయ పునర్నిర్మాణమునకు అంకురార్పణ జరిగింది. భారత దేశపు అంగళ్లలోనుండి దేశీయవస్త్రాలు, విదేశీబట్టలను వెళ్లగొట్ట గలవని చాలామంది అనుకొని ఉండరు. ఈ పని దాదాపు జర గనే జరిగింది. ప్రబుద్ధ జాతీయ చైతన్యం నిజమైన యుక్తా యుక్తవివేకాన్ని రేకెత్తిస్తుంది. శాసనాలు, ఎగుమతి దిగుమతి పన్నులు, కోటాలు, సరిహద్దుల ప్రభుత్వ గ్రాంటులు, కరెన్సీల తగ్గింపులు-వీటన్నిటినీ మించిన శక్తిగలిగిన దది. ఖద్దరు గ్రామ పరిశ్రమలకు రాజు. అది దాని ధర్మాన్ని చక్కగా నిర్వర్తిం చింది. కాని గ్రామ పునరుద్ధరణానికి మార్గదర్శకమైన ఆ పరి శ్రమ తదితర పరిశ్రమల అభివృద్ధికి దోహదంచేయాలి. కాంగ్రెసు ఆదేశానుసారంగా అఖిలభారత గ్రామ పరిశ్రమల సంఘంద్వారా గాంధీ ఆ పనికి పూనుకొన్నాడు.

అధ్యాయం 12

ఆర్థికాభివృద్ధి

ఖద్దరు

ఇండియా జనసంఖ్య ప్రపంచంలో ఆరోవంతు. ఇండియా సభ్యత అతి పురాతనము. అటువంటి దేశం విదేశప్రభుత్వ యాజమాన్యంకిందవిద్యాభ్యాసంచేయడం, వారు తయారుచేసి యిచ్చిన వస్త్రాలను ధరించడం, వారికి దోసిలొగ్గుతూ వారి పరిపాలన కింద ఉండడం-ఈ అపూర్వదృశ్యం ప్రపంచంలో ఎవ్వరూ ఇంకెక్కడా కనీ వినీ ఉండరు. ఇండియాలోని అతి ప్రాచీన ప్రతిష్ఠగల బ్రహ్మాండమైన ప్రాచ్యజాతి, ఒక స్వల్పాతి స్వల్పమైన ఆధునిక ద్వీపానికెదురుగా నిలబడవలసి వచ్చింది. అయితే ఈ చిన్నలంక తన ఆయుధబలాన్ని, తన సాహసాన్ని, తన రాజనీతిచతురతను, అన్నిటినీ వినియోగించి తన బ్రతుకు తెరువుకోసం, తన ఆహారసమస్యాపరిష్కారంకోసం, చారిత్రిక పరిస్థితులను అవకాశంగా చేసికొని 'రవి అస్తమింపని' సామ్రాజ్యాన్ని ఎలాగో స్థాపించుకో గలిగింది.

ఒకప్పుడీ దేశంలోని ప్రజలు చేతితో వడికిన నూలుతో చేతితో నేసిన బట్టలను మాత్రమే ధరిస్తూండేవారనే సర్వసాధారణవిషయంకూడా చాలామందికి తెలియదు. ఈస్టిండియా కంపెనీవారు కేవలం కోస్తా పట్టణాలలో తయారయిన బట్టలను

పోగుచేసుకొని పోవడానికి ఫ్యాక్టరీలను, అంటే 'గోదాము' (Godowns)లను స్థాపించారనికూడా తెలియదు వారికి. మనమిప్పుడు చూస్తూన్న ఫ్యాక్టరీలను స్థాపించడాని కానాడు ఇంజన్లు లేవు. 1632 నాటికి ఆవిరిశక్తి (Steam Power) లేనే లేదు. కాబట్టి అప్పుడు ఫ్యాక్టరీలని వాడిన పదానికి 'డిపో' లనిగానీ, 'గోదాము' లనికానీ అర్థం. ఈ విధంగా పోగుచేసికొనిపోయిన బట్టలను ఇంగ్లాండులో లాభానికి అమ్ముకొంటూండేవాళ్ళు. అక్కడిప్రభుత్వం ఆ బట్టలను ఉపయోగించరాదని నిషేధిస్తే ఇతర దేశాలకు తీసికొనిపోయేవాళ్ళు. ఈ వ్యాపారం చేసేవర్తకులు పెద్ద పెద్ద లాభాలు తీసేవాళ్ళు. నూటికి 300వరకు కూడా లాభాలు సంపాదించేవాళ్ళు. ఒకప్పుడింగ్లాండులో ధనవంతుల ఇండ్లలోని నేలపై పరచబడిన ఈ వస్త్రాలు కొద్దికాలంలో రాణుల కటిసీమలను అలంకరించినవి. దేశీయసరుకుల అమ్మకాన్ని తగ్గించినవి. ఈ వ్యాపారంచేసే కంపెనీని గురించి అక్కడివారు అవహేళనం చేయ ప్రారంభించారు. తరువాత కొంత కాలానికి ముర్శిదాబాదు పట్టు ఇంగ్లీషు సంఘాన్ని ఆవరించింది. ఇంగ్లీషుప్రభువులు, జమీందారుల బిరుదాంకితులు అందరూ-ఈ సిల్కు-సూట్లు వేసికొని తిరుగుతూండేవారు. అదిచూచి 'ముర్శిదాబాదు బట్టలు వేసికొని సాటోపంగా సంచరిస్తున్నారు మీరంతా. అందువల్ల మన మాతృదేశపు వర్తకం ఎంత తగ్గిపోతున్నాదో తెలుసునా ?' అని డానియల్ డిఫో గట్టిగా మందలించాడు వారిని.

ఇండియా దేశపు పట్టు బట్ట ధరించిన ఇంగ్లీషు దేశీయునకు

5పౌనులు జరిమానా వేయబడునని 1700 లో శాసనం చేయ బడిన సంగతి అందఱికి తెలిసినదే. 1735 లో ఇండియాపట్టును అమ్మిన ఇంగ్లీషువానికి 25పౌనులు జరిమానా వేయబడునని మఱొకచట్టం చేయబడినది. అంతేకాదు. వారింకా దూరం పోయినారు. ఇంగ్లాండులో శవాన్ని ఉన్నిబట్టతో కాక మఱే బట్టతో కప్పినప్పటికీ 5పౌనులు జరిమానా వేయబడునని ఇంకొక శాసనం చేశారు. ఇండియాపట్టు ఇంగ్లాండులోకి దిగుమతికాకుండా ఉండేటందుకు వారు పన్నులను విధించారు. ఈ విధంగా విదేశీబట్టల దండయాత్రనుండి తమ దేశాన్ని రక్షించుకోవడానికి ఈపనులన్నీ చేశారు. ఈలోగా 1783 లో స్టీమ్ ఇంజన్ కనిపెట్టబడింది. అప్పుడుమగ్గానికీవడుకురాటానికీకూడా ఆవిరి శక్తిని ఉపయోగించ ప్రారంభించారు. అందువల్ల గవర్నమెంటువారి పన్నులవిధానంకంటే ఎక్కువ లాభప్రదమైన అద్భుతమైన ప్రయోజనాలు కలిగినయి.

నాటినుండి ఇంగ్లాండులో దూదిబట్టలఉత్పత్తి పెరిగిపోవడం మొదలుపెట్టింది. మిల్లుల ఉత్పత్తి గజాలలెక్కలో ఉండదు. బేళ్ళలెక్కలో ఉంటుంది. అవి పెద్ద రాక్షసులు; అవి తినే తిండి తులాలలోనూ పౌనులలోనూ ఉండదు. హండ్రెడ్ వేయిట్లలోనూ టన్నులలోనూ ఉంటుంది. 1803 లో మొదటిసారి ఇంగ్లాండునుండి ఇండియాకు బట్టలు దిగుమతీ అయినయి. ఆ సంవత్సరంవచ్చింది 3 లక్షల రూపాయీల విలువగల బట్టమాత్రమే. 1829లో 29లక్షల రూపాయీల బట్ట దిగుమతీ అయింది. 1929 లో 66 కోట్ల రూపాయీల నూలు దిగింది.

ఈవిధంగా లంకాషైరుకూ ఇతర దేశాలకూ ఇండియా చక్కని వ్యాపారస్థల మయింది. కాబట్టి ఇండియాలోని బ్రిటిషు సామ్రాజ్యం శాసనకర్మలవలనగానీ, విశ్వవిద్యాలయ బోధనాపద్ధతివలనగానీ, కోర్టులు, కళాశాలలు, కౌన్సిళ్ళు, బిరుదాంకితుల వలనగానీ స్థాపించబడలేదనీ నూలువడికి బట్టలునేసే లంకాషైరు ఆవిరిశక్తి(స్టీమింజన్)వలన మాత్రమే స్థాపించబడిందనీ అర్థం చేసుకోవాలి.

అందువలననే 1908 మొదలు 1915 వరకూ జరిగిన మితవాద కాంగ్రెసులలో కూడా బట్టల పరిశ్రమకు, అనధికార జాతీయ పారితోషికం (founty) ఈయవలెననే సిద్ధాంతాన్ని అంగీకరించి తీర్మానాలు చేయబడినవి. ఇటీవలి సంవత్సరాలలో చేనేతపరిశ్రమను ప్రోత్సాహపరిచి నిలబెట్టడానికి ఏడాదికి 15లక్షల రూపాయిలవరకు కేంద్రప్రభుత్వంవారు గ్రాంటులిస్తూన్నారు. కాంగ్రెసున్నూ, కాంగ్రెసుపక్షాన ప్రాతినిధ్యం వహించిన అఖిలభారతచరఖాసంఘమున్నూ ఇంకొక అడుగు ముందుకువేసి నూలుకూడా చేతితో వడికిందిగానే ఉండాలన్నారు. ఖద్దరు ఉత్పత్తిని అభివృద్ధిచేసి వ్యాపకం చేయడానికి వారు కొన్ని ముఖ్య నియమాలను చేశారు. ఖద్ధరనగా చేతితోవడికి చేతితోనేసిన బట్టమాత్రమేకాదు. ఖద్దరుబట్టను ఉత్పత్తిచేసే పనివారందరూ అనగా దూది ఏకేవారు, నూలువడికేవారు, నేసేవారు రంగులద్దేవారు, రంగులువేసేవారు, తెలుపుచేసేవారు,-ఈఅందరూ అఖిలభారతచరఖాసంఘంవారేర్పాటుచేసిన మజూరీ పొందితీరాలి. అలా తయ్యా

రయిన బట్టయే ఖద్దరని నిర్వచనం చేశారు. కాబట్టి ఖద్దరనే పదానికి న్యాయ్యశాస్త్రసంబంధమైన నిర్వచన మేదైనప్పటికి పనివాళ్ళందరూ-- మొదటినుండి చివరవరకూ అ.భా.చ.సం. వారు నిర్ణయించిన మజూరీలను పుచ్చుకొని తయారుచేసిన బట్టకు మాత్రమే రాజకీయంగానూ, ఆర్థికంగానూ ఖద్దరని అర్థం, అందువలననే సర్టిఫైడు షాపులనుండి మాత్రమే ఖద్దరు కొనవలెనని మేము ప్రజలను హెచ్చరిస్తున్నాము.

రాటమూ ఒక యంత్రమే

ఈ ప్రాచీన పరిశ్రమను పునరుద్ధరించడం గడియారం ముల్లును వెనుకకుతిప్పడమని మామూలుగా ఆక్షేపణ చేస్తాం టారు. అందుకు గ్రెగ్గు సరియైనజవాబిచ్చాడు. అది గడియా రాన్ని నడిచేటట్టుచేస్తుంది. అంతేకాని వెనుకకుతిప్పదన్నాడు. రాటమూ చిన్నయంత్రమే — అయితే అది ప్రతియింటికి తీసికొనిపోదగినయంత్రం. 'మనం గ్రామస్థుణ్ని పరిశ్రమ దగ్గ రకు తీసికొని పోవాలా? లేక పరిశ్రమను గ్రామస్థుని కడకు తీసికొని రావాలా? అని బార్కరడిగిన ప్రశ్న బహు సమంజ సంగా ఉంది. మొదటిప్రశ్నకర్థం మిల్లులలో పనిచేయడం. రెండోప్రశ్న కర్థం రాటంమీద పనిచేయడం. జాతి కేవలం భాగ్య వంతంగానే గాక నిజంగా బలిష్ఠంగా కూడా కావాలంటే కష్టజీవుల క్షేమంపైన, వారి తెలివిపైన వారి పరిశ్రమలకు చేసే సహకారంపైన ఆధారపడి ఉన్నది. ఇదే జాతికి అసలైనఐశ్వర్యం. ప్రతి దేశంలోనూ అధిక సంఖ్యాకులు పేదవాళ్లు కాబట్టి దేశం పేదవాళ్లది. ఇదే గాంధీ

ఉపదేశాలలోని సారాంశం. జాతినిబట్టీ రంగునుబట్టీ హక్కులు ఉండవనే అపోహను తొలగించుకోవాలని ఆయన పదే పదే చెబుతూంటాడు. 'మనిషికిగల ఆంతరంగిక శక్తులనుబట్టి హక్కులేర్పడతయి. ప్రజలను స్వాతంత్ర్యార్హులనుగా చేయడానికి మార్గం, వాళ్లకు స్వతంత్రమీయడమే. రాజకీయాధికారాలిస్తేనే గాని వాటిని ఎలా ఉపయోగించాలో వాళ్లకు తెలియదు. ఇదీ అసలు రహస్యం. స్వాతంత్ర్య సమానప్రతిపత్తులు ఒకరు ప్రసాదించేవీ మరిఒకరు గ్రహించేవి కావు. శక్తిఉన్నవాళ్లకవి దేవునినుండే లభిస్తయి. అంతేకాని ప్రజాపీడకుల నుండీ, ప్రజాప్రతిపక్షులనుండీ, అవి లభిస్తవనుకోవడం వట్టి పొరపాటు' అని గాంధీజీకి గట్టినమ్మకం. 'గాంధీ తనదేశానికి అతి సన్నిహితంగా కావలసిన అకృత్రిమ అవసరాలను అర్థం చేసుకొన్నవిధానాన్ని సూచిస్తుంది ఆయన రాటం' అన్నాడు. అర్నెస్టుబార్కర్ (P. 61. M. Gandhi) మగ్గము దానికి కావలసిన నూలును సప్లయిచేసే రాటము-ఈరెండిటివల్ల లక్షలాది కుటుంబాల కయ్యే ఖర్చులో అయిదోవంతుగాని ఆరోవంతు కాని పూడ్చుకోవచ్చునని గ్రెగ్గులెక్క వేసి చూపిస్తూన్నాడు. ఇండియాలో అడవులలోను పొలాలలోనూ పనిచేసే మూడో వంతు ప్రజకు దాదాపు సంవత్సరంలో నాలుగునెలలు మొదలు ఆరునెలలవరకూ పనిఉండదు. ఈలెక్కలేని ప్రజాసమూహానికి దినమునకు ఒక అణాగాని, రెండణాలుగాని ఆదాయవచ్చే మరొక పని చూపించగలరా అని యంత్రపూజాపరాయణులైన పాశ్చాత్య నాగరిక వైజ్ఞానిక ప్రపంచాన్ని అనేకసార్లడిగాడు.

ఈ ప్రశ్నకు జవాబు రానంతవరకు, ఈ యుగంలో కెల్ల గొప్ప ఆర్థికశాస్త్రజ్ఞు డాయనేఅని ఒప్పుకోక తీరదు. గాంధీ వట్టిమూఢ విశ్వాసానికిగానీ, పూర్వాచారపరాయణతకుగానీ, పాశ్చాత్య విజ్ఞాన ద్వేషమునకుగానీ బలికా లేదు. ఆయనకు విజ్ఞానశాస్త్రం పైన చాలా పక్షపాతం. ఆయన వైజ్ఞానికదృష్టికి సమన్వయం కాని పన్నిని దేనిని నమ్మడు, అంగీకరించడు, చేయడు. ఆయన ప్రతివిషయంలోనూ చాలా లోతుకు దిగి ఆలోచిస్తాడు-తనకు తెలిసిన విషయాలకు భిన్నంగాఉన్నా, తన సందేహాలను నివృత్తి చేయలేకపోయినా యేసిద్ధాంతాన్ని నమ్మడు. శాస్త్ర విరుద్ధంగా ఉన్నదని అసహ్యించుకొని తృణీకరింపబడుతూన్న చరఖాను ప్రతి సూక్ష్మాంశములోనూ శాస్త్రప్రమాణానికి సంపూర్ణానుగుణంగా ఉండేటట్లు చేశాడు. దాని నిర్మాణములోనేమి, ఉత్పత్తిలోనేమి చెప్పుకోదగిన అభివృద్ధి కావించాడు. కాని గ్రామంలో మరమ్మతు చేయడానికి వీలులేని కొత్తచిక్కులను వేటినీ అందులో కల్పించలేదు. గాంధీకి విజ్ఞానశాస్త్ర నైపుణ్యమునందు, నిర్దోషత్వమునందూ గల పక్షపాతానికి చిహ్నంగా ఎరవాడా రాట్నాన్ని చూపవచ్చును. గాంధీ దాదాపు విజ్ఞాన శాస్త్రవేత్తలకు 'విరోధి' అనే నిందారోపణకు ప్రత్యుత్తరంగా ఆర్. బి. గ్రెగ్ వ్రాసిన దానిలోని ముఖ్యభాగాన్ని (మహాత్మా గాంధీ-సర్ రాధాకృష్ణ పేజి 80) ఇక్కడ ఉదాహరిస్తూన్నాము.

గ్రెగ్గు చెప్పిన మాటలు

ఆయన సాంఘికవిజ్ఞాన శాస్త్రవేత్త. అందువల్లనే ఆయన సాంఘికసత్యాలను శాస్త్రదృష్టితో పరిశీలించి సహజ జ్ఞాన, విమర్శనా, తర్కములతో ఆలోచించి

ప్రయోగరీత్యా పరీక్షిస్తేనేగాని అనుసరించడు. పాశ్చాత్య శాస్త్ర వేత్తలుచాలామంది తమమూలసిద్ధాంతాన్ని తమమీద ప్రయోగించుకొని పరీక్షచేసుకొని కారణంచేత వారు పండితులైనట్లుగా భావించనని ఒకప్పుడాయన నాతో అన్నాడు. కాని ఆయనమాత్రం ప్రతిమూల సిద్ధాంతాన్నీ ముందు తనపైన ప్రయోగించుకొని పరిశీలిస్తేనేగాని ఇతరు లకు చెప్పడు. ఆసిద్ధాంతం, ఆహారం, ఆరోగ్యం, రాట్నం, సంఘసం స్కారం, సత్యాగ్రహం - వీటిలో దేనికి సంబంధించిందైనా కావచ్చు. కనుకనే ఆయన స్వీయచరిత్రకు 'నా సత్యాన్వేషణ ప్రయోగాలు' అని పేరుపెట్టుకొన్నాడు.

ఆయన మామూలు శాస్త్రవేత్తకాడు. గొప్ప శాస్త్రవేత్త. ఆయన ఏరీ కోరీ నిర్ణయించుకొన్న సమస్యలు, వాటిని పరిష్కరించే పద్ధతులు, వాటిని సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశోధించడంలోచూపే దృఢప్రసక్తి, ఆయనకు గల పరేంగితజ్ఞానము-వీటన్నిటివలన అంత గొప్ప శాస్త్రవేత్త అయినాడు. ప్రజల సంస్కృతికి, భావ వికాసమునకు, ఆర్థిక సంపత్తికీ, కళానైపు ణ్యమునకూ, సన్నిహితంగా ఉండే పద్ధతులను అవలంబించడంలోనే సమాజ విధాతగా కూడా ఆయన గొప్పతనం వ్యక్తమవుతుంది. దేనిని త్యజించవలెనో దేనిని అవలంబించవలెనో దేనిని పరీక్షించాలో, విచక్షణ చేసుకోవడంలో కూడా ఆయన గొప్పతనముందని నా తలంపు. అంతే కాదు; సంస్కరణలను ప్రవేశపెట్టడంలోనూ, సాగించడంలోనూ,ఆయన చూపించే వేగపరిమితినిబట్టి కూడా ఆయన గొప్పతనం అర్థమవుతుంది. ప్రతిసంఘానికీ ఆయా దశలలో ప్రత్యేకపరిణామం సహజంగా కలుగు తూంటుందనే సంగతి ఆయనకు తెలుసును. సంఘంలో కొన్ని పరి వర్తనాలు చాలాకాల గర్భస్థంగా ఉండి ఆకస్మికంగా ఆవిర్భవించ వచ్చుననీ, మరికొన్ని మార్పులు రావడానికి కనీసం మూడు తరాలైన పడుతుందనీ, దీనికి కారణం పరంపరాగతములైన సంప్రదాయములన్నీ

ఆచారాలనూ దులిపివేసుకొని, కొత్త వాటికి అలవాటు పడడంలో సంఘంపడే గుంజాటన అనీ ఆయన ఎఱుగును. ఆయన చేయబూనుకొన్న ప్రతి సంఘసంస్కరణమునూ సమర్థతతో ఆచరణలో పెట్టేనిమిత్త మొక గట్టిసంస్థను స్థాపిస్తాడు. ఇదికూడా ఆయన సంఘ సంవిధానంలో ఒక గొప్పతనం. సంస్థానిర్మాణంలోగాని, పరిపాలనా విధానంలోగాని, వివరాలను నిర్ణయించడంలో ఆయన అందెవేసిన చేయి. వివిధరంగాలలో ఆయన నిర్వర్తించిన పనుల ఫలితాలు ఇప్పటికప్పుడే ఆయన గొప్పతనాన్ని ఘోషిస్తున్నవి. ఇప్పటికిప్పుడే ఆయన పని మొదలు పెట్టినచోట్ల కలుగబోయే ఫలితాలనుబట్టి ఆయన గొప్పతనాన్ని ముందుచరిత్రయే చాటగలదు.

గాంధీజీ ఖద్దరు స్వదేశీల సిద్ధాంతం ఇండియాకు ఆచరణ యోగ్యమైన కార్యక్రమాన్ని సూచిస్తున్నది. అబ్రహాంలింకం ఎన్నో ఏండ్లకింద చెప్పినమాట కూడా ఇదే. 'నాకయితే అర్థ శాస్త్రమంత ఎక్కువగా తెలియదు. కాని ఇంతమాత్రం తెలుసు:— 'మనం విదేశాలలోని సరుకులను కొంటే మనకు సరుకులు లభిస్తయి. విదేశస్థులకు సొమ్ము లభిస్తుంది; మనదేశపు వస్తువులనే మనం కొనుక్కుంటే సొమ్ము మనకే ఉంటుంది. వస్తువులూ మనకేవుంటవి.'

నిర్మాణకార్యక్రమం : సత్యాగ్రహం

గాంధీ ఇటీవల ప్రారంభించిన సత్యాగ్రహంలో(1940 నవంబరు) తిరిగీ నిర్మాణ కార్యక్రమంయొక్క ముఖ్యావశ్యకతను ప్రకటించాడు. వినోబాభావే నిర్బంధంగానీ జవహరలాల్ నిర్బంధంకానీ, యెట్టి శాసనోల్లంఘన ప్రారంభమునకూ సంకేతంగా భావింపరాదని దానికి తగిన జాగ్రత్త వహించాడాయన. ఆయన ఉత్తరువులకు భిన్నంగా చేయబడిన శాసనోల్లంఘనము శిష్టసమ్మత మనిపించుకోదు. ప్రజా

సామాన్యం అత్యుత్సాహంతో నిర్మాణకార్యక్రమాన్ని సాగించడమే ఈ ఉద్యమానికి సహాయంచేయడమని ఆయన వివరించాడు. బ్రిటిష్ ప్రభుత్వమువారిచే ప్రకటింపబడిన యే జిల్లా పూర్వచరిత్రను చూచినప్పటికీ, ఆ జిల్లాలోని ఖద్దరక్కడి ప్రజలకు సరిపోగా, మిగిలినది ఈస్టిండియా కంపెనీవారు పైకి ఎగుమతి చేస్తూండేవారనీ, నేడది అపరూపమైపోయిందనీ బోధపడుతుంది. ఇందులోని సత్యమాయా జిల్లాలకు పోయి చూచినప్పుడు ప్రత్యక్షంగా కనిపిస్తుంది. మఱీ తూర్పుగోదావరిజిల్లా అంకెలు మనకళ్లు తెరిపిస్తూన్నవి. 1803 లోను తరువాత నూకోరింగా, కోమరగిరిపట్నం, నీలపల్లి మొదలగు కోస్తా పట్నాలనుండి ప్రతిసంవత్సరము 15 లక్షల రూపాయిల విలువగల ఖద్దరుసరుకు ఎగుమతీఅవుతూండేది. ఈఎగుమతులు 1825 నాటికి 10 లక్షలకు దిగిపోయినవి. 1845 నాటికి రెండు లక్షలైతరువాత అసలే లేకుండాపోయినయి. గ్రామస్థులకీ సంగతి బాగా తెలుసు. తమ కోస్తావ్యాపారం పడిపోవడం మూలాన, తమకు కావలసిన బట్టలను పైనుండి దిగుమతీచేసుకోవడం మూలాన, ఈ దరిద్రం పట్టిందని గ్రామస్థు లెరుగుదురు. నేటి ధనప్రవాహం తలక్రిందులయింది. నదులు సముద్రంలో పడేటప్పుడు, మంచినీరంతా సముద్రంలోకి పోతుంది. తిరిగీ సముద్రపు నీరుతో నదీముఖద్వారాలు నిండిపోతయి. ప్రాంతీయ గ్రామాలవారికి నది దగ్గరగా ఉన్నప్పటికీ తాగడానికి మంచినీరు లభించదు. అలాగే ఇప్పుడా గ్రామాలవారు సీమబట్టలనూ ఉప్పునీరునూ పుచ్చుకోవలసివచ్చింది.

ఇండియాలో ఇప్పుడు కావలసిన 632 కోట్లగజాల బట్టలో 410 కోట్లగజాల బట్ట ఇండియాలోని దేశీయ మిల్లులలోనే తయారవుతూన్నది. 152 కోట్లగజాల బట్టమాత్రం మిల్లు నూలుతో చేమగ్గంమీద తయారవుతూన్నది. 70 కోట్ల గజాలబట్ట విదేశాలనుండి దిగుమతీ అవుతున్నది. ఖద్దరుబట్ట 1 1/2 కోట్లగజాలు మాత్రమే తయారవుతూన్నది. కాబట్టి లంకాషైరు బట్టలదిగుమతి తగ్గిపోవడంవల్ల ఆదావచ్చిన 44 కోట్ల రూపాయీలు గ్రామాలకు పోలేదు. ఆసొమ్ము ధన వంతులను ఇంకా ధనవంతులనుగా చేయడానికీ, పేదవాళ్ళను మఱీ పేదవాళ్లుగా చేయడానికీ మాత్రమే ఉపయోగించింది. విదేశీబట్టల దిగుమతి ఆగిపోయినందున గ్రామస్థుల కుపకారం కలుగలేదు; నగరాలే బాగుపడ్డయి. ఈ సంగతికూడా గ్రామ స్థులు చక్కగా తెలుసుకొన్నారు. కాబట్టి ఖద్దరు ఉత్పత్తికి కావలసిన అన్నిదశలలోనూ - అంటే ఏకడం, ఏకులుతీయడం, వడకడం, నేయడం - ఈ అన్నిటిలోనూ పునరుజ్జీవనం కలిగిం చాలని వారు పట్టుదల చూపిస్తూన్నారు. గాంధీ సత్యాగ్ర హాన్ని మొట్టమొదట్లో ఇద్దరికిమాత్రమే వర్తింపచేయడం వలనకూడా ప్రజలలోని సృజనశక్తి తీవ్రరూపం దాల్చింది. ప్రజలు రాటం చేబట్టినారు. ప్రతివారూ రాట్న పరిశ్రమను పునరుద్ధరించ కోరుతూన్నారు.

ప్రజోత్సాహం.

ఒకానొకపట్టణం (మచిలీపట్టణం) లోని స్త్రీలు, 50 మంది ముసల్మానుస్త్రీలు, 150మంది తదితరస్త్రీలు రాటాలు తిప్పుతూ

మంచి మజూరీ సంపాదిస్తూన్నారు. కొంతమంది వారు వడికిన నూలువల్ల వారానికి రు. 0-15-3 లు సంపాదిస్తూన్నారు. ఒక స్త్రీ ఇంట్లోకూర్చొని వారానికి 0-15-3 సంపాదించగలిగితే, భారత దేశపు ఆదాయం దాదాపు రెట్టింపు అయిందని చెప్పవచ్చును. ఈ పట్టణంలో సత్యాగ్రహాశ్రమ మూలకంగా వేయిరాటాలు పనిచేస్తూన్నవి.

ఎవరి ఏకులు వారు చేసుకొని వడుకుకోవడం ఎవరిఅన్నం వారు వండుకొని తినడంలాంటిది. అంగడిలోకొన్న ఏకులలో చాలా నలకలు, దుమ్ము, గాలి ఉంటుంది. అందువలన బాగా దారం రాదు. ఏకులు అంగడిలో దొరకవు కూడాను. మన బజారులో కావలసినన్ని ఐరోపా అమెరికా దేశాల సరకులు దొరుకుతయిగాని, ఏకులుచేయడానికి ఒకవిశేషు పత్తికావలసినా, నూలు వడకడాని కొక వీసెడు ఏకులు కావలసినా దొరకవు. కాబట్టి మా అంతట మేమొక పనిచేయదలచుకొన్నాము. వేలకొలదీ నూలువడికేవారు మంచిదూదీ, ఏకులు కావాలని రోజూవస్తూంటే ఏంచేయాలి? పత్తిలో గింజలు దీయడం, శుభ్రపరచడం, ఏకడం, ఏకులుచేయడం – ఇవన్నీ ముఖ్యంగా పిల్లలూ ఆడవాళ్ళూ చేయదగిన పనులు. మేము కొంతమంది స్త్రీలకీవిషయంలో తగిన శిక్షణ యిచ్చాము. కాని దేశమంతకూ వారు సరిపోరు. మేమెక్కడికిపోయినా వారి స్త్రీలకీవిషయంలో తగిన శిక్షణ యిప్పించవలసిందని కోరడం ప్రారంభించారు. అది జరిగేలోపుగా, హరిజన్ పాఠశాలలలోని చిన్నపిల్లలు గ్రామాలలో పనిలేకుండా తిరిగే

పిల్లలూ ప త్తిని శుభ్రపరచడం మొదలుకొని నూలు తీసేటంత వరకూ అంతపనినీ ఒక్క నెలలో చక్కగా నేర్చుకోవచ్చును. ఒక్కొక్క పిల్లవాడప్పుడు దినానికి నాలుగణాలు సంపాదించ గలవాడవుతాడు. ఇది చిన్నవిషయం కాదు. 'సవర్ణ' విద్యా వంతులలో నిరుద్యోగతను సృజించిన చదువునే హరిజన బాలురుకూడా చాలాశ్రమపడి జిల్లా ముఖ్యపట్టణాలలోనూ తదితర గ్రామాలలోనూ చదువుతూన్నారు. హరిజనులు మన సానుభూతిని తప్పగా అర్థంచేసుకుంటారేమో ననే భయం చేత మనముకూడా నిరుద్యోగానికి దారితీసే అర్థంలేని ఆ చదువునే వారినిచదువనిస్తూన్నాము. కాబట్టి హరిజనసంఘాలు తమరక్షణకిందఉన్న హరిజన బాలబాలికలకు వృత్తిని చేకూర్చి పోషించగల విద్యాపద్ధతిని ఆలోచించవలసినతరుణం వచ్చింది. ఏకడం, ఏకులుచేయడంలో ఒక నెలరోజులు శిక్షణయిస్తే ప్రతి బాలుడు, బాలికా నెలకు ఏడెనిమిది రూపాయిలకు తక్కువ లేకుండా సంపాదించగలరు. అయితే ఈ పిల్లల సంపాదన కంటెకూడా గ్రామస్థులకు కావలసిన మంచిఏకులను తయారు చేసి యివ్వడం అవసరం కొంత కాలానికి గ్రామస్థులే ఈపనిని నేర్చుకొంటారు. విదేశీబట్టలవల్ల 50 లక్షల మగ్గాలకు పని లేకుండా పోయింది. అంటే ఈ మగ్గాలకు దారం వడికిఇచ్చే 10 కోట్ల రాటాలకు, 25 లక్షలమంది దూదేకేవారికి, 50 లక్షల మంది చాకళ్ళకు, అద్దకంపనివారికి, రంగువేసేవారికి, నేతకు సంబంధించిన తదితర వృత్తులుచేసే మఱొక యాభై లక్షల మందికి పని లేకుండా పోయిందని అర్థం. పూర్తిగా చేతితో

తయారైన బట్టమాత్రమే ఇండియా ప్రజలు ధరించినందువలన తక్షణం 12 కోట్లమంది దేశీయులకు వృత్తి లభిస్తుందని ఈ పై అంకెలనుబట్టి తెలుస్తూన్నది. వారు పెట్టవలసిన పెట్టుబడి ఆయా పనుల ననుసరించి నాలుగణాలనుండి మూడు రూపాయీల వరకూ ఉంటుంది.

వినడానికి వింతగా కనిపిస్తే కనిపించవచ్చునుగాని, ఆధునిక సభ్యత ఎక్కువ అవుతూన్నకొద్దీ నిరుద్యోగత కూడా పెరుగుతూన్నమాట వాస్తవం. అమెరికా సంయుక్తరాష్ట్రాలలో యంత్రసహాయంతో పనిచేసే కూలీల ఉత్పత్తి 1919, 1933 సంవత్సరాల మధ్య నూటికి 71 వంతున పెరిగితే నిరుద్యోగుల సంఖ్య 15 లక్షలనుండి 120 లక్షలవరకూ హెచ్చినట్లు తెలుస్తూన్నది. అనగా నూటికి 800 వంతున పెరిగిందని అర్థం. ఎక్కువగా శాస్త్రజ్ఞానం (Scientific knowledge) వ్యాపించినందువలన మఱొక 40 లక్షలమంది నిరుద్యోగులు పెరిగారు. అనగా నాగరికత పెరిగి నూటికి 1250 మంది నిరుద్యోగులను ఎక్కువ చేసిందని అర్థం. భారతీయ నిరుద్యోగులలో వ్యవసాయ నిరుద్యోగుల సంఖ్య 40 లక్షలుంటుందని అంచనా వేయబడింది. ఇప్పుడు మనవాళ్లంతా వ్యవసాయానికి యంత్రాలను ఉపయోగించాలంటూన్నారు. అప్పుడు నిరుద్యోగుల సంఖ్య ఇంకా ఎక్కువ పెరుగుతుంది. నూలు వడికే పని, చేతిమగ్గపు నేత— ఈ రెంటినీ పునరుద్ధరించినందువలన 12 లక్షల మందికి వృత్తి లభిస్తుందని ఇంతకు పూర్వమే చెప్పిఉన్నాము. అదే విధంగా చేతితో దంచిన

బియ్యం, చేతితో విసిరిన పిండి—వీటిని ఉపయోగించినందు వలన రెండు కోట్లమందికి పొట్ట నిండుతుంది. ఇక అఖిల భారత గ్రామపరిశ్రమల సంఘంవారి సిద్ధాంతాన్ని అనుసరించి మనం చేతితో వడికిన నూలు, చేతితో నేసిన బట్ట, చేతితో దంచిన బియ్యం, చేతితో విసిరిన పిండి, చేతితో చేసిన బెల్లం, గానుగలో తయారైన నూనె. చేతితో తయారైన కాగితం ఉపయోగిస్తే ఇండియాలో నిరుద్యోగ సమస్య ఉండనే ఉండదు. అప్పుడు గ్రామాలు స్వయం సంపూర్ణములై నూతన సంఘ వ్యవస్థ ప్రారంభ మవుతుంది. ఈపైన పేర్కొనబడిన ఏడున్నూ జాతీయ పునరుజ్జీవనానికి, గ్రామ పునర్నిర్మాణానికీ 'సప్తాక్షరి'.

చేతినూలు - మిల్లునూలు

మిల్లునూలుతో, చేతినూలు సన్నదనంలో ఎంతవరకు పోగలదని ఒక స్నేహితుడడిగాడు.

ఈవిషయం చారిత్రక కౌతుకాన్ని రేకెత్తించి చేనూలు పరిశ్రమ ఉచ్ఛదశలోనుండి, జనసంఖ్య నానాటి కభివృద్ధి అవుతూన్న తొలిరోజులను జ్ఞాపకం చేస్తుంది. పాఠకులీవిషయం తెలుసుకోవలెనని కుతూహలపడుతూంటారు.

దేశంలో కొంతవరకు మిల్లులు స్థాపించబడి, చేతితో ఉత్పత్తి అయిన సరుకులను సాగనంపి మిల్లుబట్టలు అంగళ్లను ఆక్రమించిన పిమ్మటనే ఒకప్పుడు మిల్లునూలుతో చేతి నూలును పోల్చిచూడడ మనే ప్రశ్న ఉదయించింది. ఆరోజు

లలో మజ్లిన్ల నూలువంటి సన్న నూలును మిల్లులు తయారు చేయగలవని అనుకొంటూండేవారు. మజ్లిన్లను అనుకరించాలనికూడా ప్రయత్నాలు జరిగినయి. కాని అపజయం పొందారు. మిల్లు మజ్లిన్లను, అసలు మజ్లిన్లను పోల్చిచూచిన ఫలితాలు వాట్సన్ వ్రాసిన 'టెక్స్టయిల్ మ్యాన్యుఫ్యాక్చరర్స్' లో ఉదాహరింపబడినవి. దానిని 1866లో ఇండియా కార్యాలయంవారు ప్రచురించారు.

వాట్సన్ మూడు మజ్లిన్ ముక్కలను పరీక్షించి వివరించాడు. ఒకటి థామస్ హోల్డ్సువర్త్ కంపెనీవారు తయారు చేసిన ఫ్రెంచి మజ్లిన్ 440 నెంబరుది. ఇది 1862 అంతర్జాతీయ ప్రదర్శనంలో ప్రదర్శింపబడింది. రెండోది 1851 అంతర్జాతీయ ప్రదర్శనంలో ప్రదర్శింపబడిన ఇంగ్లీషు మజ్లిన్. దాని నెంబరు 540 అనిఅన్నారు. మూడోది ఇండియన్ మ్యూజియంలోనుండి తీసిన అసలు డక్కా మజ్లిన్ 404 నెంబరు 'మల్మల్ ఖాస్' ఇంగ్లీషు మజ్లిన్ ముక్క 540 ఉండదని తగాదావచ్చింది. "ఈ నెంబరు యథార్థతనుగూర్చి సందేహించడానికి మంచి కారణముం" దన్నాడు వాట్సన్.

డక్కా నూలు

కాని ఈ నెంబర్లను గూర్చిన నిర్ణయాలు అంత్య నిర్ణయాలని చెప్పడానికి వీలులేదు. ఇవి నూలును పరిశీలించి నిర్ణయించినవి కావు. నేసినబట్టను పరీక్షించి నిర్ణయించారు. నేసేటప్పుడు నూలుకు గంజి పెడతారు. తరువాత ఉతుకు

లలో గంజితోపాటు నూలు చిక్కదనంకూడా కొంతపోతుంది. అందువల్ల మొట్టమొదటి నూలు బరువు కొంత తగ్గవచ్చును. ఉతికిన తరువాత బట్టలకు మళ్ళీ గంజి పెట్టవచ్చును. కాబట్టి ఈ అన్ని దశల ఫలితాలను వివిధ విధాలుగా మార్పుచేస్తవి. అందువల్ల నెంబరు కనుక్కోవడానికి మామూలుగా ప్రయోగించే ఉపాయాలవల్ల నిజం తేలడం కష్టం. నూలు నమూనాలను సూక్ష్మదర్శినీ పరీక్షకు పంపి దారపు వ్యాసం, (diameter) దారంలోని యేసుల (filaments) సంఖ్యనూ పరిశీలించవలెనని సూచించబడింది. అలా చేసిచూచినప్పుడు 'ఢక్కాసూలు వ్యాసం అత్యంత సున్నితమైన ఐరోపా ఖండపు నూలు వ్యాసం కంటె' తక్కువగా కనిపించింది. 'ఐరోపాఖండపు దారంలోని యేసుల సంఖ్యకంటె ఢక్కా దారంలోని యేసుల సంఖ్య చాలా తక్కువ' అని కూడా తేలింది. ఢక్కాదారంలో 8 యేసులుంటే మిల్లుల దారంలో 14 యేసు లున్నవి. కాని, ఒకే యేసుగల ఢక్కాదారం వ్యాసం ఎక్కువ పెద్దది. ఈ ఒకే యేసుదారాలు మిల్లుబట్టలను నేసే 'సీ-ఐలెండు' పత్తిదారాల యేసులకంటె ఎక్కువ బలవత్తరములుగా ఉంటవి. 'ఢక్కాదారంలో తక్కువ యేసు లుండడమే అది ఎక్కువ సన్నంగా ఉండడానికి కారణం; వడికే పద్ధతివలనకూడా ఆ దారం ఎక్కువ గట్టిగా నొక్కుకొంటుంది. కాని, అందువలన విశేష ఫలితం కలుగుతుందనుకోవడానికి వీలులేదు' అని పరిశోధకులు నిర్ణయించారు. అయితే దీనితో సరిపోయిం దనుకోకండి. మిల్లుల

మీదకూడా సన్నంగా దారం వడికి నేయవచ్చునని చూపించడానికి మాత్రమే మిల్లుమజ్లినులు ప్రదర్శింపబడినవి. కాని అవి చాలా దుర్బలంగా ఉండడంచేత ధరించడానికి పనికిరావు. 'ధరించడానికి ఈ సన్నని యూరోపియను మిల్లు మజ్లినులు ఏమాత్రమూ పనికిరావు. ఇండియాలో చేతితో తయారయినవి చిరకాలం ఉపయోగించడమేకాక, చాలా ఉతుకులకు కూడా ఆగుతయి. ఇంగ్లీషు మజ్లినులుగానీ, తదితర యూరోపియన్ మజ్లినులుగానీ ఆగవు.'

డక్కా పత్తిలోని గుణమే డక్కానూలు ఆధిక్యతకు కొంత కారణమని పరీక్షకులు నిర్ణయించారు. సీ-ఐలెండుపత్తిలోని యేసులు ఎక్కువ పొడుగు, ఎక్కువ సన్నమూను. డక్కాపత్తి యేసు (fibres) ఎక్కువ పొట్టీ, ఎక్కువ మందమూను. ఒకేనెంబరుగల రెండు దారాలను పరీక్ష చేస్తే డక్కాదారం ఆధిక్యత వహించింది.

బహుశా ప్రయోగ ఫలితాల వల్లనే డక్కా మజిలినులను అనుకరించాలనే ప్రయత్నం విరమింపబడిం దనుకొంటాము. సీ ఐలెండు పత్తితో మిల్లుమీద తీయగలిగిన దారం 300 నెంబరుకు మించదని తెలుసుకొన్నారు. కాబట్టి మిల్లు మీద 300 నెంబరుకంటె ఎక్కువ సన్నంగా తీయడం సాధ్యం కాదనీ, చేతితో 400 నెంబరు దారంకూడా తీయవచ్చుననీ తెలిసింది మన కిప్పటికి. కాని ఇదే డక్కానూలు సన్నదనానికి పరమావధి అనుకోకండి! డక్కా నూలు 700 మొదలు 1,000 నెంబరువరకుకూడా ఉన్నట్లు చదివాను. ఇది

నిజం కావచ్చుకూడా. 9 యేసులు గల డక్కా దారం 400 నెంబరుకు వచ్చిందంటే 5, 4, 3 యేసులుగల దారం 600 మొదలు 1000 నెంబరువరకూ రావడం ఎందుకు సాధ్యం కాదు.

అయితే డక్కా మజిలిన్ కుపయోగించిన దూదిని మిల్లులు కూడా ఉపయోగిస్తే అంత మంచి నూలూ రావచ్చునని కొందరు వాదించవచ్చును. కాని అది నిజం కాదు. డక్కా మజిలిన్ దూది మిల్లులలో ఉపయోగించి చాలా ఆశాభంగం పొందారు.

మిల్లునూలులో మఱీ సన్నని నూలు

ప్రస్తుతం సీ ఐలెండు పత్తినుండి తీసిన మిల్లునూలులో మఱీ సన్నని నూలు 300 నెంబరుకు మించిలేదు. ఇది సాధించడానికి తగిన పరిమితి మొదటి రకపు పత్తిఅయితేనే ఈ నెంబరు వరకూ నూలు తీయడం సాధ్యం. సీ ఐలెండులో కొంచెం తక్కువ రకపు పత్తి లేక ఫ్లోరిడా పత్తి, సీ-ఐలెండులో 'జార్జియా' రకం పత్తి, ఈజిప్టుదేశపు అతి నాజూకు పత్తి (the finest) — ఈ రకాలను ఉపయోగిస్తే పడుగు నూలుకు 100 లేక 70 నంబరు తయారవుతుంది. పేకకు 120 నెంబరు వరకూ తయారవుతుంది.

(The world's cotton crops, 1923 : Todd.)

డక్కాలోనే కాకుండా ఇండియాలోని ఇతర ప్రదేశాలలోకూడా స్థానికంగా పండిన పత్తివలన ఎక్కువ సన్నని

నూలు తయారయింది. అయితే డక్కా నూలు సన్నదనాని కెక్కడా సాటిలేదు.

1867 నాటి బీరారు మధ్యరాష్ట్రాల పత్తిశాఖా కార్యదర్శి నివేదిక నుండి (The report of the Operations of the Cotton Department of the Central provinces, Berar 1867) ఈ భాగం ఉదాహరిస్తున్నాము.

> నాగపూరు, జబ్బల్ పూరు, అకోలా పట్టణము లందలి ప్రదర్శనాలలోని నూలు, అక్కడే ఎదురుగా కనిపిస్తూన్న ముత్తాతలనాటి మోటు రాటం మీద గ్రామస్థులు చేతితో వడికినదని చెప్పి ఒప్పించడం కష్టమై పోయింది. అకోలాలో నేను ప్రదర్శించిన పల్లెటూరి చేతినూలు అత్యంత సున్నితంగా ఉంది. అటువంటిది ఒక పౌను దారం 117 మైళ్ళ పొడవు ఉంటుందని లెక్క కట్టాను.

పౌను నూలు పొడుగు 117 మైళ్ళుంటే, నూలు నెంబరు 240-250 ఉంటుంది. ఈ సంగతి అనుగుణ షరాలో ఉదాహరింపబడింది. అందులో ఇంకా కొంత భాగట్టాకూడా ఉంది.

> 400 నెంబరు నూలు వడికినట్లుగా రికార్డులో ఉంది......పైన ఉదాహరించిన చాందా నమోనా, ఇంగ్లీషు లెక్క ప్రకారం 244 నెంబరవుతుంది. ఇది ఢేరులు ఉత్పత్తిచేశారు. సన్నని ధోవతులకు పనికి వచ్చే 140 నెంబరు నూలు నాగపూరులోనూ, ఓమ్రాయర్ లోనూ సాధారణంగా వడుకుతూనే ఉంటారు.

ఆ ఢేరు లెక్కడికి పోయినారు? ఆ పత్తి, ఆ ధోవతులూ యేమయినవి? డక్కా మజిలీ వలెనే యంత్రాల దండయాత్రతో అవన్నీకూడా తుడిచిపెట్టుకొనిపోయినవి. 1867 నివేధికలో ఉదాహరింపబడిన నాగపూరు ప్రదర్శనాలు నిజానికి

బ్రిటిష్ మిల్లుబట్టలను ప్రచారం చేయడాని కేర్పాటు చేయబడ్డవి. మధ్యరాష్ట్రాల ప్రజలకు కావలసిన బట్ట అంతా దాదాపు అక్కడే తయారవుతూండేది. అందువల్ల మిల్లులు ఎక్కువగా పోటీచేయవలసి వచ్చింది.

1864 డిశంబరు నివేదికనుబట్టి జమూరుఘాటులో (చాందా) వారం వారం జరిగే సంతకు వివిధ తరగతుల వర్తకులవి 521 దుకాణాలు వచ్చేవనీ, అందులో 5 మాత్రమే సీమబట్టలను అమ్ముతూండేవనీ ఈ దిగువ వివరాలనుబట్టి తెలియగలదు.

౧	ఖరీదుగల తలపాగాలు, ధోతీలు, శాలువలు మొదలయినవి - దేశీయులు తయారుచేసినవి అమ్మే దుకాణాలు	25
౨	సీమబట్టలు అమ్మే దుకాణాలు ...	5
3	కోష్టీలు-సన్నని దేశీయ వస్త్రాలను నేసేవారు	110
౪	రంగ్ రేజ్ - రంగులు వేసేవారు, రంగులు అద్దకాలు వేసిన దేశీయ బట్టలదుకాణాలవారు	26
౫	స్త్రీలకు కావలసిన రంగు బట్టలమ్మే సేల్వారు దుకాణాలు ...	5
౬	ధేరులు సొంతంగా తయారుచేసికొన్న ముతక బట్టల దుకాణాలు ...	350
	మొత్తం	521

ఇందులో 44 మంది వ్యాపారం వృత్తిగాగల పెద్ద వర్తకులు. వారు సంతకు బళ్లమీద సరుకులు తెచ్చుకొని రెండు రోజులు నిలవ ఉండేవారు. మిగిలినవారు పేదవాళ్లు. వాళ్లు చిన్నచిన్న మూటలను

వీపులమీద మోసుకొని వచ్చేవారు. వారి అమ్మకంకూడా తక్కువే.

దేశంలో తయారయిన ఆ ఖరీదుగల తలపాగాలను ధోవతీలను అమ్మే వర్తకు లేమయినారు? చాందాజిల్లా, చిమ్నూరు పరగణాలోని జమూరుఘూటా వార సంతలకు వస్తూండే ఆ 'కోష్టిల' 'రంగరేజ్' 'సేల్వారుల' 'ఢేరుల' దుకాణా లేమయినవి?

రాష్ట్రవాణి 31—10—40

నూలు వడకడమే తుది శరణ్యం

హరిజన్ నుండి :

నిన్న మొన్నటివరకూ నిరంతర దరిద్రబాధనుండి ఎలాగో తప్పించుకొని, ఏరోజు కారోజు కావలసిన అన్నం సంపాదించుకోవడానికి నిరుపేదలకు నూలు వడకడం తుది శరణ్యంగా ఉండేది. ఇది ఒక ఇండియాలోనే కాదు. అరేబియాలోను, పశ్చిమ ఆశియాఖండమునందలి తదితర దేశముల లోనూకూడా ఇంతే. అరబ్బీభాషలో వ్రాయబడిన ఒక భక్తుని కథ నుండి (అలీఫ్ లాయలావాలాయలా) ఈ సంగతి చక్కగా వ్యక్తమవుతుంది. సర్ రిఛ్వార్డు బర్టన్ నేటి కనుగుణంగా కొద్ది మార్పులతో ఆ కథను వ్రాసిన అనువాద మిది:-

ఒకప్పుడొక భక్తుడైన యూదు డుండేవాడు. అతని కుటుంబం నూలు వడుకుతూండేది. ప్రతిరోజూ ఆయన బజారుపోయి నూలమ్మి, దూది కొనుక్కొని మిగిలిన డబ్బుతో కుటుంబానికి కావలసిన ఆహారం కొనుక్కొంటూండేవాడు. ఒక ఉదయం మామూలు ప్రకారమే ఆయన బజారుపోయి ఆనాటి నూలు అమ్మిన తరువాత

తనవంటి నిరుపేద సోదరుడే కనపడి ఆక లవుతూందన్నాడు. అప్పు డానూలు విక్రయించిన డబ్బు ఆయన కిచ్చివేసి ఇంటికి వట్టిచేతులతో వచ్చాడు. అప్పుడు కుటుంబంలోవారు "దూదేమయింది? మన ఆహార మేమయింది"? అన్నారు. "మనవంటివాడే ఒక సోదరుడు కనబడి ఆకలిగా ఉందన్నాడు. ఆయన కానూలు డబ్బిచ్చివేశాను" అని జవాబుచెప్పాడు. 'ఇప్పుడు మన మేమి చేయాలి? అమ్మేటందు కైనా ఇంకేమీలేదే' అన్నారు వారు.

(హరిజన్ 11 జనవరి 1936)

మిల్లుబట్ట - ఖద్దరుబట్ట

ఖద్దరు స్వదేశీ ప్రదర్శనాలలో మిల్లుబట్టను ఎందుకు వెలి వేయవలసి వచ్చింది? మిల్లుబట్టకూడా స్వదేశీయే కదా! కాంగ్రెసు సంఘాల కార్యకర్తలను మిల్లుబట్టల నెందుకు కట్టుకోనీయరు? అని అనేకమంది ప్రశ్నిస్తూంటారు. మిల్లుబట్ట ధనవంతుల పెట్టుపోతలలో పెరుగుతూన్నది గనుక, మన పేదల ప్రదర్శనాలలో దానికి ప్రకటన అనవసరం. కాంగ్రెసులో ఎన్నికస్థానాలకు నిలబడేవారు ఖద్దరు కట్టితీరాలి అనే నిర్బంధమున్నమాట నిజమే. ఖద్దరువల్ల పేదలకు అన్నం దొరుకుతుంది; ఖద్దరువల్ల నగరాలలోని డబ్బు పట్టణాలకూ, అక్కడనుండి పల్లెటూళ్లకూ పోతుంది కనుక ఆ నియమ మేర్పాటుచేయబడింది.

కాని కొంతమంది బాధ్యతగల మనుష్యులే ఇటీవల మిల్లు బట్టను ఉపయోగిస్తూన్నారు. మిల్లుబట్టల ఉపయోగంలోని,

ఆర్థిక నైతిక భావాలను చాలామంది అర్థంచేసుకోవడంలేదు. 'అది మాత్రం స్వదేశీకాదా' అని అడుగుతారు వారు. 'అవును స్వదేశీయే' కాని స్వదేశీ అయినదల్లా పేదవాడికి ఉపయోగకారికాదు. బ్రిటిష్‌సామ్రాజ్యతత్వంనుండి దేశాన్ని రక్షించుకొనేటందుకేగాక భారతీయ పెట్టుబడిదారులనుండి తప్పించుకోవడానికికూడా తగినట్లు మన సంఘవ్యవస్థ పునర్నిర్మాణం కావాలి.

మిల్లు లన్నీ గొప్పగొప్ప ధనవంతులవి. వాటిలో పని చేయడానికి గ్రామాలనుండి కూలిజనంవస్తారు. పల్లెటూళ్లలో ఉన్నప్పటి వారి జీవితాన్ని మిల్లులలో పనిచేసే నాటి జీవిత పరిస్థితులతో పోల్చి చూస్తే, ఆ భేదం మీకు దుఃఖం కలిగించక తప్పదు.

మిల్లుకూలీలకు చేతులు తప్ప—తలకానీ హృదయంకానీ ఉంటుందనుకోరు. అందువల్లనే వారిని 'మిల్‌హ్యాండ్సు' అంటారు ఇంగ్లీషులో—వారికి కల్పనాశక్తి నశిస్తుంది. వాళ్లేవస్తువునూ మొదటినుండి చివరదాకా తయారుచేయరు. వాళ్లు యంత్రానికి సరుకు అందించడమో; దారం తీయడమో; ప్యాకెట్లు లెక్కపెట్టడమో, పనిముట్టుకు నూనె రాయడమో, తిప్పడమో, చుట్టడమో యేదో చేసేసరికి రోజు గడుస్తుంది. సాయంకాలానికి వాళ్ళ మజూరీకోసం యెదురుచూస్తూంటారు కాని చేసిన పనివంక చూడరు. నిర్జీవమైన వస్తువుకు దేనికీ సరియైన చక్కని రూపమిచ్చి సజీవంగా తయారుచేసే భాగ్యంలేదు వారికి.

ఒక శిల్పిని తీసుకోండి. ఆయన ఒక కలకు రాతిముక్క పుచ్చుకొని దానిలో చక్కని విగ్రహాన్ని చెక్కుతాడు. లేదా పూవులూ, లతలూ చిత్రిస్తాడు. సాలీని తీసుకోండి. సాయంకాల మయ్యేసరికి చక్కని బట్టను నేసుకొంటాడు. అది అతనిది. అతను కట్టుకోవచ్చు. అమ్ముకోవచ్చు. తాకట్టు పెట్టుకోవచ్చు. కొడుకు పెళ్ళికి దాచుకోవచ్చు. మిల్లుకూలీ దినమంతా అసంతోషదాయకములగు అసహజ పరిస్థితులలో పనిచేసి తన కూలిలో సగమో, ముప్పాతికో తాను పడ్డ కష్టం తెలియకుండా ఉండేటందుకు తాగి ఇంటికి పోతాడు. మానవచిత్తానికి ఆనందం కలిగించేది కేవలం కూలిడబ్బు కాదు. చేసే పనివల్లనే కలుగుతుంది ఆనందం. మిల్లుకూలీకి ఆ ఆనందం ఎలా ఉంటుందో తెలియదు.

ఇక నైతికదృష్టితో ఆలోచిద్దాము. మిల్లులో పనిచేసే కూలీలలో ఒకే కుటుంబంలోని స్త్రీపురుషులు చీలిపోవడము, వేరువేరు కుటుంబాలలోని స్త్రీపురుషులు కలసి పనిచేయవలసి రావడమూ తటస్థిస్తుంది. మిల్లులలోని కూలీల కుటుంబాలు కళాకౌశలాన్ని ప్రదర్శించేటందుకు ప్రతికలసి పనిచేసే ఒకే వర్గంగా ఉండదు; కేవలం విచ్ఛిన్నమైపోతుంది. తల్లుల వడిలోని బిడ్డలవిషయంలోకూడా అంతే. మిల్లులలోని కూలీలు కూడా సరుకులవలెనే ఒకే మూసలో తయారవుతారు. కుటీరపరిశ్రమలలో గృహమర్యాదలకు భంగం రాకపోవడమే కాక ఎవరు తయారుచేసుకొన్న వస్తువు వారిదే అవుతుంది,

మిల్లుబట్ట చౌక అని చెప్పుకొంటారు జనం. కాని ఈ చౌకదనంలోనే తమ ప్రక్కనున్న పేదల చావు ఉందని వారికి తెలియదు. మిల్లు 15000 చదరపు గజాల బట్టను ప్రతి రోజూ తయారుచేస్తుందని సంతోషిస్తారే కాని 1,000 మంది సాలీలవృత్తి నాశనమయిందని గమనించరు. సాలీలు పని లేని జనంలో చేరారు. ఇండియాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమ నేత. జీవితానికి ఆహారం తరువాత బట్టే కదా కావలసింది. కాబట్టి మీరు ఆహారపదార్థాలను, వస్త్రాలను దిగుమతీచేసుకోవడం ప్రారంభించినప్పటినుండీ మీ ముఖ్య పరిశ్రమలు రెండూ పాడయిపోయినవి. అందువలననే మేము దేశంలో పండిన పంటను తిని, చేతితో నేసిన బట్టను కట్టుకోవలసిందని ప్రజలకు సలహా యిస్తున్నాము.

చేతితో నేసిన బట్టను ఉపయోగించడం ఉచితమైతే మిల్లుబట్టను ఉపయోగించడంకూడా ఉచితమే అంటారు కొంతమంది. మేమది ఒప్పుకోము. చేతితో నేసిన బట్టలను ఉపయోగించినందువలన సాలివానికి వృత్తి లభిస్తుంది. కాని గ్రామాలలో దిక్కులేకుండా ఉన్న అనేకమంది వితంతువులకు పోషణ జరగదు.

పైగా మిల్లు యజమానులయొక్కయు, మిల్లుయేజెంట్లయొక్కయు ఐశ్వర్యం, వారి పెట్టుబడి, వారి ఉత్పత్తి, వారి కమీషను, వారి లాభాలు, వారి బంగళాలు, వాళ్ళ క్రీడా సరోవరాలు, వాళ్ళ మోటార్లు, గుర్రాలు, వాళ్ళ వేసంగి ప్రయాణాలు, ఖండాంతర యాత్రలు, వాళ్ళ భోగాలు.

వాళ్ల దుబారాఖర్చులు—ఇవన్నీ చూస్తే మీరిలా అనరు. గ్రామాలలో కడుపు నిండా అన్నం, వంటినిండా బట్టా లేని వాళ్లను అన్యాయ్యంచేసి వీళ్లకా మీరు సహాయం చేస్తారు? వీళ్లకు మీ సహాయం కావాలా అసలు?

మిల్లుబట్ట - చేనేతబట్ట

మిల్లు పరిశ్రమ ఇండియాలోని చేనేత పరిశ్రమకు పోటీ. ఈ పోటీని తగ్గించడమునకే స్వచ్ఛమైన మిల్లుబట్టల దుకాణదారులను మద్రాసులోని కాంగ్రెసు ప్రభుత్వం లైసెన్సులు తీసుకోవలసిందని కోరింది. ఈ చట్టంవలన గొప్ప ఫలితాలు కలిగినవని మేము చెప్పడంలేదు. కాని ఈ రెండు రకాల బట్టలకు పోటీ ఉందని మాత్రం హెచ్చరించడానికదది ఉపయోగపడుతుంది. ఈ సందర్భంలో మిల్లుయజమానుల అభిప్రాయాలు, చేనేత పరిశ్రమను ప్రోత్సహించవలెనన్నవారి అభిప్రాయాలు ఒకచోట పెట్టి పోల్చిచూడవలెనని కుతూహాలపడుతూన్నాము.

> చేనేత పరిశ్రమను సంరక్షించవలెనన్న సందర్భంలో, ఇండియాప్రభుత్వంవారికి బెంగాలు మిల్లుయజమానుల సంఘంవారు వ్రాసిన ఉత్తరమునందు చేనేత పరిశ్రమ చక్కగా సంస్థాపింపబడలేదన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. దేశీయవస్త్రపరిశ్రమపైన అప్పుడప్పుడు వేస్తూవచ్చిన పన్నులభారమును పరిశీలిస్తే ఇక కొత్తపన్నులు వేయడానికి సావకాశం లేదని ఆ సంఘం మొఱబెట్టుకొన్నది. మిల్లులో తయారైన దేశీయవస్త్రాలపైన యేమైనా పన్ను వేసినట్లయితే అందు

వల్ల కలిగే నష్టాన్ని పూడ్చడానికి, దేశంలోకి దిగుమతిఅయ్యే, అటు వంటి సరుకు లన్నిటిమీద సమభారపు పన్ను వేయవలసి ఉంటుం దని ఆ సంఘం కోరింది. దీని ఫలితంగా అన్ని బట్టలకు — చే నేత బట్టలుకానీ, మిల్లుబట్టలుకానీ— స్థానికంగా తయారైన బట్టకానీ— దిగుమతి అయిన బట్టకానీ — ధర పెరుగుతుంది. ప్రజలకు కొనుక్కొనే తాహతు లేనందువలన అసలు బట్టల ఖర్చే చాలా తగ్గి పోతుంది; బెంగాలు మిల్లులు వివిధ రకాల బట్టను తయారుచేయడం లేదు. రెండు మూడు రకాలను మాత్రమే తయారుచేస్తున్నవి. అందువల్ల అవి ఆర్థికంగా అంత లాభదాయకంకాని స్వల్పద్రవ్యంతో పనిచేయవలసివస్తూన్నది. అటువంటప్పుడు ఉత్పత్తి చేసే రకాలనుబట్టి పరిమితిని యేర్పాటుచేయడమంటే స్థానిక మిల్లులను మూసివేయమని చెప్పడం. అంతేకాక నూలుపైన పన్నును తగ్గించనట్లయితే దేశీయ మిల్లులను విదేశసరుకుల పోటీకి గురిచేసి అభివృద్ధిపొందుతూన్న దేశీయపరిశ్రమను చేతులారా చంపడమవుతుంది.

ఇక చేనేత పరిశ్రమ ముడిసరుకులను సంపాదించుకొంటూన్న నరతులు దానికి లాభకరమైనవికావు. ఆ పరిశ్రమ కేవలం షాహు కారు దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉంది. దానికి తగిన పెట్టుబడిలేదు. తగిన అంగళ్ళు లేవు. అంతేకాదు, కావలసినంత కాలం, శ్రమ, బలం నూలు చేయడంలోనే వృథాఅయిపోతూన్నది. 'గవర్నమెంటు తనిఖీకింద సహకార క్రయ సంస్థ స్థాపింపబడి నేత గాళ్ళకు ఉచితమైన ఖరీదులలో ముడిసరుకులను సప్లయిచేయడానికి సహాయపడినట్లయితే వాళ్ళకు కొంత ఉపకారం కలుగవచ్చును. 'చేనేతపరిశ్రమకు ప్రథమంలోచేయవలసిన పనులను నిర్వర్తించడానికి అక్కడక్కడా ఆవిరియంత్ర కేంద్రాలను నిర్మించడం మంచిది' అని ఆసంఘం సూచిస్తున్నది.

ఖాదీనిగూర్చి గుల్జరీలాల్ నందా

హిందూదేశపు యంత్రాలు 50 కోట్ల విలువగల బట్టను ఉత్పత్తి చేస్తవి. ఇందులో షుమారు 10 కోట్ల రూపాయిలు కూలికింద ఖర్చు అవుతుంది. అంతే ఖరీదుగల ఖాదీ 35 కోట్ల రూపాయీలు కూలికింద వెచ్చించవలసివస్తుంది. అదే పరిమాణంగల ముడిపత్తితో తయారైన ఖాదీ ఇప్పటి పరిస్థితులలో నూరు కోట్ల రూపాయీలకు అమ్మవచ్చును. అందులో 70 కోట్లు కూలికి వెచ్చించబడుతుంది. బట్ట ఖరీదు 50 కోట్లు పెరిగితే కూలికింద యిచ్చే పైకం 60 కోట్లు పెరుగుతూన్నది. అంటే ఖాదీలో పనిచేసే కూలీల సంఖ్యకంటె చాలా తక్కువమంది కూలీలను నియమించి పనిచేస్తూన్న మిల్లులు కూలీలో మిగిల్చే 60 కోట్ల రూపాయీలలోను 50 కోట్లుమాత్రమే కొనుక్కునేవాళ్ళకింద వినియోగపడుతూన్నదనీ, మిగిలిన 10కోట్లు అధిక బాడుగలు, వడ్డీలు, లాభాలకింద పోతూన్నదనీ అర్థం. అంతే కాదు; ఖాదీకి తీసికొంటూన్న ఎక్కువ ధరవలన దేశమంతటిలోనూ కొనుక్కొనేవాళ్లు కొనుగోలుశక్తి తగ్గిన 50 కోట్లునూ తేరగా వచ్చే లాభాలనుండి, పన్నులనుండి 10 కోట్ల రూపాయిలునూ— ఈ మొత్తం అంతా ముఖ్యంగా పల్లెటూళ్ళలో కూడులేని కూలీలకు, రైతులకు చేరుతూన్నదనికూడా తెలుసుకోవాలి. ఎక్కువ ధరపెట్టి కొనడంవలన పట్టణాలలోని ధనవంతులు ఖాదీకి వెచ్చించిన అధిక మొత్తమున్నూ, మిల్లుబట్టల ధరలలో చేర్చబడిన లాభాలు వడ్డీలు వగైరాలు మిగిలిపోయినందున కనపడే ఆదా 10 కోట్ల రూపాయలునూ గ్రామస్థుల కొనుగోలు శక్తిని ఎక్కువచేస్తూన్నవి. అయితే మిల్లుబట్టకు బదులుగా ఖాదీబట్టను ఉపయోగించడంవల్ల గ్రామస్థుల కయ్యే బట్టలవ్యయం పెరిగేమాట వాస్తవమే. కాని ఖాదీ ఉత్పత్తి

వలన వారికి ముట్టే ఎక్కువ మజూరీ వారి ఖాదీబట్ట కయ్యే ఎక్కువ వ్యయం కంటె అధికంగానే ఉంటుంది. నిజానికి బట్టల విషయంలో తిరిగీ వారు స్వయం సంపూర్ణతను పొందడానికి ఈ మార్పు చక్కగా ఉపకరిస్తుంది. మిల్లుబట్టనుండి ఖాదీ బట్టలకు మారినందువలన పట్టణస్థుల కొనుగోలు శక్తి కొంత తగ్గి గ్రామస్థుల కొనుగోలుశక్తి కొంత హెచ్చుతుంది. అనగా పట్టణాలలో భోగాలకు తమాషాలకు వెచ్చించే డబ్బు గ్రామాలలో ఆరోగ్యానికీ, సత్తువకు కావలసిన వస్తువులను, నిపుణులను సంపాదించుకోవడానికీ ఉపకరిస్తుంది. ఖరీదు హెచ్చడంవలన బట్టలు కొనడం కొంత తగ్గుతుంది నిజమే కాని అందువల్ల దేశంలో కావలసిన బట్టకంటె ఎక్కువ బట్టలను ఉపయోగించే అలవాటు చాలావరకు పోతూంది. అంటే ఈవాదం విదేశబట్టలవిషయంలో ఇంకా ఎక్కువగా వర్తిస్తుంది. విదేశీబట్టలు తయారుకావడంలో ముట్టిన కూలి అంతా ఇండియాలో కూడులేని కష్టజీవుల కడుపుగొట్టి వారెరుగని భోగాలనుభవిస్తూన్న విదేశీ కూలీలకే ముడుతూన్నది. మిల్లు పరిశ్రమలో వెచ్చించబడే కూలి రోజుకు సగటున ఒక్కొక్కనికి 10 అణాలవంతున 4 లక్షల మందికి ముట్టుతూన్నది. ఖాదీ రోజు 1కి సగటున మనిషికి 0-3-0 చొప్పున షుమారు కోటిమందికి 70 కోట్ల రూపాయిలు మజూరీకింద యిస్తూన్నది. అంతేకాదు. మిల్లుకూలీకి ముట్టిన ప్రతి రూపాయలోనూ చాలా భాగం వడ్డీకిందగానీ, అద్దెకిందగానీ, లాభంకిందగానీ తిరిగీ ధనవంతులకే చేరుతూన్నది. గ్రామానికి ముట్టిన ప్రతిరూపాయి జీవనాధారములయిన వస్తువుల ఉత్పత్తికి సహాయంచేసి స్థయిర్యాన్ని చేకూరుస్తున్నయి.

ఖాదీ అంతర్జాతీయ శాంతికి ముఖ్య సాధనమని ఆయన చెప్పబోతూన్నాడు చూడండి:—

> మిల్లుబట్టవలన పనిలేకుండా పోయిన ఇండియాలోని కష్టజీవులందరూ యంత్రోత్పత్తికి పూనుకొన్నట్లయితే, ఇండియాకు ఏడాది పొడుగునా కావలసిన బట్ట తయారుకాగా, ప్రపంచ మంతటికి చాలా ఏళ్ల వరకు సరిపోయేటంత బట్ట సిద్ధమవుతుంది. ఇండియాలో మిగిలి పోయిన బట్టను ప్రపంచంలోని యితర దేశాలమీద రుద్దగలిగినట్లయితే ఆయా దేశాలలోని లక్షలాది ప్రజల పని పోయి వారికి బ్రతుకు తెరువుండదు. యంత్రోత్పత్తివలన యేదో ఒక జాతిలోని కొంతమంది వ్యక్తులకో, కొన్ని సంఘాలకో జీవనం పోవడమే కాదు, జాతుల ఐక్యత, రక్షణ, స్వాతంత్ర్యం, ఆనందం ఇవన్నీ నశిస్తాయి.

ఇక ఆయన ఖాదీ సంస్కృతినిగూర్చి ఇలా అన్నాడు.

> చేతి పనిచేసే బత్తుడు తన వస్తువులలో తన సహజ ప్రకృతిని ప్రవేశ పెడతాడు. యంత్రం దూరదేశాలకోసం ఉత్పత్తి చేస్తుంది. ఉత్పత్తి దారుడూ, కొనుక్కునేవానికి పరస్పర సంబంధంగానీ మొగమోటంగానీ ఉండదు. కాబట్టి యంత్రంలో తయారైన వస్తువులు ఆత్మరహితములు.

ఖాదీ అర్థశాస్త్రంపైన ఆయన వ్రాసిన విషయాలుకూడా చాలా ఆకర్షవంతాలుగా ఉన్నవి. ఆయన 'కేవల మూల్య సిద్ధాంతం' (Absolute price theory) అసంగతమని తోసి పారేశాడు.

> ఇండియాలో ప్రభుత్వంవారు మిల్లుబట్టల విషయంలో అవలంబించే విధానానికీ, మహాత్మా గాంధీ ఖాదీవిషయంలో అవలంబించే విధానానికీ పరిమాణంలోనూ (degree) పద్ధతిలోనూ మాత్రమే భేదం. (సిద్ధాంతంలో భేదంలేదు.) మిల్లుబట్ట రక్షణకోసం విదేశీ సరుకులు కొన్నింటిమీద ప్రభుత్వంవారు నూటికి 50 వంతున దిగుమతి పన్ను

విధించి వాటిని మిల్లుబట్టకంటె నూటికి 40 వంతువ తక్కువ ఖరీదులో కొనుక్కోవడానికి వీలులేకుండా ఆటంక పరుస్తూన్నారు. మహాత్మా గాంధీ మిల్లుబట్టకు వ్యయంచేసే పైకంలో నూటికి నూరు వంతున ఎక్కువ ఖర్చు అయినా ఖద్దరునే కొనవలసిందని ప్రజలను పదేపదే హెచ్చరిస్తూన్నాడు. చౌకబట్టల దండయాత్రలకు తట్టుకొని పరాయి సహాయంలేకుండా తమ కాళ్ళమీద తాము నిలబడేటందుకు ఖద్దరు కానీ, మిల్లుబట్టలుకానీ శక్తికలవి కావు. ఆ విధంగా రెండూ ఆర్థికంగా సమర్థనీయములుకావు.

ఖాదీకి పెట్టే ఎక్కువ వెల నిరుద్యోగుల కిచ్చే దినబత్తెములకంటె చెడిపోయినదా? అని ఆయన అడుగుతూన్నాడు. దానికీ దీనికీ పోలికేలేదు. నిరుద్యోగుల దినబత్తెములవల్ల ప్రజాద్రవ్యం ప్రయోజన రహితముగా వినియోగింపబడుతూన్నది. ఖాదీలో అలా కాదు.

ఖాదీనుండివచ్చే ఆదాయం అత్యల్పమా? ఫ్యాక్టరీవిధానం కింద వచ్చే కుటుంబపు మొత్తపు ఆదాయంకంటె కుటీర పరిశ్రమ పద్ధతివలన లభించే కుటుంబాదాయం ఎక్కువమాట నిశ్చయం.

అమెరికా సంయుక్తరాష్ట్రాలు కావలసినంత ధనసహాయం చేసి పత్తిపంటను సంరక్షిస్తూన్నప్పుడు, ఇండియాప్రభుత్వం 1924 ఉక్కుపరిశ్రమల రక్షణచట్టంకింద, గొప్ప ద్రవ్యసహాయంచేసి ఆ పరిశ్రమను నిలబెడుతూన్నప్పుడు, ఖాదీకి ధనమిచ్చి, విదేశీవస్త్రాలను దేశంలోకి రాకుండా పూర్తిగా నిషేధించి మిల్లుబట్టల ఉత్పత్తికీ వ్యాపారానికీ పరిమితిని ఎందు

కేర్పాటు చేయకూడదు? రాజకీయ వాతావరణం ఇంతకంటె బాగున్న సమయంలో జరుగవలసిన పని యిది.

చేతితో చేసే పనివలన తగినంత ఉత్పత్తి కాగలదనే నమ్మకం ఉందా? అని ప్రశ్న. మిల్లులలో పనిచేసే కూలీలు చేతితో పనిచేసే కూలీలకంటె 50 రెట్లెక్కువ పనిని, సగం ఖరీదులో చేయగలరని నందా చెప్పిన మాటలనుబట్టి దేశంలో నూరురెట్లైశ్వర్యం ఎక్కువయినట్లుగా భావించ కూడదు. 50లో ఒక్కనికిమాత్రమే మిల్లులలో పని దొరుకు తూన్నది. తక్కిన 49 మందీ ఏవిధమైన ఐశ్వర్యోత్పత్తి చేయడం లేదు.

నందా తన వివరణాన్ని ఈవిధంగా ముగించాడు.

> ఖాదీనుండి మిల్లుబట్టకు మారినందున ఖాదీ ఖరీదుకంటె మిల్లుబట్ట తక్కువ ఖరీదు కాబట్టి 50 కోట్ల రూపాయిలు లాభం కనిపించే మాట నిజమే. కాని గ్రామవాసుల పని లేని దినాలను లెక్కకడితే సంవత్సరానికి కనీసం 300 కోట్లు తేలతయి. ఈ రోజులు లాభం వచ్చిన పైకము కంటే యేమాత్రమూ తక్కువ ఖరీదు కలవి కావు. ఈ రోజున ఖాదీ ఉత్పత్తికి ఇస్తూన్న రేట్లనుబట్టి, ఈ కూలిజనపు కాయకష్టపు ఖరీదు 70 కోట్లు (ఏడాదికి). [హరిజన్ 1936 మే 7.]

ఖాదీ ప్రదర్శనాల స్వభావంకూడా ఇటీవల కొన్ని సంవత్స రాలనుండి మారిపోయింది. లక్నో ప్రదర్శనంలో మహాత్మా గాంధీ ఇలా ఉపన్యసించాడు.

> మీ కన్నులకు చెవులకు భోగేచ్ఛ ప్రేరేపించి ఆకర్షించే సినీమా ప్రదర్శనాలు కావివి. విద్యా విలువలేని ప్రతి వస్తువును ఈ ప్రదర్శనం

నుండి బహిష్కరించడానికి ప్రయత్నించాము. ఈ ప్రదర్శనాన్ని మేము పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రంగా మీకు కన్నులపండువుగా, వీనుల విందుగా, మీ భావాలను అకలంకంగా చేయగల ఆధ్యాత్మిక సంతర్పణగా నొసర్చవలెనని కృషిచేశాము. ఇదంతా ఎందుకోసమో చెబుతాను. మీరు ఒరిస్సాను, అక్కడి బొమికల పోగులను ఎరుగుదురుగదా! సరే, అయితే! ఆకలితోనూ దరిద్రంతోనూ అల్లాడుతూన్న ఆ అస్థిపంజరాల దేశంలోనుండి, బొమికతోనూ, కొమ్ముతోనూ, వెండితోను అద్భుత కల్పనలను కావించినవారిక్కడకు వచ్చారు. వెళ్ళి ఆ వస్తువులను చూడండి. తయారైన వస్తువులే కాదు; తయారవుతూన్నవికూడా ఉన్నవి. ఆకలితో చిక్కిపోయిన మానవ శరీరంలోని ఆత్మకూడా నిర్జీవములైన లోహాలకు, కొమ్ములకు, ఎలా ఊపిరి పోస్తున్నదో చూడండి. మట్టిలోనుండి అలౌకిక సృష్టిచేశాడు పాప మా పేద కుమ్మరి. నేను కొన్ని అణాల ఖరీదుంటవనుకొన్న వస్తువులు ఒకటో రెండో రాగి డబ్బుల ఖరీదట! అయితే యేమి అవి సుకుమార శిల్పకళారేఖలు. ఒక ప్రియసోదరి నిన్ననే దంతపు బాలకృష్ణుడ్ని కొనుక్కొన్నది. ఆమెకు కృష్ణభగవానుణ్ని ఇదివరకు పూజించే అలవాటు లేదు. ఇప్పుడీ మనోహర బాలరూపాన్ని పూజచేయడం ప్రారంభించిందట.

ఈ ప్రదర్శనం కేవలం కౌతుకాత్మక దృశ్యం కాదు. ఒక విధమయిన స్వర్గధామము. కాని మన అభిరుచు లధోగతికి పోయినవి. అందువల్ల మన కళ్ళయెదుట ఉన్న అద్భుత దృశ్యాలను ఈసడించి అవతలనుండి వచ్చిన అల్పవస్తువులను చిత్తాకర్షక శిల్పకళగా ఆనందిస్తాము. దూరంగా ఉన్న ఐరోపాఖండంలోని అర్థంకాని ఏదో పేరుగల సొన నీరు మనను అద్భుతంగా ఆకర్షిస్తుంది. అఘురహితమనీ

సహజపూతిహారమనీ ప్రసిద్ధిగల గంగా పవిత్రజలం మనకు మురికి గుంటలోని నీరు.

డివేలరా ఆర్థిక సిద్ధాంతం

ప్రపంచ ఆర్థికమహాసభ జరగడానికి కొన్ని వారాలు ముందుగా, 1933 జూను నెలలో ప్యారిసునగరమునందు అమెరికన్ క్లబ్బువారు డివెలరా గౌరవార్థ మొక విందుచేశారు. అందులో ఆయన తన ఆర్థిక సిద్ధాంతాన్ని స్పష్టంగా వివరించాడు. స్వేచ్ఛావాణిజ్యపద్ధతి ప్రపంచంలోని చెడుగులన్నిటిలోకీ గొప్పచెడుగు. 'దేశంలో కాగా మిగిలిన ఉత్పత్తులను మాత్రమే ఎగుమతిచేయవలెననే పరిమితిని యేర్పాటుచేస్తేనే తప్ప, లేకుంటే నిజంగా అంతర్జాతీయవ్యాపారమే క్రూరం. (ఉదా: ఇటీవల పునరుద్ధరింపబడిన 1935 జనవరిలోని రాక్షసిబొగ్గు, పశువులనుగూర్చిన ఒడంబడిక) 'స్వేచ్ఛావ్యాపార' మనే పేరుతో ఇంగ్లాండు — ఐర్లాండు పరిశ్రమలను చంపి, ఆ దేశాన్ని జనసంఖ్య తక్కువగల ఆహారపదార్థనిలయంగా తయారుచేసింది. తనను లొంగదీసి అధికోత్పత్తిచేస్తూన్న పక్కదేశంపైన ఆధారపడిఉండే పద్ధతినుండి బయటపడడమే ఇప్పు డయిర్లాం డవలంబించవలసిన రాజనీతి.

డివేలరా వాదంలో చాలా అర్థముంది. 90 సంవత్సరాల కిందట ఇప్పటి 'సార్‌స్టాట్ ఐరీన్' (Saorstat Eireann) ప్రదేశంలో 670,000 ఎకరాల గోధుమపంట ఉండేది. ప్రతి దేశము ఆ ఎకరాల అభివృద్ధికి కారణమయింది. ఐర్లాండు

తనకు కావలసిన పంటను పండించుకోవడమేగాక ఇతర దేశాలకుకూడా ఎక్కువ ఉంటే ఎగుమతిచేస్తూండేది. ధాన్యపుచట్టాలను (corn laws) రద్దుచేసి, 1847లో స్వేచ్ఛా వ్యాపారసిద్ధాంతాన్ని ఐర్లండుకు వర్తింపచేసిన పిమ్మట అమెరికానుండి చౌక సప్లయిలతో ఇంగ్లండు నిండిపోయినయి. ఐర్లండు గోదుమపొలాలు పశుపోషక స్థలాలుగా మారిపోయినవి. కుటుంబాలు లేచిపోయినయి. పంటపొలాలు పచ్చిక బీళ్లయినయి. 1931 నాటికి పంటపొలం 21,000 ఎకరాలకు క్షీణించింది. నేడు (1935 పంట) ఎన్నోవిధాల ప్రోత్సాహమిచ్చి ప్రచారంచేస్తే తిరిగి 170,000 ఎకరాలకు పెరిగింది. గోదుమకాక ఇతర ఆహార ధాన్యాలపంట అంత ఎక్కువ వేయడం లేదక్కడ. కాని పశువుల దాణాకింద దిగుమతి అయ్యే సరుకులను నిరోధించడంచేత, ఇంకా కొంత భూమి దున్నవలసి వచ్చినది. మొక్కజొన్న పిండితో తయారుచేసే ఆహారంలో కొంతభాగం దేశంలో పండిన ధాన్యం వినియోగింపబడవలెనని నియమం చేయబడింది. మొక్కజొన్న పంటను ఆహారరూపంలో ఎగుమతిచేయడం పూర్తిగా నిషేధింపబడింది. ధాన్యరూపంలోని ఎగుమతికి లైసెన్సుపద్ధతి కింద పరిమితి యేర్పాటు చేయబడింది. ఈ నీతిని అవలంబించడంవలన 100,000 ఎకరాలలో పండిన ధాన్యాన్ని దేశంలోనే భుజిస్తూన్నారు.

గ్రామ సౌభాగ్యాన్ని గూర్చి 'సర్ ఆలమ్‌పిమ్'

ఇంగ్లాండులోని భారతీయ గ్రామసౌభాగ్యసంఘ (Indian Village Welfare Association) పక్షాన సర్ ఆలమ్‌పిమ్ ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించాడు. అందులో గ్రామాల ఆర్థిక సాంఘిక వ్యవస్థలనుగూర్చి విలువగల విషయాలు దొరికినవి మాకు. జనసంఖ్య పెరిగి పొలం తక్కువగావడం, ఋణాలు హెచ్చడం—ఈ రెండే ఎక్కడచూచినా గ్రామస్థులను ఎక్కువగా చీకాకుపరుస్తూన్న సమస్యలు.

ఇండియాలో ఇవి మరీ ఎక్కువ. మన జనసంఖ్య చదరపు మైలుకు 248. నేడు కేవలం వ్యవసాయదేశంగా పరిణమించిన ఇక్కడ ఈ జనసంఖ్య చాలా ఎక్కువ. అందువలన సగటున ఒక్కొక్క పొలం యొక్క విస్తీర్ణం చాలా తక్కువ. వివిధ రకములైన పంటలు పండించడానికి వీలుండి, అంగళ్ళకు దోవలుండి, కోఆపరేటివ్ వ్యాపార పద్ధతి ఉండి, తీరిక కాలంలో ఇంకొక ఉపవృత్తి ఉంటే ఈ చిన్న చిన్న పొలాలలో ఒక కుటుంబం కొంతవరకు మర్యాదగా జీవితం గడపవచ్చునని సర్ ఆలమ్‌పిమ్ ఉదాహరిస్తూన్నాడు. జపానులో నూటికి 25 మంది మాత్రమే 2½ ఎకరాలకంటె ఎక్కువ పొలం ఉన్నవా రున్నారు. అన్ని విధములైన వ్యవసాయసంస్థలు యేర్పాటు చేయబడినవి. ఎక్కడా దుబారా అనేది లేదు. పొలాలను చిన్న చిన్న ముక్కలుగా చీల్చడం చాలావరకు నిషేధింపబడింది. పట్టు పురుగులను పెంచడంలాంటి ఉపవృత్తులలో చాలామంది పనిచేస్తున్నారు. ఇండియాలోని గ్రామస్థుల నిరుద్యోగతను తగ్గించే ఆశాకిరణం మహాత్మా గాంధీ 'చరఖా ఉద్యమం' లోనే ఉన్నది. నిజమైన లోటును పూరించే ప్రయత్నాని కది చిహ్నం. చైనాలో సగ

టున ఒక్కొక్క కుటుంబానికి ఒక ఎకరం పొలం ఉంది. ఇండియాలో ఐదెకరాలు.

ఖాదీ ఆర్థికంగా లాభదాయకమేనా?

'మిల్లుబట్టతో పోల్చిచూస్తే ఖాదీ ఆర్థికంగా లాభదాయకమా?' అనే విషయంపైన గాంధీకీన్నీ సుప్రసిద్ధ ఆర్థికశాస్త్రజ్ఞులకున్నూ జరిగిన చక్కని సంవాదాన్ని ప్యారీలాలు చెబుతూన్నాడు. ఆ సందర్భంలోనే చేతి పరిశ్రమల విషయం కూడా యాదృచ్ఛికంగా చర్చింపబడింది. ఇండియా దేశపు ప్రస్తుత పరిణామదశలో ఖాదీయున్నూ తదితర గృహపరిశ్రమలున్నూ పనిలేనివారికి పని కల్పించి కొంతవరకు సహాయపడడానికి ఉపకరించేమాట నిజమే. అందువల్ల వాటి నిప్పుడు ప్రోత్సాహపరచవలసిందే. కాని జాతీయపరిశ్రమల నిర్మాణకార్యక్రమంలో వాటికి ప్రధాన స్థాన మీయడానికి వీలు లేదని అర్థశాస్త్రజ్ఞమిత్రు లభిప్రాయపడ్డారు. వారి భావం ప్రకారం ఆర్థికంగా లాభప్రదములుగాని 'ఖాదీని ఇతర చేతి పనులును' యంత్రములమీద ఉత్పత్తిఅయ్యే సరుకులకు పోటీగా ప్రోత్సాహపఱచి, యంత్రోత్పత్తులకు నష్టం కలిగించడం సిద్ధాంతంలో తప్పు అని; అందువల్ల దేశముయొక్క ఉత్పత్తిశక్తి క్షీణించిపోతుందని వాదించారు. ఈ రోజున నిజానికి చేతిపరిశ్రమలకు నష్టదాయకంగా యంత్రము లనేక విధముల సంఘముచేత ఎలా ప్రోత్సహింపబడుతూన్నవో గాంధీ వ్యక్తంచేశాడు. అందు కుదాహరణంగా రైల్వేలో

తక్కువ రేట్లకు సరుకులను చేరవేయడం, మున్సిపాలిటీవారు ప్రత్యేకసౌకర్యాలుచేయడం, అనేకముఖ్యపరిశ్రమలు ఫ్యాక్టరీ ఉత్పత్తికి సహాయపడడం. బ్యాంకింగు భీమా యేర్పాట్లను చేయడం, అనేకమంది శాస్త్రనిపుణులకు శిక్షణ ఇప్పించడం ఇవన్నీ ఫ్యాక్టరీపద్ధతికి సహాయపడి దానిని జయప్రదంగా చేస్తూన్నవని చూపినాడు. ఇవి ఎంతో వ్యయంచేస్తేనేగాని జరగని పనులు. కాని సంఘం గునియకుండా ఒప్పుకుంటూ న్నది. అందుకు కారణం ఈ అన్నిటికీ ఆనుషంగికంగా, వేగ ప్రయాణ సౌకర్యాలు, మోటారుకారులు, సినీమాలు, రేడి యోలు, ఎలెక్ట్రిక్ దీపాలు, ఇంకా అనేకం మన నాగరిక విద్యాధిక సంఘనాయకుల కిష్టమైనవి లభించడమే. వీటికీ స్టూఅర్టుఛేజ్ 'నాగరిక క్రీడావస్తువు' లని పేరుపెట్టినాడు. ఇక చేతిపనులు వేరువిధమైన ఆర్థికపద్ధతిపైన ఆధారపడి ఉన్నవి. గ్రామపక్షపాతంగల సంఘం యేదైనా వీటికి సహాయపడినట్లయితే ప్రపంచంలో యేశక్తీ వీటితో పోటీ చేయజాలదు. అయితే వారు, పల్లెటూరి పరిసరాలు ఈయ గల నిరాడంబర జీవితంతోనూ, అకృత్రిమ ఆనందంతోనూ సంతృప్తిపడిఉండాలి. అంతేగాని అన్నిగ్రామాలకు 'ఆధు నిక సౌకర్యాలు' చేకూరుతయ్యనే ఊహాప్రపంచంలో విహ రించేవారుగా ఉండకూడదు. ఈరోజున ఫ్యాక్టరీ ఉత్పత్తిని చేతిపనులతో పోల్చి లాభదాయకంగా ఉందనడం కేవలం ఫ్యాక్టరీపద్ధతిలోఉన్న సహజగుణంవలనకాదు, కాని నేటి సంఘా

నికి యిష్టమైన ప్రమాణాలనుబట్టి విలువకట్టడంవలన దానికా లక్షణం ఆపాదింపబడినది. ఒక వృత్తిగానీ, ఉత్పత్తి విధానంగానీ లాభదాయకమా కాదా 'అనే సంగతి విచారించాలంటే మార్పులు లేని మంచి పరీక్ష ఒక్కటే — అది జీవిత ప్రధానావసరాల కెంతవరకు ప్రయోజనకరం? ఉత్పత్తిదారు విషయంలో ఆ పని ఎటువంటి పరిణామం కలిగిస్తుంది? అని ప్రశ్నించుకోవడమే.

ఎల్లెన్ హెచ్. ఈస్టన్ అభిప్రాయం

ఎల్లెన్ హెచ్. ఈస్టన్ 'దక్షిణోన్నత ప్రదేశాల చేతి పనులు' (Handicrafts of Southern High Lands) అను పేరుతో రస్సెల్ సంస్థా సంపుటం (Russel Foundation Volume) ఒకటి ప్రచురించాడు. అందులో పైన ఉదాహరింపబడిన అభిప్రాయా న్ననుసరించి చేతిపరిశ్రమల స్థితిగతులను పరిశీలించాడు. దాని ప్రతి ఒకటి గాంధీగారి కాయన పంపినాడు. రస్సెల్ సేజి సంస్థను 'అమెరికా సంయుక్తరాష్ట్రాలలోని సాంఘిక, జీవిత విధానాభివృద్ధికొఱకు' రస్సెల్ సేజి 1909లో స్థాపించాడు. దాని ఉద్దేశాలను నిర్వర్తించే నిమిత్తం ఆ సంస్థ ప్రత్యేకం ఒక సిబ్బందీని పోషిస్తూన్నది. వారు జనరల్ డైరెక్టరు అధికారం కింద సాంఘిక పరిస్థితులను పరీక్షించి, అవసరమైన క్రొత్త భోగట్టాను సంపాదించి, దానిని విమర్శించి, వ్యాఖ్యానంచేసి, అభివృద్ధి కనుగుణము, ఆచరణ యోగ్యమూ అయిన కార్యవిధానాన్ని సూచిస్తూంటారు.

అప్పుడప్పుడు వారి పరిశోధనాఫలితాలను పుస్తకంగా గాని, కరపత్రంగా గాని ప్రకటిస్తూంటారు.

చరఖా 'మేరో రాయ్ రంగీలో'

ఒకప్పుడు రాటం భారతదేశానికి ప్రాణప్రదంగా ఉండేది. యాభై సంవత్సరాల కిందట కూడా చరఖావల్ల జీవిస్తూన్న ముదుసలి వితంతువు 'నా ప్రసన్న ప్రభూ!' అని రాటాన్ని పిలుస్తూండడం అసాధారణ విషయం కాదు. కాని తరువాత మిల్లుబట్టల మెఱపులో రాటం కనిపించకుండా పోయింది. జరిగిన ఇరవైయేండ్లనుండి గాంధీ దానిని పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తూన్నాడు.

ఖాదీ గ్రామపునర్నిర్మాణానికీ, పవిత్రతకు, జాతీయతకూ చిహ్నం. 1938 లో అఖిలభారత చరఖాసంఘం చేసిన పనిని పరిశీలిస్తే ఖాదీ అభివృద్ధి అర్థమవుతుంది.

అఖిలభారత చరఖాసంఘం చేసిన పనిని 40,000 కదుళ్లు, 1000 మగ్గాలు, తెలుపుచేసి రంగులు వేసే యంత్రనిర్మాణమూ గల మిల్లుపనితో పోల్చి పరిశీలిద్దాము.

	అ.భా.చ.సం.	మిల్లు
పెట్టుబడి	రు 29,54,717	రు 50,00,000
ఉత్పత్తి అయిన బట్టల మొత్తం విలువ	55,10,525	22,50,000
,, చదరపు గజాలు	1,25,82,499	1,70,00,000
ఉపయోగించిన గ్రామాల సంఖ్య	13,265	

	అ.భా.చ.సం.	మిల్లు
ఉత్పత్తి కేంద్రాలు :		
అ. భా. చ. సం. శాఖలు	666	
సర్టిఫైడ్ సంస్థలు	2,17,883	
ఉపకారం పొందిన వడుకు పనివారు	2,81,880	200
నేత పనివారి సంఖ్య	18,632	500
ఇతర కర్మకారుల, కూలీల సంఖ్య	9,324	650
ప్రయోజనం పొందిన జనుల సంఖ్య	3,09,836	1350

మిల్లు ఉత్పత్తిదారు వినియోగించే పెట్టుబడిలో నూటికి 60 వంతున మాత్రమే అ. భా. చ. సం. ఉపయోగిస్తూన్నది. కాని మిల్లు ఉత్పత్తిలో నూటికి 70 వంతున ఉత్పత్తిచేస్తూన్నది. మిల్లు పోషిస్తూన్న భారతీయులలో నూటికి 24,000 చొప్పున పోషిస్తూన్నది. మిల్లులో పెట్టినంత పెట్టుబడిని అ. భా. చ. సం. లో పెడితే, ఈరెండో సంస్థలో మిల్లువల్ల ప్రయోజనంపొందేవారికంటె 400 రెట్లమందికి ప్రయోజనం చేకూరుస్తుంది. అనగా 5,00,000 మందికి లాభంచేకూరుస్తుందన్నమాట.

ఖద్దరు ఆర్థికంగా నిలబడుతుందా ?

ఖద్దరు ఆర్థికంగా నిలబడుతుందా అని చాలామంది అడుగుతూంటారు. అసలీ ప్రశ్న వేసే పద్ధతిలోనే మొట్టమొదటి తప్పున్నది. బజారులో బహిరంగంగా విక్రయానికి పెట్టినప్పుడు, చక్కగా సంస్థాపింపబడిన పరిశ్రమ, బాగా స్థాపింప

బడని పరిశ్రమను రూపుమాపగలదు. అందులో అనంతమైన పెట్టుబడితో, ప్రభుత్వగ్రాంటులతో ప్రోత్సహింపబడుతూన్న మిల్లుపరిశ్రమ తన వస్తువులను తాత్కాలికంగా కొంత నష్టానికికూడా విక్రయించగలిగి ఉన్నప్పు డింక చెప్పవలసిం దేమిటి? బ్రిటిష్‌వాళ్ళు చలిచీమలులాగున చప్పుడు లేకుండా మన దేశంలో ప్రవేశించిన విధానమే మిల్లు సరుకులవలన మన గృహాపరిశ్రమలు, చేతిపనులు చల్లగా సమసిపోవడానికి సాధనమయింది. ఇది కారణంగా దరిద్రులు మరీ దరిద్రులైనారు. భాగ్యవంతులు మరీభాగ్యవంతులైనారు. కాని గాంధీమాత్రం ధైర్యంగా ఇలా అన్నాడు. 'భారత దేశంలోని ప్రతి గ్రామంలోనూ పదహారేళ్లకుపైబడి శరీరసౌష్టవంగల స్త్రీ పురుషులకు తగినప్రతిఫలంతో పొలములోనో, పాకలోనో చివరకు గ్రామ కార్ఖానాలోనో పనిచూపించగలిగే విధానండొరికేటంతవరకు గానీ, లేదా మంచి నియమబద్ధమైన జీవితానికి కావలసిన సౌకర్యాలను, సంతోషాలను గ్రామస్థులకు చేకూర్చేటందుకు చాలినన్ని నగరాలను గ్రామాలకు బదులుగా నిర్మించగలిగేటంత వరకుగానీ, లక్షలాది గ్రామస్థుల విషయంలో ఖాదీ ఒక్కటే నిజమైన ఆర్థికప్రణాళిక.' 'పనిచేసేటందుకు, ఆలోచించేటందుకు చివరకు జీవించేటందుకుగూడ ఇచ్ఛ లేకుండా పోతూన్న లక్షలాదిగ్రామస్థులకు పని చూపించడ మొక పెద్ద సమస్య' అంటూన్నాడు గాంధీజీ. ఖాదీ వారికి పని చూపిస్తూన్నది; పరికరాల నిస్తూన్నది; సరుకులను కొనే అంగడిని సంసిద్ధం చేసింది. నిన్న మొన్నటివరకూ నిరాశగా ఉన్నవారికి నే

డా శాజ్యోతి కనిపిస్తూన్నది. ఖాదీ 12 కోట్లమందికీ వడ్లదంపు, పిండి విసరడం పనులు మఱి రెండు కోట్లకు వృత్తికల్పిస్తూ న్నవి.

ఖద్దరు - మనోభావము

సాధారణ ఆర్థికశాస్త్రానికీ ఖద్దరు ఆర్థికశాస్త్రానికీ భేద ముందనేమాట ఖద్దరుధారులు తెలుసుకోవాలి. మొదటి దానికి మూలం స్పర్థ. అంతేకాని దేశభక్తి, మానవసౌభ్రా తృత్వం, భావ వికాసం—ఇవేవీ లేవు దానిలో. రెండో దానిలో స్పర్థలేదు. దేశభక్తి, మానవ సౌభ్రాతృత్వం, భావ వికాసం—ఈ అన్నీ ఉన్నవి. ఇటీవల హెచ్చించిన మజూరీలవలన ఖాదీ ఖరీదు పెరిగినమాట నిజమేకాని మజూరీ హెచ్చుదలకు, దామాషాగా ఖరీదు పెఱుగలేదు. ప్రభుత్వము వారు గ్రాంటు లిచ్చి పోషించకపోయినప్పటికీ ఖాదీధారు లిస్తూన్న గ్రాంటు అని చెప్పాలి. ఖాదీ చాలావరకు మధ్య తరగతి పేదలచేత మాత్రమే పోషింపబడుతూన్నదని ఒక ఆరోపణ ఉన్నమాట వాస్తవమే. కాని ఖాదీ కిచ్చిన ద్రవ్యం తిరిగీ మరొక వస్తురూపంలో మాత్రమే బజారుకు పోతూన్నది గదా అని వారికి కొంత చిత్తశాంతి. అమ్మకపు సొమ్ము మరొక వస్తురూపంలో అమ్మినవానికే చేరే పరిస్థితి ఉండడం అవసరం. అప్పుడు స్థానికంగా పరస్పర వ్యాపారమూ పరి శ్రమలు వర్ధిల్లి ఆప్రదేశం భాగ్యవంతమవుతుంది. అక్క డికి కఱువు, నిరుద్యోగతలు ఉండనే ఉండవు.

ఖాదీ అహింసకు మూలంగానూ ప్రతిబింబంగానూ భావించబడుతూన్నది. నిజమైన ఖద్దరుధారి అబద్ధం చెప్పడు. హింస, మోసం, అపవిత్రత అతనికి పనికిరావు. గ్రామంలో జరిగే కాంగ్రెసుమహాసభ రు 5,000 లతో పూర్తి అయ్యే టట్లుండాలి. కాని విఠల్‌నగరం 7½ లక్షల రూపాయీల వ్యయంతో నిర్మింపబడింది. గాంధీ ఫైజ్‌పూరు, హరిపురా కాంగ్రెసులకు తనను కాలినడకను తీసికొని వెళ్లలేదనీ, తనను భూమిపైన అడుగైనా పెట్టనీయలేదనీ అసంతుష్టిని వెల్లడించాడు. 'నన్ను రెండెడ్ల బండీలోకూడా తీసికొనిపోలేదు' అన్నాడాయన.

> కాంగ్రెసు ప్రదర్శనస్థలాలు మనకు కాశీ మక్కాలవంటి పుణ్య క్షేత్రాలు. అక్కడ స్వాతంత్ర్య పూజలుచేసి మాతృదేశ సేవకు ఆత్మార్పణం చేసుకోవడానికి మన మంతా వచ్చాము. పేదరైతుల నెత్తిపైన కూర్చోవడానికి రాలే దిక్కడికి మనం. వారి దినకష్టంలో పాల్గొంటూ మన పిండి మనం విసురుకొని, మన బట్టలు మనం ఉతుక్కొని, మన మలుగు దొడ్లను మనం శుభ్రపఱచుకొని వారికి కష్టం గలిగించకుండా మెలగడ మెలాగో తెలుసుకోవడానికి వచ్చాము. జనసామాన్యంపైన ఎక్కికూర్చున్నట్లుగా వారు మనలను భావించకూడదు. ప్రజాసేవకులలో అగ్రగణ్యులు కావడంచేతనే ప్రజాదరణకు పాత్రులై నాయకులు నాయకులుగా ఉన్నారు. కాంగ్రెసు రంగం పుణ్యక్షేత్రం. ఇక్కడ అంతా ఒకటే. అందఱూ ఆ జగన్నాథుని ప్రసాదంలో పాల్గొనాలి.

చేతితో చేసే పనివలన, బుద్ధితో చేయవలసిన పనికి శక్తి నశిస్తుందని భయపడేవారికోసం ఆర్. బి. గ్రెగ్గు అభిప్రాయ

మిక్కడ ఉదాహరిస్తున్నాము. 'ఖాదీ అహింసాకార్యవిధానంలో భాగం' 'మానవ పరిణామదశలో హస్తవికాసం మేధావికాసానికి తోడ్పడ్డది' అని వ్రాశా డాయన. 1936 లోని యూరపుఖండ పరిస్థితి నెదుర్కొనేటందుకు ఇంగ్లాండులోని, క్యానన్ షెప్పర్డు, జార్జ్ లాన్సుబరీ, లార్డు పోన్సన్బీ మొదలయిన యుద్ధవ్యతిరేకులు గ్రెగ్గుసహాయం కోరినసంగతి మీకు జ్ఞాపకముండియుండవచ్చును. అహింసావర్తనము, బుద్ధితో చేసేపని—ఈరెండూ అత్యంత సన్నిహిత విషయాలు. కొన్ని బుద్ధిజాడ్యాలకు చేతితో చేసే పనులను, ముఖ్యంగా— నేత, వడ్రంగం, కుమ్మరిపని, మేదర పని—వీటిని 'వృత్తిచికిత్సావిధానంగా' నిర్దేశించారు. ఈ వృత్తులు జీవితానికి ఉత్సాహము, ఆనందము, ధైర్యము, చిత్తస్వాస్థ్యము కలిగిస్తవని అంటారు.

అధ్యాయం 13

అఖిలభారత గ్రామ పరిశ్రమల సంఘం

1934 లో బొంబాయి కాంగ్రెసు జరిగినప్పుడు అఖిల భారత గ్రామ పరిశ్రమల సంఘం స్థాపింపబడింది. దాని తరువాత సాంవత్సరిక నివేదికలన్నిటిలోనూ తెలుసుకోదగిన విషయాలు చాల ఉన్నవి. వాటిలో కుటీరపరిశ్రమల యొక్కయు, గ్రామవృత్తుల యొక్కయు అభివృద్ధిని గూర్చిన విషయాలే కాక గ్రామ పరిశుభ్రత, ఆరోగ్యరక్షణ, ఆహారగుణవృద్ధి, చచ్చిపోయిన, చచ్చిపోతూన్న పరిశ్రమల పునరుజ్జీవనం-ఈఅన్నివిషయాలూ కూడా ఉన్నాయి. ఈ సంస్థ పెట్టుబడి లేకుండా పని చేసింది. మొదటి సంవత్సరంలో ఎక్కడనో రు 45,000 చందాల ద్వారా సంపాదించింది. మొట్టమొదట పరిశుభ్రతను గూర్చి పని ప్రారంభించింది. పట్టణాలలోను గ్రామాలలోనూ గూడా వీధులను- వీధులనే కాదు మైదానాలను ఏటి సెజ్జలను మరుగు దొడ్లుగా ఉపయోగించే శతాబ్దాలనుండి వస్తూన్న దురభ్యాసాన్ని రూపుమాపడానికి దండయాత్ర సాగించింది. మానవుల మలమూత్రాలు మంచి ఎరువు. కాని ప్రజలలో వ్యాపించిన మూఢ విశ్వాసము అవిమర్శాభావము,-ఇవి పోతేనే గాని ఈ చిన్న విషయాన్ని వారు గ్రహించ లేరు. వారివెనుక దొడ్లో ఉన్న బంగారుగనిని గమనించ లేనంత అమాయకులు వారు. కాక పోతే వారు పశువుల ఎరువును పిడకలు చేసి పొయిలో పెట్టుకుంటారా! ఇది

ఆర్థికంగా ఎంతో గొప్ప నష్టం. బెంగాలులోని కొన్ని ప్రాంతాలలో మానవుల మల మూత్రాలు ఎరువుగా ఎంత విలువ గలవో చూపించడానికి ప్రదర్శనా లేర్పాటు చేయబడ్డవి. మరుగు దొడ్లను శుభ్రం చేసేపని సంఘంలోని చివరి తరగతుల వారికి వృత్తిగా యేర్పాటు చేయడంవలన ఈకీడు వాటిల్లినది. పై తరగతులవారీపని మంచి వృత్తి అనుకొని చేయ ప్రారంభించినప్పుడు జాతిలో కలిగిన తర తరాల నాటి ఈ తప్పు ఊహా, తొలగిపోయి మనుష్యుల మల మూత్రాలను ఎరువుగా ఉపయోగించడాని కలవాటవుతారు. సంఘ కేంద్రాలున్న ప్రతి ప్రదేశంలోనూ, రోడ్లు తుడవడం, ముళ్లు, పొదలు, కంచెలు తీసివేయడం, పనికి మాలిన చెత్త చెదారం లేకుండా చేయడం- ఈ పనులన్నీ నిత్యమూ జరుగు తూన్నవి. నగర వాసులకు గ్రామాలలో పని చేయడ మొక శిష్టాచారం కిందకు వచ్చింది. సంవత్సరంలో ఒక రోజు నిర్ణయించి ఆనాడు పెద్ద ఉద్యోగస్థులు జిల్లాఅధికారులు కూడా గ్రామాలకు పోయి రోడ్లు తుడుస్తూన్నారు. పంజాబులోని కొన్ని గ్రామాలలో ప్రతి ఏకాదశిరోజున గ్రామస్థులే రోడ్లు ఊడ్చుకోవలెనని నిర్ణయించు కొన్నారు.

గాంధీ సలహాలు

ఆదర్శ గ్రామ సేవకులకు గాంధీ యిచ్చిన సలహాలు చాలా ముఖ్యంగా గమనింపదగినవి. కనుక ఇక్కడ ఉదాహరిస్తూ న్నాము:-

నే నీ రోజున సేవాజీవితాదర్శములనుగూర్చి మీకు చెప్పదలచుకొన్నాను. వాటిని మీరు మనస్సులో ఉంచుకొని పనిచేయ కోరుతున్నాను. నేటికాలంలో స్వార్థంకోసం పనిచేసుకోవడం అభివృద్ధిగా భావిస్తున్నారు. మీ రిక్కడకు వచ్చినందుకుగాదు. ఈనాడు మనిషి విలువ రూపాయిల అణాలు పైసలలో లెక్క వేస్తున్నారు. మనిషి చదువుకొన్న చదువు వర్తకపు సరుకు కిందకు వచ్చింది. ఆ కొలతతో మీ రిక్కడకు వచ్చినట్లయితే మీ కాశాభంగం కలుగక తీరదు. మీ చదువు పూర్తి అయిన తరువాత పది రూపాయిల గౌరవవేతనంతో మీ జీవితం ప్రారంభమై దానితోనే పూర్తికావచ్చును. ఒక కంపెనీ మానేజరో లేక ఒక పెద్ద ఉద్యోగియో పొందుతున్న జీతంతో దీనిని పోల్చిచూడకూడదు. నేడు చలామణిలో ఉన్న ప్రమాణాలను మనం మార్చితీరాలి. మీకు ఏవిధమైన లౌకికాభ్యున్నతినీ మేము వాగ్దానము చేయజాలము. అటువంటి పెద్దపెద్ద కోరికలనుండి మిమ్ములను తప్పించాలనికూడా మా ఆశయము. మీ భోజనపు ఖర్చు నెలకు ఆరురూపాయిలకు మించకూడదని మా వాంఛ. ఐ. సి. యస్. ఉద్యోగి భోజనపు ఖర్చు నెలకు రు 60 లు ఉండవచ్చును. అందువలన ఆయన శారీరకంగాగానీ, వైజ్ఞానికంగాగానీ నైతికంగాగానీ మీ కంటె అధికుడని అర్థం కాదు. ఆయన ఎంత భోగపరాయణుడుగా జీవించినప్పటికీ ఈ అన్ని విషయాలలోను మీకంటె తక్కువకూడా కావచ్చును. మీరు మీ యోగ్యతను లోహంతో విలువకట్టుకోవడంలేదు. గనుక నే మీ రిక్కడకు వచ్చారని భావిస్తున్నాను. మీరు నామమాత్ర వేతనంతో దేశసేవ చేయకోరుతున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజిలో ఒక మనిషి వేలకొలది రూపాయిలను సంపాదిస్తూండవచ్చును. కాని ఆయన మన పనులకెందుకూ పనికిరాడు. వారు మన దరిద్రపరిసరాలలో ఆనందంగా ఉండలేరు. వారి పరిసరాలలో మనం ఆనందంగా ఉండలేము. మన

దేశక్షేమంకోసం మన కిప్పుడు ఆదర్శకష్టజీవులు కావాలి. వారికి లభించిన ఆహారంతో సరిపెట్టుకోవాలి. వారు సేవించే గ్రామస్థులిచ్చే ఆతిథ్యం వారికి మహాద్భాగ్యంగా ఉండాలి. అవసరాలకు కేవలం దేవునిపైన ఆధారపడిఉండాలి. వారికికలిగే కష్టపరంపరలను సంతోషంతో భరించాలి, 7,00,000 గ్రామాలు గల మన దేశంలో ఇది తప్పనిసరి. జీతాలిచ్చి సిబ్బందీని యేర్పాటుచేయలేము. వారి కన్నెప్పుడూ ప్రమోషన్లపైన ప్రావిడెంటు ఫండుపైన ఫించనులపైన ఉంటుంది. గ్రామస్థులకు నమ్మకంగా సేవచేయడంలో ఒక విధమైన ఆనందముంది. మీలో కొంతమంది గ్రామస్థులకుకూడా ఇదే ప్రమాణమా అని అడుగవచ్చును. ఎంతమాత్రమూకాదు. ఇది సేవకులమైన మనకుగాని యజమానులైన గ్రామస్థులకు కాదు. ఇన్నాళ్ళనుండీ మనం వాళ్ళ మెడలమీద కూర్చున్నాము. ఈ రోజున మనం బుద్ధిపూర్వకంగా పేదరికాన్ని చేపట్టి మన యజమానుల జీవితం ఇంతకంటె ఎక్కువ సౌభాగ్యవంతంగా చేయదలచుకొన్నాము. ఈ రోజున వారు సంపాదిస్తున్న దానికంటె ఎక్కువ సంపాదించుకొనే ఉపాయాలు వారికి చెప్పాలి. అది ఈ గ్రామ పరిశ్రమల సంఘాదర్శం. నే నిప్పుడు వర్ణించిన సేవకుల సంఖ్య నానాటికి పెరుగుతూంటేనేగాని మన సంఘం అభివృద్ధికాదు, మీరట్టి సేవకులగుదురుగాక.

యంత్రం - హింసాప్రవృత్తి

నిర్మాణ కార్యక్రమం అహింసాప్రవృత్తియైనట్లు గానే యంత్రపరిశ్రమ హింసాప్రవృత్తి అని చూపడానికి అఖిల భారత గ్రామపరిశ్రమల సంఘం చాలా కృషిచేసింది. కేంద్రీకరణోత్పత్తి విధానమే హింస. దాని పుట్టుకకు పోషణకు

అభివృద్ధికీ కారణమైన ఆర్థిక నిర్మాణముయొక్క మూలము లోనే హింస ఇమిడిఉన్నది. ఉపయోగంకోసం గాక ఎగుమతి కోసం చేసే అధికోత్పత్తివలన అమ్మకానికి అంగళ్ళు కావలసి వస్తవి. వాటిని సంపాదించుకోవడానికి రాజకీయాన్నత్యం కావలసివస్తుంది. దానిని నిలబెట్టుకోవడానికి సైనికాధిక్యత కావాలి. అనగా కేంద్రీకరణోత్పత్తి విధాన మవలంబించిన జాతి, ఎగుమతికోసం చేసే ఉత్పత్తి కేవలం ఆర్థిక రాజకీయ జీవితంలో ఆజాతి చేయగల హింసమీదనే ఆధారపడిఉంటుం దని అర్థం. అటువంటి విధానంలో స్పర్థ ఉండకతీరదు. అదే హింసకు మూలమవుతుంది. అక్కడ కాలం డబ్బు. ఎంత తక్కువకాలంలో ఎంత ఎక్కువ ఉత్పత్తి అయితే అంత ఖర్చు తగ్గిపోతుంది. అందువల్ల వస్తువులు ఎక్కువ చౌకవుతయి. చౌకయినకొద్దీ వ్యాపకమెక్కువవుతుంది. వస్తువులు త్వరగా అంగడికి చేరవలెనంటే వేగప్రయాణసౌకర్యాలు కావాలి. అవి ఉండడంతోనే ఇంకా ఎక్కువ ఉత్పత్తిచేయవలసి వస్తుంది. ఎక్కువ ఉత్పత్తికితగిన గిరాకీ (demand) ఉండాలి. ఇందుకోసం 'వెనుకపడి ఉన్న జాతులను నాగరికులనుగా చేయాలి.' ఆవిధంగా అంగళ్ళపైన రాజకీయాధికారం సంపా దించాలి. ఈ పద్ధతిని హింస అనక మరేమనాలి? సాధ్యమై నంత తక్కువకూలితో పనిచేయించుకోవడానికి యంత్రాల యాధికారులు ప్రయత్నించక తప్పదు. ఐశ్వర్యాన్ని దోచు కోవడానికి వారు వేసే పెద్ద కన్నమదే!

గ్రామపరిశ్రమాభివృద్ధి విషయంలో కాంగ్రెసు ప్రారంభించి చేసిన పని 1939 నాటికి ఇండియా ప్రభుత్వ దృష్టిని ఆకర్షించినది. వారు మన గ్రామాలలో ఉన్న నూనె గానుగలనుగూర్చి చేతితో తయారుచేసిన కాగితమును- ముఖ్యంగా ఖాదీ ప్రతిష్ఠానంవారు చేసిన కాగితమును గూర్చి ఒక పెద్ద నివేదికను ప్రచురించారు. ఈ సంఘం కాగితమును చేసేటందుకు 96 మందికి శిక్షణ యిచ్చింది. 52 మందికి నూనె గానుగ ఆడడంలో, 24 మందికి వ్యవసాయంలో, 18 మందికి తాటిబెల్లం చేయడంలో, 10 మందికి వడ్లు దంచడంలోనూ, పిండి విసరడంలోనూ శిక్షణ యిచ్చింది. ఈ సంఘ యాజమాన్యంకింద పనిచేసే నిమిత్తం బీరారులోనూ, మధ్యరాష్ట్రిలలోనూ 38 కేంద్రాలు స్థాపించబడినవి. మద్రాసు, బొంబాయి, ఒరిస్సా రాష్ట్రాలలో నూనెగానుగ ఆడడం, తాటిబెల్లం చేయడం, తేనె తీయడం. కాగితాలు చేయడం మొదలైన పనులను నేర్పడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేసింది గ్రామపరిశ్రమల సంఘం. 'ఉద్యోగభవన' స్థాపన ఆ సంవత్సరం జరిగిన ముఖ్య సంఘటనం. 1938 లో గాంధీ దానిని లాంఛనంగా ప్రారంభించాడు. అందులో అన్ని శాఖల కార్ఖానాలూ ఉన్నవి. వీటికితోడు మగన్ సంగ్రహాలయ మనే పేరుతో ఒక మ్యూజియం ఉన్నది. అది అ. భా. చ. సం. యొక్కయు అ. భా. గ్రా. ప. సం. యొక్కయు సమష్టి యాజమాన్యంకింద నడుస్తూంటుంది. అక్కడ వివిధ కుటీర పరిశ్రమల పనినిగూర్చి భోగట్టా అంతా లభిస్తుంది. ఒక్కసారి

మన మీ సంస్థకు పోయిచూస్తే మన మొక కొత్త ప్రపంచంలో ఉన్నట్లు తోస్తుంది. జాతీయపునర్నిర్మాణంకింద స్వరాజ్య మెలా ఉంటుందో తెలుస్తుంది. నూరు సంవత్సరాల కిందటి హిందూదేశంతో పోలిస్తే ఇప్పటి మనదేశాన్ని ఏవిధంగా ఆనవాలు పట్టలేమో, అలాగే రాబోయే స్వరాజ్యంలోని ఆ దేశాన్నికూడ ఆనవాలు పట్టలేమని అర్థమౌతుంది. అన్ని శాఖలలోకంటె పరిశుభ్రతకు సంబంధించిన శాఖలో పని చాలా తక్కువ జరుగుతూండడం చిరాకు కలిగిస్తూన్నది. మనుష్యులలో చాలా అశ్రద్ధ పెచ్చుపెరిగి ఉండడంచేత ఎవరి సలహాను వారు సరిగా వినడంలేదు. వీధులను తమ చేతులతో స్వయంగా తుడవవలెననే పాఠాన్ని వారు గ్రహించి ఇంకా ఆచరణలో పెట్టడంలేదు. అయినప్పటికీ 1939లో ఒక పద్ధతిని అవలంబించి నూరుమంది గ్రామస్థులు వారి వీధులను వారు ఊడ్చుకొన్నారు. 27 గ్రామాలలో నూతులు, చెరువులు పూడికతీయబడి పరిశుభ్రం చేయబడ్డవి. 16 కేంద్రాలలో గ్రామోత్పత్తి వస్తువిక్రయశాలలేర్పాటుచేయబడినవి. బెంగాలులో ముఖ్యంగా కూరలు కాయించడం అభివృద్ధిచేశారు. మద్రాసు రాజధానిలో అనేకచోట్ల వడ్లు దంపేటందుకు, పిండి విసిరేటందుకూ కేంద్రాలు నిర్మింపబడినవి. ఒక్క గుంటూరు జిల్లాసంఘమే రు 41,000 విలువగల దంపుడు బియ్యం అమ్మింది. సాధ్యమైనంత ఎక్కువ నూనె తీయడానికి వీలుగా గానుగలను అభివృద్ధిచేశారు. సంఘ కేంద్రస్థానంలోనే అన్ని రకాల గింజలలో

నుండి మొత్తం 28,870 సేర్ల నూనె తయారయింది. బెల్లం చేయడం అంతకంతకు ఎక్కువ వ్యాపకమవుతూన్నది. పంచదారకు బదులుగా ప్రజలు బెల్లం వాడడం ప్రారంభించారు. అందువల్ల బెల్లాన్ని ఇంకా ఎక్కువ బాగా పరిశుభ్రం చేస్తూ న్నారు. మద్రాసులోని తీపికల్లు నిబంధనలు ఇండియాలోకల్లా ఎక్కువ బాగున్నవని ఈ సందర్భంలో అనుకొంటూన్నారు. చాలా యితర రాష్ట్రాలలోని ఉత్పత్తి పన్నుల విధానం లోపభూయిష్టంగా కనిపిస్తూన్నది. తేనెటీగలను పెంచే పని విస్తారంగా వ్యాపిస్తూన్నది. చాలామంది యువకుల కది ఉత్సాహజనకంగా ఉంటూన్నది. ఈ వృత్తి హిందూదేశమంతా పాకుతూన్నట్లు కనిపిస్తుంది, ప్రతి సంవత్సరం కాగితంచేసే కేంద్రాలు పెరుగుతూన్నవి. కాగితం చేయడంలో పనివాళ్ళ కిచ్చే మజూరీ చాలా ఎక్కువ కావడంచేత కాగితం ఖరీదెక్కువవుతూన్నది. ఇండియాలో ఉత్తమోత్తమమైన కాగితం తయారుచేస్తూన్నా మనుకొనే కేంద్రాలలోకూడా అది వ్యాపార సరళిలో సాగడంలేదు. సబ్బులు చేయడంలో చాలా మార్పు వచ్చింది. సబర్మతీకార్యాలయంలో దిగుమతి అయిన కాస్టిక్‌సోడాను సబ్బుపరిశ్రమకు ఉపయోగించడం మాని 'మహువా' నూనెను ఒండుమట్టిసి వాడుతూన్నారు. 1937లో 33,590 పౌనుల సబ్బు తయారయింది. 1938 లో 82,813 పౌనులకు పెరిగింది.

చెఱుకుగడలను నిలవచేయడంలో కొంత అభివృద్ధి జరిగింది, చెఱుకుగడలకు చెక్కుదీసి చిన్నచిన్న గుండ్రనిముక్క

లుగా కోసి ఎండబెట్టి కుండలలో ఉంచుతారు. అవసరమై నప్పుడు వాటిని నీళ్లలో నానవేసి ఉపయోగిస్తారు. కొత్తగా కోసితెచ్చిన చెఱకుగడను నిలవ వుంచిన చెఱుకుముక్కలతో పోల్చి పరీక్షచేయగా రెండింటిలోనూ సమానమైన గుణమే ఉన్నట్లు తేలింది. కాకపోతే రెండోదానిలో ఆహారవస్తుగుణా లెక్కువగా ఒకచోట గుమికూడి ఉన్నట్లు తెలిసింది. నిలవ చేసిన చెఱుకులో ఇనుమెక్కువ ఉండడానికి కారణం, ఇనప పాత్రలో నిలవచేయుడంవల్లనని ఊహిస్తున్నారు.

వడ్లు దంచడానికి చక్కీలు ప్రచారంలోకి వచ్చినయి. మహారాష్ట్రదేశంలోని ఒక్కొక్క చక్కీ గంటకు 80 పౌనుల వడ్లు దంచుతుంది. దాని ఖరీదు రు 6.

తాటికల్లు పులుపును తీసివేసి తీపిచేసేటందుకూ, వేసిన సున్నాన్ని తొలగించడానికీ ఒకవిధమైన రాతి వడపోత యోగ్యమైనదని మద్రాసు గవర్నమెంటువారి పారిశ్రామిక రసాయనశాస్త్రజ్ఞుడు సూచించాడు. అది చాలా ఉపయోగ కరంగానే ఉన్నట్లు గ్రామపరిశ్రమల సంఘంవారు గమనించారు.

కాగితాల పరిశ్రమలో గుడ్డపేలికలు, జనపనార, అరటి తూట, జనపనార సంచులు, వెదురుచెత్త—ఇవన్నీ ఉపయోగపడుతూన్నవి. బోద గడ్డి, మారుల్ నార (Marul fibre) బాగా ఉపయోగపడుతున్నయి. ఈ పరిశ్రమకు చిత్తు కాగితాల వర్గీకరణంలో కూడా మంచి పద్ధతులు కనిపెట్టబడి

నయి. మన్ను వేయడం, తొక్కడం, కడగడం—ఈ పద్ధతులన్నీ జాగ్రత్తగా పరిశోధించబడుతూన్నవి.

అ. భా. గ్రా. ప. సం. పరిశోధన

అ. భా. గ్రా. ప. సం. అన్వేషణ పరిశోధనా విషయాలలో చేస్తూన్న పని రసాయనశాస్త్ర పద్ధతులమీద నడుస్తూన్నదని వారి సర్క్యులర్లనుబట్టి తెలుసుకోవచ్చును. బెల్లంలోని విలువగల లోహపదార్థాలు పోనికారణంచేత బాగా తయారయిన పంచదారకంటెకూడా ఎక్కువ ప్రయోజనకారి కాగలదు. ఉడకబెట్టిన పండుకాని, పానకంలో నిలవచేసిన పండుకాని, పచ్చికాయ, లేక సహజంగా పండిన పండు ఉన్నట్లుండదనేమాట మాత్రం నిజం. మనకు లభించే వస్తువులలో తేనెకు బదులుగా ఉపయోగించదగిన ఉత్తమోత్తమ వస్తువు బెల్లం. కాని తీపిలో భేదమున్నది. జీర్ణం కావడం ఎక్కువ కష్టం. శరీరమునకు తేనె తగిఉన్నట్లు బెల్లం తగి ఉండదు. ఆల్కలీని మందుగా ఉపయోగించవలసినచోట్ల సోడా బైకార్బనేటు తాత్కాలిక చికిత్సగా ఉపయోగపడుతుంది. కాని పండ్లలోను, ప్రకృతి ధాన్యాలలోను ఉన్న సహజ క్షారాలకు అది యెంతమాత్రమూ సరిపోదు. వెన్న సహజ స్థితిలో పులుపూ (ఆమ్లము) కాదు. క్షారమూ కాదు. కాచిన పాలలో పులుపు చేరుకొంటుంది. జీవబిందువులోని క్షారాన్ని (Tissue) తొలగించడాని కది ఉపయోగపడుతుంది. పాలను కాచడమే ఇప్పటికి మన కందుబాటులో

ఉన్న సురక్షిత పద్ధతి. పెరుగులో ధూళివలె తయారయ్యే పుల్లని క్షారాలు ఎక్కువగా ఉంటవి. పెరుగులో నాలుగు వంతులు క్షారపదార్థాలు, ఒకవంతు పులుపు పదార్థమూ ఉండడం ఉచితం. నేయి సహజంగా ఆమ్లపదార్థం కాదు. కాని దానితో కొన్ని వస్తువులను వండినప్పు డది కొన్ని క్షారపదార్థాలను తొలగిస్తుంది. ఆవిధంగాతయారైన ఆహారం సహజంగా పులుపు కాకపోయినప్పటికి పులుపుగుణాలను కలిగి ఉంటుంది. ఇటువంటి ఉపయోగకరములైన విషయాలన్నీ చదువరులకు తెలిసేటందుకు కొందరు అడిగే ప్రశ్నలకు జవాబుగా 'హరిజన్'లో ప్రచురింపబడుతూంటవి. ఈ జవాబులన్నీ డాక్టరు మెంకెల్ వ్రాస్తూంటారు.

పాశ్చాత్య సంప్రదాయాలలో శిక్షణపొందిన అర్థశాస్త్రజ్ఞులున్నూ, మన కళాశాలాధ్యాపకులున్నూ ప్రజల జీవిత ప్రమాణాన్ని హెచ్చించాలని తరుచుగా అంటూంటారు. జీవిత ప్రమాణాన్ని హెచ్చించడమంటే జీవితావసరాలకు ఉపయోగపడే వస్తువుల విక్రయం వృద్ధిచేయడమని వారర్థం చేసుకొన్నట్లు కనిపించదు. వేషంకోసం ఉపయోగించే వస్తువులద్వారానే తరుచుగా ద్రవ్యం పట్టణాలకు నగరాలకు అక్కడ నుండి విదేశాలకు పోతూన్నది. కాబట్టి జీవిత ప్రమాణాన్ని వృద్ధిచేసే వస్తుసముదాయంలో ఇవి చేరకూడదు. అ. భా. గ్రా. ప. సం. వారి ఉద్దేశం డబ్బు స్థానికంగా తిరుగుతూండాలనీ అప్పుడా అమ్మకపుసొమ్ము స్థానిక వ్యాపారానికీ పరిశ్రమలకూ ప్రోత్సాహకరంగా ఉండి, ఎక్కువ ఉత్పత్తి కావడానికి

దారి తీస్తుంది. పనివాళ్లకు కొనుగోలుశక్తిని సరుకులను సప్లయి చేసే, తెలిసిన ప్రదేశంలోనే వస్తువుల అమ్మకపు డబ్బు తిరుగుతూండాలని కుమారప్ప చెప్పినమాట బాగాఉంది. విదేశీ వస్తువులను ఎక్కువగా కొనడమంటే ముడివస్తువులను ఆహార పదార్థాలను ఎక్కువగా ఎగుమతి చేయడమన్నమాట. అంతే కాదు; విదేశాల కొనుగోలుశక్తిని ఎక్కువచేసే మన దేశంలో నిరుద్యోగాన్ని, దరిద్రాన్ని పెంచుకోవడం. "మనిషి ఆకలిగా ఉన్నప్పుడు కోరికలను పెంచుకోవడం ఆకలిమంటను ప్రజ్వలింప చేసుకోవడమే" అని కుమారప్ప సత్యాన్ని సంగ్రహంగా చెప్పినాడు. జీవిత ప్రమాణాన్ని హెచ్చించడమంటే మనవాళ్ళ అర్థమేమిటో తెలుసునా? జపాను చాపలు, పారసీకపు తివాచీలు, ఆస్ట్రియన్ లాంతర్లు, అమెరికన్ పొయ్యి, బర్మింగ్‌హామ్ కాఫీపొడిచేసేయంత్రం, సీమ కప్పులు, సాసర్లు, జర్మన్ ఫోర్కులు, చంచాలు, జెకోస్లోవికియా మూడు మడత బల్లలు, లాంకషైరు టేబిల్ బట్ట, ఆస్ట్రియన్ మడత కుర్చీలు, అయిరో బ్యాట్లు, బంతులు, లండన్ బిలియర్డు బల్లలు, కుర్చీలు. రీడింగు బిస్కట్లు, ఆస్ట్రేలియన్ పాలు, జావా పంచదార, ఫ్రెంచి కాఫీ, ఇంగ్లీష్ పండ్ల మురబ్బాలు ఇవన్నీ కొనడం. దీని కర్థం విదేశాలకు డబ్బు దోచిపెట్టడం. ఈ దేశంలోని లక్షలాది జనులు దాదాపు పస్తులు పడుకొంటూన్న సంగతి అందరికి తెలిసినదే. వారి నికృష్టజీవిత ప్రమాణం అభివృద్ధి కావలసిందే కాని మధ్యతరగతుల విషయంలోనూ, ఉన్నత మధ్య తరగతుల సందర్భంలోనూ, ఈపని తలపెట్టడం

అన్న వస్త్రాలు దొరకక బాధపడుతూన్న కోట్లకొలది ఉన్న జనసామాన్యాన్ని నాశనం చేయడం.

ఆర్థిక విజయం

భారత దేశంపైన బ్రిటిష్‌వారి ఆర్థిక విజయాన్ని మన విద్యావంతులుకూడా సరిగా గ్రహించలేదు. బ్రిటిష్‌విజయం కేవలం ప్రాదేశిక విజయమే కాదు. సాంఘిక, ఆర్థిక, నైతిక, ఆధ్యాత్మిక లేక అనాధ్యాత్మిక విజయమనాలి. ఇండియాలో బ్రిటిష్ పరిపాలనకు నిజంగా మూలమని చెప్పదగిన ఈస్టిండియా కంపెనీ, అత్యంతాభివృద్ధిపొంది ఇంగ్లీషు వాళ్ళను ధనవంతులనుగా చేసిన మొట్టమొదటి జాయింటు స్టాకు కంపెనీ డచ్చివాళ్లు మిరియాల ధరను పౌను మూడు షిల్లింగులనుండి 6 షిల్లింగుల 8 పెన్నీలకు పెంచి విశేషలాభాలు తీయడమే ఈస్టిండియా కంపెనీ పుట్టుకకు కారణం.

క్లైవు కాలంలో కావలసినంత ధనం ఇంగ్లాండుకు తీసికొని వెళ్ళారు. ఒక్క బెంగాలునుండి ఈస్టిండియా కంపెనీవారు, వారి నౌకర్లు, 1757—1766ల మధ్య లంచాల రూపంలో పౌ 600,000 గుంజుకొన్నట్లు తెలుస్తూన్నది. 1767లో బ్రిటిష్ ప్రభుత్వం ఈ దోపిడీలో ప్రత్యక్షంగా భాగం కావాలని పట్టు పట్టింది. అందువల్ల కంపెనీ ప్రతి సంవత్సరము 400,000 పౌనులు ప్రభుత్వ ఖజానాకు జమకట్టేట్టు ఒప్పుకోక తప్పింది కాదు. ఇంగ్లాండు భారత దేశాన్ని ప్రత్యక్షంగా దోచుకొం

టూండడంవల్లనూ, వలసరాష్ట్రాలలో పోటీ అనేది లేకుండా వ్యాపారం యావత్తు తమ ఒక్కరి చేతులలోనే ఉంచుకోవడం వల్లనూ వేగంగా పోగైన పెట్టుబడియే అక్కడి పారిశ్రామిక విప్లవానికి కారణమయిందని ఆర్థిక చరిత్రకారులు వ్రాస్తూ న్నారు. 1813లో ఈస్టిండియా కంపెనీ వారి ఏకాధిపత్య వర్తక పద్ధతిని రద్దుచేయడమే బ్రిటను భారత దేశము నెడల అవలంబించిన దోపిడీ విధానానికి ఒక కొత్తదశ. 1803లో మొదటిసారి ఇండియాకు లాంకుషైరుబట్ట దిగుమతి అయింది. 1803లో దిగుమతి అయినబట్టలవిలువ మూడులక్షలే 1820లో 2 కోట్ల విలువగల బట్టలు దిగుమతి అయినవి. ఆ వర్తకమే ఇండియాలోని చేనేత పరిశ్రమను నాశనం చేసింది. "దరిద్రుడైన భారతీయ నేతపనివాని వలపోత వింటే అంతు లేని జాలి వేస్తూన్నది. అతడు అన్నంలేక పస్తులుపడుకొంటూ న్నాడు. ఇందుకు ముఖ్యకారణ మేమిటి? ఇంగ్లండులో తయా రైన చౌకబట్టల దిగుమతి. సాలీలలో అనేకులు ఆకలితో చని పోయినారు. మిగిలినవారు నేతపనిని వదిలిపెట్టి వేరేవృత్తి చూచుకొంటూన్నారు. ముఖ్యంగా వ్యవసాయంలోకి దిగారు. నాజూకుతనానికీ, అందానికీ ప్రపంచమంతటా పొగడ్తకెక్కిన డక్కాముజిలినులు అందువల్లనే అపరూపమై పోయినవి."[1] అని డాక్టరు బౌరింగు 1835లో వ్రాశాడు. భారత దేశపు బట్టల పరిశ్రమకు ప్రధాన కేంద్రమైన డక్కా జనసంఖ్య 1815-1837 సంవత్సరాల మధ్య 150,000 నుండి 20,000కు తగ్గిపోయింది.

---

1 డక్కా మజిలినుల దీర్ఘ విషాద వృత్తాంతం మరొకచోట ఉన్నది.

ఈ విధంగా పారిశ్రామికంగానూ వ్యావసాయికంగానూ కూడా భాగ్యవంతంగా ఉన్న ఇండియా దేశం, కేవలం వ్యవసాయదేశమై ఇంగ్లాండుకు ముడిపదార్థాలను, ఆహారాన్ని సరఫరాచేస్తూ, ఆ దేశంనుండి యిదివరకు తాను సొంతంగా తయారుచేసుకొంటూండే సరుకులను తెప్పించుకొంటూ న్నది యిప్పుడు:-

భారత నౌకావ్యాపార కథకూడా ఇంత విషాదగాథా అవును. తన 'ఇండియా చరిత్రలో' మెడో టేలరు ఇలా వ్రాశాడు.

> ఇండియా దేశపు ఉత్పత్తులతో ఇండియాలో చేయబడిన నౌకలు లండన్ కోస్తాకు వచ్చినప్పుడు అచటి ఏకాధిపత్యంగల నౌకావ్యాపారస్తులకు థేమ్సునదిలో శత్రు నౌకాదళం దిగినప్పటికంటె ఎక్కువ భయ సంభ్రమాలు కలిగినవి. లండను కోస్తాలోని నౌకా నిర్మాతలు కొంపమునిగి పోయినట్లుగా గోలచేయడం, ప్రారంభించారు. వాళ్ళ వ్యాపారం అపాయంలో పడ్డదన్నారు. నౌకానిర్మాతల కుటుంబాలు అన్నమోరామచంద్రా, అని దుఃఖించేరోజు వస్తూన్నదన్నారు.

హిందూదేశంలో తయారైన నౌకలు ఇంగ్లాండు ఇండియా దేశాల మధ్య జరిగే వ్యాపారంలో వినియోగ పడకూడదని 1801 జనవరి 17 వ తేదిన ఈస్టిండియా కంపెనీ డైరెక్టరొక నివేదికను తయారు చేశారు. అందులో వారు చెప్పిన వాదాలలో ఈ దిగువ వాదం ముఖ్యంగా తెలుసుకోదగినది.

> ప్రాచ్య దేశాలలోని 'నేటివులు' మనకు లోబడ్డ ప్రజల నావలను మన రేవు పట్నాలకే తీసికొని వస్తూండడం వలన మన దేశానికెంతో సేవచేసిన ఆ ధైర్యశాలురలో ఏ ఒక్కడూ ఆహారం లేకుండా పోవలెనని ఏ బ్రిటిషు హృదయమూ కోరదు. కాబట్టి మన నౌకా వ్యాపారంలో ఎక్కువగా ఈ భారతీయ నావికులను చేరనీయడం వలన కలిగే ఫలితాలు, ఆర్థిక, నైతిక, వాణిజ్య, రాజకీయ దృష్టితో విచారించినప్పుడు తెలుస్తూనే ఉన్నవి. భారతీయులచే నడప బడుతూన్న నౌకలకు ప్రత్యేక సౌకర్యములు చేయబడవలెననే సూచనకిది పతియొక బలమైన అభ్యంతరం.

"ఆర్థిక, ఆదాయ వ్యవహార నిర్మాణంలో ఇండియా, సామ్రాజ్యానికి కేంద్రమూ కొలికిపూసా అయింది" అన్నాడొక బ్రిటిష్ చరిత్రకారుడు. అటువంటి మహోన్నత శిఖరం నుండి పాతాళంలో పడిపోయింది ఇండియా నేడు. నిర్మాణ కార్యక్రమమంటే ఇండియా పునర్నిర్మాణంకోసము, పునర్విజయంకోసమూ ఏర్పాటైన కార్యక్రమం కాబట్టి దానిని మనం జాగ్రత్తగా పరిశీలించాలి.

నిర్మాణ కార్యక్రమము - అహింస

గాంధీ సేవాసంఘ మహాసభ 1939లో బృందావనంలో జరిగినప్పుడు గాంధీ ఇలా ఉపన్యసించాడు.

> నిర్మాణ కార్యక్రమానికీ అహింసకూ సంబంధమేమిటి? వాటిని రెంటినీ ఎందుకంత సన్నిహితంగా జోడిస్తున్నారు? అనే ముఖ్య ప్రశ్నలకు నేను మీకు జవాబీయవలసి ఉన్నది. మంచిది; హిందూ మహమ్మదీయుల సంఘీభావము, మద్య నిషేధము, అస్పృశ్యతానివారణమూ—ఇవి అహింస లేకుండా జరిగే పనులు కావని స్పష్టంగా

తెలిసిన విషయాన్నే నకొంటాను. ఇక చరఖా విషయం మిగిలింది. అది అహింసకు చిహ్నం ఎలాఅవుతుంది? ముఖ్యంగా మీ భావనను బట్టీ, మీరు దాని కాపాదించే గుణములనుబట్టీ అది మీకు ప్రత్యక్షం అవుతుందని ఇదివరకే మీకు చెప్పిఉన్నాను. క్విసైను మాత్రను గూర్చిన మీ భావం అలా ఉండగా దానికి కొన్ని సహజ గుణా లున్నవి.అటువంటిదికాదు రాటం. దానిలో అలాటి సహజ గుణ మేమీ లేదు. గాయత్రీ మంత్రం తీసుకోండి. నా పైన దానికున్నప్రభావం హైందవేతరులపైన ఉండదు. కల్మా ముసల్మాను హృదయంలో కలి గించే పరివర్తనం నా హృదయంలో కలిగించలేదు. అదే విధంగా అహింసను బోధించే శక్తిగానీ, స్వరాజ్యాన్ని తెచ్చేశక్తిగానీ, రాటంలో స్వతస్సిద్ధంగాలేదు. కాని మీరు దానికా గుణాలను ఆపాదించి భావిస్తే అది సరిగా అలాగే ప్రత్యక్షమౌతుంది. పేదలను సేవించడమే దానిలోఉన్న విలువ అనే సంగతి స్పష్టమే. అందువల్ల అది అహింసా చిహ్నమనిగానీ, స్వరాజ్య సంపాదనకు తప్పనిసరి అనిగానీ, అర్థంచేసుకో నక్కర లేదు. కాని 1920 నుండీ నేను రాటాన్ని స్వరాజ్యంతోనూ అహింసతోనూ ముడిపెట్టాను. ఇక ఆత్మ పరిశుద్ధతకు సంబంధించిన కార్యక్రమంఉంది. దానితో కూడా రాటం సన్నిహిత బాంధవ్యం కలిగిఉంది. ఇంట్లో వడికిన ముతకనూలుబట్ట నిరాడంబర జీవితాన్నీ తద్వారా పవిత్రతనూ సూచి

స్తుంది. రాటం, హిందూ మహమ్మదీయ సఖ్యత, అస్పృశ్యతా నివార ణము- ఇవిలేకుండా శాసనోల్లంఘనంలేదు. శాసనోల్లంఘనం అన్న ప్పుడు, మనంతట మన మేర్పాటు చేసుకొన్న నియమాలకు హృదయ పూర్వకంగా మనం కట్టుబడి ఉండాలనే భావం ఇమిడిఉంది. అది లేకపోతే శాసనోల్లంఘన మొక క్రూర పరిహాసం. ఇదినాకు 'రాజ

కోట ప్రయోగశాలలో కలిగిన ద్విగుణీకృత విశ్వాసం. ఈపరతులన్నీ ఒక్క మనిషి నిర్వర్తించినప్పటికీ ఆయన ఒక్కడే స్వరాజ్యాన్నీ తీసుకొని రావడానికర్హుడు. నేను ఆదర్శ సత్యాగ్రహిని కావడాని కింకా ఎంతో దూరంలో ఉన్నాను. రౌలట్టు చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహ సన్నాహాలు సాగించవలెననుకొన్నప్పుడుకూడా నేనీ మాటలే చెప్పినాను. ఆ సత్యాగ్రహం ప్రారంభించబడినప్పుడు కొద్ది మందిమే ఉన్నాము. ఆ కొద్దిమందిలో నుండే చెప్పుకోదగినసంస్థను స్థాపించాము. నేను అసంపూర్ణ సత్యాగ్రహిని కావడం చేత మీ సహకారం కోరుతూన్నాను. మీ సహకారాన్ని అభిలషించడంలోనూ, సత్యాగ్రహ సంవిధాన ప్రయత్నంలోనూ నిరంతరం ఆత్మపరీక్ష చేసుకొంటూండడంవలన నేను అభివృద్ధి కాగలను. నేను మీ కిస్తూన్న ఇంత సావకాశమూ మన ఉభయుల క్షేమంకోసమే. మీ క్షేమంకోసం కాకపోతే అధమం నా క్షేమంకోసం. నేను ఆత్మపరీక్ష చేసుకొంటూన్న కొద్దీ పెరుగుతూన్నాను; క్రమపరిణామం పొందుతూన్నాను; ఎవ్వరూ పెరగడానికి వీలులేనంత పెద్ద వాళ్లుకారు. ముఖ్యంగా నేనుకాను. ట్రాన్సువాలులో సత్యాగ్రహం పుట్టింది. కాని అక్కడ కొన్ని వేలమంది మాత్రమే దానిని ప్రయోగించారు. ఇక్కడో లక్షలాది ప్రజలు ప్రయోగించారు. 1919 ఏప్రిల్ 6 వ తేదీని మద్రాసు నుండి నేను పిలవగానే లక్షలాది ప్రజలు ఒక్కటిగా లేచి నిలబడతారని ఎవరనుకొన్నారు ? కాని అంత్య విజయానికి నిర్మాణ కార్యక్రమం ముఖ్యావసరం. ఈనాడు అహింసా చిహ్నమైన రాటంపైన చేయవలసిన పనిని మనం సరిగా నిర్వర్తించక పోయినట్లయితే మన జాతికి అన్యాయం చేస్తూన్నామని నేను నిజంగా అనుకొంటూన్నాను. ఎంత కాలమైనా కానీయండి ఈ పని చేసి తీరవలసిందే.

మధ్యరాష్ట్రిలలో పారిశ్రామిక విచారణ సంఘంవారి అపూర్వ నివేదిక.

మధ్యరాష్ట్రిల ప్రభుత్వంవారు 1938 డిశంబరు 15 వ తేదీని నియమించిన పారిశ్రామిక విచారణసంఘం 1939 మే 20 వ తేదీని "ఒక అపూర్వనివేదికను" ప్రచురించింది. "అది శాస్త్రవిషయిక విచారణ కాదు, ప్రచారక విచారణ కాదు, రుగ్ణవిషయిక (Clinical) విచారణ కాదు. కాని రోగి ప్రాణాలను కాపాడతగిన మందును సూచించేనిమిత్తం స్వల్పకాలంలో ముగించబడిన రోగనిదానవిచారణ-అది జాతీయ భావి నిర్ణయసూచిక - మన కార్యరంగంలో మనకు లభించే ముడి వస్తువులనుబట్టి వ్యక్తుల ఆర్థిక క్రియా విధానమున్ను సూచిస్తూన్నదది" అన్నాడు. ఆచార్య కుమారప్ప దానినిగూర్చి అందులోని విషయాలను సంగ్రహంగా మనవి చేస్తాము.

1. ప్రభుత్వ విధులు

ప్రతి సాంఘికసంస్థా, పెద్దజాతి కానీయండి, ఒకరాష్ట్రీయ రాజకీయ కేంద్రం కానీయండి, సంకుచిత విశాలదృక్పథాలకు తగిన సమాధానం కుదర్చగలిగి ఉండాలి. వ్యక్తి ప్రయోజనం సాధారణంగా సంకుచితంగా ఉంటుంది. అది జాతీయక్షేమానికి విరుద్ధంగా ఉన్నప్పుడు, ఉభయుల క్షేమాలను ఉచితపద్ధతిని సమన్వయపఱచడం సంస్థాపితసంఘధర్మం. అందువల్ల సంఘం మొత్తానికి అపాయము కలుగకుండా ఉంటుంది. అదే విధంగా గ్రామస్థుల ఆర్థికవ్యవస్థను, పారిశ్రామికుల ఆర్థికవ్యవ

ష్ఠకు ప్రయోజనాలలో విరోధం కలిగినప్పుడు, మొత్తంపైన జాతీయ క్షేమంకోసం రెండువ్యవస్థలకు సమాధానం కుదర్చడం అవసరం. ఈ పని చేయడానికి తగినసంస్థ ప్రభుత్వంకంటె మఱొకటి లేదు. కాబట్టి రాజ్యపరిపాలనలో ఉన్నవారు అందఱి క్షేమంకోసం ఈసందర్భంలో జోక్యం కల్గించుకోవడం న్యాయం. దుర్బలులహక్కులను ప్రభుత్వం రక్షించితీరాలి. అంతే కాదు వ్యక్తిచేయజాలని పనులు కొన్ని ప్రభుత్వం చేసి తీరవలసినవి ఉన్నవి. ప్రజల అవసరాలను పరిశీలించి వ్యాపార సౌకర్యాలను యేర్పాటు చేయడం వ్యక్తులకు సాధ్యమైనపని కాదు. అందుకు తగిన కాలంగానీ ధనంగానీ వారు వెచ్చించ లేరు.

2. పన్నులు - ఖర్చులు

ప్రజలనుండి పన్నులద్వారా లభించిన ద్రవ్యంవలననే ప్రభుత్వం నడుస్తూన్నది. ప్రభుత్వం ప్రజలకోసమే ఉన్నట్లయితే, ప్రజల ఆర్థిక క్షేమానికి విరుద్ధంగా ఎప్పుడూ పన్నులను విధించకూడదు. కాబట్టి పరిపాలకులు పన్నులను వెచ్చించే విధానం మొత్తంపైన జాతీయైశ్వర్యాన్ని పెంపొందించే టట్లు చూచుకోవలెను. పేదలనుండి పన్నులను వసూలుచేసి ధనవంతులను ఇంకా ధనవంతులనుగా చేయడానికి వినియోగించినట్లయితే, జాతీయైశ్వర్యవిభజనలో మానవవ్యక్తికీయ తగిన విలువ ఈయలేదని అర్థం. అతికఠినమైన ఆర్థికవిధానం గల ఇండియావంటి పేద దేశం సందర్భంలో ఈ విషయం

ఇంకా ఎక్కువగా వర్తిస్తుంది. వస్తువులను చౌకధరలో కొనమని బోధించడమే అర్థశాస్త్రము యొక్క ఉద్దేశం కాదు. ఎందువల్లనంటే ప్రభుత్వం కేవలం ధనదృష్టితోనే వెచ్చించకపోవచ్చును. విదేశీవస్తువులకంటె స్థానికంగా తయారైన వస్తువు లెక్కువ ప్రియంగా ఉన్నప్పటికీ, వాటికి ఎక్కువ ప్రోత్సాహమివ్వాలి. అందువల్లఅక్కడిద్రవ్యం ఆరాష్ట్రంలోనే తిరుగుతూంటుంది ; వస్తువుధర పౌరుని పన్నులను భరించే శక్తికి భంగం రానీయదు ; ఐశ్వర్యం ఒక్కచోట గూడు కట్టుకొని ఉండక చక్కగా విభజింపబడుతుంది. స్థానిక వ్యాపారంఅభివృద్ధి అవుతుంది. విదేశీవస్తువులను కొన్నట్లయితే మారకం స్వేచ్ఛగా జరగడానికి వీలు లేకుండా కొనుగోలుశక్తి దేశసరిహద్దులను దాటిపోతుంది. ఎగుమతి దిగుమతి పన్నులు మారక నిర్ణయాధికారము సరుకుల రాకపోకల రేట్లనిర్ణయం-మొదలైన అడ్డగోడలను కట్టుకొంటూన్నంత వరకూ స్వేచ్ఛా వ్యాపారం వలనకలిగే పరస్పరక్షేమం కలుగుతుందని అనుకోవడానికి వీలు లేదు.

నేడు మన ఆర్థికవస్తుసముదాయం కృత్రిమ పద్ధతులతో శాసింపబడుతూన్నది. ప్రజలు ఉత్పత్తి చేసిన వస్తువుల చలామణికి ప్రభుత్వవ్యయం ఎలా తోడ్పడుతూన్నదో తెలుసుకోవడానికి నిరంతరం కన్ను వేసి చూస్తూండాలి. వస్తువుల చౌకదనమే ప్రధానంగా పెట్టుకొని విదేశీసరుకులను కొనే ప్రభుత్వం, తనరాజ్యం లో నిరుద్యోగతను సృజించిన నేరానికి తానే గురి అవుతుంది. స్థానికోపయోగంకోసం ఉత్పత్తి అయిన

వస్తువు స్థానిక ప్రజలకు పని కల్పిస్తుంది. ఇక ఇతరరాష్ట్రం నుండి వస్తువులను తెప్పించుకొన్నప్పు డావస్తువుల గిరాకీవలన కల్పింపబడిన పని అంతా సరుకులను దిగుమతి చేసుకొన్న రాష్ట్రానికి లేకుండా పోయినట్లే. కాబట్టి ప్రభుత్వం పన్నులను వ్యయంచేసే విధానాన్నిబట్టి ప్రజలకు పని కల్పించనూవచ్చు పోగొట్టనూవచ్చు. దిగుమతి చేసుకొన్నవస్తు వెంత చౌకగా ఉన్నప్పటికీ, ప్రజలకు పోయినపనినిబట్టి చూస్తే దానిఖరీదు చాలా ఎక్కువే. కనుక చౌక అనే కారణంతో పైనుండి సరుకులను దిగుమతి చేయించుకొనే ప్రభుత్వం తన ప్రజలకు అపకారం చేస్తూన్నదనేమాట స్పష్టం.

3. పెట్టుబడి - రెక్కలకష్టము

మన ఆర్థికవిధానానికి పాశ్చాత్యుల ఆర్థిక విధానానికి కావలసినంత భేదమున్నది. పెట్టుబడికి కొఱత ఉండదనే భావంతో వారిసంస్థలు నిర్మింపబడినవి. పారిశ్రామిక పరివర్తనానికి ముందు తూర్పుదేశాల ఐశ్వర్యం పశ్చిమదేశాలకు ప్రవహించింది. అప్పటినుండీ వస్తువులను ఉత్పత్తి చేయడంలో కూలిఖర్చులను తగ్గించి మధ్య దళారీలకు ఎక్కువ ప్రతిఫలం ముట్టేటట్టు ప్రయత్నాలు చేస్తూన్నారు వారు.

మన దేశంలో ఏగ్రామానికి పోయి చూచినా కూలిజనం ఎక్కువగా నున్నట్లు పెట్టుబడి తక్కువగా ఉన్నట్లు అర్థమవు తుంది. కాబట్టి మన అభ్యుదయవిధానం పెట్టుబడి లభించడం పైన ఆధారపడి ఉండకూడదు. కూలిజనం కావలసినంత ఉన్నదనే జ్ఞానంపైన ఆధారపడి ఉండాలి. పెద్దపెద్ద పెట్టుబ

డులు కావలసిన ముఖ్యపరిశ్రమల విషయంలోనూ, ప్రజోప యోగ కార్యముల సందర్భంలోనూ, ప్రకృతి సౌభాగ్యాన్ని ప్రజా క్షేమానికోసం వినియోగపరచడంలోనూ, ప్రజల పక్షాన ప్రభుత్వమే పనిచేయవలసి ఉంటుంది. ఈ ఇతర సందర్భాలలో ఈ ప్రమాణం పనికిరాదు. మనసందర్భంలో మన ఉత్పత్తి పరికరాలు కారు చౌకగా ఉండాలి. ఏదైనా సరుకును ఉత్పత్తి చేసేటందుకు కూలికింద ఎక్కువఖర్చు అయిందంటే ఆ సరుకు ఉత్పత్తిలోనే ద్రవ్యవిభజన సరిగా జరిగిందని అర్థం.

సాధారణంగా ప్రభుత్వానికి ఆదాయం ప్రజల సాంవత్సరిక ఉత్పత్తివలననే వస్తూన్నది. అది వారి పెట్టుబడినుండివచ్చే ఆదాలో భాగం. కాని ఒక్కొక్కప్పుడు చాలాకాలం మనుతుందనే ఉద్దేశంతో కూడా ప్రభుత్వంవారు విదేశీవస్తువును తెప్పిస్తూంటారు. ఇదికూడా ఆర్థికశాస్త్రరీత్యా తప్పు. ప్రజల సంవత్సరాదాయములనుండియే ప్రభుత్వానికి సొమ్ము వస్తూన్నది గనుక ప్రభుత్వంచేసే ఖర్చులుకూడా తమ సంవత్సరాదాయముపైననే ఆధారపడి ఉండాలని మా అభిప్రాయం. ఇందుకొక ఉదాహరణ మిస్తూన్నాము. మన గ్రామాలప్రక్కనూ అడవులలోనూ కూడా రైలుమార్గాల దరినున్న టెలిగ్రాఫ్ స్తంభాలు ఉక్కువి. దేశంలో ఎంతో కొయ్య ఉండగా ఆ ఉక్కుస్తంభా లెందుకు వేయాలి. పైగా ఉక్కు పరదేశం నుండి దిగుమతీ అయింది. కొయ్య స్వదేశీది. భాగ్యవంతములైన అమెరికా ఇంగ్లండు దేశాలలో కూడా ఆ స్తంభాలు కొయ్యవే. ఇనుపస్తంభాలు వేయడానికి (కారణం) ఏమి చెబు

తారంటే కొయ్య చెదతినిపోతుంది, పుచ్చిపడుతుంది, ఉక్కు చాలాకాలం మనుతుందని చెబుతారు. దేశక్షేమానికి విరోధంగాఉండే ఖర్చులుచేసి ప్రభుత్వంగాని మఱొక ప్రజాసంస్థగానీ యెన్నడూ అటువంటి కుంటి కారణాలుచెప్పకూడదు. కొయ్య ఉపయోగించినట్లయితే కావలసినంత మందికి పని దొరుకుతుంది. కొయ్య కొద్దికాలం మనేమాట నిజమే కాని చాలా చౌకగూడాను. ఎక్కువసార్లు కొత్తవి వేయవలసివస్తే మన పన్నులలోనుండి వెచ్చించబడిన ఆ సొమ్ము దేశంలో ఇంకా ఎక్కువసార్లు తిరగడానికి సావకాశం కలుగుతుంది. ప్రజలనుండి తీసుకొన్న పన్నులను సాధారణంగా ప్రభుత్వం పెట్టుబడిగా వినియోగించకూడదు. అందువల్ల డబ్బు తిరగడానికి అడ్డంకు కలుగుతుంది. ఒక్కొక్కప్పుడు ప్రజల నిరుపేదతనానికికూడా కారణం కావచ్చును. పన్నులు చెల్లించే ప్రజలు దాదాపు జీవితావసరములను సంపాదించుకోగలిగిన వారుగా మాత్రమే ఉంటారు. అటువంటి వారి దగ్గరనుండి డబ్బు పుచ్చుకొని ఎప్పటికో భావికాలానికి దానిని దాచి ఉంచడం సరియైన ఆర్థికవిధానం కాదు. కాబట్టి అటువంటి సొమ్మును పెట్టుబడికింద కాకుండా, రెవిన్యూనుండి ఖర్చు బడేటట్టుగా చూడడమే సరియైన పద్ధతి.

ఈ పద్ధతివలన మఱొక ప్రయోజనంకూడా ఉన్నది. తాముపయోగించిన సామగ్రి త్వరలో శిథిలమైనట్లయితే ప్రభుత్వం తిరిగి ప్రజలదగ్గరకు డబ్బుకోసం పోవలసివస్తుంది. అందువల్ల ప్రభుత్వం లావాదేవీలను గూర్చి ప్రజలకు తెలియు

జెప్పక తీరదు. అప్పుడు ప్రజాపరిపాలనా సంస్థలలో హద్దు పద్దు లేకుండా డబ్బు ఖర్చుపెట్టడానికి వీలుండదు.

ప్రతిసంవత్సరము గ్రామంనుండి ప్రభుత్వం తీసుకొన్న ఆదాయమూ, ఆగ్రామంమీద ప్రభుత్వం పెట్టిన ఖర్చూ తెలియ పరుస్తూ ఒక నివేదికను తయారు చేసి దానిని గ్రామములో నలుగురికీ కనబడే చోట - పోస్టాఫీసుకో ఆసుపత్రికో పాఠశాలకో అంటించాలని కూడా కమిటీవారు సిఫారసు చేశారు.

మన ఆర్థిక వ్యవస్థలో సాధారణంగా అందరికీ అర్థంకాని విషయ మొకటున్నది. అది తెలుసుకొంటేనే గాని అసలు సంగతి తెలుసు కొన్నట్లుకాదు. ఇండియాలో బాగా వ్యాపించ వలసిన పరిశ్రమలు పెట్టుబడి మీద ఆధారపడేవిగా గాక పనిమీద ఆధారపడేవిగా ఉండాలని ఇదివరకే చెప్పిఉన్నాము. కేంద్రీకరణ పద్ధతులలో తయారైన విదేశీ వస్తువులతో పోటీ చేసేటంతవరకూ మన కుటీర గ్రామపరిశ్రమలను మనం పాడు చేయదలచుకో లేదు. గ్రామంలోకి పోయి ఒక్కసారి పరిశీలిస్తే అన్నంలేని పేదవాళ్ల ఇళ్లన్నీ మట్టితోనూ తడికలతోనూ కట్టి ఉన్నట్లూ, షాహుకారుల ఇళ్లు వ్యాపారస్తుల ఇళ్లు (మాల్ గుజార్ల) రాయి, సున్నం, పెంకులతో కట్టి ఉన్నట్లూ తెలుస్తుంది. ఇది కేవలం దరిద్ర చిహ్నమే కాదు; శతాబ్దాల తరబడి పరిస్థితులకు పరిసరాలకు అనుగుణంగా సరిపుచ్చుకొని వస్తూన్న ఆర్థిక వ్యవస్థలో ఒక భాగమని కూడా అర్థమవుతుంది. గట్టి ఇంటికి మరమ్మతు చేయడానికి బయట నుండి తాపీమనిషి రావాలి. పాకల విషయంలో అలా కాదు.

ఇంట్లోవాళ్లే పడిపోయే గోడలకు అండలు వేసుకొని మెత్తు కొంటారు. కాబట్టి రాతితో కట్టిన యిళ్లను మరమ్మతు చేయడానికి డబ్బుకావలసివచ్చి సాధారణంగా మరమ్మతు లేకుండానే ఉంటున్నాయి. ఆ యిళ్లు మట్టితో కట్టినయిళ్లు - హరిజన వాడలలోని యిళ్లుకూడా పరిశుభ్రంగా చూడ ముచ్చటగా ఉంటున్నాయి. దీనికి కారణం వాళ్ల రెక్కలకష్టమే వాళ్లకు డబ్బు.

4. డబ్బు - వస్తుమారక పద్ధతి

ఈ సందర్భంలో, ఒక ప్రమాణం యేర్పాటుచేసుకొని, ఆ ప్రకారంకొంతసొమ్మును వస్తురూపంలో ముట్టచెప్పేపద్ధతి కూడా తగినదే నని మాఅభిప్రాయం. డబ్బు ఉపయోగాన్ని గూర్చి పదేపదే నొక్కినొక్కి మాట్లాడుతూంటారు చాలా మంది. దీనికి ప్రభావం పాశ్చాత్య ఆర్థిక నిర్మాణం వలన కలిగింది. అక్కడిపరిశ్రమలకు కావలసిన ముడిసరుకులను దూర ప్రదేశాలనుండి తెప్పించు కోవడం ముఖ్యావసరం గనుక డబ్బుతో పని పట్టింది వారికి. ముడిసరుకులకోసం దూరం పోయిన కొద్ది డబ్బుతో అవసర మెక్కువ కలుగుతుంది. డబ్బుకు వచ్చిన ఈ ప్రాముఖ్యత వలన గ్రామస్థులు విదేశీ వ్యాపారస్థుల దయా దాక్షిణ్యాలకు తలలొగ్గవలసి వచ్చింది. వారు తమ వ్యాపార స్థలాలను ఎక్కువ చేసుకొని అక్కడ నుండి తమ దేశపు సరుకులను తీసికొని వచ్చి అమ్ముతూంటే ఇక్కడి వారు ఆపడానికధికారం లేక గుడ్లు మిటకరించుకొని చూడవలసి వస్తూన్నది. డబ్బు జీవితానికి కావ

లసిన ముఖ్య అవసరాలను వేటినీ తీర్చగలిగిన సరుకు కాదు. కాబట్టి మనిషి కేవలం డబ్బుతో బ్రతకలేడు. కాని డబ్బుకు వచ్చిన ప్రాముఖ్యతను బట్టి డబ్బు కలవాడు ఇతర సరుకులు కలవాడి కంటే మిన్నగా ఉంటాడు. అందువలన బేరంలో సరుకు గలవాడి కంటే డబ్బున్నవాడి చేయి పైగా ఉంటుంది. కాబట్టి డబ్బు ఇతరుల జీవితాలను చేతిలో పెట్టుకోవడానికి మనిషికి గల శక్తిని నిరూపిస్తుంది. బంగారం దానంతటది తరిగిపోదు. కాని దానికి మారుగా లభించే సరుకులు చాల వరకు సహజంగా కాలం గడచినకొద్దీ తరిగి పోతూంటాయి. కాబట్టి మనం నాణెముల ఆర్థిక విధానాన్ని విరివిగా గ్రామాలలో ప్రవేశ పెట్టినట్లయితే, పేదలను భాగ్యవంతుల చేతి కప్పగించడమే. డబ్బు లోహరూపంలో ఉండడం మంచిదని ఎంత చెప్పినప్పటికీ, కుళ్లిపోయే సరుకున్న పేదవానికీ కుళ్లిపోని లోహము గల భాగ్యవంతునికీ పోటీ వచ్చినప్పుడు పోల్చి చూస్తే అందులో ఉన్న అన్యాయం అర్థమవుతుంది. కనుక గ్రామస్థులు ప్రపంచ వాణిజ్యం జోలికిపోక తమ ఉత్పత్తి శక్తుల మీద ఆధారపడి ఉండడం ఎక్కువ మంచిది.

5. వస్తు మారక పద్ధతి - ప్రభుత్వ నిధులు

ప్రభుత్వ వ్యయం కోసం ప్రజల నుండి తీసుకోబడుతూన్న కొనుగోలు శక్తిలోని మానవ మూల్యమును తగ్గించే వైఖరి ఈ సందర్భంలో ఎక్కువగా కనబడుతుంది. జీవితావసరములను కూడా సంపాదించుకొనే శక్తి లేనివారు పెద్ద పెద్ద జీతాలు పుచ్చుకొనే ప్రభుత్వోద్యోగులను భరించ వలసి

వస్తూన్నది. ఈ కమిటీ సభ్యులు గ్రామస్థుల అతిథులుగా ఉండవలసి వచ్చినప్పుడు మట్టినేల మీదనో వసారాలలోనో, లేక అనారోగ్య భూయిష్ఠమైన పశువుల చావడి దగ్గరనో నిద్రించ వలసి వచ్చినది. ఇది గ్రామస్థుల ఆతిథ్యలోపం వలన గలిగిన చిక్కుకాదు - పేదవాళ్ల హృదయాలు పెద్దవిగా ఉంటవి - కాని పాపం వాళ్ళ బొక్కసాలు చిన్నవి. అతిథుల కోసం వేరే ఒక చిరిచాప వాళ్ళింట్లో లేదు. ప్రభుత్వానికి వచ్చేపైకం చాల వరకీ ప్రజలనుండే వస్తూన్నది. కాని ప్రభుత్వ వ్యయ పద్ధతిని బట్టిచూస్తే వారాసంగతిని గమనించి నట్లే తోచదు ఒక్క అసెంబ్లీ విశ్రాంతి గృహం 1,32,000 ఖరీదయింది. భూమి మీద మంచి మంచి తివాచీలు పఱచి ఉన్నవి. గదులన్నీ మహావైభవంగా మనోహరములైన ఉప కరణాలతో నిండిఉన్నవి. మన శాసన సభ్యులందరు సంవత్స రానికి రు. 15 ల ఆదాయం గల గృహస్థులకు అతిథులు. కాని ఒక్కొక్క యం. ఎల్. ఎ. ఉండే గది ఖరీదు రు. 3,300. ఇటువంటి రాజ హర్మ్యాల వలననే మానవ మూల్యంలో జాతీయైశ్వర్యం తగ్గి పోతున్నది.

ప్రభుత్వం వారి రెవిన్యూ కొంతవరకైనా వస్తురూపంలో వసూలు చేయబడినట్లయితే, కొంత ఉపయోగ కరంగా ఉంటుందని మా అభిప్రాయం. అందువల్ల వారు వసూలు చేసిన వడ్లు కానీ, గోధుమలు కానీ స్థానికోద్యోగుల జీతాల కింద ఈయవచ్చును. ఈ ధాన్యాలను అమ్మడంలో గ్రామస్థులకు పట్టణస్థులకు కలిగే పోటీ కూడా కొంత తగ్గుతుంది. ప్రభు

త్వానికి ధాన్యం వసూలు చేయడంలో కష్టమున్న మాట నిజమే కాని అందువల్ల ప్రజలకు కలిగే లాభాలను యోజించి నట్లయితే ఆ కష్టమొక లెక్కలోది కాదు. పూర్తిగా వస్తు రూపంలోనే పన్నులన్నీ పుచ్చుకోవలెనని మేము సిఫారసు చేయడం లేదు. కాని సరియైన పద్ధతిలో వస్తు రూపంగా కొంత వరకు పన్నులను వసూలుచేసే విధానాన్ని ఆచరణలో పెట్టినట్లయితే చాలా వరకు ప్రజల కష్టాలు గట్టెక్క గలవని మా అభిప్రాయము.

6. ముడి పదార్థాలు - ఉత్పత్తి లాభం

మరొక ముఖ్య విషయం కూడా ఆలోచించాలి. సాధారణంగా ముడి పదార్థం ఉత్పత్తి అయిన స్థితిలో శ్రమకు ముట్టే ప్రతిఫలం కంటే, వస్తు రూపంలో అమ్మకం కోసం తయారు అయిన స్థితిలో శ్రమకు ముట్టే ప్రతిఫలం ఎక్కువగా ఉంటుంది. దీనికి కారణం కొనేవారు ఆ ఖర్చును భరించ గలిగిన శక్తి వంతులుగా ఉండడమే. ఈ సంగతి చాలా మంది సరిగా గ్రహించడం లేదు. తక్షణం ఉపయోగించడానికి వీలుగా తయారైన వస్తువు రు. 100 లకు అమ్మితే తేలికగా రు. 5 ల లాభం ఉండవచ్చును. అదే వస్తువును చేసేటందుకుపయోగించిన రు. 10 ల ముడి పదార్థంలో దామాషాగా 0-8-0 లాభం రావచ్చును. కాని రు. 5 లు లాభం ఉండదు. కాబట్టి ముడి పదార్థం ఉత్పత్తి చేసిన వానికంటె, దానిని వస్తు రూపంలో తయారు చేసిన కర్మకారునకు ఎక్కువ ప్రతిఫలం ముట్టుతుంది. కొన్ని ప్రదేశాలలో, ఈ రెండు పనులూ

ఒక్కరే చేస్తూండవచ్చును. అందువలన సంఘం మొ
మీంద మేలు కలుగుతుంది. కాని ప్రస్తుత సంఘ వ్యవస్థ
కొంత మంది సరుకులను తయారు చేసేవారు, మఱి కొం
మంది ముడి వస్తువులను ఉత్పత్తి చేసేవారు. ఈ రెండో వా
మొదటి వారికి కొన్ని వేలమైళ్ల దూరంలో ఉండడం వీరి
వురి మధ్య అనేక కృత్రిమ ప్రతిబంధకాలుండడం తట
స్తూన్నది. మొదటి వారు నిరంతరం హాయిగా తగినం
సంపాదించుకోవడం, రెండో వారు నిరంతరం తగినవిలువ రా
బాధపడడం జరుగుతూన్నది. ముడి వస్తువుల ఎగుమ
పేదరికాన్ని నిరుద్యోగతను, కల్పించడానికి కారణమ
తూంటుంది. ముడి పదార్థాలను ఉత్పత్తి చేయడం వర
అయినట్లయితే మొత్తం మీంద వ్యవసాయం లాభదాయక
కాదు. ప్రతి ప్రభుత్వం మొత్తం సంఘమంతటికీ యే
ప్రయోజనకరమో ఆలోచించాలి; ఆహార పదార్థాలు ప్ర
లకు ఎక్కువగా క్షేమం చేకూరుస్తవనీ, డబ్బు కానీ, ఇత
వాణిజ్య సస్యాలు కాని ప్రజలను దరిద్రులనుగా చేస్తవనీ
గ్రహించాలి. కిందటి తరం నుండీ వాణిజ్య సస్యాలను వృ
చేయాలని ఒక అనవసర ప్రచారం బయలుదేరింది. దా
దుష్ఫలితం గ్రామాలలో ఇప్పుడు ప్రత్యక్షమౌతూన్నది.

ఫ్యాక్టరీల కోసం వాణిజ్య సస్యాలను వేస్తూన్న రైతుకు
ఫ్యాక్టరీ కూలీలకు భేదం లేదు. ఈ రైతు కూడా తన స్వాత
త్ర్యాన్ని కోల్పోతున్నాడు. ఫ్యాక్టరీల వారితో తనకు లాభ
దాయకంగా ఉండేటట్లు బేరమాడుకోనే శక్తి అతనికి లేదు

త్వానికి ధాన్యం వసూలు చేయడంలో కష్టమున్న మాట నిజమే కాని అందువల్ల ప్రజలకు కలిగే లాభాలను యోజించి నట్లయితే, ఆ కష్టమొక లెక్కలోది కాదు. పూర్తిగా వస్తు రూపంలోనే పన్నులన్నీ పుచ్చుకోవలెనని మేము సిఫారసు చేయడంలేదు. కాని సరియైన పద్ధతిలో వస్తు రూపంగా కొంత వరకు పన్నులను వసూలుచేసే విధానాన్ని ఆచరణలో పెట్టినట్లయితే చాలా వరకు ప్రజల కష్టాలు గట్టెక్క గలవని మా అభిప్రాయము.

6. ముడి పదార్థాలు - ఉత్పత్తి లాభం

మరొక ముఖ్య విషయం కూడా ఆలోచించాలి. సాధారణంగా ముడి పదార్థం ఉత్పత్తి అయిన స్థితిలో శ్రమకు ముట్టే ప్రతిఫలం కంటే, వస్తు రూపంలో అమ్మకం కోసం తయారు అయిన స్థితిలో శ్రమకు ముట్టే ప్రతిఫలం ఎక్కువగా ఉంటుంది. దీనికి కారణం కొనేవారు ఆ ఖర్చును భరించ గలిగిన శక్తి వంతులుగా ఉండడమే. ఈ సంగతి చాలా మంది సరిగా గ్రహించడం లేదు. తక్షణం ఉపయోగించడానికి వీలుగా తయారైన వస్తువు రు. 100 లకు అమ్మితే తేలికగా రు. 5 ల లాభం ఉండవచ్చును. అదే వస్తువును చేసేటందుకుపయోగించిన రు. 10 ల ముడి పదార్థంలో దామాషాగా 0-8-0 లాభం రావచ్చును. కాని రు. 5 లు లాభం ఉండదు. కాబట్టి ముడి పదార్థం ఉత్పత్తి చేసిన వానికంటె, దానిని వస్తు రూపంలో తయారు చేసిన కర్మకారునకు ఎక్కువ ప్రతిఫలం ముట్టుతుంది. కొన్ని ప్రదేశాలలో, ఈ రెండు పనులూ

ఒక్కరే చేస్తూండవచ్చును. అందువలన సంఘం మొత్తం మీద మేలు కలుగుతుంది. కాని ప్రస్తుత సంఘ వ్యవస్థలో కొంత మంది సరుకులను తయారు చేసేవారు, మరి కొంత మంది ముడి వస్తువులను ఉత్పత్తి చేసేవారు. ఈ రెండో వారు మొదటి వారికి కొన్ని వేలమైళ్ళ దూరంలో ఉండడం వీరిరువురి మధ్య అనేక కృత్రిమ ప్రతిబంధకాలుండడం తటస్థిస్తూన్నది. మొదటి వారు నిరంతరం హాయిగా తగినంత సంపాదించుకోవడం, రెండో వారు నిరంతరం తగినవిలువ రాక బాధపడడం జరుగుతూన్నది. ముడి వస్తువుల ఎగుమతి పేదరికాన్ని నిరుద్యోగతను, కల్పించడానికి కారణమవుతూంటుంది. ముడి పదార్థాలను ఉత్పత్తి చేయడం వరకే అయినట్లయితే మొత్తం మీద వ్యవసాయం లాభదాయకం కాదు. ప్రతి ప్రభుత్వం మొత్తం సంఘమంతటికీ యేది ప్రయోజనకరమో ఆలోచించాలి; ఆహార పదార్థాలు ప్రజలకు ఎక్కువగా క్షేమం చేకూరుస్తవనీ, డబ్బు కానీ, ఇతర వాణిజ్య సస్యాలు కాని ప్రజలను దరిద్రులనుగా చేస్తవనీ, గ్రహించాలి. కిందటి తరం నుండీ వాణిజ్య సస్యాలను వృద్ధి చేయాలని ఒక అనవసర ప్రచారం బయలుదేరింది. దాని దుష్ఫలితం గ్రామాలలో ఇప్పుడు ప్రత్యక్ష మాతూన్నది,

ఫ్యాక్టరీల కోసం వాణిజ్య సస్యాలను వేస్తూన్న రైతుకూ ఫ్యాక్టరీ కూలీలకు భేదం లేదు. ఈ రైతు కూడా తన స్వాతంత్ర్యాన్ని కోల్పోతున్నాడు. ఫ్యాక్టరీల వారితో తనకు లాభదాయకంగా ఉండేటట్లు బేరమాడుకోనే శక్తి అతనికి లేదు.

కాబట్టి అతని ముడి పదార్థానికి బహుతక్కువ విలువ లభిస్తూన్నది. రైతు స్వతంత్రాభిలాషి అని ప్రతీతి కాని అతను ఆహారపదార్థాలను ఉత్పత్తి చేయడమూ, తానూ తన ఇరుగు పొరుగువారూ కలిసి, ప్రజలకు ఉపయోగకరములైన సరుకులను తయారుచేసేటందుకు తగిన పంటలను పండించడమూ మానివేసిన కారణముచేత, అతని సంప్రదాయసిద్ధమైన స్వాతంత్ర్యప్రియత్వాన్ని పోగొట్టుకొంటూన్నాడు.

ఈ మార్పువలన రైతుకు కలుగుతూన్న దుష్ఫలితాలను మన వ్యవసాయశాఖవారి విధానంకూడా ఇంకా ఎక్కువ చేస్తూన్నవి. వారి పరిశోధనలన్నీ ముఖ్యంగా వాణిజ్య సస్యాలను అభివృద్ధి చేసేటందుకే జరుగుతూన్నవి. ఇది కేవలం హ్రస్వదృష్టితో చేస్తూన్నపని. గృహపరిశ్రమద్వారా పంచదార చేయడానికి తగిన తాడిచెట్లు పుష్కలంగా దేశంనిండా ఉన్నవి, కాని వాటిని పూర్తిగా నిర్లక్ష్యంచేసి ఫ్యాక్టరీ పంచదారకోసం చెఱుకుపంట పండించమని రైతులకు పదే పదే సలహా యిస్తున్నారు వారు. అందువలన చక్కగా గోధుమలు పండేభూమి కావలసినంత చెఱుకుపంట కుపయోగించబడుతూన్నది. ఇది రైతుల కెక్కువ వ్యయప్రయాసలకు కారణమవుతూన్నది. ముడిపదార్థాలను ఆహారసామగ్రిగా తయారు చేసేటందు కేమీ ఆలోచనలు జరగడమే లేదు. హిందూదేశంలో నూనె ధాన్యాలూ బాగా ఉత్పత్తి అవుతవి. కాని ఈదేశంలో వాటిని ఉపయోగకర పదార్థాలుగా తయారు చేయడంలేదు; అవి విదేశముల కెగుమతి చేయబడుతూన్నవి.

అట్టి పదార్థాల కీ దేశంలో ఎక్కువ అవసరం కూడా ఉన్నది. నూనెతో తయారైన సామగ్రికి తగిన అంగళ్లు ఎక్కువగా ఉన్నట్లయితే, మనం మన పంటనూనెలు వెలగడానికి తగిన దీపాలను తేలికగా కనిపెట్ట గలిగి ఉండే వాళ్లము. అప్పుడు మనకు వేలకొలది గ్యాలనుల కిరసనాయిలును దిగుమతి చేసుకోవలసిన అవసరం ఉండేది కాదు.

7. పరిపాలనా దక్షత లేక సృజన శక్తి

పరిపాలనాసామర్థ్యం అనే పేరుతో ప్రభుత్వం బహు సంకుచితంగా పరిణమించింది. కొన్ని హద్దులను దాటినట్లయితే సామర్థ్యం కూడా అపాయకరంగా పరిణమిస్తుంది. పెద్ద ఉద్యోగస్థులు, ఆఫీసు కట్టువాళ్లు చేయుగల రోజువారీ పనితో మునిగి తేలుతూన్నారు. వాళ్లకు ఆలోచించడానికి గానీ, తమంతట తామేదైనా పని ప్రారంభించడానికి గానీ సావకాశం లేదు. దాని మామూలు కర్మకాండతో 'పరిపాలనా దక్షత' కరుడు గట్టుకొన్నది. సృజన శక్తులు పూర్తిగా నశించినవి. నష్టమూ వద్దు లాభమూ వద్దు అనే సూత్రానన్ననుసరించి ప్రభుత్వ వ్యయం నడుస్తూన్నట్లు తోస్తూన్నది.

ఉత్పత్తికి అడ్డంకులు

ప్రభుత్వానికి డబ్బు చేకూర్చవలెననే ఆతురతతో వస్తువుల ఉత్పత్తిదశ లన్నింటిలోనూ అనేక రకాల పన్నులు విధింపబడుతూన్నవి. వాటి వలన ఉత్పత్తికి అడ్డంకు లేర్పడుతూన్న సంగతి వారాలోచించడం లేదు. ముడి పదార్థానికి

ఈ పన్నెంత సన్నిహితంగా ఉంటే ఉత్పత్తి కంత ఆటంకం కలిగిస్తూన్నది. ఒక పరిమాణంగల ముడి పదార్థాలపైన మొట్ట మొదటి దశలో వేసిన ఎనిమిదణాల పన్ను, చివరిదశలో వేయవలసి వచ్చినట్లయితే, పడవలసిన ఎక్కువ పన్నును సాధారణంగా పడకుండా చేస్తుంది. కాని ప్రస్తుత పన్నుల పద్ధతి కల్పవృక్షాన్ని కట్టెపుల్లలకు వినియోగిస్తూన్నట్లున్నది. గవర్నమెంటువారి పన్నుల భారం పరిశ్రమలను అణచి వేస్తూండగా పైపెచ్చు మాల్గుజార్లు, స్థానిక సంస్థలు వాటి స్థితిని దుర్భరం చేస్తూన్నారు. ఈ లోపాన్ని సవరించడానికి తక్షణం తగిన చర్య తీసుకోక పోయినట్లయితే పరిశ్రమలు చాలా తొందరలోనే ప్రమాదావస్థలోకి రాగలవు. మాల్గు జారులు డబ్బులాగుతూన్న పద్ధతిని ప్రభుత్వంవారు జాగ్ర త్తగా పరిశీలన చేయాలి. అవసరమైతే వారినుండి ప్రజలను రక్షించడానికి తగిన శాసనాలు చేయాలి. పెద్ద గ్రామాల లోని మున్సిపాలిటీలు అవలంబించే ధన సంపాదనా పద్ధతి యెంత మాత్రమూ శాస్త్రసమ్మతంగా లేదు. కావలసిన డబ్బు వసూలు చేయడమే వారి ముఖ్యాభిప్రాయం. గ్రామా లనుండి వచ్చే సరుకులపైనను, తదితర వస్తువులపైనను అనా లోచితంగా సరిహద్దు పన్నులను విధించే మున్సిపాలిటీల మూలకంగా అనేక పరిశ్రమలు నాశనమవుతూన్నవి. కొన్ని జిల్లా మున్సిపాలిటీలు కూడా ఈ పనినే చేస్తూన్నవి. పాపం గ్రామస్థులకు తాము చెల్లించే పన్నులలో ఉన్న మెళుకువ లేమీ తెలియవు. అప్పుడప్పుడూ అజ్ఞానంవల్ల తాము చెల్లించ

తగిన వాటి కంటె కూడా ఎక్కువ పన్నులను చెల్లించుతూంటారు. కాబట్టి ఈపన్నుల విధానం శాస్త్రసమ్మతంగా ఉన్నదో లేదో విచారించడం ప్రభుత్వంవారి విధి. ఇందువలన వారు గ్రామ పరిశ్రమలకు సహాయం చేయ లేకపోయినప్పటికీ అధమం అపకారం చేయకుండా ఉన్నవా రవుతారు.

ఇక ప్రస్తుత పన్నుల పద్ధతి వలన ముడి పదార్థాల ఖరీదెక్కువవుతూన్నది. పరిశ్రమల పరిస్థితిని గణించకుండా విడదీసి ఆలోచిస్తే, పన్ను తక్కువగానే కనిపిస్తూంది. కాని పన్నులను విధించడంలో దేశ కాల పాత్రాలు సరిగా గమనింపబడడం లేదు.

గ్రామాలలోని అంగళ్లన్నీ విదేశీసరుకులతో నిండిఉన్నవి. విదేశాలు మన ఉత్పత్తి అవకాశాలను ఉపయోగించుకోవడంవలన మన దేశంలో యెంతమందికి పని దొరకకుండా పోతూన్నదో తెలుసుకోవడానికిది మంచి నిదర్శనం. గ్రామాలకు దిగుమతీ చేయబడుతూన్న ఈ విదేశీసరుకుపైన ఎక్కువ అమ్మకంపన్ను విధించి, స్థానికోత్పత్తుపైన పన్నులను తీసివేస్తే మున్సిపాలిటీలు గొప్ప ఉపకారం చేసిన వవుతవి. ప్రధాన జీవితావసరములుకూడా గ్రామాలలోకి నేడు దిగుమతి అవుతూన్నవి. ఇవి ఎంత ఎక్కువగా గ్రామాలలోకి వస్తే అంత ఎక్కువమందికి గ్రామాలలో పని ఉండకుండా పోతుంది. వస్తువుల రాకపోకలను కూడా తెలివిగా ఏర్పాటు చేయవలసి ఉన్నది. ఈ పనులన్నీ పరిశ్రమల శాఖవారు చేయవలసినవి. అధమం గ్రామాలలోనైనా విదేశీవస్తువులు కన

బడకుండా పోవాలి. కాని అందుకు విరుద్ధంగా జరుగుతూన్న దిప్పుడు. కాబట్టి గ్రామ ఆర్థిక విధానానికి అపాయకరములైన వస్తువు లేవో జాగ్రత్తగా పరిశీలన జరగాలి.

ఈ నివేదికనుగూర్చి కొన్నిమాటలు సంగ్రహంగా చెప్ప దలచుకొన్నాము. ఇది మన ఆర్థికవిధానానికీ పాశ్చాత్య ఆర్థికవిధానానికీ గల భేదాన్ని విశదంగా నిరూపిస్తూన్నది. పాశ్చాత్య దేశాలలో పెట్టుబడి పుష్కలంగా ఉన్నది. ఉత్పత్తికయ్యే కూలిఖర్చులను తగ్గించి దళారీ వ్యాపారస్తులకు ప్రతిఫలం ఎక్కువ ముట్టేటట్టుగా చూడడం వారి ఉద్దేశం. మన దేశంలో పెట్టుబడి తక్కువ. కాని కూలిజనం ఎక్కువ. సాధారణంగా ప్రభుత్వానికి ఆదాయం ప్రజల సాంవత్సరిక ఉత్పత్తివల్లనే లభిస్తూన్నది. అది వారి పెట్టుబడినుండి వచ్చే ఆదాలో భాగం. ప్రజల సంవత్సరాదాయములనుండే ప్రభుత్వానికి సొమ్ము వస్తూన్నది గనుక ప్రభుత్వం చేసే ఖర్చులు కూడా తమ సంవత్సరాదాయముపైననే ఆధారపడి ఉండవలెననే సిద్ధాంతాన్ని ఇండియా గవర్నమెంటు గ్రహించాలి. అయితే ఇండియాలో కొయ్య టెలిగ్రాఫ్ స్తంభాలు వేయడానికి వీలుండగా, పైనుండి ఉక్కుస్తంభా లెందుకు తెప్పించాలి? అమెరికా, ఇంగ్లాండు దేశాలలోవి కొయ్యస్తంభాలనే మాట నిజమేకదా? నార్వే, స్వీడనులలో కూడా కొయ్యవేనే. కొయ్య జీర్ణించిపోతుందనే వాదం సరియైనది కాదు. మన అడవులలో కొయ్య నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. ఇక గృహనిర్మాణమునుగూర్చి ఒక మంచి ఆర్థికవిషయం సూచింప

బడింది. ఒక గట్టి ఇంటిని మరమ్మతు చేయడానికి మట్టిఇల్లు మరమ్మతుకంటె చాలా ఎక్కువసొమ్ము ఖర్చవుతుంది. అందువలననే గ్రామస్థుల లెక్కలకష్టానికి ఎక్కువ విలువ ఉండడం. రాతిఇండ్లకంటె గ్రామస్థుల మట్టియిళ్ళెక్కువ పరిశుభ్రంగానూ చూడముచ్చటగానూ ఉంటవి. డబ్బు మనిషి యొక్క ముఖ్యవాంఛలను వేటినీ సంతృప్తిపఱచలేదు. కాబట్టి డబ్బున్నంతమాత్రంతో మనిషి జీవించజాలడు. డబ్బు విదేశాలనుండి ప్రవేశపెట్టబడిన సరుకు. అది ఒక చోట కూడుకట్టుకొని పోతుంది. మఱొకచోట మాయమౌతుంది. కరెన్సీపైనా, మారకంపైనా గల సర్వాధికారాల వలన బజారులో డబ్బు ఎక్కువచేయవచ్చు, తక్కువచేయవచ్చు. ఖరీదులను పెంచవచ్చు. తగ్గించవచ్చు. ఇవన్నీ వ్యాపార శాంతికి ఎప్పటికప్పుడు భంగం కలిగించే పరిస్థితులే. కాబట్టి గ్రామఆర్థికస్థితి వస్తు మారకపద్ధతిపైన ఆధారపడి ఉండాలి. నాణెముల ఆర్థికపద్ధతి (Money economy) ని ప్రవేశపెట్టడమంటే పేదవాళ్లను భాగ్యవంతులచేతి కప్పగించడం. కుళ్లిపోయే వస్తువును కుళ్ళిపోని వస్తువుకు పోటీగా తుల తూచవలసివచ్చినప్పుడు, అందులోని అన్యాయ్యం అర్థమవుతుంది. ముడిపదార్థాలను ఉత్పత్తిచేసే వానికంటె, వస్తురూపంలో సరుకులను తయారుచేసేవానికి ఎక్కువ ప్రతిఫలం ముట్టుతుంది. కారణం ముడిపదార్థం కొనే మనిషికంటె తయారైన వస్తువు కొనే మనిషికి, ఆ ఖర్చు భరించగలశక్తి ఎక్కువ వుండడమే. ఈ సంగతి ఎవ్వరూ సరిగా గమ

నించడం లేదు. ఇందుకు ఫలితంగా కొంతమంది నిరంతరం హాయిగా తగినంత సంపాదించుకోవడమూ, మఱికొంత మంది తగిన విలువ రాక నిరంతరం బాధపడుతూండడం జరుగుతూన్నది. ముడిపదార్థాల ఎగుమతి దేశంలో దరిద్రవ్యాప్తికీ, పని లేకపోవడానికీ కారణ మవుతూన్నది. ఫ్యాక్టరీలకోసం డబ్బు పంటలను పండించే రైతు ఫ్యాక్టరీకూలీకంటె అధికుడు కాడు. పారిశ్రామిక సస్యములకంటెను, ఆహారసస్యముల కంటెనూకూడా వాణిజ్యసస్యముల అభివృద్ధినిగూర్చియే మన వ్యవసాయశాఖవా రెక్కువగా పనిచేస్తూన్నారు. వారు తాడిచెట్లమాట మఱిచేపోయినారు. చెఱకుపంటకు చేయవలసిన కృషి చాలా ఎక్కువయినప్పటికీ, మిల్లులకు ముడిపదార్థం సప్లయిచేసేటందుకు వారావిషయంలో చాలా శ్రద్ధ తీసుకొంటూన్నారు. దక్షత అనేదానిని ప్రభుత్వంవారు పరమదైవంగా పూజిస్తూన్నారు. కాని 'దక్షత' అనేపేరుతో హద్దులు దాటి డబ్బు ఖర్చుపెట్టడం అపాయకరమని వారు గ్రహించినట్లు కన్పించదు. పరిపాలనా దక్షత మామూలు కర్మకాండలతో పాషాణరూపం తాల్చింది. సృజనశక్తులు చచ్చి మంచువలె గడ్డకట్టుకొని పోయినవి.

కమిటీవారు 606 గ్రామాలనుగూర్చి విచారణచేసి తేల్చిన విషయాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తూన్నవి. గ్రామస్థుని సగటు ఆదాయం సంవత్సరానికి రు 12 లను మించి ఉండదని వ్రాశారు. భారతీయుని సగటాదాయం సంవత్సరానికి 65 మొదలు 80 వరకూ వుంటుందని ఇదివరకు కొంతమంది

రాజకీయవిశారదులు పరిపాలనాదక్షులు చెప్పగా విన్నాము. అయితే 65 మొదలు 80 వరకూ వుంటుందన్న సగటు ఆదాయం ఇండియాలోని ప్రజలందరకూ సంబంధించింది. అందులో జమీందారులు, కోటీశ్వరులు, మధ్యతరగతుల వారూ కూడా వున్నారు. నేతపరిశ్రమవంటి కళాకౌశలం చూపవలసిన పనులుచేసే వారి కుటుంబాదాయంకూడా సంవత్సరానికి 50 మొదలు 70 వరకూ మాత్రమే వుంటుంది. మన పరిశ్రమలు పారిశ్రామిక పరిశ్రమలు కాకపోయి నట్లయితే సరియైన ఆహారం ఎలా ఏర్పాటు చేయడం? పని వాళ్ళు తినే ఆహారం బియ్యంగాదు సరిగదా ఇంకేధాన్యము కూడ కాదు. వారు నూకలగంజి త్రాగుతూన్నారు. దానిలో ఎంత ఎక్కువ నీరుంటే అంతఃకొందరగా పొట్ట నిండుతుం దని దానినే ఆశిస్తూన్నారు వారు. దీనికితోడు మరబియ్యం దాపరించినయి. అవి ఆరోగ్యానికీ భంగమే, ఆర్థికంగానూ నష్టమే. ఒక బియ్యపుమర 7,000 మంది అన్నం తీసివేస్తుంది. పత్తివిత్తులు తీసేమర రోజు 1 కి 90 కుటుంబాలకుగానీ లేక 400 మంది వ్యక్తులకు గానీ లభించే అన్నం తీసివేస్తుంది. నేసే మర రోజుకు 1,000 కుటుంబాల అన్నం లేక 5,000 మంది మనుష్యుల అన్నం తీసివేస్తుంది. నేతవృత్తికి సన్నిహితంగా వుండే ఇతర వృత్తులనుకూడా అది నాశనం చేస్తుంది. అందు వల్ల మరి 200 కుటుంబాలకు గానీ, లేక 1,000 కడుపులకు గానీ అన్నం తీసివేస్తుంది. గ్రామాలను పునరుజ్జీవింపచేయవలె నంటే అక్కడి వృత్తులను పునరుజ్జీవింపచేయాలి. గోధుమలు

ఆస్ట్రేలియానుండీ, నూకలు సయాంనుండీ రావడం అలా ఉండగా, ఉరలగడ్డలు ఇటలీనుండీ, యాపిల్సు జపాను నుండీ వస్తూన్నవి. డబ్బులేనిరోజులలో పన్నులు వసూలు చేయబడుతూన్నవి. ఇంతకంటె పన్నులక్రింద వడ్లు ఎందుకు పుచ్చుకోకూడదో తెలియడంలేదు. వయోజన విద్యను గూర్చి ప్రతివారూ మాట్లాడుతూన్నారు. గ్రామాలకు రేడియోలు వస్తూన్నవి. కాని ఇవన్నీ గ్రామస్థుల పొట్టలు నింపవు.

గ్రామాలకు క్రొత్తభావాలను తీసికొనిపోవడం లేదు. క్రొత్త పనిముట్లు, పరికరాలు వారికి సప్లయి చేయబడడం లేదు. గ్రామనాయకులకు, ఉద్యోగస్థులకు సజీవమైన సన్నిహిత సంబంధం లేదు. కేవలం మ్యాజిక్ లాంతర్ల ఉపన్యాసాలవల్ల గ్రామస్థులకు విజ్ఞానం కలుగదు. చిన్నచిన్న పరిశ్రమలను మొదటినుండి చివరవరకూ, పనిచేసి చూపినందువలన అన్నం లేక అల్లాడుతూన్న కోట్లకొలదీ ప్రజలకు అవి ఏవిధంగా పనిని కల్పిస్తవో అర్థమౌతుంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో చాలాభాగం అధికార్ల జీతాలకే అయిపోతూన్నది. మధ్యరాష్ట్రాల ఆదాయం 4.75 కోట్లు. ఈ పైకం వసూలు చేసే ఖర్చులక్రింద, ఉద్యోగస్థుల జీతాలక్రింద 3.65 కోట్లు అయిపోతూన్నది. షుమారు ఒక కోటిరూపాయలు మాత్రమే నిర్మాణ కార్యాలకు మిగిలిపోతూన్నది. గ్రామాలలో ఎక్కడా చెప్పుకోదగిన రోడ్లు లేవు. ఆసుపత్రులు, పశువైద్య శాలలు, పోష్టు ఆఫీసులు, విద్యాసౌకర్యాలు, ఆరోగ్యరక్ష

ణకు తగిన ఏర్పాట్లు, అంటుజాడ్యాలు రాకుండా వుండే సదుపాయాలు లేవు సరికదా చిట్టచివరకు నీటి వసతులుకూడా లేని గ్రామాల కీచిన్న మొత్తంతో ఏమి ఉపకారం జరుగుతుంది. రేడియోవల్ల ఈపరిస్థితులన్నీ చక్కబడవు. ఆకలితో అల్లాడుతూన్న ఈ ప్రజలకు గ్రామపరిశ్రమలుమాత్రమే ఆహారంచేకూర్చగలవు. మనుష్యులు త్రాగే నీరు ఎంతో అపరిశుద్ధంగా ఉంటుంది. వ్యవసాయానికి తోడుగాఉండే తాడు వేనడం లాటి పరిశ్రమలు విదేశీవస్తువుల దిగుమతితో పాడయి పోయినవి. కమిటీవారీదిగువ గ్రామపరిశ్రమల విషయంలో జాగ్రత్త తీసికొనవలెనని సిఫారసు చేస్తున్నారు:

'వడ్లదంపు, పిండి విసరడం, నూనె గానుగ ఆడడం, బెల్లం చేయడం, పంచదారపరిశ్రమ, తేనె తయారుచేయడం, కుండలు చేయడం, గ్లాసుపని, సబ్బులుచేయడం, పత్తితో చేసేపనులు (అనగా పత్తి వలవడం, గింజలు తీయడం, ఏకడం, వడకడం, నేయడం, ఉతకడం, రంగువేయడం) ఉన్ని వడకడం, ఉన్ని నేయడం, గొర్రెలను పెంచడం, వడ్రంగం, కమ్మరిపని, పట్టు తయారుచేయడం, చాప అల్లడం, తాడు వేనడం, తోలు ఊనడం, మృతకళేబరాలనుతగులపెట్టడం లేక పాతివేయడం, చేపలను పెంచడం, కోళ్లనుపెంచి అభివృద్ధిచేయడం, పాల ద్రవ్యాలను తయారుచేయడం, కంచర పని, బొమ్మలు చేయడం, కాగితం తయారుచేయడం, రాకపోకల ఏర్పాట్లు చేయడం, లక్కపరిశ్రమ, వెదురు, నిప్పుపుల్లలను తయారుచేయడం, బీడీ పరిశ్రమ.

ఎడ్ల బండ్లు

పొలంలో చేసేపనికీ కొద్దిదూరం ప్రయాణం చేయవలసి నప్పుడూ యంత్రాలను ఉపయోగించడంకంటె జంతువుల నుపయోగి స్తేనే తక్కువ ఖర్చవుతుంది. కాబట్టి ఈ రెండు సంద ర్భాలలోనూ జంతువులు యంత్రాలతో పోటీచేయగలవు. ఈ రోజులలో జంతువుల నుపయోగించడం పూర్తిగా మాని యంత్రాల నుపయోగించడం ఆచారంకిందకు వస్తూన్నది.

ఇందుకొక ఉదాహరణం: నూరు రూపాయీల బండీ, రెండు వందల రూపాయీల ఎడ్లు ఉన్నవనుకోండి. ఈ ఎడ్లు గ్రామాలలో, మిట్టపల్లాలుగా ఉన్న ఇసుక రోడ్ల మీద 16 బెంగాలు మణుగుల బరువు వేసుకొని రోజుకు 15 మైళ్ల చొప్పున ఆ బండిని ఈడ్చుకొనిపోగలవు. ఇందువల్ల 0-12-0 ఎడ్లకు, 0-6-0 బండి వానికీ, 0-4-0 బండీ అరుగుదలకు మొత్తం రోజుకు రు. 1-6-0 ఖర్చవుతుంది. ఒక టన్ను మోసే మోటారు లారీ ఈ 15 మైళ్లే ఈడ్చుకొని పోవడానికి ఒక గ్యాలను పెట్రోలు, కొంత క్రూడ్ ఆయిల్, పోషణ ఖర్చులు ఎన్నో మరమ్మతు ఖర్చులు పెద్దజీతం తీసుకొనే డ్రైవరూ కావాలి 15 మైళ్లునడవడానికి ల్యూబ్రికేటింగుఆయిలుఖరీదు పెట్రోలుఖరీదు రు. 1-12-0. రోజుకు 8 గంటలకు 0-6-0 చొ॥ పోషణ ఖర్చులు 0-12-0. డ్రైవరు, క్లీనరు, లారీపైన సామాను లెక్కించి దింపే మనుష్యులకూ కూలి 0-8-0 కాబట్టి మొత్తం ఖర్చులు 2-12-0. 16 బెంగాలు మణుగుల బరువు మోయడానికి బండికి రు.1-6-0 మాత్రమే అవుతుందన్న మాట. ఒక్క ఎద్దులబండీ

ఒక రోజులో గ్రామంలో నుండి అరమైలు దూరాన ఉన్న పొలానికి 7, 8 బళ్ళ ఎరువు తీసికొనిపోతుంది. అందువల్ల రు. 1-6-0 బండీ ఖర్చులును, ఎరువు బండిలో పోయడానికీ తీయడానికీ కావలసిన పైమనిషికి 0-6-0 మొత్తం 1-12-0 అవుతుంది. ఈ పనిచేయడానికి మోటారు లారీని ఉపయోగించినట్లయితే తక్కువ ఖర్చు కాదు. మంచి కంకర రోడ్డు పైన ఒక్క సారే చాలా దూరం పోవలసివచ్చినట్లయితే మోటారు లారీలు ఎక్కువ లాభదాయకం. అటువంటి సందర్భాలలో చాలానెమ్మదిగా నడిచే ఎడ్లబండ్లు అందువల్ల లాభదాయకం కాదు. అంతేకాక ఒకేపర్యాయం జంతువులను చాలాదూరం నడిపించడం వలన వాటి బలము, శక్తి నశిస్తుంది.

అధ్యాయం 14

విద్యా పునర్నిర్మాణం

జాతీయ విద్య

నేటి సంఘటనలు అపూర్వ లక్షణంతో అత్యంత వేగంగా నడుస్తూన్నవి. మన పిల్లలు పెరుగుతూన్నప్పుడు వారి అవయవ సౌష్ఠవాల్లో గలిగే మార్పులను చూస్తూన్నప్పటికీ ఎలా గమనించలేమో అలాగే దేశంలో కూడా, సాంఘిక నిర్మాణంలో, సిద్ధాంతాలలో ప్రజా సంస్థలలో అతి వేగంగా కలుగుతూన్న సంపూర్ణ పరివర్తనాలను కూడా గమనించ లేకుండా ఉన్నాము. దీనికి కారణం, రోజురోజూ, గంటగంటా జరిగే అభివృద్ధిని చూస్తూండడమే, ఈ మార్పు యాభై సంవత్సరాలనుండీ మన కళ్లయెదుట జరుగుతూన్నది.

ఈ సంగతి భారత రాజకీయ పోరాటాల విషయంలోనూ, నిర్మాణ కార్యక్రమ శాఖల విషయంలోనూ కూడా యథార్థంగా వర్తిస్తుంది. రాజకీయాలు బహిరంగంగా ప్రజల దృష్టిని ఆకర్షిస్తవి. నిర్మాణ కార్యక్రమం నిశ్శబ్దంగా తెలియకుండా జరుగుతూంటుంది. హిందూస్థాన్ తాలిమీ సంఘం మొదటి మూడు సంవత్సరాలలో నిర్వర్తించిన కార్య విస్తీర్ణతను గమనించినప్పుడు మా కాశ్చర్యం గలిగినందున పైమాటలు చెప్ప వలసివచ్చింది. గాంధీజీ, విద్యా విషయంలో గానీ ఆర్థిక విషయాలలో గానీ, నైతిక రాజకీయ విషయాలలో గానీ చెప్పిన అభిప్రాయాలు కొత్తవికావు. కాని ఆయన వాటిని

బోధించిన విధానం మాత్రం ప్రపంచాని కాశ్చర్యం కలిగించింది. మీరొక రోగానికి చికిత్స చేయవలెనంటే యేషధ్ధతుల మీద ఆ చికిత్స ఉండాలో ముందు నిర్ణయించుకోవాలి. రోగంలోని ప్రతి గుణానికి ఔషధాన్ని నిర్ణయించేవాడు చేత కాని వైద్యుడై యుండాలి. ముందు రోగనిదానం చేసి, చికిత్సా విధానాన్ని నిర్ణయించుకొన్న వైద్యుడు, రోగం కుదర్చగలడని చెప్పవచ్చు. ఇప్పుడు ఇండియా అనుభవిస్తూన్న వ్యాధి యేమిటి? పట్టణాల ముందు గ్రామాలు నిర్లక్ష్యం చేయబడడమా? గ్రామ పరిశ్రమలు పోయి యంత్రాలు పైకెక్కడమా? స్వదేశీ వస్తువులకు బదులుగా విదేశీ సరుకు దిగుమతీ కావడమా? దేశీయ సంస్కృతి నశించి విదేశ సంస్కారం వ్యాపించడమా? స్వయంసంపూర్ణత అడుగంటి ముడి పదార్థాలకోసం అంగళ్లకోసం పాకులాడే అడియాస అధికం కావడమా? ఆత్మసంతృప్తిగల జాతీయత, సర్వభక్షక సామ్రాజ్యతత్వంచేత కుంగిపోవడమా, చట్టం ముందు న్యాయ్యం అడుగంటడమా, పంచాయితీలుపోయి వ్యాజ్యాలు పెచ్చు పెరగడమా, సత్యం మాయమై లా కోర్టులలోని మోసపు మాటలకు విలువ హెచ్చడమా, ధర్మాలను గమనించకుండా హక్కుల కోసం పోరాడడమా, ఐకమత్యం కంటె కక్షులను ప్రధానంగా భావించడమా, నిషేధం లేకుండా ముడి పదార్థాలను పుచ్చుకోవడమా? సహకారం కంటె స్పర్థకు చోటీయడమా, ఆనందంగా జీవనం చేయడం మాని పరస్పర హత్యా బుద్ధితో రక్తపిపాసులై సంచరించడమా? — ఇవన్నీ

రోగలక్షణాలు. అహింసపైన హింస ఆధిపత్యం వహించడం అసలు రోగం. కాబట్టి గాంధీసిద్ధాంతంలోని అసలు పనితన మంతా ఆయన నిర్మాణ కార్యక్రమంలో ఇమిడి వున్నది. అదే ఆయన రాజకీయ పోరాట విధానానికీ ఆయన నిర్మా ణన కార్యక్రమానికీ రెండోవైపు. నిర్మాణ కార్యక్రమాన్ని గూర్చి సంగ్రహంగా చెప్పవలసివస్తే, క్రియా రూపకమైన అహింస అని చెప్పాలి. ఒకచోట ప్రాథమిక విద్యా విధానం సంస్కరింప బడవచ్చును. మరొకచోట ఖద్దరుద్వారా ఆర్థిక నిర్మాణం పునరుద్ధరింపబడవచ్చును. ఇంకొకచో అస్పృశ్యతా నివారణ మూలకంగా జాతీయైక్యతకోసం ప్రయత్నాలు జరుగవచ్చును. ఈ అన్నిటిలోనూ అహింసాక్రియ మూర్తీ భవించి ఉంది. ఎందువల్లనంటే విదేశీవస్తువుల దిగుమతి మూలకంగా అన్నంలేక అల్లాడుతూన్న గ్రామస్తులకు ఖద్దరు ఆహారం కల్పిస్తుంది. హరిజనుల ఆత్మగౌరవానికీ, మర్యాదకూ భంగకరంగా ఉన్న అంటరానితనం రూపుమాయడంవలన వారికి సాంఘికౌన్నత్యం కలుగుతూన్నది. విదేశీ ప్రభుత్వానికి దాసులనుగాజేసి వారి నైతిక సాంఘికవిజయాలకు దోహదం చేసిన ప్రస్తుత విద్యావిధానానికి బదులుగా జాతీయ విద్యా సంస్థాపనం వలన దేశంలో సర్వతోముఖంగా అభ్యుదయ బీజాలు అంకురిస్తూన్నవి.

బిడ్డ - జాతి

విద్య జాతీయావసరముల కనుగుణంగా బిడ్డను అభివృద్ధిచేసే ఒక కళ, ఒక శాస్త్రం. అది యువకులను సాంఘిక యంత్రనిర్మా

ణంలో తగిన భాగాలుగాచేసే విధానమనికూడా కొందఅం టారు. పుట్టిన ప్రతిబిడ్డ కేవలం తల్లిదండ్రుల సొత్తుకానీ కుటుంబానికి ఆధారం కానీ కాదు. అది జాతిధనం. కాబట్టి ఆబిడ్డకు ఇచ్చేశిక్షణ జాతీయాదర్శాలకూ, వాంఛలకూ అనుగుణంగా ఉండాలి. ఏమిటీ ఆదర్శాలు? అవి ప్రాచ్యపాశ్చాత్య దేశాలకు వేరువేరుగా ఉన్నవి. పాశ్చాత్యదేశాల వారికి అధికారం కావాలి. వారి పరిశ్రమలు అభివృద్ధి కావాలి అందుకు తగిన ముడిపదార్థా లొకమూలనుండి రావాలి. మరొకమూల వారి వస్తువుల అమ్మకానికి తగిన అంగళ్లు ఉండాలి. ఇవన్నీ ఉన్నప్పుడు వారి పారిశ్రామి కౌన్నత్యమును నిలుపుకోవడానికీ, సాగించుకోవడానికీ రాజకీయాధిక్యతను కోరడం సహజం. ఇదంతా శాంతి సమయంలో అనగా తక్కిన దేశాలు వారికి బలికావడానికి నోరెత్తకుండా ఒప్పుకొంటూన్నప్పుడు జరిగే పని. ఏ నాడా దేశాలిందు కంగీకరించవో ఆనాడే యుద్ధం వస్తుంది. కాబట్టి శాంతిసమయంలోనే యుద్ధానికి సన్నాహాలు జరుగుతూండాలి కనుక ప్రతియుద్ధము శాంతితో అంతమైనట్లు, ప్రతిశాంతి స్థాపనము యుద్ధానికి భావిసూచకంగానూ సన్నాహంగాను పరిణమిస్తూన్నది. పాలక దేశాల యువకులు సామ్రాజ్యతత్వము నందును, పాలిత దేశాల యువకులు బానిసత్వము నందును శిక్షణపొందవలసివస్తూన్నది. అందువలననే విద్యాపరిశ్రమలు సాంఘికైకమత్యము, స్వయంసంపూర్ణత— వీటిలో పాలక పాలిత దేశాలకు సంఘట్టనం, కలుగుతూన్నది. పాలిత పాలక దేశాల ఆదర్శాలు భిన్నంగాఉండితీరాలి. గాంధీ ప్రారం

భించిన ప్రాథమిక విద్యావిధానం చూడగానే స్వప్నవృత్తాంతంగా తోచవచ్చును. కాని స్వపరిపాలిత దేశాలలోని విద్యావిశారదులు ఇంతవరకూ అవలంబిస్తూన్న 'లాబ్యాకు' పద్ధతికీ దీనికీ ఏమీ భేదం లేదు. బ్రిటనులో గ్రామ, కుటీరపరిశ్రమలు ఎక్కడో మూరు మూలలలో ఒదిగి ఒదిగి ఉంటవి. కాని మిల్లులు, ఫ్యాక్టరీలు, యువకులకు నిజమైన శిక్షణాలయాలు. ఇక ఏ కొద్దిమంది యువకులో విశ్వవిద్యాలయ శిక్షణపొంది బ్రిటిష్‌సామ్రాజ్యంకిందఉన్న 62 దేశాలలోనూ పరిపాలకులుగా తయారవుతారు. మన దేశంలోని జనసంఖ్యలో నూటికి 80 మంది గ్రామాలలో నివసించే వారే. కాబట్టి పురాతన గ్రామ పరిశ్రమలను అణగదొక్కే యంత్ర నాగరికత నూటికి 80 మందికి వినాశహేతువుగా పరిణమిస్తుంది. కాబట్టి మన ప్రాథమిక విద్య మన జాతీయ జీవితానికనుగుణంగా యువకులను తయారు చేసే పద్ధతిలో ఉండాలి.

> క్రైస్తవ ధర్మాధ్యాపకునికి అన్ని ఆత్మలూ విలువగలవే.
> జడ్జికి అన్నివాక్కులూ రక్షించబడ దగినవే.
> కాని ప్రొఫెసరుకు అందతీబుద్ధులు సమానమైనపదును గలవికావు.
> ధర్మజ్ఞానంలోను న్యాయశాస్త్రంలోనూ అంతా ఒకటే అని చెప్పితే చెప్పవచ్చునుకాని యూనివర్సిటీలోమాత్రంఅలాచెప్పడానికి వీలులేదు. అక్కడ మధ్యరకపు తెలివి తేటలు పనికిరావు. సోదరమానవులకు మార్గదర్శకమైన అఖండ పాండిత్యం ఉండితీరాలి.
> తీరికగల భాగ్యవంతులు కష్టజీవులకంటె అధికులుగా ఎన్నడూ పరిగణింపబడకూడదు.
>
> — జాక్ ద్యూయీ

విద్య పరిసరాల ఫలితం. మనం స్వయంపోషణ, ఆత్మ గౌరవం, తెలివితేటలు గలిగి పనిచేయాలి. పారిశ్రామిక జీవితంలోవలె సాంఘిక, ప్రాకృతిక సిద్ధాంతజ్ఞానంలో స్పర్థ ఉండదు.

విద్య సంఘక్షేమంకోసమే వినియోగింపబడవలె నని గాంధీ అభిప్రాయం. ఇప్పుడది వ్యక్తుల కోరికలను తీర్చడాని కుపయోగపడుతూన్నది.

నేటి యూనివర్సిటీవిద్య పెట్టుబడిదారీ విధానానికి చెలికత్తె. అది పెద్దపెద్ద పరిశ్రమలకోసం భౌతిక శాస్త్రజ్ఞులనూ ఇంజనీయర్లనూ తయారుచేస్తుంది. కాని రాటంవంటి గృహపరిశ్రమలకేమీ ఉపయోగపడదు. కాబట్టే గ్రామాల సహాయార్థం వార్ధా విద్యావిధానం ప్రారంభించబడినది.

ఇటీవల భారతజాతీయ మహాసభకు మఱియొక అంగంగా, అఖిల భారత జాతీయవిద్యాసంఘం ఒకటి, అ. భా. చ. సంఘమునకూ, అ. భా. హరిజనసంఘమునకూ సమానప్రతి పత్తిలో ఉండేపద్ధతిని స్థాపింపబడినది. ఈ విధంగా మన నిర్మాణకార్యక్రమం అ. భా. చ. సం. ద్వారా పారిశ్రామిక జీవితానికీ, హరిజనసంఘం ద్వారా నైతికజీవితానికీ, జాతీయ విద్యాసంస్థద్వారా ఆర్థిక సాంఘికజీవితానికీ నూతన రూప మిస్తూన్నది.

జాతీయ విద్యా సంఘ ఆదర్శాలను, కార్యక్రమాన్ని ఇండియాప్రభుత్వమునకు చెందిన విద్యాశాఖాధికారి మిస్టరు

సార్జెంటున్నూ, మద్రాసు విద్యాశాఖా డైరెక్టరు మిస్టరు స్టాతమున్నూ, ఇంకా అనేకమంది విద్యాశాఖాధికారులున్నూ విద్యా విశారదులున్నూ శ్లాఘించారు. 30 సంవత్సరాలు చేసిన ప్రయత్న ఫలితంగా వ్యతిరేక మార్గాలను నడుస్తూన్న రెండు విద్యా విధానాలను — ప్రభుత్వ, జాతీయవిద్యా విధానాలను — ఒకేదోవకు తీసికొని రాగలిగినాము. ఈ ఉభయ విధానాల కలయిక వలన పొంగి పొరలెత్తిన భావతరంగాలు, సంఘ నివేదికల రూపంలో బయల్వెడలి జాతీయ సంస్కృతీ వాహినిని విశాలం చేస్తూన్నవి. అవి కేవలం విద్యా ప్రపంచానికే గాక, జాతీయాదర్శాల కను గుణంగా శిక్షింపబడిన యువకుని సామర్థ్యంమీద ఆధార పడవలసిన భావిభారత భాగ్యోదయానికి కూడా ఎంతో అమూల్య సేవ చేస్తూన్నవి.

జీవిత విశ్వవిద్యాలయం

స్వేచ్ఛా వాతావరణంలో, సంఘటనా విద్వత్పరిషత్తు లలో, మానవ సంభాషణా విద్యా మందిరాలలో, సద్గ్రంథ సాహచర్యంలో, ఉదార భావపూరిత కార్యకలాపనియతితో మన జనసామాన్యం బుద్ధివైభవం, ధైర్య వివేకాలు సంపూర్ణ ఆత్మ నిగ్రహం సంపాదించి నరేంద్ర మండలిలో మెలగుతూ వారికి మకుటాయమానంగా ఉండగలగాలి. నేటి విశ్వవిద్యా పరిషత్తుల సంకుచిత విరుద్ధ సిద్ధాంతాలు ఆ విధానాన్ని పరమ దైవంగా భావిస్తూన్నవి. వాటిని విడిచివేయు వలసిన తరుణ

మాసన్నమయినది. పరీక్షా ఫలితాలు పరమావధిగా ఉండ కూడదు. పద్ధతులు మంచివిగా ఉండాలి. పాండిత్యం బుద్ధి వైభవానికి దోహదం చేయాలి. విద్యాపద్ధతి అంతకూ శీలం అలంకరణంగానూ, సంస్కృతి ఆదర్శంగానూ ఉండాలి. నిష్కళంకమైన దృక్పథము, స్పష్టమైన ఊహ, ఉచితమైన భావం, ఉదారమైన సంకల్పము కలిగించి ప్రజలను తమ దేశసౌభాగ్యంకోసం పనిచేసే ప్రవీణులనుగా తయారు చేయగలిగి ఉండాలి విద్య. ఈ విశ్వాసంతో పని చేస్తూన్న జాతి ప్రస్తుత పరివర్తనాలలో గాని, రానున్న పరిణామాలలోనూ, పోరాటాలలోనూ గాని, లక్షలాది ప్రజల ప్రేమకూ కృతజ్ఞతకూ పాత్రమై, కనీసం పదమూడు వేల సంవత్సరాల నుండి ప్రపంచ సభ్యజాతులలో సగర్వంగా నిలబడ్డ హిందూస్థానాన్ని నిష్కళంకితంగా తమ భావి సంతానానికి సమర్పింప గలదు. ఇదే మన విద్యా విధానాన్ని గూర్చి గాంధీ ఆశయం - ఇదే ప్రజా సమూహంలో ఆకారం తాల్చిన ఆదర్శం - ఇదే విశ్వాసమనే అగ్నిలో ఎఱ్ఱగా కాల్చబడి జీవితానుభవము లనే సమ్మెట పెట్లతో రూపం పొందిన సిద్ధాంతం. - ఇదే ప్రజలను తన వెంటరమ్మని ఆదేశిస్తూన్న దృక్పథం, ఆ ఆదర్శంకోసం ఆసిద్ధాంతం కొఱకు, ఆ దృక్పథం నిమిత్తం స్వార్థాలను త్యజించడం వలననే, గాంధీకి, గాంధీతో ఉన్న కొంత మందికీ, ఆకీర్తి ఆ దక్షత కలిగినవి. డిగ్రీలను బట్టి, ఆస్తిని బట్టి, మరణకాలంలో విడిచి వెళ్ళిన ఐశ్వర్యాన్ని బట్టీ మనుష్యుల విలువను గొప్పతనాన్నీ కొలుస్తూండడం మాకసహ్యం. మనిషి స్వప్ర

యోజనం కోసం జీవిస్తూన్నాడా! లేక ప్రజాక్షేమం కోసం జీవిస్తూన్నాడా అనేదే మనిషి గొప్పతనానికి సరియైన పరీక్ష. వాడు చదువుకొన్న చదువు స్వార్థం కోసం ఉపయోగ పడు తూన్నాదా? ప్రజాసేవలో వినియోగ పడుతూన్నదా? అనే ప్రశ్నకువచ్చే ప్రత్యుత్తరాన్నిబట్టి విద్యాపద్ధతి మంచిదా కాదా అని నిర్ణయించాలి. ఆర్థిక, జాతీయ సంస్కృతులకు సంబంధించి, జాతీయ విద్యా విధానాన్ని పరిశీలించవలసి యున్నది. ముందు ఆర్థిక విద్యాస్వరూపాన్ని విచారిద్దాము.

(1) ఆర్థిక దృష్టి

ప్రతి కాలంలోనూ, ప్రతి యుగంలోనూ, ప్రతి శకం లోనూ కూడా ఏదో ఒక విషయంపైన ప్రజలలో తీవ్రవిభే దాలూ, వాద ప్రతివాదాలూ చెలరేగుతూనే ఉంటవి. ఒక కాలంలో వ్యక్తిగత నిరంకుశాధికారము, మరొక యుగంలో మధ్యతరాలనాటి జమీందారీ విధానం, మరొక శకంలో జాతీయ తత్వమూ విజృంభిస్తూ ఉండినవి. ఈ విశాల దృక్పథ ములే అనేక స్థానిక శాఖావిభేదాలుగాను, సాంఘిక విభా గాలు గానూ, వివిధ వర్గాలు గాను, విభిన్న సంప్రదాయ సమూహములు గానూ పరిణమిస్తూంటవి. ఆ పరివర్తన కాలం లోనే వ్యాపారం లాభాలకోసం చేయాలా ప్రజా క్షేమం కోసం చేయాలా? పరిశ్రమలకూ శిల్పానికీ సంబధం లేకుండా చేయవచ్చునా? యంత్ర సామగ్రి కళాభివృద్ధికి దోహదం చేస్తుందా; అభ్యంతరం కలిగిస్తుందా? కళాకౌశలమునకు

పాండిత్యమూ, జ్ఞానమూ, అవసరమా ? విద్య దైవపూజ వలె వ్యక్తిగతంగా ఉండాలా లేక సామాజికంగా ఉండాలా? పాఠశాలలు స్వతంత్రంగాను, స్వచ్ఛందంగానూ ఉండాలా; లేక అచ్చును గుద్దినట్లు దేశమంతా ఒకే పద్ధతిని నడుస్తూండాలా? పరీక్ష, తప్పకుండా ఉండదగిన భాగ్యమూ లేక తప్పించుకోవడానికి వీలులేని పాప ఫలితమా? ఉద్యోగాలూ వివాహ సంబంధాలూ పరీక్షా ఫలితాలనుబట్టీ, డిగ్రీలను బట్టీ లభించ వలసిందేనా ? ఎవడి అంతరాత్మకు తోచినట్లు వాడు నడుచుకోవడంలో జీవితం సుఖప్రదంగా ఉంటుందా లేక శాసనమును బట్టి ప్రజాభిప్రాయమునుబట్టీ నడుచుకోవడంలోనా ? — అనే ఈ ప్రశ్న లన్నీ రాజనీతి విశారదులను, రాజకీయ ధురంధరులను, విద్యా ప్రవీణులను, సంఘ సంస్కర్తలను, ఆర్థిక శాస్త్రవేత్తలను, భౌతిక శాస్త్రజ్ఞులను, ఎదుర్కొంటూ దేశంలోని స్త్రీ పురుషుల తీరిక సమయాలలో తీవ్రవాద ప్రతివాదములకు కారణము లవుతూన్నవి.

అక్షర జ్ఞానము : సంస్కృతి

విషయాన్ని విచారించడంలో, చదువుకోని వాళ్ళంతా సంస్కారం లేనివాళ్ళనీ, చదువనూ వ్రాయనూ తెలిసిన వాళ్ళుమాత్రమే సంస్కారం కలవాళ్ళనే సర్వసాధారణాభిప్రాయాన్ని ముందుగా మన మనస్సులలోనుండి మనం తొలగించుకోవాలి. హిందూదేశంలోని మన గొప్పగొప్ప పండితుల్లలోనూ, ఉలేమాలలోనూ అనేక మందికి అక్షర

జ్ఞానమే లేని సంగతి మనకు తెలుసు. ఇది వింత విషయమే. కాని వారు చక్షురక్షరసంయోగం లేకుండా శాస్త్రం కంఠస్థం చేసుకొన్నమాటమాత్రం నిజం. సంస్కారానికి అక్షరజ్ఞానం ప్రధానం కాదు. యుగయుగాలనుండీ కూడా ఇదే విధంగా భారతీయ విజ్ఞానం నిలబడి వ్యాపిస్తూన్నది. ఒక్క విజ్ఞానమే కాదు సంస్కృతికూడా తండ్రినుండి కొడుకుకు పరంపరగా వస్తూనే ఉన్నది. ప్రతి యిల్లూ పాఠశాలయే. ప్రతి తండ్రీ ఉపాధ్యాయుడే. ప్రతి కుటీరమూ కర్మాగారమే. ప్రతిరోజూ చేసే పనియే శిక్షణ. పనిలోని ప్రతి పరిణామ విధానమూ ఒక పరీక్ష. ఉత్పత్తిచేసిన ప్రతి వస్తువూ ఒక డిగ్రీ. ఈవిధంగా ప్రతి కర్మకారుడు జీవిత విశ్వవిద్యాలయంలో మానవ పరిశ్రమ కళామందిరంలో సుప్రసిద్ధ శిల్పాచార్యుల, లేక శాస్త్రవేత్తల సాహచర్యంలో, సంభాషణా పరంపరలలో ఒక పట్టభద్రుడవుతూన్నాడు.

మన దేశంలో చదువుకు మొదలు పట్టి పసుగువచ్చే పాఠ్యక్రమా (syllabuses) లేర్పాటుచేయబడినవి. అవి అందరికీ ఒక్కటే. విద్యార్థుల యోగ్యతలతో, అభిరుచులతో, తెలివితేటలతో, సంఘ మర్యాదలతో, సభ్యతలతో, జీవితావసరాలతో, నివాసప్రదేశాలతో యేమీ సంబంధ ముండదు వాటికి. అది విద్య కాదు- ముద్రణాయంత్రం; సంస్కృతి కాదు - అర్థం లేనిచదువు; పరీక్ష కాదు - జూదం; విజయంకాదు - గాలిపాటు. ఇంతా అయితే అతనికి అన్ని వైపులా శూన్యం, ఎక్కడ చూచినా పెద్ద గొయ్యి. కింద అంతు లేని అగాధం,

పైన అంటరాని ఆకాశం. విశ్వవిద్యాలయాలు స్థాపించబడి నప్పటినుండి ఈనాటివరకూ ఈ మార్గాలలో 80 సంవత్సరాలు గడిపాము. ఇంకా ఎంత కాలం ఈ అస్వాభావ ప్రయత్నంలో మన జీవితాన్ని వృథాచేయాలి.

జీవితము - విద్య

మనం పుట్టిన క్షణంనుండీ రోజూ నేర్చుకొంటూనే ఉన్నాము. ఏకష్టమూ లేకుండా ముందు ఊపిరి పీల్చడం తరువాత కారణం లేని చిఱునవ్వులు నవ్వడం, పిదప పాల కోసం ఏడవడం, పిమ్మట ఉయ్యాలలో దొర్లడం, చివరకు కూర్చోవడం, నిల్చుండడం, నడవడం, పరుగెత్తడం, పడడం లేవడం, ఉరకడం, ఆడడం అన్నీ నేర్చుకొంటూన్నాము. మూడేళ్ళ బిడ్డ చిట్టిచిట్టి మాటలు చెప్పడమేకాదు పెద్దపెద్ద వాక్యాలు దొర్లిస్తుంది. ఐదేళ్ళ బిడ్డ నీతో వాదించి తప్పు పట్టుకొంటుంది. ఏడేళ్ళ అల్లరిపిల్లకాయ భౌతికశాస్త్రంలోని ఆశ్చర్యకర విషయాలనుగూర్చి ప్రశ్నించి మనకు తెలియదని పిస్తాడు. పదేళ్ళ బిడ్డకు స్వతంత్రాలోచన ప్రారంభ మవుతుంది. పదునాలుగేళ్ళవాడు పనిచేయడం ప్రారంభిస్తాడు. 18 ఏండ్లవాడు కళాకౌశలం సంపాదించి మనకు కావలసిన గృహోపకరణాలను, జీవితావసర వస్తువులను తయారు చేయడం మొదలుపెడతాడు. శిల్పకళావస్తువుల నమూనాలను గీసుకొని ఆప్రకారం తయారుచేస్తాడు వాటిని. ఇళ్లను మనోహరంగా అలంకరిస్తాడు. ప్రకృతి దృశ్యాలను చిత్రి

స్తాడు. బొమ్మలు వేస్తాడు. బట్టలు నేస్తాడు. నగలు చేస్తాడు. పరిసరాలను సౌందర్యవంతంగా చేస్తాడు, వంట చేస్తాడు, రోగుల ఉపచారం చేస్తాడు, ఇళ్లు కడతాడు, పనిముట్లను తయారు చేస్తాడు, పంటలు పండిస్తాడు, తోటలు వేస్తాడు పశువులను మేపుతాడు, దున్నుతాడు, విత్తనాలు వేస్తాడు, కలుపు తీస్తాడు, కోతకోసి ధాన్యం నూరుస్తాడు.

వృత్తి పక్షపాతం

వేలకొలదీ వృత్తులు, కళలు, శిల్పవిద్యలు, వ్యాపారాలు ఉన్నవి ఇండియాలో - వీటిని బోధిస్తూన్న వారెవరు? పరీక్షలలో జయాపజయాలను నిరూపిస్తూన్న దెవరు? గెలిచిన వారికి బహుమానాలు, తప్పినవారికి శిక్షలూ యెవరు నిర్ణయిస్తూన్నారు? - కుటుంబం తల్లి దండ్రులు, మేస్త్రీ, ముఠా నాయకుడు, సంఘం - వీరి మూలమున భారతీయ సంస్కార రేఖలు చెక్కు చెదరకుండా అనేక రూపాలలో విరాజిల్లుతూ న్నవి. కాబట్టి ఇప్పుడు మనకు కావలసినది ఒక విధమైన విద్యా మందిర పద్ధతి. ఆపద్ధతి ప్రకారం పురాతన శిల్పకళల యెడల వృత్తుల యెడల, పరిశ్రమల యెడల పక్షపాతం వహించి శిల్పాన్ని ప్రయోజనంతో సమ్మేళనం చేయగల దక్షత చేకూర్చడమే మన కర్తవ్యము. ప్రతి వస్తువూ ఉపయోగ కరంగా కళానైపుణ్యంతో ముద్దులు మూటగట్టుతూ ఉండాలి. ఇటువంటి సంఘ నిర్మాణం గలిగినందువలననే హిందూ దేశ మొక పెద్ద సహకార సంస్థవలె - అనేక సమష్టి కుటుంబాలనే

కార్మిక సంఘములతో కూడిన కోఆపరేటివ్ ఫెడరేషనువలె ఉండేది. ఇందువలన భారతదేశమే గాక దాదాపు దేశంలోని ప్రతి గ్రామమూ కూడా స్వయం సంపూర్ణంగా ఉండేది. నేటి పాశ్చాత్య యంత్రోత్పత్తుల మూలమున గలిగిన నిరుద్యోగత కిది ఒక్కటే నివారణోపాయము.

కాబట్టి భావి భారతదేశంలోని విద్యా విధానం చాలా ప్రాముఖ్య స్థానం వహించగలదు. మన యువకులకు, ఏపనికి వారు తగియుండేటట్లుగా మనం శిక్షణ ఈయాలో నిర్ణయించుకోవాలి. పోటీపడి ఉత్పత్తిచేసే విధానం మన కక్కర లేదు. మనకు కావలసినది స్వయం సంపూర్ణత. అందుకు గాను మన పురాతన వృత్తులపైన వారికి పక్షపాతం కలిగించి తగిన శిక్షణ ఈయాలి. అప్పుడు హిందూ దేశపు మారుమూలలు కూడా స్వయం సంపూర్ణాలుగా ఉంటవి. వార్ధా ప్రణాళిక లోని విద్యా విధానమిదే. కాలం గడచినకొద్దీ దానిలోని ఆదర్శాలింకా వెల్లడియై ప్రజలసందేహాలకూ ప్రభుత్వోద్యోగుల విమర్శనలకూ సమాధానం కుదురగలదు. ఖద్దరు విషయంలో జరిగిందంతే కదా ? ఇరవై సంవత్సరాల నుండి అవిశ్వాసంతో అభ్యంతరాలు పెట్టినవారు నేడు ఆహాహా అంటూన్నారు.

నూతన వ్యవస్థ

ఖద్దరు అర్థశాస్త్రంలో ఒక క్రొత్తపంథాను చూపిస్తూన్నది. విద్య, ఆర్థిక విషయాల్లు - ఈ రెండు ఒక దానిపైన ఒకటి

ఆధారపడి ఉంటవి. కాబట్టి ఖద్దరు తదితర గ్రామ పరిశ్రమలూ ప్రచారంలోకి రాగానే, విద్యా విధానంలో వాటి కనుగుణ మయిన మార్పును కాంగ్రెసు అవలంబించ వలసియున్నది. బ్రిటిష్‌వారి విద్యావిధానమిప్పుడు పనికిరాదు. అది వారవలంబించిన ఆర్థిక విధానాని కనుగుణంగా ఉంది. మన ఆర్థిక విధానాన్ని కనుగుణంగా మన విద్యా పద్ధతి ఉండాలి. ఇందులోమాత్రం ఏమీ పొరపాటుపడకూడదు. మన మిప్పుడు ప్రతి విషయంలోనూ సంపూర్ణపరివర్తనం కోరుతూన్నాము. పాత పద్ధతులు మూటాముల్లె కట్టుకొని పోవచ్చు నిక. ప్రతి వృత్తిలోనూ నూతన విధానం ఆరంభం కావాలి.

అయితే మనకు కొన్ని చిక్కులు లేకపోలేదు. మనమంత్రులకూ పెద్ద పెద్ద పర్మినెంటు ఉద్యోగస్థులకూ కూడా పూర్వపక్షపాతాలూ పూర్వ వాసనలూ పోలేదు. మన విరోధి విధానమునుండి ఉత్పత్తి అయిన సరుకది. కాబట్టి అందుకు భిన్నంగా వారుండజాలరు. కనుక వారి సభలను, వారి తీర్మానాలను గమనించేటప్పుడు మనమాసంగతి మాత్రం మఱచిపోగూడదు. మొదలు సత్యాగ్రహం దుస్తరమనిపించింది. పిదప సత్యాగ్రహ ఫలితాల కనుగుణంగా పునర్నిర్మాణం చేయ ప్రారంభించినపుడు మూకది ఏటికి ఎదురీత వలె కనిపించింది. కాని తరువాత సులువైనది. అదే విధంగా వార్ధా విద్యా విధానంకింద నడచే పాఠశాలలు కూడా కేవల ప్రదర్శ కేంద్రాలుగా గాక జాతీయ పునర్నిర్మాణ మహా కార్యక్రమంలో మార్గదర్శకము లయ్యేరోజు త్వొందరలోనే

రాగలదు. వాటిని ఆర్థిక సంస్థలనండి, విద్యా సంస్థలనండి. రెండిటికీ అవినాభావ సంబంధమే.

సంస్కార దృష్టి

కాంగ్రెసు మంత్రు లధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఇంకా జాతీయ విద్యనుగూర్చి మాట్లాడుతూనే ఉంటారు; ఇప్పుడా విద్యా విధానాన్ని ఆచరణలోకి తీసికొని రావచ్చును గదా ? దాని స్వరూపమేమిటో ఇప్పుడేల వెల్లడించ రాదని మమ్మల్ని చాలా మంది అడుగుతూంటారు. ఇది నిజమే కాని మా మంత్రుల అధికారం నామ మాత్రం. వారు ఉద్యోగంలో ఉన్నారు. కాని సంపూర్ణాధికారాలు చలాయించ లేకుండా ఉన్నారు. నిజమైన అధికారాలన్నీ ఆయా శాఖల ఉన్నతోద్యోగుల చేతులలో ఉన్నవి. వారు పూర్తిగా కాదు సరిగదా కొంత వఱకైనా మంత్రుల ఆజ్ఞలకు లోబడడం లేదు. అంతే కాదు మంత్రుల ఆశయాలతో గాని, భావ ప్రవృత్తులతో వారికే మీా సానుభూతి లేదు. మన మింకా గానుగ ఎద్దువలె ఆ పూర్వపు గాడిలోనే అడుగు తప్పకుండా చుట్టుతిరుగు తూన్నాము. బళ్ళో వేసినప్పటి నుండి చదువు ముగించే వరకు మాతృ భాషలో మన బాలురకు పాఠాలు చెప్పించ లేకుండా ఉన్నాము. పరీక్షలపైన వ్యామోహం పూర్వం ఎంత ఎక్కువగా ఉన్నదో ఇప్పుడూ అంత ఎక్కువగానూ ఉన్నది. కేవలం భాష నేర్చు కోవడమే విద్య అనే దురభిప్రాయం నేటికీ, ఉపాధ్యాయులలో గాని,

బాలురలో గాని, తల్లిదండ్రులలో గాని పోలేదు. అందువలన పనిలేని జనం ఎక్కువ కావడం తప్ప ప్రయోజనం లేదని తెలిసి కూడా ఆ చదువు మాన లేకుండా ఉన్నాము. ఒక వంక ఎంతో డబ్బు ఖర్చుపెట్టి నిరుద్యోగతను చేతులారా తెచ్చుకొని మరొక వంక దేశం నిరుద్యోగ సమస్యతో పీడింపబడుతూన్నదని గోల చేస్తూన్నాము. ఈ రోజున యువకులకు ఇంకా విశ్వవిద్యాలయ పట్టపరీక్షలపైన వ్యామోహం పోలేదు. వారికే పరిశ్రమలపైన శిల్పకళలపైన వర్తకంపైన మోజు కలిగి నట్లయితే గౌరవంగా జీవించ వచ్చును గదా? అయితే మన బాలురకు మనము నేర్పగల పరిశ్రమగానీ, వృత్తిగానీ వ్యాపారం గానీ యేమిటని మళ్ళీ ప్రశ్న వస్తుంది. మన యువకులు భావిభాగ్య సూచకమైన జాతీయ విద్యా సమస్య కూడా దేశంలోని పౌరుల భవిష్యద్భాగధేయమున తగిన జాతీయ స్వాతంత్ర్య సమస్య వంటిదే. మనకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంటేనేగాని మన జాతీయాభ్యుదయమునకు కావలసిన, వాణిజ్య, పారిశ్రామిక, శాస్త్రీయఅధికారాలను వినియోగించడానికి వీలు లేదు. అనగా పరాయిదేశాల వారిశ్రేయస్సుకొఱకేర్పడిన పారిశ్రామిక వాణిజ్యరక్షణాలు లేని సంపూర్ణ స్వరాజ్యంలోనే తప్ప భారతదేశ క్షేమాభ్యుదయాలు చిరస్థాయిగా ఉండవు. జాతీయ విద్య సర్వతోముఖంగా నిర్వర్తించవలసినఆదర్శమిదే. కాబట్టి విదేశపరిపాలనా దాస్యమునుండీ విదేశ పారిశ్రామిక వాణిజ్యశృంఖలముల నుండీమన దేశాన్నివిముక్తి చేసే ప్రయత్నా లేక కాలమందు జరగాలి. ఇందుకు గాను మన జాతీయ సంస్కృతి యందు, దేశీయ శిల్పకళా కౌశ

లము నందూ మన యువకుల హృదయాలులో ఆసక్తి కలిగించాలి. ఇదే జాతీయ విద్యా సమస్యలోని కీలకము ఇందుకే బ్రిటిష్‌విజయం కేవలం రాజకీయ విజయమే కాదు. వాణిజ్య, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక విజయమని మేమంతా నెత్తిని నోరు పెట్టుకొని చెప్పుతూన్నది. యువకుల మనస్సులను, బ్రిటిష్ వారికి అనుకూలంగా ఉండే పద్ధతిని ఒకే అచ్చులో పోత పోస్తూండడం ఇండియాలోని ఇంగ్లీషు వారి స్వప్రయోజనం కోసం. అందువల్లనే ఇంగ్లీషు విజ్ఞానానికీ, ఇంగ్లీషు డిగ్రీలకు, బిరుదులకు, అధికారాలకు, పదవులకు, పింఛనులకు పొంగి బోర్లపడే శిక్షణ యిస్తూన్నారు వారు మన యువకులకు. మన వాళ్లకు ఇంగ్లీషులో మాట్లాడడ మంటే చాలా సరదా. ఇంటికి ఇంగ్లీషులోనే ఉత్తరాలు వ్రాస్తూంటారు. శుభలేఖలు ఇంగ్లీషులో అచ్చు వేయిస్తారు. ఇంగ్లీషు రాజభాషఅని కొంత మందీ, కోర్టులలో, కళాశాలలలో, గాన సభలలో, ఉపయోగిస్తూన్న భాషఅని కొంత మందీ, ప్రభుత్వంవారి ఆర్డర్లు రూల్సు, రెగ్యులేషనులు, స్టాండింగు ఆర్డర్లు, అన్నీ ఇంగ్లీషులోనే ఉంటూన్నవని కొంత మందీ, ఇంగ్లీషుకు ఎక్కడ లేని ప్రాముఖ్యతా అంటగట్టారు. అందువల్ల ప్రజలలో అన్ని తరగతుల వారికీ తమలో తాము మాట్లాడుకొనేటప్పుడు కూడా ఇంగ్లీషు భాషను ఉపయోగించడమే సంస్కృతికి ప్రధాన చిహ్నమనే అపోహ బాగా వ్యాపించింది. శాసన సభలలో, కళాశాలలలో కోర్టులలో మన మాతృభాషలోనే మాట్లాడవలసిందని మామిత్రులను ప్రోత్సహించడం మాకు చాలా

కష్టమనిపిస్తూన్నది. మాతృభాష ద్వారా విశ్వవిద్యాలయాలలో యావత్తు సాహిత్యమూ బోధించ వచ్చుననీ, దేశంలోని రాష్ట్రాలు భాషలను బట్టి విభజింప బడవలెననీ, కోర్టు వ్యవహారాలు కక్షిదారులకు తెలిసిన భాషలో జరిగేయెడల న్యాయ్య పరిపాలన ఎక్కువ స్పష్టముగా ఉంటుందనీ ఎంతో కాలం నుండీ మేము వాదిస్తూన్నాము కాని చాలా మందికి సందర్భాలలో విదేశీభాష నుపయోగించడం వింతగా తోచడం లేదు.

శిల్పపు గనులు

భాషస్థితి ఇలా ఉండగా ఇక సంస్కృతికి సంబంధించిన స్థితి ఇంత కంటె దుర్భరంగా ఉంది. ఈ దేశంలో చిత్రలేఖనమే లేదని నమ్మేటంత వరకూ చదువుకొన్నాము మనం. శిల్పం ఏలాఉంటుందో ఇక్కడి ప్రజలెరుగనే ఎఱుగరనీ, పడమర నుండి వెలుగు రావాలి గాని తూర్పు నుండి రానే రాదనే, మనకు నేర్పిన విద్యలోని సారాంశము. వస్తువుల యథార్థ స్వరూపాలను అనుకరింపవలె ననే ఉత్సాహం, ఆధ్యాత్మిక చిత్రాలను రచించవలె ననే కోరికను మఱుగు పరుస్తూన్నది. దేశంలో శిల్పకళయే విపరీతంగా మారిపోయింది. జయపూరు, ఉదయపూరులను, ఆగ్రా, ఢిల్లీ నగరాలను, బీజాపూరు ఔరంగాబాదులను, మధుర తంజావూరులను అలంకరించిన పురాతన శిల్పకళా విన్యాసములను చులకనగా చూస్తూన్నారు. ప్రాచీన దేవాలయ శిల్పనైపుణ్యం, ప్రతిమా

నిర్మాణ కౌశలం, చిత్రకళా విన్యాసం - ఇవన్నీ పరిశీలించేవారు లేక పాడయిపోతూన్నవి. ఇప్పుడైనా ఈ కళలలో అభిరుచి కలిగించడానికి మన మంత్రులకు అధమం అయిదు వేల రూపాయిలైనా ఖర్చు పెట్టడం అవసరంగా కనిపించ లేదు. తంజావూరు గ్రంథాలయంలోని వ్రాతపుస్తకాలు శతాబ్దాల నుండీ అశ్రద్ధ చేయడంవలన జీర్ణించి పోతూన్నవి. అవి పునరుజ్జీవనం పొందే శుభముహూర్త మెప్పుడు వస్తుందో తెలియదు. ఆ తాటాకు ముక్కల కుప్పలోనూ జీర్ణించి పోతూన్న పాత కాగితాలలోనూ ఉన్న విజ్ఞాన సర్వస్వమును వెలికి దీయవలె నంటే ఎంతో మహాప్రయత్నంచేసి, వ్రాత ప్రతులన్నింటికీ తిరిగీ నకళ్ళు వ్రాయించవలసి ఉన్నది. అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా కొంత ఎక్కువ పైకం వెచ్చించక తప్పదు.

భారతీయ శిల్పం

దేశంలో ఏమూలకైనా వెళ్ళండి, ఆ పురాతన శిల్పకళల ఔన్నత్యం, వైభవం, ప్రతిష్ఠ, అన్నీ కళకళ లాడుతూ చెక్కు చెదరకుండా ప్రత్యక్ష మౌతూంటవి. కాలంగానీ, విదేశీయుల దౌష్ట్యము గానీ వాటిని రూపుమాప లేకపోయినవి. ఈ అత్యద్భుత విషయాలను పరిశీలించడానికి కెక్కడ ప్రారంభించాలి? ఎక్కడ ముగించాలి? అత్యంత శ్రద్ధాభక్తులతో శతాబ్దాల తరబడి చేసిన కృషి ఫలితంగా రాతిలోనూ రంగులోనూ, ఇటుకలోనూ చిత్రించబడిన ఈ పురాతన

ఆదర్శ స్మృతి చిహ్నాలనుగూర్చి వేగంగా సింహావలోకనం చేయదలచుకొన్నాము. కులశేఖర మంటపం, బయలుదేరి తిరువేంద్రం దేవాలయ వితానములపైని మన మనకగా కన పడుతూన్న చిత్రములను చూచి మధురలోని అనంత శిల్ప కళా కౌశలాన్ని దర్శించి, తంజావూరి ప్రతిమా నిర్మాణ కోమల విన్యాసములను వీక్షించి, అక్కడ నుండి రాతి చెక్కడములతో రమణీయములైన బేలూరు హాలిబీడెలకు పోయి కచ్చిలోని వెండి బంగారు నాజూకు తీగల నగిషీ అల్లి కలను స్మరించి, తంజావూరు, మైసూరు, బేలూరు, హాలి బీడెలలో మహోత్కృష్టములని ప్రసిద్ధిగాంచిన నందిమూర్తు లను పరస్పరం పోల్చుకొని పరిశీలిస్తూన్నప్పుడు, ఇంత పని చేయడానికి ఎంతకాలం పట్టిందో, ఎంత ధనం వెచ్చింప బడిందో అని ఆశ్చర్య పడతాము. లేపాక్షి దేవాలయ వితా నములన్నీ మనోహరములైన చిత్రాలతో నిండి ఉన్నవి. అవి నాలుగైదు వందల ఏండ్ల నాటివి. వాటిలో రాజుల యొక్కయు మహోద్దీపక చరిత్రలలోని కొన్ని దృశ్యాలు, రాతిలో చెక్కి, రంగులతో తీర్చి దిద్దబడినవి. ఇవికాక లేపాక్షిలో అనేక అద్భుత శిల్పకళా విషయాలు కలవు. పెద్ద పెద్ద స్తంభాలు పైనుండి కిందకు వ్రేలాడుతూంటవి. కాని కింద ఆనవు. అంతే కాదు; కొన్ని స్తంభాలు గిరగిరా తిరుగుతూంటవి. తాడిపత్రి, పెనుగొండలో ఎక్కడచూచినా దేవాలయాలే. దీనిని బట్టి ఒకప్పుడు కళాశిల్పములకోసం మన పూర్వు లెంత శ్రమపడ్డారో ఎంతసొమ్ము వెచ్చించారో

అర్థమవుతుంది. ఈ రోజున వాటి శిథిలావస్థకు కారకులయిన అధికారవర్గంవారి అశ్రద్ధ నిందార్హ్యం. రచనా విన్యాస ప్రాచీనతలో నేమి నిర్వహణ కౌశలములో నేమి సూక్ష్మాంశా పరిశీలనా నైపుణ్యములో నేమి, వంకబెట్ట వీలు లేని పనితన ములో నేమి, భావపోషణ ప్రకటనలలో నేమి, శిల్ప సౌంద ర్యంలో శాస్త్రమును మేళవించుటలో నేమి, గర్భగుళ్లలో కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి కోణాలలో అత్యంత మనోహరములయిన చిత్తరువులను, చెక్కడములను ఘటించు టలో నేమి ఈ సంస్థలన్నీ ఇండియాలో అగ్రస్థాన మలంకరిస్తూ న్నవి. బేలూరు హాలిబీడెల మండపాలలోని రాతి స్తంభాలను తడిబట్టతో కొంచెం చెమ్మగిలచేస్తే చుట్టూ ఉన్న వస్తువు లన్నీ అందులో అనేక విధాలుగా ప్రతిబింబిస్తూంటవి. ఒక ప్రతిబింబం ఒక రాతిలో కనిపించే తీరుగా మరొక రాతిలో కనిపించదు. వేరు వేరుగా కనిపిస్తూంటుంది. లేపాక్షి దేవా లయంలోని కటికి చీకట్లో వీరభద్రస్వామి మూర్తిని దర్శించ వలెనంటే, తీక్షణమైన విద్యుద్దీపంతో గాని వీలుకాదు. అప్పుడు కూడా ఆ మహత్తమ రూపాన్ని పూర్తిగా చూడ జాలము. భాగాలు భాగాలుగా మాత్రమే చూడగలము. ఆ విగ్రహము పొడవు ఒక కొననుండి మరొక కొనవరకు 35 అడుగులు. ఇంకా కొంచెం పడమరకుపోతే బీజాపురం విస్పరింగు గ్యాలరీ ఉన్న పెద్దగుమ్మటం కనబడుతుంది. ఆంధ్రదేశంలోని ఉండవల్లి గుహాలను, కన్నడ దేశంలోని బాదామీ గుహాలను ఇటీవలనే కనుగొన్నారు. బీజాపూరు

గుమ్మటంలోని శబ్దగ్రహణ గుణంగానీ, బేలూరు హాలిబీడుల లోని స్తంభాల బింబ గ్రహణ గుణంగాని శిల్ప చాతుర్యం వలన కలిగినవా లేక కాకతాళ న్యాయ్యంగా తటస్థించినవా అని ఆశ్చర్యంతో ప్రశ్నించుకుంటూంటాము. ఈ మహోత్కృష్ట దేవాలయ శిల్పమున్నా, అంతులేని ఎల్లోరా అజంతా గుహలలో చెక్కబడిన శిలా ప్రతిమలున్నా, ఊహాతీతమయిన విస్తీర్ణతగల ఎలిఫెంటా గుహాలున్నా వాటి కవే సాటి. అజంతాలోని 27 గుహలను నిర్మించడానికి ఏడుశతాబ్దాలు పట్టిందట. వీటికోసం ఎంతసొమ్ము వెచ్చించబడిందో ఊహించగలమా? తూర్పు గోదావరి జిల్లాలోని ర్యాలీ గ్రామంలోనున్న కేశవ జగన్మోహన విగ్రహానికి ఇండియాలోని ఏ శిలావిగ్రహమూ సరిపోలదు. అది రాతిలోని రత్నం. వాటి నిర్మాణంలో డబ్బు లెక్కేమిటి? ఎంత శ్రమపడితే ఆ బొమ్మ అంత చక్కగా తయారయిందో ఆలోచించండి. ఈ పని అంతా అసలు శిల్పికానీ తక్కిన పనివాళ్లు కానీ టెండర్లు పెట్టి, కాంట్రాక్టు పుచ్చుకొని, కాలపరిమితి నేర్పాటు చేసుకొని, ప్లానులు గీసికొని చేశారా? వాళ్ల ఆత్మలను పాటలో, రాతిలో, రంగులో మేళవించితే అయిన పని అది. ఆ తయారైన రూపమే వాళ్ల ఆనందానికి ప్రతిబింబం. పూర్వకాలంలో శిల్పులు డబ్బుకోసం పనిచేసినవారు కారు; తమ ఆత్మోపలబ్ధికోసం చేశారు. ఆ రోజులలో జ్ఞానాన్ని వాణిజ్యవస్తువుగా ఉపయోగించేవారు కారు. పుస్తకాలమ్ముకొని బ్రతికేవృత్తి

అవసరము లేదు. పాండిత్యము, సంస్కారమూ కలిగి ఉన్నం దుకు ఫలం డబ్బు సంపాదించడం కాదు. ఇంకా ఉత్తరానికి పోతే అహమ్మద్ నగరం తగులుతుంది. అక్కడి మశీదు శిఖరాలు ఊగుతూండడం ఆశ్చర్యం కలిగిస్తుంది మనకు. ఒకదాని కొకటి 40 అడుగుల ఎడంగా రెండు శిఖరాలున్నవి. ఒక్కొక్క దాని వ్యాసం 6 అడుగులు. ఒక దానిలోపలికి పోయి గట్టిగా చేతితో చరిస్తే ఇది కదలగా, రెండోదికూడా దీనితో సానుభూతి చూపిస్తూన్నదా అన్నట్లు కదులుతుంది. బ్రిటిష్ ఇంజనీయర్లు పరిశోధన చేయడానికి ఇందులో ఒక దానిని పడగొట్టి మళ్ళీ కట్టినారు. కాని ఆ ఊగడం ఆగి పోయింది. అహమ్మదాబాదులో ఇంకా కొన్ని చిత్రా లున్నాయి. అక్కడి పెద్దనూయి గొప్ప అద్భుత విషయం. మైసూరు రాజ్యంలోని శ్రావణబేలగులలో నున్న గోమటే శ్వర విగ్రహం అద్భుతం కాదు అలౌకిక విషయం. ఇక చిట్ట చివరకు ఆగ్రా ఢిల్లీ రాజప్రాసాదాల రమణీయదృశ్యాలను పరిశీలిద్దాము. ఆగ్రాలోని తాజ్‌మహాల్‌కు చలువరాతిలోని స్వప్నమని పేరు. తాజ్ సౌందర్యం మనోహరం. దానిలోని అభిరుచి అతి లలితం. ఆకళా వస్తువులో ప్రతిసూక్ష్మాంశమూ తీర్చిదిద్దినట్లు కనిపిస్తుంది, ఆనిర్మాణానికి మూలమైన భావనా పటిమా, కృషీ అందులోని శిల్పరహస్యాలను విశదీకరించ పూనుకొన్న ప్రయత్నాలను భగ్నంచేస్తూన్నవి. ఆబూపర్వ తంపైన కనిపించే వాస్తు నిర్మాణరీతులకు గానీ శిలాప్రతిమా విన్యాసములకు కానీ అంతులేదు. అమృతసర స్వర్ణ దేవా

లయసౌందర్యాన్ని గూర్చి వేరే చెప్పనక్కరనేలేదు. దీనికిపోటీ అజంతాలోనే కనిపిస్తుంది. ఇంక తూర్పుకుపోతే జగన్నాథ భువనేశ్వర కన్‌రాకు దేవాలయాలు కనిపిస్తవి. వాటిప్రత్యేకత వాటి కున్నది.

ఈ జ్ఞానానికి మూలమేమిటి? ఇటువంటి భావోద్రేకం ఎక్కడనుండి కలిగింది? వీటిని రచించిన శాస్త్రకోవిదు లేమైనారు? వీటిని నిర్మించిన పనివాళ్ళెక్కడ? ఈ సంగతులన్నిటినీ పరిశీలించడమే నిజమైన జాతీయ విద్యావిధానం. వైద్యం, చిత్రలేఖనం, కవిత్వం, నాటకరచన: ఈ అన్నిటిలోనూ ఇటువంటి అద్భుతాలు కనిపిస్తూనే ఉన్నవి. మననాటకం ఇంగ్లీషునాటకంకంటె అథమం 800 సంవత్సరాలైనా ముందు పుట్టిఉండాలి. వైద్యవిషయంలో పాశ్చాత్య పండితులు, భౌతిక శాస్త్రజ్ఞులూ ఇటీవల 60 సంవత్సరాల కిందట కనిపెట్టినవిషయాలు, మనపూర్వులు వేలకొలదీ సంవత్సరాల కిందటనే గ్రహించినట్లు తెలుస్తుంది.

భౌతికశాస్త్ర. కళారహస్యాలను వెల్లడిచేయాలి

ఈ భౌతికశాస్త్ర కళారహస్యాలనూ, మన ఇంజనీరింగు వైద్యం, న్యాయ్యశాస్త్రం, సాహిత్యం వీటిలోని నిగూఢతత్వాలనూ వెల్లడిచేయాలి. అదే నిజమైన జాతీయవిద్య. జాతీయ విద్యా పట్టభద్రులమైన మనము మనవృత్తులను చూచుకోవడమేగాక, ప్రాచీనకాలంలోనే ప్రసిద్ధతగడించి, కొన్నిశతాబ్దాలకిందట అభివృద్ధి, ఆగిపోయిన ఈ శాస్త్ర విజ్ఞానాలను బాగా పరిశోధించాలి. విదేశీ పరిపాలనకింద మనసాహిత్యా

నికీ, మన శిల్పకళలకు కూడా ప్రజాసంస్థలకు, సాంఘిక శాసనాలకు రాజకీయాలకువలెనే, ప్రభు ప్రోత్సాహం లేకుండా పోయింది. రాజు కేవలం భోగాసక్తుడుగానుండి విలాసలాలసుడుగానూ ఉండకూడదు. శాంతి, శాసనాలను కాపాడుతుండడ మొక్కటే అతని పనికాదు. ఆచార సంప్రదాయ విషయాలలో ప్రజలకు సదుపదేశకుడుగాను, శిక్షకుడుగానూ ఉండాలి. ఆచారంలో మార్పుజరుగకపోతే ఒక్కొక్కప్పుడు అభివృద్ధికి ఆటంకంగా ఉంటుంది. విదేశ పరిపాలకులు ఆచార పరంపరగా వస్తూన్న శాసనాలను మార్చడానికి ఇష్టపడక పోవడంవలన సాంఘిక విషయాలలో అభివృద్ధి ఆగిపోయి భారతదేశం బాధపడుతూన్నది. పూర్వంవుండిన ప్రజాభిప్రాయాని కిప్పుడు అక్కడక్కడా చిహ్నాలు మాత్రం కనిపిస్తూన్నవి. నిజానికి అది ఆచరణలో లేదని చెప్పడమే న్యాయ్యం. అందువలన ఆచారం కరుడుగట్టుకొని మార్పు లేకుండాపోయింది. విజ్ఞానము, శాస్త్రము, ఎదుగు బొదుగులు లేనివైనవి. విదేశీ సభ్యత వలన నూతన వేషభాషలు ఆచరణలోకి వచ్చినవి. అంతేకాదు, పూర్వ విజ్ఞానమంటే అసహ్యమూ, ఆక్షేపణా ఎక్కువయింది. శతాబ్దములకొలదీ అవిచ్ఛిన్నంగా ప్రవహించిన విజ్ఞాన, పరిశోధనా, సాహిత్యస్రవంతులు, వ్యతిరేక స్రోతస్సులవలన ఆగిపోవడమేకాక, ఇంకి పూడికూడా పోయినవి. ఇప్పుడా పూడికనుతీసి, నాడు నిరాటంకంగా జరిగిన అభివృద్ధిని గ్రహించి, అప్పటి ఆశ్చర్యకరాభ్యుదయ హేతువులను పరిశీలించడం మన మొదటికర్తవ్యం. ఈ సందర్భంలో

నర్ వాల్టర్ ర్యాలి ఇలా అన్నాడు. "విశ్వవిద్యాలయం పరంపరాగతా జ్ఞానరక్షణకోస మేర్పడిన సంస్థ. అది ప్రధాన ప్రాచీన భావాలనన్నిటినీ పునర్విమర్శచేసి మార్పులుచేస్తూంటుంది. అది పునాదినుండి ప్రారంభించి నిర్మాణం చేస్తుంది. పాతపొలాలను దున్ని కొత్త పైరులను వేస్తుం దది. విజ్ఞాన సీమలను అది నిరంతరం బహుజాగరూకతతో కాపాడుతుంది. వెనుకటి అభివృద్ధి ఆగిపోవడానికి కారణం అజ్ఞానమూ, స్వప్రయోజన పరత్వమూను. విశ్వవిద్యాలయాలలో పరీక్షలకు తప్ప ఇంక దేనికీ ప్రాముఖ్యత లేకుండా పోయినందువలన కొంతమంది విద్యా విశారదులు, పరిపాలనాధికారులు, వ్యాపారస్థులు, ప్రస్తుత విద్యావిధానముయొక్క నిష్ప్రయోజకత్వమునూ దౌష్ట్యమునూ నిస్స్వార్థ బుద్ధితో వెల్లడిస్తూన్నప్పటికీ యేమీ ఉపకారం కలగడం లేదు. బాలురు అజ్ఞానం వలన తల్లిదండ్రులు జడత్వమువలన, ఉపాధ్యాయులు జీవనోపాధికోసమూ ఈ విద్యాపద్ధతినే అవలంబిస్తున్నారు. మన విద్యాశాఖామంత్రులే ఈ జీర్ణ విద్యావిధానమువలన ఉత్పత్తి కావడంచేత, అభివృద్ధి నిరోధకులుగా ఉంటారు. ఆధునిక భావాలు, నవీన సంస్కృతీ, ఇవి మన దేశీయనాయకులచిత్తాలను అజాతీయాలుగా చేసివైచినవి. అందువలన వారు జాతీయ సంస్కార నిరంతరవాహినియే జాతీయ సభ్యత- అనే ప్రాథమిక సూత్రాన్నే విస్మరిస్తూన్నారు. జాతీయ సంస్కృతి భూత వర్తమాన భవిష్యత్కాలములలో జీవనదివలె ఎడతెగక జాలువారుతూంటూం దనీ, ప్రతిజాతి భూతకాలంనుండి వర్త

మానకాలానికి, వర్తమానంనుండి భవిష్యత్తుకు నడుస్తూనే ఉంటుందనీ కూడా వారు గ్రహిస్తున్నట్లు లేదు. భూతకాలపు లక్షణాలు వర్తమానంలో ఉంటవి. వర్తమానం భవిష్యత్తును సూచిస్తూంటుంది. మన నైతిక ప్రమాణాలు స్మృతులూ అన్నితరతరాలనాటి అనుభవముల కలయిక. అదేవిధంగా మన సభ్యతకూడా భూతవర్తమానముల సమ్మేళనమే కాక ప్రాచ్యపాశ్చాత్య నాగరికతల మిశ్రమమని చెప్పవచ్చు. అంతర్జాతీయ సంబంధాలు వాణిజ్యరూపంలోనేకాక సంస్కారరూపంలోకూడా వ్యాపిస్తూన్నకాలంలో సభ్యతకు అనేక ముఖాలూ అనేకవైపులూ ఉంటవి. ప్రతిముఖంనుండీ ప్రతివైపునుండీ వెలిగ్రక్కుతూన్న వివిధసంస్కృతుల తేజోకిరణాల సమ్మేళనమే ఆ సభ్యత. నేటినాయకులు తమ నింత వాళ్లనుగాచేసిన తమ నవీనసంస్కారమునకు ఇంకా మురుసుకొంటూనే ఉన్నారు. వారి మనస్సులు సరియైన మార్గాలనుబట్టి అభివృద్ధి పొందేటంతవరకూ, మనజాతీయ సంస్థలు జాతీయతాచ్ఛాయలలో అణగిమణగి కాలక్షేపం చేస్తూండాలి. తమ కష్టసుఖాలలో మార్గదర్శకంగా ఉన్న వెలుగు, జాతీయ స్వాతంత్ర్య యాత్రలో తమ దేశీయుల త్రోవనుకూడా ప్రకాశవంతంగా చేసి తీరుతుందనే ఆశతో జీవించి ఉండాలి అవి.

అ ధ్యా య ం 15

సంఘన్యాయ్యం

సంఘసేవ చేసేనిమిత్త మిండియాలో అనేక వ్యవస్థలు కలవు. వివేకానంద మఠము, రామకృష్ణ ధర్మ ప్రచారమండలి (Ramakrishna Mission) మత,విద్యా, సంస్కార, విష యాలలో హిందువులను సేవిస్తూన్నవి. 40 యేండ్ల కిందట గోఖేలు 'భారత సేవక సంఘం,' (Servants of India Society) అనే పేరుతో ఒక సంస్థను స్థాపించాడు. అది విద్యాధికుల వ్యవస్థ. పేదరికాన్ని స్వీకరించి ప్రజాసేవచేయడం వారిమతం. కాని వారు రాజకీయవాంఛలకు లోబడకూడదని ఎక్కడా నిషేధంలేదు. తరువాత ఇరవైసంవత్సరాలకు ప్రసిద్ధ పాంచాలదేశ పండితుడు లాలా లజపతిరాయలు 'ప్రజాసేవక సంఘం' (Servants of the People's Society) అనే పేరుతో మఱొక సంస్థను స్థాపించాడు. అందులో ఉన్న సభ్యులు కూడా గొప్ప సంస్కారులు, కాని వారికి కూడా 'స్వార్థ నిరసన వ్రతం' లేదు. తరువాత గాంధీ కూడా మఱొక నూతన వ్యవస్థకు మూలపురుషుడైనాడు. అందులో ఆయన మొదటి సేవకుడు. దీనిని స్థాపించడంలో ఆయన హృదయవైశాల్యమూ, ఉదార దృక్పథమూ వెల్లడి అవుతూ న్నవి. "మానవ సేవకులలో ఆయన అగ్రగామి."

అయంనిజః పరోవేతి

గణనా లఘుచేతసాం

ఉదార చరితానాం తు
వసుధైవ కుటుంబికం ’

“ నా వాడు, పరాయివాడు అనే భావం లఘు బుద్ధులకు, ఉదార చరితులకు లోకమే కుటుంబం ” అని ఆయనమతం. కాని అంతమాత్రంతో ఆయన విశ్వమానవ సౌభ్రాతృత్వ జాలంలో చిక్కుకోలేదు. జాతీయత సర్వ జాతీయ సమ భావమునకు తొలిమెట్టు. వ్యక్తులు గానీ, జాతులు గానీ, సమత్వ, సాహచర్య భావపూరితులు కానియెడల సౌభ్రాతృత్వమనే మాట వట్టికల్లగా పరిణమిస్తుంది. కాబట్టి గాంధీ హిందూదేశానికి సంపూర్ణ స్వరాజ్యం కోరడం న్యాయ్యం. భారత దేశం సంపూర్ణ స్వాతంత్ర్యమును పొందినప్పుడే ప్రపంచ జాతుల సుహృత్సమితిలో సమాన స్థానమాక్రమించ గలదు. అంతే కాని ఇండియా ప్రపంచానికి వెలిగా ఉండ వలెనని కానీ, లేక తన నూతన స్థితిని ఇతర జాతులపైన అధికారం చలాయించేటందు కుపయోగించ వలెనని కానీ గాంధీ అభిప్రాయంకాదు. అందుకొఱ కాయన దేశంలోని పరస్పర సంఘట్టనలను, దూషణలను, మతపోరాటాలను సాంఘిక స్పర్థలను, నిర్మూలింప చూస్తూన్నాడు. భారత జాతీయతకు కళంకంగా, మానవత్వమునకు మచ్చగా, దైవ ద్రోహంగా కనిపిస్తూన్న అంటరానితనాన్ని తుడిచి వేయ వలెనని ప్రయత్నిస్తూన్నాడు. పురుషుని అభ్యుదయానికి త్యాగమునకూ కారణమైన స్త్రీని, అమె తొలినాటి ఉన్నత స్థానమునకు కొనిపోవలెనని కోరుతూన్నాడు. వ్యభిచారం

వృత్తిగా గల కులాన్ని, మద్యపాన పిశాచాన్ని, పుట్టుకవలన వచ్చిన ఎక్కువ తక్కువలను, కనపడ కుండా చేయవలెనని కృషిచేస్తూన్నాడు. మనుష్యులలో 'అధమాధముని' యందు ఆయనకు సానుభూతి. ముందు జన్మలో తానంటరానివాడుగా జన్మించకోరుతున్నానని చేసిన ప్రకటనయే ఇందుకు ప్రబల నిదర్శనం.

జీవితంలో పతితులైనవారిని లేవనెత్తవలెనంటే మనం వంగితేనే కాని లేవనెత్తలేము. నీళ్లలో మునిగి పోతూన్న మనిషిని గట్టుమీద కూర్చొని పైకిలాగలేము. మనం కూడా నీళ్లలో దిగాలి అతనిని రక్షించడానికి. గాంధీ యెన్నడూ తాను నమ్మిన అనుచరులు, తనను ఒంటరిగా విడిచి వేసినట్లు అనుకోలేదు. ఆయన కవిశ్వాసం కానీ అధైర్యం కానీ యెన్నడూ కలుగలేదు. వారు దిగినప్పుడు వారితోపాటు తానూ దిగి తిరిగీ వారిని పైకి లేవనెత్తే స్వభావమాయనది. నిజంగా నాయకుడు చేయవలసిన పనిఅదే. ఆదర్శానికీ వాస్తవికతకూ సమన్వయం చేసుకోగల చతురత ఉందాయనకు. నిరంతరం తమ ఉన్నతాదర్శాలలోనే అణగి మణగి ఉండే వారు తమతమ చుట్టూవున్న ప్రపంచంలోని వాస్తవిక విషయాలనుగుర్తించలేక, రాజీకి ఎప్పుడు ఒప్పుకోరు. రాజీ అనగానే తమఆదర్శాలు క్షీణించిపోయినట్లు నీతిభ్రష్టమై పోయి నట్లు భావించి నిరంతరం కుంగిపోతుంటారు.

అంటరానితనం

ఇండియా జనసంఖ్యలో ఐదవవంతు ప్రజలను అంటరాని వాళ్ళుగా పరిగణిస్తున్నాము. ఆ ఒక్క కారణంచాలు భారత దేశం పరాయిప్రభుత్వంకింద బానిసగా ఉండతగిన దేశమని నిరూపించడానికి. ఆర్యులిండియాలో స్థిరనివాసమేర్పరచుకొని 13,000 యేండ్లయినప్పటికీ దేవుడు సృజించిన ఈ 7 కోట్ల మందిని వారిలో కలుపుకొనలేక పోయినప్పుడు, 350 కోట్ల మంది భారతీయులను బ్రిటిష్‌వారు అంటరాని వాళ్ళుగా, దరిచేరరానివాళ్ళుగా, కలవరానివాళ్ళుగా భావిస్తే హిందువులు వారినేమొగం పెట్టుకొని నిందించగలరు? తరతరాల నాటి ఈ దురాచారం, జాతీయ కళంకమేగాక దైవద్రోహం గూడానని భావించి, నిరసించిన సంఘసంస్కర్త లనేకమంది ఇదివరకే గడ్డమీద జన్మించారు. కాని ఖద్దరు, సాంఘికైక మత్యము, మద్యపాననిషేధములతో సమాన ప్రతిపత్తిగల కాంగ్రెసు కార్యక్రమంగా అస్పృశ్యతా నివారణమును కూడా అంగీకరింపచేసే పని గాంధీ వంతుకు వచ్చింది.

అంటరాని తనమును నిర్మూలించ వలెననేది కొత్త అభిప్రాయంకాదు. కాని దానిని రాజకీయనిర్మాణకార్యక్రమంలో ముఖ్యాంగంగా చేయడం కొత్తసంగతి. నిజానికి గాంధీజీ నిర్మాణ కార్యక్రమంలో ఒక్క ఖాదీ పునరుద్ధరణం తప్ప ఇంకేదీ కొత్తది లేదు. సాంఘిక, ఆర్థిక, నైతిక విషయాల సమ్మేళనమే ఆయన కార్యక్రమ స్వరూపం. ఆయన ఈ దేశంలో ఒకకొననుండి మఱొకకొనకు అనేకసార్లు సంచారం

చేశాడు. అసంఖ్యాకులైన దీనులాయనకగపడి శరణాగతులైనారు. కొన్నిచోట్లపతితస్త్రీలు, మరికొన్నిచోట్ల అస్పృశ్యులు ఆయన దయకు పాత్రులైనారు. దిక్కులేక ఆకలితో అల్లాడుతూన్న బిడ్డలను, త్రాగుబోతుల, వ్యభిచారుల నిస్సహాయ కుటుంబాలను ఆయన ఎన్నిచోట్లనో చూచాడు. ఆయన చుట్టూ ఏమూలచూచినా దుఃఖమూ దైన్యమూ ప్రత్యక్షమైనవి. కాని ఆయనకు నిరాశ జనించలేదు. శుష్కవేదాంతివలె అడవులకుపోయి తపస్సుచేసుకొన బుద్ధిపుట్టలేదాయనకు. ఆయన నిజమైన మానవుడు. ఆపాదమస్తకమూ ఆయనలో మానవత్వము పరిపూర్ణతను పొందింది. కాబట్టి పతితస్త్రీలను అస్పృశ్యులను, దిగంబరులను, పానప్రమత్తులను, వ్యభిచారులను. క్షుధాతురులను, రక్షించేటందు కుపాయాల నన్వేషింప ప్రారంభించాడు. ఆయనకు అనుభవం కలిగినకొద్దీ ఆలోచన చేసినకొద్దీ అనేక ఉపాయాలు స్ఫురించినవి. వాటి ఫలితమే జాతీయనిర్మాణ కార్యక్రమం. అస్పృశ్యతనివారణకు మూల మిది.

పూర్వ చరిత్ర

నూరు సంవత్సరాల కిందట రాజా రామమోహనరాయలువారీ విషయంలో చాలా కృషిచేశారు. పిదప ఆయన అనుయాయులు - ముఖ్యంగా బ్రహ్మసమాజమును నడుపుతూన్నవారు - ఆయన ప్రారంభించిన ఈ మహాత్కార్యము నిర్విఘ్నంగా సాగిస్తూవచ్చారు. వారి యాజమాన్యం కింద

అనేక మంది హరిజన బాలికలు పతనం గాకుండా రక్షించ బడ్డారు; అనేక హరిజన బాలురు పెరిగి పెద్దవారై విద్యాబుద్ధులను గడించి గౌరవనీయులైన తదితర పౌరులవలెనే ఆరోగ్యంగాను, ఆనందంగానూ, జీవిస్తూన్నారు. పూర్వచరిత్ర లేకుండా ఏమహోద్యమమూ ఒక్క సారిగా ఆకాశంనుండి ఊడిపడదు. రామానుజుని వంటి మహర్షులతో ప్రారంభమైన మతసాంఘికోద్యమం, అక్కడక్కడా అప్పుడప్పుడూ ఈ విధంగా జరిగిన నూరు సంవత్సరాల పనివలన బలిష్ఠమయింది. ఇదంతా నేటి తరంవారికి పైతృకధనంగా లభించి గాంధీకి భావోద్రేక కారణమయింది. అందువలననే ఆయన అంటరాని వాళ్ళని వ్యవహరింప బడుతూన్న వారికి హరిజనులని నామకరణం చేసి వారి సాంఘిక ఆర్థికాభివృద్ధికి జాతీయ కార్యక్రమంలో స్థానం కల్పించాడు.

కాంగ్రెసుయొక్క ఈ నూతన కార్యక్రమ ఫలితంగా, హిమాలయము మొదలు కన్యాకుమారివరకు ఒక ఉత్తుంగ భావతరంగం వ్యాపించింది. సవర్ణులనుకొనేవారు 'అవర్ణులకు' సహాయం చేయడం ఒక ధర్మంగా భావించ ప్రారంభించారు. ఆ భావం కార్యరూపంలో అనేక విధాల వెల్లడింప బడింది. హరిజన విద్యార్థులకు హైస్కూళ్లలో ఉచిత వేతనాలీయడం వాళ్ళవృత్తులకు- అనగా చెప్పులుకుట్టడం, చొక్కాలుకుట్టడం తోలుఊనడం, వడ్రంగం, నేత, హోమియోవైద్యం, ఆయుర్వేదం, చాపలల్లడం, రంగుల అద్దకం, పేముపని, కళాయి వేయడం, మాట్లువేయడం, ఈపనులన్నీ నేర్పడం, చిన్నచిన్న

ప్రాథమిక పాఠశాలలను స్థాపించడం, హాస్టల్సును కట్టించడం, వైద్యసహాయ కేంద్రాలనేర్పాటుచేయడం, వైద్య పరీక్షచేయించడం, కొత్తగా నూతులు తవ్వించడం, ఫ్యాక్టరీలలో కంపెనీలలో షాపులలో ఇళ్ళలో వాళ్ళకుద్యోగా లిప్పించడం, పత్రిక లమ్మించడం, మంగలిపని, చాకలిపని నేర్పించి సవర్ణుల గ్రామాలలో ఉంచడం, హరిజనగ్రామాలకు ఎడ్లను సప్లయిచేయడం, హరిజన కూలీలను ఎక్కువగా ఏర్పాటు చేసుకోవడం, కూలిఎక్కువచేయడం, పుస్తకాలయాలను క్లబ్బులను స్థాపించడం, హరిజనపిల్లలకు బస్తులు, పెద్దవాళ్లకు కంబళ్ళు యీయడం, ఇవన్నీ ధర్మమనుకొని గాంధీజీచేత సంస్థాపింపబడిన హరిజనసంస్థ నిర్వహిస్తూన్నది.

ఇంక హరిజనులపైన పూర్వంనుండీ సవర్ణులు కొన్ని ఆంక్షలు పెట్టారు. గరహ్వాజిల్లాలలో హరిజనులు పెళ్ళిఊరేగింపులలో పాలకీలుకాని, డోలీలుగానీ ఎక్కకూడదని ఒక ఆంక్ష ఉన్నది. అలహాబాదు హైకోర్టులో హరిజనులకు ఆహక్కు స్థిరపరపబడింది. మధ్యహిందూ దేశములో పాకీవాళ్ళను బస్సుడ్రైవర్లు బస్సులలో ఎక్కించుకోవడానికి నిరాకరిస్తూండేవారు. షాజాపూరు పాకీవాండ్లు ఈ హక్కును సంపాదించారు. ఈ మార్పంతా ఎలాకలిగింది. అక్కడక్కడా సంఘసంస్కర్తలు చేస్తూవచ్చిన పనివలనకాదు. ఆర్థిక శాస్త్రవేత్తలు, మఠాధిపతులు చేసిన మహోపన్యాసముల వలన కాదు. 77 కోట్లమంది హిందువులనుండి 4 కోట్లమంది హరిజనులను ప్రత్యేకించ కూడదనే ఉద్దేశంతో, ప్రాణాన్ని తృణ

ప్రాయంగా అర్పించదలచుకొని ప్రాయోపవేశంచేసిన మహా నాయకుని తపోశక్తియే జాతి అంతటలోనూ ఇంతమహత్తమ చైతన్యాన్ని కలిగించింది.

లోకోత్తరోపవాసము

నేను రాజకీయరంగంలో ప్రధాన పురుషులుగా నున్న వారు తమ పనిని ముగించుకొని కాల గర్భంలో కలసి పోయి నప్పుడు, నేటి రాజకీయ సమస్యలన్నీ సవ్యంగా పరిష్కరింప బడి భవిష్యత్తులో చరిత్రాత్మక విషయాలుగా మారిపోయి నప్పుడు, నేటి ఇండియా జనసంఖ్యలో ఉయిదోవంతు అంట రానివాళ్ళున్నారనే సంప్రదాయమునే ప్రపంచం మరచి పోయినప్పుడు, భారత భావిసంతానం శతాబ్దములవరకూ జ్ఞాపకం ఉంచుకోగలిగిన విషయమొక్కటే. అదిగాంధీ 1932 సెప్టెంబరు 20 తేదీని ప్రారంభించిన ప్రాయోపవేశవ్రతం; భారత స్వాతంత్ర్య సమరస్వరూపాన్ని సంపూర్ణంగా మార్చి వైచిన లోకోత్తరవ్రతమది. సంఘంలోని ఒక చెడుగును సావ కాశంగా తీసికొని రాజకీయ స్వార్థదృష్టితో హిందూ సమా జంలోని అల్పసంఖ్యాకులనబడే హరిజనులకూ, అధిక సంఖ్యా కులనబడే ఎడ తెగని చీలిక కలిగించే ప్రయత్నాన్ని భగ్న పరచేటందుకే అది ఉద్దేశింపబడింది. ఆప్రయత్నమే కొనసాగి నట్లయితే తరువాత హరిజనులను ప్రత్యేక రాజకీయ సమూ హంగా నిర్దేశించి ఉండేవారు ప్రభుత్వంవారు. ఇది 'చీలదీసి పాలించు' అనే సామ్రాజ్య తత్వ మూలసిద్ధాంతానుగుణంగా

నడుస్తూన్న రాజకీయతంత్రం. ముసల్మానులను సిక్కులనూ హిందువులనుండి ఈలాగే చీలదీశారు. ఇప్పుడు హరిజనులను చీలదీయ ప్రయత్నిస్తూన్నారు. ఈ రాజకీయకైతవం గాంధీని ఆపాదమస్తకం కదలించివైచింది. అస్పృశ్యులను ప్రత్యేకతరగతిగా విభజించే పద్ధతి కాయన అంగీకరించలేదు. 'సిక్కులు మహమ్మదీయులు శాశ్వతంగా ఉంటే ఉందురుగాక! కాని అస్పృశ్యత జీవించి ఉన్నదంటే హిందూమతం మృతిపొందినట్లుగా భావిస్తాను' అన్నాడు ఆయన రెండో రౌండుటేబిలు మహాసభ జరిగినప్పుడు. మరొకసందర్భంలో 'హిందూదేశ స్వాతంత్ర్య సంపాదనకోసం కూడా అస్పృశ్యుల ప్రధాన ప్రయోజనాలను విక్రయించ జాలను' అన్నాడు.

గాంధీ తన సదుద్యమంలోనూ, హిందూ సంఘంలోనూ, మానవ ప్రకృతిలోనూ, ప్రభుత్వోద్యోగులలోనూ సంపూర్ణ విశ్వాసంతో ఆ ఉపవాసవ్రతం ప్రారంభంచేశాడు. పరమ పవిత్రము, సదుద్దేశజనితము, ఉన్నతాదర్శ పూర్వకమూ అయిన ఆ ఉపవాసవ్రతం జయప్రదం అయితీరాలి. కాకుంటే జరిగిన నాలుగు సంవత్సరాలలో హరిజన సేవాసంఘం అంత పని ఎలా చేయగలిగి ఉండేది?

ఎక్కడ చూచినా హరిజన మహాసభలు, హరిజనులలో మతవిషయిక విద్యాప్రచారము, హరిజన భజనసంఘాలు, హరిజన కర్మకాండంలో వేదపఠనలు, హరిజన కేంద్ర విచారణసంఘాలు, హరిజన పారిశ్రామిక, వృత్తివిద్యామందిరా

లూనూ, దేశంలో ఒకనూతన వాతావరణం చెలరేగింది. హరిజన సంఘక్షేమంలో ఒకనూతనాసక్తి ప్రజ్వలించింది. మహాత్మాజీ తన సబర్మతీ ఆశ్రమాన్ని హరిజనోద్యమానికి ధారపోయడం, దేశీయులను హరిజనాభ్యుదయ భావప్రేరితులనుగా చేసింది. గాంధీసొంతమని చెప్పుకోదగినదా సబర్మతీ ఆశ్రమ మొక్కటే. దానిని హరిజనుల కిచ్చివేయడంతో 'గాలిలో తిరిగే పక్షులకు గూళ్లూ, పొలాలలో తిరిగే పురుగు బుట్టలకు కలుగులూ అయినా ఉన్నవిగాని మనిషికి తల దాచుకొనే చోటుకూడా లేదు.' అని చెప్పినమాట గాంధీ యెడల అక్షరాలా నిజమైనది.

జాతీయాపచారాన్ని తొలగించాలి

మనం హరిజనులను తాకినంతమాత్రంతో మనపని పూర్తి అయినట్లుగా భావించకూడదు. ఇంకా ముందుకు పోవాలి. వాళ్ళను మన కుటుంబాలలోకి తీసికొనివచ్చి వాళ్ల ఆర్థికస్థితిని చక్కచేయాలి. హరిజన స్త్రీపురుషులను సోదరీ సోదర భావంతో చూడాలి. జాతీయ స్వాతంత్ర్యోద్యమంలో వారి సేవలను గ్రహించాలి. అప్పుడు మనభారత స్వరాజ్యం ఇతర మార్గాలకంటె తొందరగా చేకూరగలదు. తిరువాన్కూరుమహారాజు లతీసంస్థానాధిపతులు హరిజన దేవాలయ ప్రవేశాని కంగీకరించడం మహావిషయమే. కాని ఆర్థికంగా వారికి జరిగే అన్యాయ్యాని కది ప్రతిఫలం కాజాలదు. హరిజనోద్యమంలో ఆత్మపరిశుద్ధత, సాంఘికోపకారమూ, ఈ రెండూ

ఇమిడి ఉన్నవి. అంతేకాదు, అందులో ఆర్థిక, సాంఘిక నైతిక, మతవిషయిక సమస్యలు లీనమై ఉన్నవి. కాబట్టి ఈ జాతీయాపచారాన్ని తొలగించి మన సోదరులను పౌర సత్వములలోను, రాజకీయ స్వాతంత్ర్యంలోను, మనతో పాటు సమానభాగస్వాములనుగా చేయవలసిఉంది. 'మనసు మారితేనేగాని అంటరాని తనం పోదు. డబ్బుఖర్చు పెట్టడం వివేకం గావచ్చును గానీ అంతమాత్రంతో మనస్సులు మారవు. మనకు తగినంతమంది ఆధ్యాత్మికచింతగల నిస్వార్థపరులైన మనుష్యులు దొరికినప్పుడామార్పు వస్తుంది' అన్నాడు గాంధీజీ.

హరిజనోద్యమం

హరిజనోద్యమం యొక్క అసలు లక్షణాన్ని పాఠకులు తెలుసుకోవడం అవసరం. హరిజనోద్యమానికి వెనుక రాజకీయోద్దేశమేమి లేదు. అంటరానితనాన్ని పోగొట్టవలెననే ప్రయత్నం యేవిధంగానూ రాజకీయం కాజాలదు. అంతే కాదు. కేవల వారి ఆర్థికాభివృద్ధికీ, సాంఘిక పునరుద్ధరణము నకూ చేసే పనికూడా కాదు. ఇలా అనడంవలన కోట్లకొలదీ ఉన్న ఈ ప్రజల ఆర్థిక సాంఘికౌన్నత్యంకొఱకు పనిచేయడం మా అభిప్రాయంకాదని భావించకూడదు. కాని మాలక్ష్యం వేరు. 'అంటరానితనం హిందూమతానికి కళంకం. దానిని తొలగించి తీరాలి. అది దైవద్రోహంకూడాను. అది విషం. తొందరలో నిర్మూలించకపోతే హిందుమతాన్ని నాశనం

చేస్తుం'దని అంటాడు మహాత్మాజీ. హరిజనులు త్రాగుడూ చచ్చిన జంతువులను తినడమూ మాని పరిశుభ్రంగా ఉంటే, అంటరానితనాన్ని తొలగిస్తా మంటారు సవర్ణహిందువులు. వారిలో ఎన్ని లోపా లున్నప్పటికీ వారిని మనం ప్రేమతో కౌగిలించుకోవాలి. హరిజనుల శరీరాలకంటె సవర్ణుల మనస్సులు ముందుగా పరిశుభ్రం కావాలి. 'మీరు అంటరానితనాన్ని నిర్మూలించనైనా నిర్మూలించాలి. లేదా నాశనమైనా కావాలి' అన్నప్పుడు గాంధీ హృదయమెంత క్షోభించిందో!

దేవాలయ ప్రవేశం

హరిజనోద్యమానికి ఆర్థికమూ నైతికమూ కూడా హరిజనుల దేవాలయ ప్రవేశాన్ని అంగీకరించడం హిందువుల ధర్మం. ఆ ధర్మాన్ని గుర్తించినప్పుడే హిందూమతంలోని కళంకం పోతుంది. 1939 జులై 8 న దక్షిణ భారత దేవాలయాలలోకెల్ల పెద్దదయిన మీనాక్షి దేవాలయంలో హరిజనులను ప్రవేశింపచేయడం లోకోత్తర విషయం. తిరువాన్కూరు రాజ్యంలోని దేవాలయాలన్నిటిలోనూ హరిజన ప్రవేశాన్ని అంగీకరించడం కూడా మహత్కార్యమే. కాని ఆ పని ఒకమహారాజూ ఆయన దివానూ తలచుకొన్నంత మాత్రంతో జరిగింది. మహారాజు, మహారాణి, దివాన్ ఈ ముగ్గురికేదక్కింది ఆకీర్తి. మధురలో జనసామాన్యం చేసిన పని అది. ప్రజాభిప్రాయాన్ని నిరోధించలేక ధర్మకర్తలు

మధుర దేవాలయద్వారాలు హరిజనులకు తెఱవవలసి వచ్చినది. అస్పృశ్యతా నివారణ చరిత్రలో తిరువాన్కూరు దర్బారువారు 1936 నవంబరులో చేసిన ఈ ప్రకటన ఎక్కువగా ఎన్నదగిన సంఘటనము.

> మామతంలోని సత్యప్రామాణ్యములయందు గాఢప్రత్యయంగలిగి, అది దైవ ప్రేరణపైననూ సమగ్రసహాన భావంపైననూ ఆధారపడి ఉన్నదనే నమ్మకంతో, శతాబ్దముల తరబడి కాలపరివర్తనాల కనుగుణంగానే అది ఆచరణలో నడుస్తూన్నదనే విషయాన్నిగ్రహించి మా పౌరులలో ఎవ్వరూ పుట్టుకవలన గాని, కులంవలనగాని, సంఘంవలనగాని, హిందూమతముయొక్క సాంత్వన సమాశ్వాసములకు దూరం చేయబడకూడదనే తలంపుతో, మాస్వాధీనంలోనూ మా ప్రభుత్వ స్వాధీనంలోనూ ఉన్న దేవాలయాలలో ప్రవేశించి పూజ చేసేవిషయంలో, పుట్టుకవలనగాని మతంవలనగాని, హిందువైనయొవ్వనికీ అభ్యంతరం కలిగించరాదని నిర్ణయించి, ఇందుమూలకంగా ప్రకటిస్తూన్నాము, నియోగిస్తూన్నాము, ఆజ్ఞాపిస్తూన్నాము. అయితే ఈ ఉత్తరువు ఆదేవాలయాలలో సముచిత వాతావరణమును నిలబెట్టేటందుకున్నూ, విధ్యనుష్ఠానములనూ ఆచారములనూ పోషించేటందుకున్నూ, మేముచేసే నియమాలకూ కట్టుబాట్లకు లోబడి అమలు జరుగుతూంటుంది.

శళావస్తు వనదగిన హిందూమతం కొన్నివేల సంవత్సరాలకిందట పుట్టినట్లు తెలుస్తుంది. అది పుట్టిపెరిగిన ఇంత కాలంలోనూ అనేక దురదృష్టములకు గురియైనది. ముఖ్యంగా విదేశీ సభ్యతచేసిన దండయాత్రలకు తట్టుకోవలసి వచ్చింది. ఇక ఆచార వ్యవహారాలు, విధ్యనుష్ఠానాలు, సాంఘిక శాస

నాలు, పౌరవ్యవస్థలు, ఇవన్నీ నానాటికి విశ్వాసం లేని బాహ్యాడంబరాలుగా పరిణమించినవి. శ్రద్ధాభక్తులుకలనాడి వన్నీ, సజీవములుగానూ శక్తివంతములుగానూ ఉండేవి కనుకనే గాంధీ వర్ణాశ్రమాలనుగూర్చి వివరిస్తూ హిందూ సంస్కృతికి పునాదులన్నాడు.

> శాస్త్రాలు నేటి అంటరానితనాన్ని సమర్థించే టట్లయితే, నేను హిందువునని చెప్పుకోవడం మానివేస్తానని చెప్పినమాట నా మనస్సులో నిశ్చయించుకొన్నదే. అదేవిధంగా మనకు నేడు భీషణ రూపంలో కనిపిస్తూన్న కులాన్ని అవి సమర్థించేపక్షంలో అంత కోపజనాలకు అంతర్వివాహాలకూ అభ్యంతరంలేని నేను హిందువు వని పిల్చుకోను; హిందువుగా ఉండను.

శ్రీమతి రామేశ్వరి నెహ్రూ హరిజన సేవ

అస్పృశ్యులను ఇతరమతాలలో కలుపుకోవలెననే పిచ్చ దేశమంతటా బాగావ్యాపించింది. దక్కన్ హైద్రాబాదులో మహమ్మదీయ మతప్రచారకులు, కేరళరాష్ట్రంలో క్రైస్తవ మతోపదేశకులు చేస్తున్న పనిఇదే. కేరళ దేవాలయ ప్రవేశోద్యమం నడుస్తూన్న రోజులలో ఎఝూవాలకు గుంపులు గుంపులుగా మత మిప్పించడం చూచి మాధవనగరంలో శ్రీమతి రామేశ్వరీనెహ్రూ ఇలా ఉపన్యసించింది.

> ప్రతి మతప్రచారకుడు ఎఝూవాలను తమమతంలో కలుపుకోవచ్చు ననే ఉద్దేశంతో తిరువాన్కూరుకు పరుగెత్తుకొని రావడంచూస్తే నా కాశ్చర్యం కలుగుతూన్నది. ఇది చాలా విచారకరము. అవమాన

కరమూ అయినదృశ్యం. ఇండియాలోని వివిధభాగాలనుండి తిరువా న్కూరు కింతమంది మతోపదేశకు లెందుకు వస్తూన్నారు? ఎఝా వాలు తేలికగా తమవారి కగ్గం కావడానికి తయారుగా ఉన్నారనా? ఎఝావాలు తమతమ మతాలలో కలసినంతమాత్రంతో వారికి కావ లసిన ఉపకారాలన్నీ చేయడమేగాక, ఆ యా సంఘాల నాయకత్వం కూడా వారి కీయగలమని ఉత్తరహిందూస్థానం నుండి కొంతమంది మతప్రచారకులు చేసిన ప్రకటనను నేడే పత్రికలలో చదివినాను.

ఇది చాలా గొప్ప వాగ్దానం. దైవచింతగలవారు చేయరాని వాగ్దానమది. అటువంటి వాగ్దాన దైవభక్తుల కోరికల నెవ్వరు తీర్చగలరు? అటువంటి వాగ్దానాల నెవ్వరు చెల్లించుకోగలరు? ఆవిధంగా చేయబడిన వాగ్దానా లిదివర కెప్పుడూ చెల్లించబడలేదు. ఇకముందు చెల్లించబడవు. క్రైస్తవులలో కూడా కులభేదాలు అస్పృశ్యత ఉన్నవని నాకు తెలుస్తూన్నది. పాంచాల దేశంలో హరిజనులేదో ఒకమతంలో కలిసివున్నప్పటికి వారు వెలిగానేవుండ వలసివస్తూన్నది. మీరు హిందూమతంలోనే విశ్వాసంతో నిలిచి ఉన్నందుకు అటువంటిగొప్పవాగ్దానాలేవీ నేనుచేయజాలను. జరిగినదానికి హృదయపూర్వక పశ్చాత్తాపమూ, భవిష్యత్తుకు నిరంతర సేవా, ఇవి మాత్రమే నే వాగ్దానం చేయగలిగినవి. ఇవి మీకు సంతృప్తికరంగా ఉంటే సరే. లేకపోతే ఇంత కంటె ఎక్కువ ఆకర్షణ లేవీ నాకడ లేవు నేను మీకు వాగ్దానం చేయ డానికి. అయితే ఎఝావాలుగానీ హరిజనులుగానీ, మాతో ఉన్నా సరే; మాలోనుండి వెళ్లిపోయినా సరే; అంటరానితనమునూ తక్కువ ఎక్కువ అనే భేదాలనూ, హిందూమతానికీ హిందూసంఘానికీ చెడుగులుగా భావించి వాటిని రూపుమాపే పవిత్రకార్యం మాత్రం విడచిపెట్టము.

అధ్యాయం 16

సాంఘిక సామరస్యం

హిందూ మహమ్మదీయ ఐకమత్యం

ఈ ప్రాచీన భూమిలో నివసిస్తూన్న వివిధ సంఘాలమధ్య గల జాతీయ సంబంధాన్ని సరిగా అర్థం చేసుకొన్నవారికి, హిందూ మహమ్మదీయ ఐకమత్య సమస్య తక్కిన సాధారణ జనానికి తోచినంత కష్టతరంగా కనిపించదు. ఈ సందర్భంలో ముందుగా విచారించవలసిన విషయం, అసలిండియాకు మొట్టమొదట ఎంతమంది మహమ్మదీయులు వచ్చారు. ఇప్పుడెంతమంది ఉన్నారు? అని ఇప్పటి ముసల్మానులలో ఎక్కువ మంది, ఈ పవిత్ర భారత వర్షంలో పుట్టినవారే. అంతేకాదు, మన పురాతన మతావలంబకులు కూడా. కాని అనేక కారణాల వలన తమ మొదటి మతాన్ని మార్చుకొన్నారు వారు. ఒకప్పుడీదేశాన్ని మహమ్మదీయులు పరిపాలించారనే కారణ మొక్కటి చాలును పరిపాలకుల మతంలో కలియడానికి (ప్రజలకు ఎక్కువ మోజు ఉండడం సహజమని చూపడానికి). మహమ్మదీయ రాజ్యకాలంలో, ఇస్లాము మతసిద్ధాంతములపైన కలిగిన విశ్వాసమే గాక పరిపాలకుల మతస్థుల మనిపించుకోవడం కూడా ప్రజలు ఘనతగా భావించి ఉండవచ్చును,

కాబట్టి ఈ సమస్యకు అట్టడుగున ఏదో నైతిక కారణము న్నట్లుగా మతోన్మాదం వలన భావింప బడుతూన్నదే కాని ఇది అనుకొన్నంత గడ్డుసమస్య కాదు. పరిసరాలలోని ముస ల్మాను దేశాల నుండి తండోప తండాలుగా జనం ఇండి యాకు వచ్చిపడిన మాటనిజమే. కాని అంత మాత్రంతో మాస్లిములను ప్రత్యేక జాతిగా పరిగణించి పరిష్కరించ వలసిన సమస్య కాదిది. పూర్వకాలంలో బ్రిటనునుండి వచ్చిన ఆంగ్లే యుల సంతానం గనుక ఆంగ్లో ఇండియనులు ప్రత్యేక జాతి అని ఎలా అనడానికి వీలులేదో ఇదీ అంతే. అనేక మతాల సమ్మేళనము, అనేక ప్రయోజనాల సమన్వయమే జాతీయత. భారత దేశంలోని ఇతర జన ప్రయోజనాలకు భిన్నములైన ప్రయోజనాలు ప్రత్యేకంగా మహమ్మదీయుల కేమున్నవి? ఉభయ సంఘాల ఆర్థిక ప్రయోజనాలూ ఒక్కటే కాబట్టి ఉభయుల రాజకీయ వాంఛలూ కూడా అభిన్నంగానే ఉండాలి. కొంతమంది అత్యుత్సాహ పరులైన మహమ్మదీయ మిత్రులు ముసల్మానులకు ప్రజాపాలన ప్రభుత్వం అంటే ఇష్టం లేదంటారు. అయితే వారి కెటువంటి ప్రభుత్వం కావాలి? బ్రిటిష్ అధికారం కింద నడిచే నిరంకుశ పరిపాలన కావాలా? అదే అయితే ప్రపంచంలోని ఇతర దేశాల మహమ్మదీయులు వారిని చూచి నవ్వుతారు. అనాగరికులుగా భావింప బడు తూన్న ఆఫ్ఘనులు కూడా భారతీయ ముసల్మానులు ప్రజా ప్రభుత్వాన్ని ఆడిపోసు కోవడం అంగీకరించరు. స్వతంత్రుల మని సగర్వంగా తలలెత్తుకొని తిరిగే పారసీకులు ప్రజా పాలన లేని ప్రత్యేక జాతిగా ఉండవలెనని సూచిస్తూన్నట్లు భావిం

పబడుతూన్న భారతీయ ముసల్మానులతో సానుభూతి గలిగి ఉంటారను కోవడానికి వీలు లేదు. స్వాతంత్ర్యంకోసం 50 సంవత్సరాల పైచిలుకుకాలం పోరాడిన ఈజిప్టు దేశీయులు, భారతీయ ముసల్మానులు స్వాతంత్ర్యాన్ని అభిలషించడం లేదంటే అర్థంచేసుకోలేరు. త్రిపురీ కాంగ్రెసుకు వచ్చిన వాఫ్డిస్టు ప్రతినిధివర్గంవారీ సంగతి స్పష్టంగా వెల్లడించారు. ప్రపంచ జాతుల సుహృత్సంఘంలో సమాన ప్రతిపత్తితో తల ఎత్తుకొని తిరుగుతూన్న తురుష్కులు, ఇండియా ముసల్మానులు కోరుతూన్నట్లు కనిపించే ఈ తాత ముత్తాతలనాటి పద్ధతిని ఒప్పుకోరు. బస్రా, బుషైరు, ఇస్టాంబుల్ ఖాండహార్, ఖాలత్, కుస్టుంటూనియాలలోని మహమ్మదీయులు, భారత దేశంలోని అయిదవవంతు జనసంఖ్య ప్రజాప్రభుత్వాన్ని కోరకపోవడ మనే అభివృద్ధినిరోధకతత్వాన్ని ప్రోత్సాహపరచరు సరికదా, సహించనుకూడా సహించరు. ఈ మిత్రుల చరిత్ర వారి మాటలకు విరుద్ధంగా కనిపిస్తూన్నది. సురేంద్రనాథ బెనర్జీ, గోపాలకృష్ణగోఖలేల శిష్యగణంలోవాడ నని చెప్పుకొనే జిన్నాగారు జాతీయవాదులలో కెల్ల జాతీయ వాదిగా ఉండినవాడు. 1928 వఱకూ ఆయన గొప్పస్వరాజ్య వాది. నెహ్రూరిపోర్టు ప్రచురించబడిన వెంటనే ఆయన అకస్మాత్తుగా మారిపోయి, అందులోని రాజ్యాంగప్రణాళికకు తాను విరోధినని ప్రకటించుకొన్నాడు. అప్పటినుండి స్వరాజ్యమంటేనే ఆయనకు రోత. ఈ కొత్తగా పుట్టిన స్వరాజ్య ద్వేషంలో నానాటికి ఆయన ఆరితేరుతూన్నాడు. చిట్టచివ

రకు ముస్లింలీగుతో రాయబారాలు నడిపేటందుకు కాంగ్రెసు నియమించిన ఉపసంఘంలో, ఒక్క మహమ్మదీయుడున్నప్పటికీ సహించనని ఎదురుతిరిగేటంతవరకు వచ్చిం దాయన స్వరాజ్యద్వేషం.

మహమ్మదీయులు ప్రత్యేకజాతిగాదు

పాలస్తీనాలోని యూదులూ, అరబ్బులవలెనే ఇండియాలోని మహమ్మదీయులుకూడా ఒక ప్రత్యేక జాతి కాబట్టి వారికి మనదేశంలో ప్రత్యేక భూభాగము కావలెననే సూచన దాదాపు పాకీస్థానం అభిప్రాయానికి దారి తీస్తూన్నది. మొదట కొంత తమాషాగా కనిపించవచ్చునుగాని, నిజానికి ఈ సూచనలో చాలా సాహసం ఉంది. ఇటువంటి సూచన చేయబడడానికి భారతదేశచరిత్రలో ఇదే ప్రథమము. 1923 లో కాకినాడ కాంగ్రెసు అధ్యక్షుడుగా ఉన్న మౌలానా మహమ్మదాలీ, దీనికి సన్నిహితంగా ఉండే సూచనను తన అధ్యక్షోపన్యాసంలో చేసినట్లు మాకు జ్ఞాపక మున్నది. కాని దానిని గూర్చి ఆయన ఆ కాంగ్రెసులోగానీ తరువాతగానీ, అంతపట్టుదల వహించలేదు. మొదటి రౌండు టేబిలు మహాసభ కాయన జబ్బుగా ఉండి డోలీలో హాజరయినాడు. అప్పుడుకూడా ఆయన కాకినాడ కాంగ్రెసులో చేసిన సూచనను గూర్చి యేమీ మాట్లాడలేదు. అయితే జిన్నాగారు తనకు తెలియకుండానే ఈ రాజకీయ భావాన్ని ఆ జాతీయ నాయకునికడనుండి పొందినట్లున్నాడు. కాని మౌలానా

మహమ్మదాలీ జీవించి ఉన్నప్పుడుమాత్రం మాయననాయక త్వాన్ని జిన్నా ఎన్నడూ అంగీకరించలేదు.

ఒకవైపునుండి ఎవరైనా, ఏదైనా విషయాన్నిగూర్చి ఎక్కువగా మాట్లాడితే మఱొకవైపునుండి అంతకంటెనూ ఎక్కువగా మాట్లాడటం మానవసమాజం. కాకి తెల్లగా ఉన్న దని అన్నప్పుడు రాత్రుసిబొగ్గువలె నల్లగా ఉన్నదనా లనిపి స్తుంది. అటువంటి మానసిక ప్రవృత్తి మంచిది కాదని చెప్ప దలచుకొన్నాము. ముఖ్యంగా హిందువు లిటువంటి తోవలను తొక్కకుండా జాగ్రత్త వహించవలెనని మాకోరిక. సత్యా గ్రహంవల్ల పూర్తిగా మన మనస్సులు మార్దవం కాలేదు. ప్రత్యపకారబుద్ధి ఇంకా మనలో చాలామందిలో ప్రజ్వరిల్లు తూనే ఉన్నది. మన మందరమూకూడా తాత్కాలిక విష యాలను ఆలోచిస్తామేకాని దూరప్రయోజనాలను చూచు కోము. ఒక్కొక్కప్పుడు ఉపాయాలకు ప్రాముఖ్యమిచ్చి, సిద్ధాంతాలను జారవిడుస్తాము. తాత్కాలికంగా కసిదీర్చు కొనే ప్రయత్నం చేస్తాముకాని శాశ్వత న్యాయ్యంకోస మాలోచించము. కనుక తీవ్రచర్యలకు దిగడంగానీ, ముస ల్మానులపైన కత్తిదూస్తామని బెదిరించడంగానీ మనకు కూడనిపనులు. అందువలన ఇరుసంఘాలవారూ నాశనమైపో వడమేకాక మనమిన్నాళ్లనుండీ పోరాడుతూన్న మూడో వాడు మన నెత్తినెక్కి కూర్చుంటాడు. మన కాయుధబలం కానీ, మందుగుండుసామానులుకానీ, వాయువిమానాలూ, బాంబులుకానీ లేకపోయినప్పటికీ కేవలం మన సంఘబలం

వలనను తీవ్రబాధానుభవం వలనను వానిని కొంతవరకు అదుపులో ఉంచగలుగుతూన్నాము.

తేశతం హి వయం పంచ పరస్పర వివాదనే
పరైస్తు విగ్రహే ప్రాప్తే వయం పంచాధికం శతః॥

అని కురుపాండవుల కాలంలో పాండవు లన్న ఈ మాటలను జ్ఞాపకం ఉంచుకోండి.

హిందూమహమ్మదీయ సామాన్యానికి విరోధం లేదు

ఈ చివరి వివరణమునుబట్టి కూడా ఈ సమస్య ఇంకా తేలికగా కనిపిస్తూన్నది. ముస్లిము ప్రజాసామాన్యం ఈ ద్వేషాలకు బలికావడంలేదు. వారు తమ హిందూసోదరులలో కలసి మెలసి ఉంటూన్నారు. గ్రామాలలోని సాంఘిక ఆర్థిక జీవితమునుబట్టి చూస్తే హిందూ మహమ్మదీయ విభేదమక్కడ ఉన్నట్లే కనిపించదు. ఇది నగరజీవితంలోనూ విద్యావంతుల మనుకొనేవారిలోనూ కల్పింపబడిన కృత్రిమ విభేదం. అయినప్పటికీ దీనిని గణించకుండా ఉండడానికి వీలు లేదు. జాతీయచైతన్య మెప్పుడూ అట్టడుగునుండి కలగాలి. కాంగ్రెసులోని విద్యావంతుల రాజకీయచైతన్యాన్నీ, కోరికలనూ, స్వరాజ్యతృష్ణనుకూడా మధ్యతరగతులవారు స్వార్థదృష్టితో కల్పిస్తూన్న కపటాందోళనమని ఇంగ్లీషు విమర్శకులు తృణీకరించారు. స్వార్థపరత్వ మున్నది. ఉంటుంది కూడాను. మొదట్లో పూర్తిగా ఉండి క్రమక్రమముగా తగ్గుతూ చివర కేమీ లేకుండా పోతుంది. ఈరోజున ప్రజా

సామాన్యంలో కలిగిన విశేష చైతన్యం స్వయంనియోజిత నాయకుల కృత్రిమస్వార్థపరత్వము నెంతమాత్రమూ సహించదు. మహమ్మదీయ ప్రజాసామాన్యంలో కూడా అదేవిధంగా చైతన్యం రావాలి. ఇంతా అయితే రాష్ట్రాలలో గలిగే చిక్కు లేమిటి? పశ్చిమోత్తర సరిహద్దురాష్ట్రాలు; సింధు రాష్ట్రమూ మాత్రమే మహమ్మదీయు లధిక సంఖ్యాకులుగా నుండి, హిందువు లల్పసంఖ్యాకులుగా ఉన్న రాష్ట్రాలు. అక్కడ అల్పసంఖ్యాకుల సమస్య హిందువులదిగాని మహమ్మదీయులది కాదు. బెంగాలు పంజాబురాష్ట్రాలలో మహమ్మదీయులు దాదాపు అధికసంఖ్యాకులంటే నూటికి 50కంటెఎక్కువ.

వంగరాష్ట్రంలో యూరోపియనుల ఉనికివలన ఈ సమస్య మరింత చిక్కులో పడ్డది. హిందూమహమ్మదీయు లిరువురి మధ్యా వారేవైపుకు మొగ్గితే వారివైపు బలమవుతుంది. అందువలన వారక్కడ ప్రధానస్థాన మలంకరిస్తూన్నారని చెప్పవచ్చును. నిజానికి తక్కినచోట్లకంటె వంగరాష్ట్రంలోని ఈ ప్రమాదకర పరిస్థితిని తొలగించడం ముఖ్య కర్తవ్యం. పాంచాలంలో మహమ్మదీయుల అధికసంఖ్య వలన, మన సిక్కులఅభిలాషలవలన, క్రైస్తవులు, జమీందారులు, వాణిజ్య సంఘాలు, హరిజనులు వీరందరివలన అక్కడి హిందువులు కేవలంఅల్పసంఖ్యాకులై పోయినారు. హరిజనులు హిందువులలోని వారేననేమాట నిజమే. అలాగే సిక్కులనుకూడా హిందువులలోనివారుగా గణించవచ్చును. ఈ పృథగ్భావాలను నశాలంలో తుంచివేయాలి. బొంబాయి, మద్రాసు, మధ్య

రాష్ట్రాలలో ఈసమస్య లేనేలేదు. అనగా ఈ సమస్యను నిర్లక్ష్యం చేయాలని మాభావంకాదు. కాని కాదనడానికి వీలులేనిపద్ధతిని ఈ సమస్య పరిష్కరింప బడింది. ఈరాష్ట్రాలలో మహమ్మదీయులు నూటికి 5 మొదలు 7 వరకూ ఉంటారు. కాని వారిసంఘంలోనుండి ఒక మంత్రిఉన్నాడు. ఇక్కడ సంఖ్యాబలంకాదు ప్రధానం. జాతీయసంస్థయెడల విశ్వాసంతో మెలగడమే మనకు కావలసింది. ఇక బీహారు సంయుక్త రాష్ట్రాలలో నూటికి 12 మొదలు 15 వరకూ మహమ్మదీయులు ఉంటారు. కాని అక్కడి మహమ్మదీయులలోగల చైతన్యము, విద్య, కోరికలు, అహంకారము, అభిలాషలు, నిష్కారణ రాగద్వేషాలు, ఇవన్నీగమనిస్తే దక్షిణ భారతదేశంలోని బ్రాహ్మణులను పోలిఉన్నట్లు తోస్తుంది. ఇక్కడి బ్రాహ్మణులవలెనే అక్కడి మహమ్మదీయులుకూడా అల్పసంఖ్యాకులైనప్పటికీ కొంత పలుకుబడి గలవారే. కాబట్టి సంయుక్తరాష్ట్రాలలోనూ బీహారులోనూ హిందూమహమ్మదీయ విభేదాలను పరిష్కారం చేసుకొన్నట్లయితే హిందూదేశంలో చెప్పుకోదగిన ముస్లిం సమస్యయే లేదు.

ప్రకృతి సమానౌదార్యమే చూపుతూన్నది

మతం మనలోని ప్రతివ్యక్తికి ప్రత్యేకంగా సంబంధించింది. ఎవరి మతధర్మాలను వారు 'తూ' 'చా' తప్పకుండా అనుసరింపవచ్చును. అయినప్పటికీ సాంఘిక ఆర్థిక విషయాలలో సమరసభావం ఉండాలి. సామరస్యమేకాదు, అందరి

ప్రయోజనాలూ ఒక్కటేననేభావం ఉండాలి. వరదగానీ ఉప్పెనగానీవస్తే యేవిధమైన భేదభావమూ లేకుండా అన్ని కులాలవారి అన్ని మతాలవారి ఇళ్లు, పొలాలు, గొడ్లు గోద అన్నీ నాశనం కావడంలేదా ? ప్రపంచంలో నివసించే జను లందరియందు సమానంగానే తన ఔదార్యాన్ని చూపిస్తూం టుంది ప్రకృతి. నిరంతరం తన ప్రేమసౌభాగ్యాన్ని ప్రకృతి దేవత పక్షపాతంలేకుండా ఎలా పంచిపెడుతుందో, అలాగే అప్పుడప్పుడూ దేశాలలో ఉత్పాతాలూ, అనర్థాలూకూడా కలిగిస్తూంటుంది. కాబట్టి ఈవిభేదాలు ప్రకృతిసిద్ధాలుకావు. మానవకల్పితాలు. పౌరులకూ, పౌరులకూ విరోధాలు కల్పించి, భారతదేశమంతా తగాదాలతో నిండి ఉన్నదనడం న్యాయ్యమా ?

చీలదీసి పాలించడం

రెండువందల సంవత్సరాల బ్రిటిషు పరిపాలన తరువాత భారతప్రజలు గట్టిగా తెలుసుకొన్న విషయ మేమంటే తమలో తమకే చీలికలుఉన్నవని, విదేశీ ప్రభుత్వంచేత కల్పింపబడిన కృత్రిమ ప్రమాణాల మూలకంగా ఈప్రాచీన భారతవర్షంలో విభేదాలేర్పడినవని అనేక పర్యాయాలు ప్రజలదృష్టికి ప్రత్యక్షంచేయబడింది. హిందూదేశంలో నాలు గోవంతు జనసంఖ్యా మూడోవంతు వైశాల్యమూగలప్రదేశం భారతసంస్థానాలనే పేరుతో వేరుచేయబడింది. ఇవి అన్నీ ఇంగ్లాండులోని బ్రిటిషురాజుతోటి సంధులు, సనదులు, వాగ్దానాలు, వీటివలన సంపాదించిన స్నేహబాంధవ్యాలు

కలిగిన స్వతంత్రరాజ్యాలని ప్రపంచానికి చాటబడుతూన్నవి. నిజానికి సంస్థానాధిపతులు బ్రిటిష్‌రాజు చేతులలో కీలుబొమ్మలు. ఆయన అనుగ్రహమున్నంతకాలమే వారి రాజ్యాలుంటవి.

మఱొకప్రక్కను దేశం రాష్ట్రాలుగా విభజింపబడింది. వోటింగు అధికారాలను నిర్ణయించడంలోనూ, ఎన్నికలను నడపడంలోనూ ప్రజాభిప్రాయం ప్రకటనకావడానికి వీలులేని పద్ధతిని గట్టి ప్రయత్నాలు జరిగినవి. కాని నిజంగా 'దైవవాణయే ప్రజావాణి' అయింది. బ్రిటిష్‌వారు వేసిన అంచనా ఇందులో తప్పింది. ప్రాదేశికంగా విభజించిన తరువాత సంఘాలుగా కూడా ఇండియాను విభజించారు. హిందువులు, మహమ్మదీయులు, సిక్కులు, క్రైస్తవులు, హరిజనులు, వీరందరికీ దాదాపు ప్రత్యేక నియోజకవర్గాలేర్పాటయినవి. క్యుములేటివ్ వోటింగ్ పద్ధతి (ఇద్దరినిగానీ ముగ్గురినికానీ ఎన్నుకోవలసిన నియోజకవర్గాలలో అన్నివోట్లూ వొకరికే వేయవచ్చును.) యేర్పాటు చేయబడింది. ఇందువలన ఒకే పార్టీఅభ్యర్థులకు ఎన్నికలలో మనస్పర్థలు కలగవచ్చును. తరువాత మంత్రివర్గ నిర్మాణంలో ప్రతిసంఘమూ ప్రత్యేక హిరణ్యాక్షవరాలు కోరేటట్టుగా ప్రోత్సాహం చేశారధికారవర్గంవారు. ఇదిచాలక ప్రయోజనాలనుబట్టికూడా వర్గాలుగా విభజించారు దేశాన్ని. పల్లెటూళ్లనూ పట్టణాలను వేరువేరుగా విభజించారు. బ్రిటిష్‌గవర్న మెంటువారు పల్లెలప్రయోజనముల కంటె పట్టణాలప్రయోజనాలనుఎక్కువగా ప్రోత్సాహపరుస్తూ

న్న సంగతీ, పల్లెటూరివారినుండి వసూలుచేసే పన్నుల పద్ధతి కంటె, పట్టణస్థులపైన విధింపబడే పన్నుల పద్ధతి ఎక్కువ సుళువుగానూ సౌకర్యంగానూ ఉంటూన్న సంగతీ అందఱికీ తెలిసిందే. ఇంతటితో ఊరుకోక ఏజన్సీప్రదేశాలనీ మైదానప్రదేశాలనీ, దేశాన్ని ఇచ్చవచ్చినట్లు వంకరకోతలుకోసి చీల్చారు. ఏజన్సీప్రదేశాలలో సామాన్య పౌరసత్వాలకూ, సామాన్య న్యాయ్యానికీ సంబంధించిన నియమాలూ కట్టుబాట్లూ వర్తించవు. ఏవ్యవహారమైనా అప్పటికప్పుడు జరిగిపోవలసిందే. మైదాన ప్రదేశాలలో లేని నిరంకుశత్వమక్కడ ఎక్కువగా ప్రత్యక్షమౌతూన్నది. ఇవిగాక తోటల యజమానులు, యూరోపియన్ వర్తకులు, విశ్వవిద్యాలయ పట్టభద్రులు, వివిధసంఘాలలోని స్త్రీలు వీరందరికీ ప్రత్యేక నియోజక వర్గాలేర్పాటుచేయబడినవి. ఈవివిధ విభాగాలవలన హిందూదేశమొక 'పావురాళ్ళ గూడు' కింద తయారయింది. 35 కోట్ల జనసంఖ్యనూ చీల్చి, వేరు వేరు అరలలో ఒకరికొకరికి సంబంధం లేకుండా ఉంచారు, ఒకరిగాలి ఒకరికి తాకకుండా, ఒకరివోటు ఒకరికిపోకుండా, ఒకరిఅభిప్రాయాలొకరికందకుండా, చాలాబందోబస్తుగా యేర్పాటుచేశారు ప్రతిఅరనూ. కాబట్టి ఎవరివాంఛలువారివే; ఎవరిఅభిప్రాయాలు వారివే; ఎవరి చిత్తప్రవృత్తివారిదే.

హిందూదేశం వివిధవర్గాలుగా విభజింపబడిన విధానమూ పుట్టుపూర్వోత్తరమూ ఇది. ఇదిజరిగిన పిమ్మట హిందూదేశంలోని ప్రజలు 250 భాషలు మాట్లాడుతారు; అక్కడ

అనేకమతాలవారున్నారు. ఇక కులాలకూ, కులాలలో శాఖలకూ మితిలేదు. కాబట్టి హిందూదేశమొక జాతి కాదని ప్రచారం ప్రారంభమయింది. ప్రభుత్వంవారెరగనట్లుగా, అతిశ్రద్ధగా కావించిన ఈ ప్రచారాన్ని నిజమేననుకొని నిశ్శబ్దంగా ఉండడమేగాక, మనలో నిస్పృహకూడా వ్యాపించింది. శాసన సభలలో ఎన్నికసభ్యులసంఖ్య, గణింపదగనంత చిన్నదిగా ఉన్నంతకాలమూ విభాగాలు దేశంలోని రాజకీయజీవితంలో లెక్కలోకి రానేలేదు.

భారత కేంద్ర రాష్ట్రీయశాసనసభలలో మొట్టమొదటిసారి ఎన్నికసభ్యులు ప్రవేశించింది 1893లో. అంతవరకు ప్రభుత్వ నియోజితులైన అధికార అనధికార సభ్యులే శాసనసభలలో ఉంటూవచ్చారు.1893లో మద్రాసులోని ఎన్నికసభ్యులసంఖ్య ఏడు. 1908లో అది 28 కి పెంపుచేయబడింది. అప్పుడు సంఘ విభేదాలు చెలరేగేటట్టుగా చేయబడినవి. నిజానికి 1905 లో వంగరాష్ట్రాన్ని రెండుగా విభజించడానికిది యొక కారణం. ఈవిభజన వలననే మొదటిసారి మహమ్మదీయులలో తామొక ప్రత్యేక సంఘమనేభావం అంకురించింది. అంతవరకూ హిందువులను బ్రిటిషువారు చాలా ప్రోత్సాహపరుస్తూండేవారు. కాని అసంఖ్యాకులైన హిందువులలో జాతీయ భావాలు వ్యాపించిన సంగతి తెలుసుకొని, జాతీయాభ్యుదయానికి అడ్డంకు కలిగించే ఉద్దేశంతో, తూర్పుబంగాళా దేశంలో మహమ్మదీయరాష్ట్రాన్ని ప్రత్యేకంగా సృష్టించారు. ఓట్టచివరకు 1911 డిశంబరులో ఢిల్లీదర్బారునాడు, చక్ర

వర్తిగారి ప్రకటనద్వారా విభజన రద్దుచేయబడింది. కాని అందువలన కలిగిన భేదభావం మాత్రం, ఆ సంఘాల మనస్సులలో పనిచేస్తూనేఉన్నది. 1908 లో ఉత్పన్నమైన ద్వేషభావం, కోపంవలనా కసివలనా నానాటికి పెరుగుతూనే ఉన్నది. అప్పటినుండీ భారతీయ సంఘవ్యవస్థ హిందూ మహమ్మదీయ విభేదవిషాదదృశ్యంతో కళంకితమౌతూన్నది.

కాని ప్రజలు చాలావరకు జాగ్రత వహిస్తూనేవచ్చారు. 1916 లో ఈ మహాపచారానికి తగిన ప్రతిక్రియ చేయడానికి ప్రయత్నాలు జరిగినవి. కాని నాటి లక్నో హిందూమహమ్మదీయ సమాఖ్యాప్రకారం సమష్టినియోజకవర్గాలకు బదులుగా ప్రత్యేక నియోజకవర్గాలేర్పాటు కావడంవలన, అప్పటినుండీ ప్రతివిషయంలోనూ పృథగ్భావమే ప్రస్ఫుటమౌతూన్నది. కాని 1921 లో, ఖిలాఫతుఉద్యమం తలయెత్తినప్పుడు ఈ విభేదాలు పూర్తిగా విస్మరింపబడినవి. తరువాత ఖలీఫులకు పుట్టినిల్లయిన టర్కీయే, ఖిలాఫత్తును రద్దుచేసి, ఖలీఫా అధికారాలనుకూడా తొలగించిన వెంటనే ఈ ఐకమత్యభావం అంతరించి, అంతవరకూ అణచిపెట్టుకొన్న అహంకారాలు దౌర్జన్యరూపంలో చెలరేగ ప్రారంభించినవి. 1924 నుండి నిరుటివరకూ హిందూ మహమ్మదీయు లొక్కొక్కప్పుడు ఎదురుపడి కొట్టుకోవడం, మరొక్కప్పుడు తమతమ స్పర్థలను మనస్సులలో దాచిపెట్టుకోవడమూ జరుగుతూన్నది. కాని ఈ విభేదాలు, ఆంగ్ల విద్యాధికులు తమతమ వ్యక్తిప్రయోజనాల కోసం తెచ్చిన పెట్టినవనీ, ఇవి జాతీయ

క్షేమానికి భంగకరములనీ కూడా, ప్రజలు గ్రహిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ ఈసంగతి 1931లోనే కనిపెట్టింది. రెండో రౌండుటేబిలు మహాసభనుండి గాంధీ రాగానే చెప్పిన విషయమిదే. ఈపర్యాయం హిందూదేశ రాజ్యాంగ విషయంలో జరిగే రాయబారాలన్నీ హిందూ మహమ్మదీయ సామరస్యం పైన ఆధారపడి ఉండాలనీ, తాను రౌండుటేబిలుసభలో అనేక విభేదాలు కలుగవచ్చు ననుకొన్నప్పటికీ, హిందూ మహమ్మదీయుల మధ్యనూ మితవాదకాంగ్రెసు ప్రతినిధుల మధ్యనూ ప్రదర్శితములయిన విభేదాలు తన కాశ్చర్య విషాదములు కలిగించినవనీ గాంధీ కాంగ్రెసు వర్కింగు కమిటీ సభ్యులకు విశద పరిచాడు.

'ఒక విషయాన్ని భావించడం' లోనూ, 'ప్రత్యక్షంగాచూడడం' లోనూ భేదమున్నదన్నాడాయన. రెండో రౌండుటేబిలు మహాసభలో కొంతమంది చూపిన కాఠిన్యము ద్వేషము, మొండిపట్టుదలా జాతి కళ్ళు తెటపించినవి. తాత్కాలిక లాభాలకోసం శాశ్వత ప్రయోజనాలనూ, అవసరంకోసం సిద్ధాంతాన్ని, స్వసంఘలాభంకోసం జాతీయ క్షేమాన్ని, తృణీకరించగల మహానుభావులీ దేశంలో ఉన్నారని అప్పుడు బాగా అర్థమయింది.

హిందూదేశంలో ఏ గ్రామానికైనా వెళ్ళిచూడండి. కుల భేదాలు మతభేదాలు కనిపిస్తే కనిపించవచ్చును. కాని వివిధ మతాలకూ వివిధసంఘాలకూ చెందిన ప్రజలందరి ఆర్థిక ప్రయోజనాలూ ఒక్కటేననీ, అన్ని కులాలవారూ,

అన్ని మతాలవారూ - హిందువులూ మహమ్మదీయులు కూడా - భ్రాతృ భావంతో మెలగుతూన్నారనీ మాకు స్పష్టమౌతుంది ఇది చూచినప్పుడు, భారత దేశంలో సవర్ణులకూ అవర్ణులకూ, హిందువులకూ మహమ్మదీయులకూ, పైకులాలవారికీ దిగువకులాలవారికీ, తీరని మనస్పర్థ, మతకలహాలు, పోరాటాలూ ఉన్నవని, ఐరోపా యాత్రికులు వ్రాసిన వ్రాతలలోని ఆ యథార్థం ఆశ్చర్యం కలిగించక పోదు. గ్రామాలలో హిందువులూ మహమ్మదీయులూ బుజాలు రాచుకొంటూ తిరుగు తూంటారు. వారిరువురిదీ వేఱొక మతమనే జ్ఞానమే వారికున్నట్లుతోచదు. సంఘం పై మెట్టులో ఉన్నవారెవరో కల్పిస్తూన్న కృత్రిమ వైషమ్యాలను వారు గమనిస్తూన్నట్లే కనిపించదు.

కొంతమంది కుడిపక్షంవారు సాంఘిక విభేదాలు కలవారనీ ఎడమపక్షంవారికవి లేవనీ అంటారు. ఇందులో సగం మాత్రమే నిజం. అవకాశాలు ఉంటేనేగాని ఆశపుట్టదు. పళ్ళచెట్టుకు దగ్గరగా ఉన్నవానికే పళ్ళుకోసుకో వలెననే ఆశ పుడుతుంది. దూరంగా ఉన్నవారికది పుట్టనే పుట్టదు.

ప్రకృతిని పరిశీలించినా ఈ విషయం తెలుస్తుంది. నది పుట్టినచోట నీరతినిర్మలంగా ఉంటుంది. ప్రవహించేటప్పుడు దానిలో కొన్ని ఉప్పులూ కొంతబురదా కలిసేమాట నిజం. సముద్రంలో కలిసిన చోటగానీ, కలవడానికి 30 మైళ్లదూరంలోగానీ, నీరు మరింత ఉప్పగా ఉంటుంది. కుడిపక్షం వారు సంకుచితభావంతో ప్రవర్తించడానికి కారణ

మేమిటో, ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటే తెలుస్తుంది. జీవితంలో వాస్తవిక విషయాలను సన్నిహితంగా ఎదుర్కొన వలసిన తరుణం వచ్చినకొద్దీ, సంకుచితభావం అంతకంతకు వెల్లడి అవుతూవుంటుంది. అందువల్లనే మొట్టమొదట్లో హిందువులు, మహమ్మదీయులు అనుకొనే మనం, బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులూ అనుకొంటాము. తరువాత మళ్ళీ బ్రాహ్మణేతరులలో రెడ్డి, వెలమ, కమ్మ, కాపు విభేదాలు వస్తవి. అటుపిమ్మట ఇంటి పేర్లనుబట్టి విభజన లేర్పాటవుతవి. మనం అడుగుకు పోయినకొద్దీ అనురాగాలుకూడా తగ్గిపోతూంటవి. ఈ సంకుచిత బాంధవ్యాలలో నుండి బ్రతికి బయటపడితేనేతప్ప జాతీయత లేదు మనకు. ఈ సందర్భంలో మనం ఇంగ్లాండును సాదృశ్యంగా తీసుకోవాలి. అక్కడ క్యాథలిక్కులు ప్రొటెస్టెంట్లూ, యూదులూ, క్రైస్తవులూ ఈ అందరూకూడా జాతిక్షేమంకోసమే పనిచేస్తారు.

ఎడమపక్షంవారు సిద్ధాంతాలు చెబుతారుగాని పనిలోకి దిగరు. కుడిపక్షంవారు ముందుస్వసంరక్షణ చూచుకొంటారు. ఈరెండూ పనికిరావు. మధ్యస్థంగాఉండి విజయంకోసం ప్రయత్నించాలి. ముసల్మానులతో పోరాటం లేకుండా ఉండేటందుకు గాంధీ యెంతదూరం పోయినాడో చూడండి. మహమ్మదీయులు బలప్రయోగం చేస్తారనే ఆరోపణలను గాంధీ నిరాకరిస్తూ హరిజన్‌లో ఇలా వ్రాశాడు. 'కాంగ్రెసును నేను ఒప్పించగలిగేటట్లయితే మహమ్మదీయులు బలప్రయోగం చేయవలసినంత శ్రమ వారికి ఈయను. నేను

వారిచే పరిపాలింప బడుతాను. అది భారతీయ ప్రభుత్వమే గనుక నా కావిషయంలో అభ్యంతరం లేదు. అనగా ప్రతి విషయంలోనూ కాంగ్రెసు అహింసాపద్ధతినే అవలంబించి పరిష్కరిస్తుందని అర్థం' కాని బ్రిటిష్‌వా రవలంబించినపద్ధతి వేరుగా ఉన్నది. బ్రిటిష్‌ప్రధాని నిర్ణయం రోగ చికిత్సకాదు. రోగ లక్షణ చికిత్స. ఆయన చేసిన సాంఘిక పరిష్కారం మన కిష్టంలేదు గనుగ అంగీకరించే స్థితిలో లేము. శక్తిలేదు గనుక నిరాకరించే స్థితిలోనూ లేము.

మన దురదృష్టమేమో మొదటినుండి చివరవరకూ, మన ఆంతరంగిక విభేదాలతోనే మనం కృశించిపోతూ న్నాము, మహమ్మదుఘోరీ దండయాత్రనాడే పృథ్వీరాజుతో తక్కిన హిందూ రాజులంతా ఎందుకు కలియలేదు ? 1526 లో ఉత్తర హిందూస్థానంలోని పఠానులూ రాజపుత్రులూ, ప్రజాకంటకుడైన ఇబ్రాహిం లోడీని ఢిల్లీ సింహాసనమునుండి లాగివేయడానికి కాబూలునుండి బాబరును ఆహ్వానించారు. 1756 లో వంగరాష్ట్రంలోని హిందూ ముస్లిము సర్దారులు సిరాజిద్దౌలాంమీద దండయాత్ర చేయడానికి ఇంగ్లీషు వారిని ఆహ్వానించేటందుకు కుట్రచేశారు. మన కమ్యూనిస్టుసోదరుల ద్వారా ఇక రష్యనులనుకూడా ఆహ్వానించుదామా, ఇప్పుడు? ఇది నష్టేట్లో పుట్టిముంచుకోవడ మవుతుంది. బ్రిటనుచేత ఇండియా స్వాతంత్ర్యం అంగీకరింప చేయాలి. అప్పుడే హిందూ మహమ్మదీయులకు సఖ్యత కుదురుతుంది, క్రీ॥ వ॥ 410 లో 'అలరిక్ ది గోథ్' రోమును ముట్టడించి నప్పుడు

హానోరి యస్ చక్రవర్తి, రోమనులుగా మారిపోయి శాంతంగా కాలక్షేపం చేస్తూన్న క్రైస్తవ బ్రిటనులకు 'మిమ్ములను మేమిక రక్షించలేము. మేము వెళ్ళిపోతూన్నాము. మీరక్షణ మీరే చేసుకోవాలి' అని చెప్పినట్లుగా, బ్రిటను మన కిప్పుడు చెప్పితే మన మేమి చేయాలి? ఐకమత్యంలోనే మన బలము, మోక్షమూ ఇమిడి ఉన్నవి.

అధ్యాయము 17

నైతికౌన్నత్యము : మద్యనిషేధము

పా ప పు డ బ్బు

తా గు డు

రాష్ట్రప్రభుత్వాలకు వచ్చే ఆదాయంలో 17 కోట్లు త్రాగుడువలన లభిస్తూన్నది. ఇండియాప్రభుత్వానికి 6 కోట్లు ఉప్పువలన, ఒకకోటి నల్లమందువలన లభిస్తూన్నది. మొత్తం 24 కోట్లు. ఉప్పుసత్యాగ్రహసమయంలో తాగుడు, నల్లమందు, ఉప్పు వీటివలన లభించే పాపపుడబ్బు రద్దుకావాలని గాంధీ పట్టుపట్టాడు. ఈ నష్టాన్ని సరిపుచ్చడానికి సైనికవ్యయము 48 కోట్ల సగానికి తగ్గిస్తే ఆ 24 కోట్లు కలసివస్తుందని సూచించాడు. గాంధీ నిర్మాణకార్యక్రమంలో ప్రాముఖ్యస్థానం వహించిన ఈ విషయాలను ఒక్కొక్కదానినే పరిశీలిద్దాము.

తాగుడు సప్తవ్యసనాలలో ఒకటి. కోట్లకొలదీ దరిద్రులూ వేలకొలదీ భాగ్యవంతులూ ఈ పిశాచానికిబలియై, ఐశ్వర్యం ఆరోగ్యం, ఆనందం, ఈ అన్నిటిని కోల్పోయినారు. పాశ్చాత్యనాగరికతలో తాగుడు తప్పుకాదు. తాగి తందనాలు తొక్కడం తగనిపని; కాని మన దేశంలో ఒక్కరుకూడా తాగుడు ఒప్పుకోరు. పూర్వాచారమునుబట్టి తాగుడలవాటయినవర్గాలవారుకూడా గౌరవం కలవారెవరూ దానిని బహి

రంగంగా అంగీకరించరు. కాని పాశ్చాత్యసంపర్కంకల క్రొత్త వర్గమొకటి సంఘంలోని ధనవంతులలోనుండి తయారయింది. వారు చాలా కొద్దిమంది. వారు తాగుడు కలవాటయినారు. ముఖ్యంగా విదేశీసారాల కలవాటుపడ్డారు. పూర్వకాలంలో మన దేశమున తాగుడు లేదని మేము చెప్పడంలేదు. పురాణాలలో కొందరు మద్యం సేవించినట్లుగా తార్కాణాలు కనబడుతూ నేడున్నవి. తరువాత శుక్రాచార్యులవారు దానిని నిషేధించారు. 'తాగుడు కలవాటయినవారు పాపాత్ములు' అన్నాడాయన.

ఈ దేశప్రజనసంఖ్య 35 కోట్లు. అందులో హిందువులు 24 కోట్లు. మహమ్మదీయులు 8 కోట్లు. హిందువులలో 4కోట్ల మంది 'అంటరానివాళ్లు' అని పిలువబడేవాళ్ళున్నారు. వీరిలో నూటికి 80 మొదలు 90 వరకూ మగవాళ్ళు తాగుడు పిశాచాని కలవాటయి కృశించి పోతూన్నారు. వీళ్ళుకాక కాయకష్టం చేసేవర్గాలలో కొందరూ, బిచ్చమెత్తుకొంటూ తిరిగేవారిలో కొందరూ, వాళ్ల సంపాదనలో చాలాభాగం తాగుడుకు వెచ్చిస్తూంటారు. ఇక వ్యవసాయకులలో ఉన్నత వర్గాలకు చెందిన కొంతమందికూడా పాపం తాగుడుకలవాటై కీర్తిప్రతిష్ఠలనూ శీలాన్ని, వ్యక్తిక్షేమాన్ని, కుటుంబసౌఖ్యాన్ని నాశనం చేసుకొన్నారు. ఈదేశంలోకి బ్రిటిష్‌పరిపాలన వచ్చినతరువాత తాగుడుకు చాటుపోయి బహిరంగభోగలాలసత్వంగా పరిణమించిందది. ప్రభుత్వంవారా వ్యాపారానికి బహిరంగంగా లైసెన్సులీయసాగించారు. అంతేకాదు

ప్రభుత్వంవారికి చాలాకాలంవరకు తాగుడుమీద వచ్చే ఆదాయం, ముఖ్యాదాయాలలో ఒకటిగా ఉండేది. దొంగతనం జూదములాటి నేరములకింద పరిగణించవలసిన తాగుడుకు మాన్యుయల్ అనే ఒక గ్రంధాన్ని ఆధారంగా చేసికొని లైసెన్సు లిస్తూండడం చూస్తే, సిగ్గూ విచారమూ వేస్తూంటుంది. బహిరంగంగా దోవలుకొట్టేటందుకూ, రహస్యంగా వ్యభిచారగృహాలు నడిపేటందుకూ లైసెన్సులీయడంకంటె కల్లు సారాయిదుకాణాలు పెట్టుకొనేటందుకు లైసెన్సు లీయడం తక్కువ ఘోరంకాదు. ఈపని సంఘక్షేమానికి వ్యతిరేకం. పూర్వ సంప్రదాయములను బట్టి మన దేశంలో ప్రజలు తాగుడు జూదములను ఎంతహీనంగా చూస్తున్నారో, అంత హీనంగా ప్రభుత్వంవారు వాటిని చూడడంలేదు. ఇదిచాలా దురదృష్టం. హిందూమతస్థులవలెనే మహమ్మదీయమతస్థాపకులూ, గురువులూకూడా తాగుడును ఖండితంగా నిరసించారు. దురదృష్టవశమున ఇప్పుడు హిందూసంఘంలో వలెనే మహమ్మదీయ సంఘంలో కూడా తాగుడు వ్యాపించింది. ఈ ఘోర దురాచారాన్ని రూపుమాపే నిమిత్తం సంఘ శ్రేయోభిలాషులు కొంత మంది మతసిద్ధాంతాలను కాంగ్రెసు ఆదేశాలనూ నిరంతరం ప్రచారంచేయడం తమ ధర్మంగా భావిస్తున్నారు.

17 కోట్ల ఆదాయం

ఈ హేయదురాచారము వలన భారతదేశం మొత్తం మీద 17 కోట్ల ఆదాయంతీస్తూన్న ప్రభుత్వాన్నిగూర్చి

ఒక్కసారి యోచించండి. మద్రాసు రాష్ట్రప్రభుత్వాదాయం మొత్తం 16 కోట్లు. అందులోనాలుగోవంతు ఆబ్కారీవలన లభిస్తూన్నది. మగవాళ్లు తాగుడ కలవాటు పడినందువలన ఎన్నో పేదకుటుంబాలు అన్నంలేక అల్లాడుతూంటే తద్వారా వచ్చిన ప్రభుత్వాదాయంవల్ల విద్యావిలాసాలతో ధనవంతులు కాలక్షేపంచేస్తూండడం దైవచిత్రమనాలా? విషాద సంఘటనమనాలా? ఇది కాకులనుకొట్టి గద్దలకువేయడం కాదా? అంతకన్నకూడా చెడ్డది. నలుగురు కొడుకులున్న తండ్రితో నీపెద్దకొడుకుకుమందు, నీరెండోకొడుకుకు చదువూ కావలెనంటె తక్కిన ఇద్దరుకొడుకులూ తాగాలి. అందువలన లభించిన 4 కోట్లలో అప్పుడు రెండు కోట్లు ఆసుపత్రులకూ రెండు కోట్లు కళాశాలలకూ ఖర్చుపెట్టడానికి వీలవుతుందని చెప్పడంవంటిది యిది.

వృత్తికళానైపుణ్యంగల కుటుంబాలెన్నో తాగుడువలన తమ బ్రతుకు తెరవునే పాడుచేసుకొన్నవి. తాగుడుఎక్కువైన కొద్దీ హస్తకౌశలం నశిస్తుంది; నెత్తురు క్షీణిస్తుంది; అనేక రోగాలు వ్యాపిస్తవి; తాగుడు కలవాటు పడ్డవాళ్ళకు రోగాలను రాకుండా కాపాడుకొనేశక్తి ఉండదు. ఈ సంగతి అందరికీ తెలిసిందే. తాగుడు యుక్తాయుక్త వివేకాన్ని పోగొడుతుంది. తాగుబోతు లనేకవ్యసనాలకు బలియై తద్వారా అనేక నేరాలకు పాల్పడుతారు.

తాగుడుమానితే కష్టజీవుల దరిద్రం సగం తగ్గుతుంది. అంతేకాదు, రెట్టింపుఆరోగ్యమూ రెండింతల సంస్కారమూ

కలుగుతుంది. దేశంలో నేరాలు చాలావరకు తగ్గిపోతవి. అందువలన వాటిని నిరోధించేటందుకు గానీ, కనిపెట్టే నిమిత్తంగానీ వెచ్చించవలసిన ప్రభుత్వవ్యయంకూడా చాలా తగ్గిపోతుంది. డబ్బుమిగులుతుంది. కనుక వర్తకం అభివృద్ధి అవుతుంది, ఉత్పత్తికి ప్రోత్సాహం కలుగుతుంది. వీటన్నిటి వలన జాతిలో నిర్మాణశక్తి పెరుగుతుంది. జరిగిన 17 సంవత్సరాలనుండీ గాంధీ ఈసంపూర్ణ మద్యనిషేధ సిద్ధాంతాన్ని కాంగ్రెసు యాజమాన్యం క్రింద ప్రచారం చేస్తూన్నాము. తాను ఒకటిన్నర దశాబ్దములనుండీ ప్రజాసామాన్యానికి బోధపరుస్తూన్న ఈకార్యక్రమాన్ని కాంగ్రెసుమంత్రు లధికారంలోకిరాగానే తమతమరాష్ట్రాలలో ఆచరణలో పెట్ట నిశ్చయించు కొన్నారు. ఒకేసారి తాగుడును నిలిపివేసినందు వలన రాష్ట్రప్రభుత్వాలఆదాయం చాలావరకు పడిపోయే మాట నిజం. కాబట్టి మద్రాసురాజధానిలో మొట్టమొదట సేలం, చిత్తూరు, కడప, ఉత్తరార్కాటు జిల్లాలలోనూ, బొంబాయిరాష్ట్రంలో అహమ్మదాబాదు బొంబాయినగరముల లోనూ, ఇతర రాష్ట్రాలలో అక్కడక్కడా కొన్నిసర్ణీతప్రదేశములలోనూ మాత్రమే కాంగ్రెసుమంత్రులు మద్యనిషేధ సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకొని వచ్చారు ఇది ఈ సందర్భములో వారు తీసుకొనిన మొదటిచర్య. మద్యనిషేధం కొనసాగుతుందా లేదా అని పరీక్షకోసంచేసిన పనిగా దిది. దానిని కొనసాగించడానికి కావలసిన పనులెన్నో తరువాత సంవత్సరాలలో చేసి ఉండేవారు. బడ్జెట్టును సరిపుచ్చుకోవల

సిన బాధ్యతకూడా ఉందికదా ప్రభుత్వాలకు; కాబట్టి అందుకు తగ్గించతగిన ప్రభుత్వవ్యయాలను తగ్గించాలి; జాగ్రత్తగా పరిశీలించి కొత్తకొత్తవిధాల ఎక్కువఆదా వచ్చే మార్గాలను అన్వేషించాలి; కనుక కొంతకాలయాపన తప్పనిసరి.

మద్యనిషేధము ; గాంధి

బొంబాయిలో మద్యనిషేధ ప్రారంభమునుగూర్చి గాంధీ ఢిల్లీనుండి 26-3-39 న వ్రాసిన విషయాలను ఇక్కడ ఉదహరించడం ఉచితం.

> 'చక్కగా చేసినపని చక్కగానే ఉంటుంది' అనేది మంచి సామెత. బొంబాయిలో మనోహరస్థలాలు చాలా ఉన్నవికాబట్టిన్నీ హార్బరుకు మంచిమార్గం ఉన్నదికాబట్టిన్నీ బొంబాయినగరం చక్కనిదనడం న్యాయ్యంకాదనీ నే ననేకసార్లు చెబుతూఉంటాను. ఆ నగరంలో మురికి కారకీచులు, జనసంకీర్ణములైన ఇరుకుసందులు, నివాసయోగ్యములుకాని హరిజనుల గుడిసెలూ ఉన్నంత కాలమూ నేనలా చెప్పక తప్పదు. కాని బొంబాయి మద్యాన్ని మానివేసినప్పుడు. నేను చెప్పిన కళంకాలు ఉన్నప్పటికీకూడా ఆ ఒక్క మనోజ్ఞకృత్యంవలననే అది రమణీయనగరం అనిపించుకుంటుంది. బొంబాయి నగరంలోని కష్టజీవులలో తాగుడు వ్యసనాన్ని తప్పించినట్లయితే వారిస్థితి బాగుపడుతుంది. అప్పుడు బొంబాయి పురపాలకసంఘం పేదలకు వాసయోగ్యములైన గృహములను నిర్మించేటందుకు చులకనగా ప్రయత్నించవచ్చును. బొంబాయి ప్రభుత్వంవారు అందులో ముఖ్యంగా డాక్టరు గిల్డరు, యింతధైర్యంగా తమ ధర్మాన్ని నిర్వర్తించ గలిగినందుకు, బొంబాయి నగరమేకాదు, రాష్ట్రమంతావారిని

అభినందించవలసి ఉంది. త్రాగుడు వ్యాపారంపైననే ఆధారపడి ఉన్న అనేకమంది పార్శీలవృత్తి యిందుమూలాన పోతుందని నాకు తెలుసు. బొంబాయి పార్శీలకు కూడలి. మంచినీళ్ళు త్రాగినట్లుగా మద్యం పుచ్చుకోవడం మర్యాద అనుకొనే నవనాగరికులు కూడా బొంబాయిలో చాలామంది ఉన్నారు. వారంతా కూడా తమకోసం కాకపోయినా, తమ పేదసోదరులకోసమైనా ఈ సందర్భానికి అనుగుణంగానే ప్రవర్తిస్తారని నా ఆశ. అందువలన వారు బొంబాయి నగరం ఇండియాలోకెల్ల రమణీయనగరమనే పేరేగాక ప్రధాన నగరమనే ఖ్యాతి తెచ్చి, భారతదేశానికి మార్గదర్శకులు కాగలరు.

బొంబాయిలోని మద్యనిషేధం వలన ప్రభుత్వాదాయం చాలా పడిపోయే మాటనిజం. ఆర్థికమంత్రి బడ్జెటును సరిపుచ్చవలసిఉంది. ఆయనకు డబ్బుకావాలి. కాబట్టి కొత్తపన్నులను వేయవలసివస్తుంది. వాటిని భరించేవారు గునియకూడదు. ఎంత ధర్మమైన పన్నయినా ఎవ్వరికీ ఇష్టముండదు. ఆర్థికమంత్రి న్యాయ్యమైన అభ్యంతరాలన్నిటినీ గమనిస్తున్నట్లే వింటూన్నాను. ఈపన్నులిచ్చేవారు ఒకమహోద్యమానికి సహాయపడే సదవకాశం లభించినదని ఎందుకు గర్వపడకూడదు? ప్రజలందరి సంతోష ధ్వానములతో మద్యనిషేధోద్యమం ప్రారంభించబడిన రోజు, బొంబాయినగరం గర్వించతగిన రోజు. దీనిని పైవారెవరో బలవంతంగా ప్రవేశపెట్టినట్లు భావించకండి. ప్రజలకు బాధ్యత వహించిన ప్రభుత్వం ప్రవేశపెడుతూన్నది దీనిని. 1920 నుండీ యిది జాతీయకార్యక్రమంలోని ప్రథానాంగాలలో ఒకటిగా ఉంది. ఇరవయి సంవత్సరాలకిందట స్పష్టంగా ప్రకటింపబడిన జాతీయాభిప్రాయాన్ని ఆచరణలోకి తీసుకొని రావడమే ఇప్పుడు చేస్తూన్న పని.

తాగుడుకు కారణాలు

ఈ సందర్భంలో కాయకష్టం చేయవలసినవాళ్లకు తాగుడల వాటు కావడానికి కారణాలను పరిశీలించడం మంచిది. న్యూయార్కు నగరంలోని ఒక ఆసుపత్రిలోనున్న రోగులనుబట్టి కొన్ని లెక్కలు తయారు చేయబడినవి. వాటి ప్రకారం వారనేక కారణాలవల్ల తాగుడును అలవాటు చేసుకొన్నారని తెలుస్తుంది. సాంఘిక కారణాలవలన నూటికి 52.5 వంతున తాగుడు కలవాటయినారు. కుటుంబ కష్టాలను మరచిపోవడానికి నూటికి 13 మంది, వైద్య కారణాలవలన నూటికి 9.3 మంది, వృత్తిగా నూటికి 7 మంది, పెద్దవాళ్ళ బోధల వలన నూటికి మరొక 7 మంది, చేసే పని లేక నూటికి 5 మంది, ఆటలలో హుషారుగా ఉండేటందుకు నూటికి 1.2మంది తాగుడును ప్రారంభించారు. నూటికి ఇంకో అయిదుగురు మాత్రం తమకు తాగుడెందు కలవాటయిందో కారణాలను చెప్ప లేనివా రున్నారు.

తాగుడువలన సాంఘికంగా తటస్థించే చెడుగులనుకూడా ఆలోచిద్దాము. తాగి తెచ్చుకొన్న కుటుంబ కలహాల వలన చాలా మంది భార్యా భర్తలు విడాకులు పుచ్చుకోవలసి వచ్చింది. 1887-1906 సంవత్సరాలమధ్య అమెరికాలో 1,84,568 వివాహాలు విడాకులు పుచ్చుకోవడంవలన రద్దయినవనీ, ఇందులో నూటికి 45 వివాహాలు రద్దవడానికి కారణం తాగుడేననీ తెలుస్తూన్నది. నగరాలలో వ్యభిచార గృహా

లనుగూర్చి తరుచు వింటూంటాము. ఈ వృత్తిచేసే వాళ్లలో నూటికి 80 మంది తాగుడు ప్రభావం వలననే అందుకు లోబడుతూన్నారు. మన దేశంలోని పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రంలో తాగుడు కింద ఖర్చు తల 1కి సగటు రూ. 0-3-8 లనీ, బొంబాయిలో రెండు రూపాయిల ఒక అణా అనీ, తక్కిన రాష్ట్రాలలో ఈ రెండు అంకెల మధ్యనూ ఉంటుం దనీ తెలుస్తూన్నది.

తా గు డు ఫ లి తా లు

తాగినందువలన పనిచేసే శక్తిలో పరిణామ మేమోకూడా విచారించాలి. తాగిన విలుకాడు చేతులు వణకి, గురి తప్పతాడు. ముద్రణా యంత్రశాలలో అక్షరాలు కూర్చ లేడు కంపాజిటరు. మల్లుడు వ్యాయామ సమయంలో తన అవయవాలు దుర్బలంగా ఉన్నట్లు తోస్తుంది. వారమంతా పనిచేసి, ఆదివారం సెలవు తీసుకొని, ఆనాడు పూర్తిగా తాగుతారు కొంతమంది పనివాళ్ళు. సోమవారంనాడు వాళ్ళు పనిచేయలేరు. మాట వచ్చింది గనుక చెబుతు న్నాము. మేము వైద్య విద్యార్థులంగా ఉన్నప్పుడు జనరల్ ఆసుపత్రిలో డాక్టర్లు సోమవారంనాడు మాట్లాడ వీలుగా ఉండేవారు కారు. ఇక పనిసంగతికి వద్దాము. శనివారంనాడు నూటికి 80 సార్లు గురి తప్పకుండా లక్ష్యాన్ని కొట్టగల విలు కాడు, సోమవారం నాడు 70 సార్లే కొడతాడు. శనివారం నాడు 8 స్టిక్కులు కూర్చగల కంపాజిటరు, సోమవారంనాడు

ఆరు స్ట్రిక్కులే కూరుస్తాడు. శనివారంనాడు 10 అడుగులు ఉరకగల మనిషి, సోమవారం నాడు 8 లేక 9 అడుగులు మాత్రమే ఉరుకుతాడు. సోమవారం నుండి, మంగళవారం, మంగళవారం నుండి బుధవారం, బుధవారంనుండి గురు వారం క్రమక్రమముగా హెచ్చుతూ గురువారం సాయం కాలానికి పని వాళ్లకు మళ్ళీ యెప్పటి శక్తిసామర్థ్యాలు వస్తవి. శుక్రవారంనాడు శనివారంనాడు చక్కగా సలక్షణంగా పనిచేస్తారు. కాని ఆదివారం తాగినప్పటినుండీ మళ్ళీ క్షీణదశ ప్రారంభమాతుంది.

ఈ విధంగా వారం వారం తెచ్చి పెట్టుకొన్న ఈ క్షీణదశ క్రమ క్రమంగా మనిషిని ఎందుకూ కొరగాకుండా చేస్తుంది. తాగుడుకు వ్యతిరేకంగా అనేకం చెప్పవచ్చును. నైతికంగా చూచుకొంటే, అది దైవ ద్రోహం సాంఘికంగా చూచుకొంటే సభ్యతకు కళంకమనాలి దానిని. శారీరకంగా, అది మనను దుర్బలులనుగా చేసి మన రోజువారీ పనుల కాటంకం కలిగిస్తుంది. ఈ నాగరికప్రభుత్వం ఇంతకాలంనుండీ దీనిని తమ ఆదాయమున కొక మార్గంగా వ్యవహరిస్తూండడం అన్నిటి కంటే ఆశ్చర్యం.

తాగుడును మానినందు వలన దక్షిణ ఇండియాలోని ప్రజలు ప్రభుత్వం వారికిచ్చే నాలుగుకోట్లను ఆదా చేసుకోవడమే కాక, తాగుడుకయ్యే అసలు ఖర్చు 17 కోట్లరూపాయీలనూకూడా నిలువ చేసుకోగలరు. సేలం జిల్లా అడుగుజాడలలో రాజధానిలోని 28 జిల్లాలూ నడిచేయెడల, ప్రజల

ఆదా సంవత్సరానికి 21 కోట్లకు పెరుగుతుంది. ప్రభుత్వా దాయమును పూరించడానికి అనేక విధాలుగా వారు సహాయ పడవచ్చును. ప్రభుత్వ వ్యయంకూడా చాలావరకు తగ్గడానికి వీలున్నది, ఈవిధంగా నిలవచేసుకోగలిగిన ప్రజల కొను గోలుశక్తి పెరిగి, ప్రభుత్వానికీ సంఘానికీ సహాయ పడ గలదు. ఆనందమూ అభ్యుదయమూ తాండవ మాడుతూండే నూతన శక ప్రారంభం కాగలదు. అయితే కాంగ్రెసు వాదులు ఈ పునర్నిర్మాణ మహోదార ప్రయత్నానికి, ఈ పుణ్య కార్యానికి హృదయపూర్వకంగా పూనుకోవాలి.

అ ను బం ధం

(ఇది అస్సాము మాజీప్రధానమంత్రి గోపీనాథ బార్డో లాయ్ పత్రికలకు పంపిన వ్యాసం)

౧

ఘనత వహించిన ఢిల్లీ మొగలాయి చక్రవర్తి, అస్సాము రాజు స్వర్గదేవ అహోముకు బహుమతులు పంపుతూ అందులో ఒక నల్లమందు అచ్చుకూడా పంపినట్లు వింటూ న్నాము. ఈ కానుకలను తీసికొని వచ్చిన రాయబారి, దేవర వారికీ, ఆయన ఆస్థానంలోవారికి దాని ఉపయోగమును దాని విశేష గుణాలనూ పూర్తిగా వివరించాడు. ఢిల్లీలోని మొగలు చక్రవర్తులు అస్సాముపై దండయాత్ర చేసి జయించ వలెనని నూరేండ్లపైచిలుకు ప్రయత్నించారు. అస్సాము

పొలిమేరలలోనుండి వారు పదిహేడు పర్యాయములు పారి పోవలసివచ్చింది. కాని చిట్టచివరకు మొగలుసేనా దండ యాత్రలు చేయలేని పనిని, ఈ నల్లమందుఅచ్చు చేసినట్లు కనిపిస్తూన్నది. ధైర్యసాహసాలు కల అహోముపైన నల్ల మందుకు విజయం గలిగింది. మొగలాయీలీ ప్రయోజనం పొందకుండానే అప్పటి కష్టుడే మఱుగుపడి పోయినారు. కాని నల్లమందు పొగపీల్చే దురభ్యాసంమాత్రం క్రమ క్రమంగా అస్సామీసు సంఘంలోని దిగువ జాతులకు దిగింది. 1826 లో బ్రిటిష్ వారు (బర్మా దండయాత్ర తరువాత) వాళ్ల మామూలు ధోరణిని, ఆర్తత్రాణ పరాయ ణత్వమనే పేరుతో అస్సామును స్వాధీనం చేసుకొన్న నాటికి అస్సామీసు జాతియావత్తూ ఈ నల్లమందు రాక్షసికి బలియై పోయింది.

అక్షీణ వాణిజ్య స్వభావంగల బ్రిటిష్ వారు, ఈ మానవ దౌర్బల్యాన్ని ఆధారంగా చేసుకొని లాభం పొందే ప్రయ త్నాలు చేశారు. రాష్ట్రంలోని గసగసాల పంటను ఆపివేసి, బీహారునుండి నల్లమందును గవర్నమెంటు ఖజానాల ద్వారా వ్యాపింపచేయడం ప్రారంభించారు. నల్లమందు తినేవాళ్ళూ కొంతమంది అస్సాము ప్రజానాయకులూ, ఈ కొత్తపద్ధతికి అయిష్టతను వెల్లడించారు. అనేక స్థలాలలో కొట్లాటలు జరి గినవి. కాని అవి తేలికగా అణచివేయబడ్డవి. నల్లమందు భాయీల వ్యసనంముందు వాళ్లకు డబ్బంటే లెక్క లేకుండా పోయింది. అప్పటినుండీ అస్సాము చరిత్రలో ఒక విషాద

ఘట్టము ప్రారంభమయింది. ఆ రోజులలో నల్లమందు ఎక్కువ చౌకగాను (సేరు రు 20 మొదలు రు 30 ల వరకు ఉండెను.) ఉండడంవల్లనూ, అమ్మకానికి యేవిధమైన నిరోధమూ లేనందువల్లనూ పాపము అమాయక ప్రజలకు నల్లమందే సర్వరోగనివారణి అయింది. ఈ విశ్వాసానికి మన ప్రభువులు మఱింత దోహదం చేశారు. నల్లమందు కమీషను ముందు ఇండియా పెట్టిన సాక్ష్యంలో, నల్లమందు చాలారోగాలకు మంచిదనడమే గాక, బలవర్ధకౌషధమనీ మలేరియా కాలాజాౘవంటి అనేక రోగాలను రాకుండా ఆపుతుందనీ కూడా ఋజువుచేయాలని ప్రయత్నించిన సంగతి అందఱికి బాగా తెలిసినదే.

నల్లమందుభాయీల సంఖ్య నానాటికి పెరగవలసినంతగా పెరుగుతూనేఉన్నది. 1910-15 సంవత్సరాలలో అస్సాముజన సంఖ్యలో నూటికి 10 మంది ఈ నల్లమందుకలవాటుపడ్డారు. మనిషికి సంవత్సరానికి వచ్చే ఆదాయెక్కువేస్తే రు 30 లు మొదలు రు. 36ల వరకూ ఉంటుంది. అంతకెక్కువఉండదు. కాని దురదృష్టవంతులైన ఈ నల్లమందు వ్యసనపరులు సగటున ఒక్కొక్కరు ఏడాదికి రు. 20 లు చొప్పున ఒక్క నల్లమందుకే వ్యయంచేయవలసివచ్చింది. దీని దురదృష్ట ఫలితాలు వెంటనే కనిపించినవి. కుటుంబాలకు కుటుంబాలు, గ్రామాలకు గ్రామాలు, పరమ దరిద్రంతో బాధపడవలసిన గతి పట్టింది. మనుష్యులు సిగ్గులేని స్వార్థంతో పశువుల్లాగా పరిణమించారు; నల్లమందుకోసం పెళ్ళాం బిడ్డల బట్టలను

అమ్ముకొని, వాళ్ళను దాదాపు దిగంబరులుగా చేశారు. ఇక తక్కిన ఆ సినంగతి చెప్పవలెనా? తాను నల్లమందు పొగ త్రాగుతూ, భార్యనూ వయసువచ్చిన కూతుళ్ళనూ జీవనంకోసం బిచ్చమెత్తుకోవడానికి పంపేవాడు ఇంటి మగ వాడు; ఒక్కొక్కప్పుడు వాళ్ళశీలభంగానికి కూడా సిగ్గుపడే వాడుకాడు. తన తృష్ణను తృప్తి చేసుకోవడానికి పెరిగి పెద్ద వాళ్లవుతూన్న కొడుకుల నెవ్వరికో బానిసలుగాచేసి చిల్లర డబ్బులుసంపాదించుకొంటూండేవాడు. నల్లమందు పిచ్చవాళ్ల ఇరుగుపొరుగు వారికెప్పుడూ శాంతిలేదు. ఇళ్ళలోనుండి వాళ్లపాత్రసామగ్రీ,తోటలోనుండి కూరలూ పండ్లూ పోతూం డేవి. నల్లమందువలన దిక్కులేకుండా పాడయినవానికి దొంగ తనమూ మోసమూచేయడం సహాజమైపోతుంది. నల్లమందు మనిషిని క్షీణబలుడుగా చేయడమే కాదు, వట్టిసోమరిగా కూడా చేస్తుంది. అతనికి నీళ్లంటే ఒకవిధమైన భయం పుడు తుంది. అందువలన స్నానంచేయడమంటేనూ, పరిశుభ్రంగా ఉండడమంటేనూ అతనికి గిట్టదు. నిరంతరం నల్లమందు తింటూండడంవలన అతని శరీరానికి నల్లమందు రంగు వస్తుంది. అస్సాము సాంఘికవ్యవస్థలో ఎక్కువ పేదరికం గానూ, ఎక్కువ అనాగరికంగానూ ఉన్నసంఘం, ఎక్కువగా నల్లమందుకు అలవాటుపడుతూన్నదన్న విషయం బాగా గ్రహించవలసిన సంగతి.కనుక ఆదిమ నివాసులు, అడవిజాతు లవారు, ఏదో ఒకవిధంగా 'అహోములు' ఈ నల్లమందు పిచ్చకు అత్యంతం గురియైనారు.

ఈ విధంగా మన ప్రజలలో చాలామంది శారీరక, నైతిక, ఆర్థిక పతనమును పొందుతూండగా, బ్రిటిష్ ప్రభుత్వంవారి ధనరాసులు పెరుగుతూ వచ్చినవి. ఈ శతాబ్దమునందలి మొదటి రెండు దశాబ్దములలోనూ అస్సాము ప్రభుత్వంవారి మొత్తంఆదాయం 2½ కోట్లో అంతకు కొంచెం తక్కువో ఉండేది. ఇందులో మామూలు రైతులనుంచి పుచ్చుకొనే భూమిశిస్తు ఒకకోటి ఉండేది. దాదాపు 50 లక్షలో అంతకు కొంచెంఎక్కువో ఎక్సైజు పన్ను ఉండేది. ఈపన్నులలో నూటికి 70 లేక 75 వరకూ నల్లమందు పన్నే. అందువల్ల పెద్దపెద్ద యూరోపియన్ తోటలయజమానులు ఎకరానికి రు 1-2-0 భూమిశిస్తు చెల్లించేవారు. ధనవంతులయిన జమీందారులు యకరానికి 0-5-0 చెల్లిస్తూండేవారు. దరిద్రుడైన అస్సాముగ్రామస్థుడు సగటున యకరానికి రు 2 8-0 చెల్లించవలసి వచ్చేది.

అయితే ఈ కీలకమును తెలుసుకొన్న విద్యావంతులు ప్రభుత్వంవారి ఈ పన్నుల విధానాన్ని గూర్చిగానీ, నల్లమందు దురభ్యాసపరుని దుస్థితినిగూర్చిగానీ అశ్రద్ధవహించి ఊరుకోలేదు. అస్సాము జనసంఖ్యలో అనేకమందికి నల్లమందుభాయీలపైన సానుభూతిలేదు సరికదా పైపెచ్చు అసహ్యం. 'కనియా' అంటే 'నల్లమందుభాయి' అక్కడ ఆ మాటకే అసహ్యాకరమైన అర్థం వచ్చివేసింది. కాని ఇటీవల చాలామంది ప్రజానాయకులీ ఘోరదురభ్యాసాన్ని ఎదుర్కొనేటందు కెంతో పనిచేశారు. 'సిపాయి తిరుగుబాటు' రోజుల

నాటికే, నల్లమందునుపూర్తిగా రద్దుచేయవలెనని ప్రజలలో ప్రచారంచేసి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ప్రేరేపించిన వాడు మోనీ రాయ్‌దివాను. ఆయన అస్సాములోని బ్రిటిష్‌ప్రభుత్వాన్ని సింహాసనమునుండి తొలగించవలెనని కుట్రచేసినట్లుగా తలంపబడి, ఉరికి పాత్రమైనాడు. జనసామాన్యం నల్లమందుకు వ్యతిరేకులని నేనిదివరకే వెల్లడిచేశాను. ఉష్ణదేశాలలో నల్లమందు సర్వరోగ నివారిణిఅని, దానిశక్తిసామర్థ్యాలను, యూరోపియన్ నిరంకుశాధికారులు, వారికి లోబడిన భారతీయోద్యోగులు, ప్రజాసేవకుల మనుకొంటూ అసలు ప్రజలచేత 'జోహుకుమ్'లు గా పరిగణింపబడే పెద్దమనుష్యులు కొందఱూ అనేక విధాల కీర్తిస్తూండేవారు. కీ॥ శే॥ శ్రీ ఘోసీధోర్ చలిహా అసిస్టెంటుకమీషనరుపనిచేసి రిటైరై 1916లో అస్సాముకౌన్సిలు సభ్యుడుగా ఉన్నాడు. ఆయన ప్రభుత్వంవారి నల్లమందు విధానాన్ని కౌన్సిలులో తీవ్రంగా విమర్శించాడు. ఎంతోమంది ప్రజల శారీరక, నైతిక పతనానికి హేతువైన నల్లమందుపైన ఆదాయంతీయడం, ప్రభుత్వానికెంతమాత్రమూ న్యాయ్యంకాదని ఆయన కచ్చితంగా చెప్పినాడు. అప్పటి ఛీఫ్ కమీషనర్ సర్‌నికోలస్ డాడ్సు బీట్సన్ బెల్, 'నిజంగా గౌరవనీయ సభ్యుడు చలీహాగారు నల్లమందునుండి వచ్చే ప్రభుత్వాదాయమంత పాపభూయిష్ఠమైనదని నమ్మకంకలిగి ఉంటే ఆయునపింఛను అందులోనుండే వస్తూన్నది గనుక దానిని పుచ్చుకోకుండా మానివేయడం మంచిదని ప్రత్యుత్తరమిచ్చాడు. (ఈజవాబిచ్చిన మహానుభావుడే తరువాతక్రైస్తవ

మతోపదేశకుడైనాడు.) దీనిని దేశమంతా అవమానంగా భావించారు. యువకులీ అవమానకర ప్రసంగానికి తగిన ప్రత్యుత్తరంకోసం ఆలోచించడం ప్రారంభించారు.

అందుకు తగినఅవకాశం రానేవచ్చింది; రాజకీయస్వాతంత్ర్యానికి ఆత్మపరిశుద్ధత, సాంఘికవిశుద్ధత అవసరమని మహాత్మాజీ ఘంటాపథంగా చెప్పినమాటలు; అస్సాము ప్రజల ఆర్ద్రహృదయాలను బాగా ఆకర్షించినవి. కనుకనే 1922 లో ఇండియా ప్రభుత్వంవారు, అసహాయోద్యమ ఆందోళన ఇక్కడ, అస్సాములో మాత్రమే ప్రజాసామాన్యం లోకి బాగా పాకిందని, భారత రాజ్యాంగ కార్యదర్శికి వ్రాసిన నివేదికలో ఒప్పుకోక తప్పినదికాదు. అప్పటి ప్రజానాయకులు కీర్తిశేషులు నోబిన్‌చంద్రబార్డోలాయ్, తరుణరాం ఫూకన్‌గార్లు మత్తుపదార్థనిషేధం ముఖ్యంగా నల్లమందు నిషేధాన్ని ఎక్కువగా ప్రచారంచేశారు. మత్తుపదార్థాల దుకాణాలు విస్తారంగా పికెటు చేయబడినవి. ఈసందర్భంలో నౌగాంగ్ జిల్లాలోని జాగీలో నల్లమందు దుకాణాన్ని పికెటుచేసిన వలంటీరుదళమే మొట్టమొదటనిర్బంధింపబడింది. అనేకచోట్ల ఇల్లిల్లూ తిరిగి ప్రచారంచేశారు కాంగ్రెసు స్వచ్ఛందసైనికులు. అనేకచోట్ల నల్లమందు దురభ్యాసపరులే స్వయంగా నల్లమందు పొగతాగే పీకెలను మావలంటీర్లకిచ్చి పెద్దపెద్ద భోగిమంటలు వేసి కాల్పించారు. మహాత్మా పేరులో యేదోమహత్తు ఉండేఉంటుంది. గ్రామాలలోని నల్లమందుభాయీలు ప్రజలవత్తిడి కాగలేక, ఆపనిముట్లను వలం

టీర్లు కిచ్చివేసేవారు. ఈ ఉద్యమ ఫలితం నిరంకుశాధికారుల కళ్లువెంటనే తెఱిపించింది. ఎక్సైజు ఆదాయం దాదాపు సగానికి తగ్గిపోయింది. నల్లమందు అమ్మకం 2100 మణుగుల నుండి 1200 మణుగులవరకో, ఇంకాతక్కువకో పడిపోయింది. నిరంకుశాధికార వర్గానికి కాళ్ళు గజగజలాడినవి. అప్పుడు అస్సాము స్వచ్ఛంద సైనికదళాలు ప్రభుత్వోద్యోగులనూ ఖజానాలనూ స్వాధీనపఱుచుకోపోతూన్న వనే కల్పితారోపణపైన, ఆసంస్థను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటనచేశారు ప్రభుత్వంవారు. 1921 నవంబరు 1922 ఫిబ్రవరి నెలలమధ్య, వలంటీర్లుగానీ నాయకులుగానీ ఒకవేయిమంది, మూడు నెలల మొదలు 18 నెలలవరకూ కారాగార శిక్ష విధింపబడ్డారు. ఈ భూతాన్ని పూర్తిగా చంపక, అంగవైకల్యం మాత్రమే కలిగించినకారణాన, ఉద్యమం సన్నగిల్లడంతోనే మళ్ళీ తల యెత్తింది. అందులోని విషం పూర్వమంత శక్తివంతంగా లేకపోయినప్పటికీ అసలుపోలేదు. పాతవాళ్ళు మళ్ళీ ఆ దురభ్యాసాని కలవాటుపడ్డారు. నల్లమందు అమ్మకం రోజురోజుకూ మళ్ళీ పెరుగుతూవచ్చింది.

కాని కాంగ్రెసువాదు లింతటితో ఆగిపోలేదు. దీనబంధు ఆండ్రూసు, వారికిశరణ్యమైనాడు. అస్సాములోని నల్లమందు అలవాటునుగూర్చి, ఆవిషయంలో ప్రభుత్వంవా రవలంబించే విధానాన్నిగూర్చి విచారించడాని కొక కమిటీని నియమించవలసిందని వారికాయన సలహాయిచ్చాడు. వెంటనే ఆప్రకారమొక కమిటీ స్థాపింపబడింది. దానికి శ్రీ కె. డి. చలిహా

(కీ॥ శే॥ ఘానీన్ద్రోర్ చవిహారిక తగినబిడ్డ) అధ్యక్షుడు. ఆయన నేటి కేంద్ర శాసన సభాసభ్యుడు. కీ॥ శే॥ శ్రీ రోహిణీ కాంత హేచ్ బారువా కార్యదర్శి. ఈ సంఘంవారు అస్సాము రాష్ట్రమంతా సంచారంచేసి, సాక్ష్యంసంపాదించి, మంచి నివేదికను తయారుచేశారు. ఇండియా ప్రభుత్వంవారు, భారత దేశంలో, ముఖ్యంగా అస్సాములో అవలంబిస్తూన్న నల్లమందు విధానాన్ని నానారాజ్యసమితిలో పరిచయం చేయడానికి, దీనబంధు దానిని బాగా వినియోగించాడు.

శాసనసభామందిరానికి వెలుపలా, లోపలాకూడా ఈ విధానమునకు వ్యతిరేకంగా చట్టసమ్మతాందోళనం చేయబడుతూ వచ్చింది. అందువల్ల అప్పటి ఎక్సైజు మంత్రి రివ. రెండు నికోలస్ రాయి, ఈ దురలవాటును మాన్పించుపద్ధతులను విచారించే నిమిత్తం ఎక్కువమంది శాసనసభ్యులుగల మఱొకసంఘాన్ని నియమించడానికంగీకరించాడు. తరువాత ప్రభుత్వంవారు తమ నివేదికను తయారుచేయడానికి రెండు సంవత్సరాలు (1927-28) పట్టింది. నివేదికలోని సూచనలు సంగ్రహంగా ఇవి. '(౧) 50 సంవత్సరాలకు లోబడిన వయస్సుగల యావన్మంది నల్లమందు దురభ్యాసపరులను ౧౦ ఏండ్లలో ఆ అలవాటును మానేటట్లు చేయాలి. ఈకాలంలో నల్లమందు తినేవాళ్ళందరినీ రిజిష్టరుచేసి, వాళ్ళకు చీట్లిచ్చి, ఆ చీటీప్రకారం నల్లమందు యిస్తూండాలి. వాళ్ళకిచ్చే నల్లమందు ప్రమాణం యేటేటా తగ్గిస్తూ, పదియేళ్ళలో పూర్తిగా మాన్పించేపద్ధతిని ఉండాలి.' ఈ ప్రణాళికనవలంబించుటలో

ప్రభుత్వంవారికి తమ ఆదాయమునుగూర్చిన చింతయే లేనట్లు సూచించబడింది. కాని ప్రజలకుమాత్రం వారికున్న ఆలోచన అది ఒకటే అన్నట్లుగా కనబడుతూండేది అప్పటికింకా నిరంకుశాధికారమును చలాయిస్తూన్న ప్రభుత్వంవారు ప్రజలపైన ముఖ్యంగా నల్లమందు కలవాటుపడిన వృద్ధజనంపైన-ఎక్కడలేని దయారసమూ జాలువారుస్తూన్నట్లు కనిపించేవారు. అప్పుడప్పుడూ యూరోపియన్ జిల్లా ఉద్యోగులు కరుణామోహితులైన కారణాన, రిజిష్టరులోకి కొత్తగా నల్లమందు కలవాటుపడిన వారిపేర్లు ఎక్కుతూండేవి. కాని నల్లమందు అమ్మకం ప్రమాణంలో తగ్గిపోతూన్నకొద్దీ, ఖరీదులో పెరుగుతూవచ్చింది. 1938-39 నాటికి పై ప్రణాళిక ఆచరణలోకి వచ్చి తొమ్మిదేండ్లయినప్పటికీ. ప్రభుత్వంవారికి నల్లమందుమీదవచ్చే ఆదాయం పదిన్నర లక్షలు కనపడింది. నల్లమందు తినేవారిసంఖ్య రిజిష్టరులప్రకారం 31,000 ఉన్నది. సరిగా ఈ సమయంలోనే కాంగ్రెసు సంయుక్తమంత్రివర్గం అస్సాము ప్రభుత్వ బాధ్యతను వహించింది.

౨

అస్సాము కాంగ్రెసువారు ఈ ఘోర దురభ్యాసాన్ని రూపుమాపడానికెన్నో కష్టాలు పడ్డారు. ఇప్పుడు వారికందుకు తగిన సావకాశం లభించింది. కాంగ్రెసు సంయుక్త మంత్రివర్గం దానిని వినియోగించుకోవడంలో యేమీలోపం చేయలేదు. ఈ నల్లమందు రేపను పద్ధతి యెంత చెడ్డదో వారికి బాగా తెలుసు. వ్యసనాని కలవాటు పడిన మనిషి

దానిని బుద్ధిపూర్వకంగా విడిచిపెడతాడని మతి ఉన్నవా డెవడూ నమ్మడు. ఒక దుర్భ్యాసాన్ని మోతాదులలో క్రమక్రమంగా తగ్గిస్తూన్నట్లు కాగితాలమీద కనిపింప చేసి నంతమాత్రాన, ఆ వ్యసనాని కలవాటయిన మనిషి పది యేళ్లలో బాగుపడతా డనుకోవడం కంటె, తగ్గింపబడిన నల్లమందు మోతాదులను మఱొక చోటినుంచిటి దొంగిలి స్తున్నా డనుకోవడం ఎక్కువ ఉచితం. సరిగా ఇంతే జరిగింది కూడాను. నల్లమందు రేషన్లు తగ్గినకొద్దీ దాని చౌర్యం ఎక్కు వయింది. ఎక్సైజు డిపార్టుమెంటు కంటె పెద్దది కాకపోయినా అధమం దానితో సమానమైన ఒక సంస్థ యేర్పాటయింది. ఈ చౌర్యానికి, గొప్పగొప్పవాళ్లకు, ఎక్కువగా రాష్ట్రేతర వర్తకులకు, ఈ అవినీతికర వ్యాపారంతో సంబంధమున్నదని ఒక జిల్లా ఉద్యోగి అన్నాడు. నల్లమందు షాపులలో తప్పు తూనికలు తూచినందువలన మిగిలిన నల్లమందున్నూ, దొంగ తనంగా తెచ్చిన నల్లమందూకూడా ఈ అంగళ్ళవారే అమ్ము తూన్నారని నిజం దాచలేని కొంతమంది ఎక్సైజు ఉద్యో గులే ఒప్పుకొన్నారు. మామూలు జనం దృష్టిలో ఎక్సైజు ఉద్యోగులన్నా, లంచగొండితన మన్నా ఒకటే అర్థం. ఈ శాఖలోని పెద్ద ఉద్యోగులుకూడా 'వృద్ధనారీ పతివ్రతా' అన్నట్లు పరిగణింపబడుతూండేవారు. ప్రభుత్వవ్యయమును తగ్గించే నిమిత్త మేర్పాటయిన కమిటీవారి సూచనలన్నీ, ఈ శాఖకు సంబంధించి నంతవరకు పై అభిప్రాయాలపైన ఆధారపడి చేయబడినవే.

కాంగ్రెసు సంయుక్త మంత్రివర్గం తొలగించదలచుకొన్న చెడుగులలో, పైన సూచింపబడినవి చాలాకొద్ది. ఎక్కువ వ్యయకారణమైన ఏ ప్రయత్నం చేయడానికీ, అస్సాము ప్రభుత్వాదాయం తగినంత సమృద్ధిగా లేదు. కిందటి ప్రభుత్వం 1938-39 సంవత్సరానికి $2\frac{1}{4}$ లక్షలు నష్టం వస్తూందని అంచనా వేసింది. అస్సాము లోయలలో వచ్చిన వినాశ హేతువులగు వరదల మూలకంగా ఇంకొక 8 లక్షలెక్కువ నష్టం రావచ్చును. కాబట్టి నల్లమందు ఆదాయమును తగ్గించడమంటే కొత్తపన్నులను వేయడమనే స్థితి వచ్చింది. సాధారణ జనంమీద కొత్తపన్నులు పడడానికి వీలులేదు. నిరంకుశ ప్రభుత్వమిదివరకే వారు భరించలేనంతవరకు పన్నులను విధించింది. కాబట్టి నల్లమందు పిచ్చి మరీ ఎక్కువగా వ్యాపించిన జిల్లా విషయం ముందాలోచిద్దామని తోచింది. మా పార్టీ సమావేశంలో ఈ దురభ్యాసాన్ని నిర్మూలించవలెనంటే అత్యంత శ్రద్ధతో పనిచేయవలెననీ, నల్లమందు దొంగతనానికి మూలమై, ఎక్కువగా నల్లమందు పిచ్చి వ్యాపించిన జిల్లాలోనే ముందుగా పని ప్రారంభించవలెననీ ఏకగ్రీవంగా అభిప్రాయ పడ్డాము. ఇంక తక్కిన జిల్లాలలో కూడా రెండేండ్లలో, అనగా 1941 నాటినుండీసంపూర్ణ నిషేధమునకు సంసిద్ధమయ్యేటట్లు, నల్లమందు అమ్మకాన్ని తీవ్రంగా తగ్గించివేయవలెననికూడా నిర్ణయించాము. అయితే మొదటి ప్రదేశంలో పనిచేసే ప్రచారకులకు తీరికకాగానే, అనగా 1940 నుండీకూడా ఈ ప్రణాళికకు సంబంధించిన పని

ఈ స్థలాలలో ప్రారంభం కావాలి. ఈ నూతన ప్రయత్నము నకు మొదట డిబ్రుఘర్, సివసాగర్ సబుడివిజనులు, తగిన ప్రదేశాలని నిర్ణయించుకొన్నాము. వీటి వైశాల్యము దాదాపు 2,000 చదరపుమైళ్ళు. ఇక్కడి నల్లమందు దురభ్యాసపరుల సంఖ్య 10,700. అస్సాము మొత్తంమీద ఉన్న దురభ్యాస పరులలో మూడోవంతు. సంపూర్ణనిషేధం వలన ఈప్రదేశం లో వెంటనే తగ్గిపోయే పభుత్వాదాయం 4 లక్షలు, తక్కిన ప్రదేశాలలో తీవ్రంగా నల్లమందు అమ్మకమును తగ్గించినందు వలన పోయే ఆదాయం రెండులక్షలు, ఇదికాక ఈ ప్రణాళికను ఆచరణలోకితీసికొనివచ్చే నిమిత్తం కావలసిన వ్యయం లక్షా ఇరవై అయిదు వేలు. ఈ ప్రణాళికను అమలుపరచుచున్నప్పుడు కలిగే అవసరములకు తగినట్లుగా కావలసిన శాసనమూ తయారుగా లేదు. ఇక ఈ విషయంలో నేరస్థులయిన వారిని శిక్షించడానికా ఇదివరకున్న చట్టం మీదనే ఆధారపడవలసి వచ్చింది.

కాబట్టి కాంగ్రెసు సంయుక్త మంత్రివర్గం ప్రారంభించిన ఈ పనిని యుక్తియుక్తంగానూ, ధైర్యసాహసములతోనూ నడపవలె ననడాని కెంత మాత్రమూ సందేహం లేదు. పన్నుల విధానంలోని అన్యాయ్యం కాంగ్రెసుపక్షంవారు మంత్రి వర్గాలలోకి పోకముందే వారిదృష్టిని ఆకర్షించింది. ధనవంతులయిన జమీందారులకు తేయాకుతోట యజ మానులకూ మాత్రం వర్తింపచేసే, వ్యవసాయ ఆదాయపు పన్నును విధించిన యెడల ఈ అన్యాయ్యం కొంతవరకు తగ్గు

తుందని వారనుకున్నారు. ఆర్థిక మంత్రి యఫ్. ఏ. అహమ్మదుగారీ విషయంబాగా ఆలోచనచేశారు. ఇతర కాంగ్రెసు ప్రభుత్వాలు విధించిన పెట్రోలు ల్యూబ్రికేటింగ్ ఆయిలు విక్రయపు పన్నులున్నూ, భోగవస్తువులపైనా విలాసములపైనా విధించిన పన్నులున్నూ. అస్సాములోకూడా విధించిన యెడల ప్రభుత్వాదాయమును హెచ్చించవచ్చునని నిర్ణయించారు. ఒక్క వ్యవసాయ ఆదాయపు పన్నే 30 లక్షలు ఉండవచ్చునని తదితర పన్నులు అన్నీ కలిసి 5 లక్షలుండ వచ్చుననీ అంచనా వేయబడినది. ఈ పన్నులచట్టం పిదప రెండు శాసనసభలలోనూ అంగీకరింపబడింది. వ్యవసాయిక ఆదాయపు పన్నుచట్టం రెండు శాసనసభల సమష్టి సమావేశంలోకూడా అంగీకరించబడింది. అందువలన నల్లమందు నిషేధంవలన పడిపోయిన ఆదాయం పూరింపబడడమేగాక ఆ ప్రణాళికను ఆచరణలోకి తెచ్చేటందుకయ్యే వ్యయములనుకూడా ప్రభుత్వం భరించగలదని నిశ్చయించుకొన్నాము. అవసరమైతే ఈ ఆదాయమును ఆధారంగా చేసుకొని ప్రభుత్వం ముందుగా అప్పుతీసుకొనగలదని కూడా మా ఆర్థిక మంత్రి అహమ్మదుగారు వెల్లడించారు.

మా నిషేధ ప్రణాళికను వివరించబోయేముందు అది అన్ని వర్గాలప్రజలలోనూ అపూర్వోత్సాహమును కలిగించిందని చెప్పితీరవలెను. ఈ ప్రయత్నానికి మంత్రివర్గాన్ని అభినందిస్తూ వందలకొలదీ సమాజాలు, సంఘాలూతమసంపూర్ణ కారాన్ని వాగ్దానం చేసినవి. కాని ఎసెంబ్లీలో వ్యతిరేక

పక్షనాయకుడు సర్ మహమ్మద్ సాదుల్లా దీనిని తీవ్రంగా ఖండించి వెనుకటి ప్రణాళికను శ్లాఘించి, ఈ ప్రణాళికకు వెచ్చించే ఆరులక్షల రూపాయిలను ప్రాథమిక విద్యకు ఖర్చు పెట్టినట్లయితే ప్రజ లీదురభ్యాసాన్ని మానుకోవడం ఎక్కువ బాగా నేర్చుకొంటారని సెలవిచ్చారు. యూరోపియన్ నాయకుడు మిస్టర్ హాకెన్‌హాలు ఒక సంవత్సరంపాటు ఈ ప్రణాళికను ప్రయత్నించి చూడడం ఉచిత మన్నారు. దీనిని ఆచరణలో పెట్టేముందు మహాత్మాగాంధీని, రాష్ట్రీయ ప్రధాన మంత్రులను, రాష్ట్రీయ గవర్నర్లను, రాష్ట్రీయ నాయకులను మా రాష్ట్రంలోని ప్రధాన మత పీఠాధిపతులను ఆశీర్వాదములు పంపవలసిందని ప్రార్థించాను. వారందరూ మా మంత్రివర్గాన్ని అభినందిస్తూ ఆశీర్వదించారు. నల్లమందు దురభ్యాసపరుల కష్ట నివారణకు కొన్ని ఉపాయాలను కూడా మహాత్మాజీ దయతో సూచించారు. ఆయన తరువాత కూడా వాటిని గూర్చి విచారణ చేశారు. కలకత్తాలో నేను వారిని 1939 ఏప్రిల్ 30 న కలుసుకొన్నప్పుడు వారికి వివరాలన్నీ చెప్పి సంతృప్తిపరిచాను. యూరోపియన్ నాయకుడు కూడా తేయాకు తోటలనుండి కావలసిన సహాయం చేస్తానని వాగ్దానం కావించాడు. కాని సంపూర్ణ నిషేధంలో తనకు నమ్మకం లేదని ప్రొటెస్టెంటు బిషప్పు ఈ ప్రయత్నాన్ని ఆశీర్వదింప నిరాకరించాడు. ఉన్నత పదవిలో ఉన్న ఒక ఆంగ్లస్త్రీ నా ఉత్సాహానికి ఆనందించింది; కానీ, ఈ ఉద్యమం జయప్రదమౌతుం దనుకోవడం అడియాస కాదా, అని అడిగింది.

ఇక ప్రణాళిక విషయం:- అప్పటి ఎక్సైజు మంత్రి శ్రీ అఖాయి కుమారదాసు ఈ ప్రణాళికను తయారుచేసే పని దయతో నాకు వదలివేశారు. ఇందులో మూడు విధములగు కార్యక్రమ మున్నది. (1) ప్రచారం. (2) నల్లమందు దొంగలపై నిగా. (3) దురభ్యాసపరులకు వైద్యచికిత్స, ప్రచారము, నల్లమందు దొంగలపై అనధికారుల నిగా, వైద్యచికిత్సా కాలంలో దురభ్యాసపరుల రక్షణ విచారణలు, ఇవి రెండు సబ్ డివిజను కమిటీలవశము చేయబడినవి. వీటిలో ఎక్కువ మంది అనధికార సభ్యులే. వీరు తిరిగీ స్థానిక కమిటీలను, స్థానికవలంటీర్లనూ, యేర్పాటుచేసుకొన్నారు. ఈ వలంటీర్లు దురభ్యాసపరుల ప్రదేశాలలో ప్రచారంచేసి, వారిని వైద్య చికిత్సకు తీసుకొనివచ్చి చికిత్సాకాలంలో వారికుపచారాలు చేస్తూంటారు. వీరిలో కొంతమంది నల్లమందును దొంగ తనంగా తీసుకొనివచ్చే వారిని కనిపెట్టిఉండి, గుమాస్తాలను గురించి ఎక్సైజు అధికారులకు రిపోర్టుచేస్తూండేవారు. ఈ యావత్తు అనధికార వ్యవహారమునూ కాంగ్రెసు నాయకు లలో అత్యంత విశ్వాసపాత్రుడైన శ్రీఓమియో కుమారదాసు యం. యల్. ఏ. గారి వశంచేయబడింది. ఆయనను ఆనరరీ ప్రొహిబిషన్ కమీషనరు అని పిలుస్తూండేవారము.

నల్లమందు తినేవాళ్లనూ, దొంగతనంగా తెచ్చేవాళ్ళనూ కనిపెట్టి జాగరూకత వహించేపని పూర్తిగా ఎక్సైజు కమీ షనరు రాయుబహదూరు దుర్గేశ్వరశర్మ చేతులలో వదలి వేశాము. ఆయన నమ్మకమైన ప్రభుత్వోద్యోగి అని ప్రసిద్ధి

ఉంది. అందువలన ఈపనికాయన తగినవారని ప్రత్యేకం పిలిపించుకొన్నాము. ఆయన తనసిబ్బందిని ఏర్పాటుచేసుకోవడంలోనూ, కొత్తవాళ్లను నియమించుకోవడంలోనూ, నిజంగా చాలా జాగరూకత వహించాడు. నల్లమందు తెచ్చే దొంగల గుంపు చాలా పెద్దదికావడంచేత, గస్తీసంఘాలు, ప్రత్యేక కాపలామనుష్యులు, కొత్తరకపు గూఢచారులూ కావలసి వచ్చారు.

ఎక్సైజు కమీషనరు బాధ్యత చాలా ఎక్కువమాట నిజమే. కాని వైద్యచికిత్సకు సంబంధించినపని మరీ కష్టమనిపించింది. మొదటి విచారణలోనే నల్లమందు తినేవాళ్ళసంఖ్య ఈరెండు సబ్ డివిజనులలోనూ, 13,600 అని తేలింది. రిజిష్టరులలో కనబడే సంఖ్య 10 700 మాత్రమే. గ్రామంలో యింతసంఖ్యకు కొద్దినెలలలో వైద్యచికిత్స చేయించడమంటె అమ్మో అనిపించింది మొట్టమొదటిరోజులలో. ఆరోగ్యశాఖ వారూ, వైద్యశాఖవారూకూడా ఉత్తమోత్తమమైన చికిత్సా పద్ధతికోసం ఆందోళనపడుతూండేవారు. 'మోడినో' చికిత్సా పద్ధతిని అవలంబించినట్లయితే శరీరంమీద గాయంచేయవలసి ఉన్నది. అది వానికి సహజంగా అసహ్యమనిపిస్తుంది. అంతే కాదు, ఆసుపత్రి సౌకర్యాలన్నీ ఉంటేనేగాని ఆపద్ధతిసరిగా ఉపయోగపడదు. పైపెచ్చుఎక్కువఖర్చుకూడాను. 'స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్సు' కు ప్రిన్సిపాలుగా నున్న కర్నల్ చోప్రా, నల్లమందు దురభ్యాసపరులకు 'లెసిథిక్' గ్లూకోసు చికిత్సలను ప్రయోగిస్తున్నట్లుగా విని ఆయనకు వ్రాయగా

ఆయన, తన అసిస్టెంటు డాక్టరు చోప్రాను, అసాము ప్రభుత్వ సహాయార్థం కొంత కాలం పంపడానికి అంగీకరించాడు. ఆయనయున్నూ, డిబ్రుఘరులోని 'బెర్రీవైటు మెడికల్ స్కూలు' ప్రిన్సిపాల్ కర్నల్ అల్లెనున్నూ కలసి ఈ చికిత్సావిధానం ఉత్తమోత్తమ మైనదని నిర్ణయించారు. నల్లమందు దురభ్యాసపరులకు దానిపైన ఉండే ఆసక్తి కేవలం మానసికమనీ, వారిని మామూలు మనుష్యులుగా చేయడమునకు, నరములపుష్టికి మందిస్తే చాలునని ఋజువుచేయబడెను. ఈ పని యావత్తు ఆరోగ్యశాఖా డైరెక్టరు, కర్నల్ హెన్టర్‌లోకు అప్పచెప్పినాము. అనేకమంది డాక్టర్లను నియమించాము. తేయాకు తోటలవారుకూడా కొంతిమంది డాక్టర్లను యిచ్చారు. స్థానిక సంస్థల డాక్టర్లందరినీ ఈ పనికి ఉపయోగించుకొన్నాము. అనేకమంది ప్రైవేటుడాక్టర్లు ఉచితంగా పనిచేయుడానికంగీకరించారు. వీరందరికీ కొద్దికాలమే శిక్షణ ఈయబడింది. డాక్టరు హరికృష్ణదాసు, డాక్టరు భువనేశ్వర బారువలవంటి సుప్రసిద్ధ వైద్యశిఖామణులు, వివిధగ్రామ కేంద్రాలలో జరుగుతూన్న పనిని పరిశీలించడానికి వందలకొలదీ మైళ్ళు ప్రయాణం చేశారు.

ప్రతిమనిషీ ఈపనిని జయప్రదంచేయడానికి ప్రయత్నించినట్లు కనిపించింది. ప్రజలు, ముఖ్యంగా మార్వాడీలు ఉచితంగా ఆహారపదార్థాలను, దుప్పట్లనూ సప్లయిచేశారు. సబ్ డివిజనల్ కమిటీలు, స్థానికకమిటీలు, వారి స్వచ్ఛందసైనికులు అంతాకలసిమెలసి ఎంతో మంచి సహకారంచేశారని

ఆరోగ్యశాఖాడైరెక్టరూ, ఎక్సైజు కమీషనరుకూడా తమ తమ నివేదకలలో యెంతో ప్రశంసించారు. కర్నల్ ఎల్లెన్ చేసిన సహాకారఫలితంగా యూరోపియన్ యాజమాన్యం కింద పనిచేసే తోటలనుండికూడా సహాకారం లభించడం సామాన్యవిషయం కాదు. మేము రాజీనామాలిచ్చిన నవంబరు నెలనాటికి ఎక్సైజు కమీషనరున్నూ ఆరోగ్యశాఖా డైరెక్టరున్నూ పంపిననివేదికలు, అప్పటికే ఉద్యమంపొందిన విజయాన్ని పూర్తిగా ఉద్ఘోషిస్తూన్నవి. ఆనరరీ ప్రొహిబిషన్ కమీషనరు అంచనానుబట్టి, అది ఇంకనూ, ఎక్కువవిజయం పొందిందనిపిస్తూన్నది. ఎక్సైజు సూపరింటెండెంటు నివేదిక ఎక్కువ మితంగాఉన్నది. అందులోకూడా డిబ్రుఘుర్ సబ్ డివిజన్‌లో నూటికి 70 మంది, ఈనల్లమందుపిశాచంనుండి తప్పించుకొని పూర్తిగా బయటపడ్డారని వ్రాయబడింది. శివసాగర్ సబ్ డివిజన్‌లో ఇంకా ఎక్కువమంది బాగుపడ్డారట. నల్లమందు దొంగలెక్కువగా పట్టుపడుతూన్నారని, డిబ్రుఘురులో ఈకేసులవిచారణకు మరొక మేజస్ట్రేటును వేయించవలసిఉంటుందనీ, ముందటి సంవత్సరాలకంటెకూడా ఎక్కువ దొంగనల్లమందు పట్టుపడుతూన్నదనీ ఆయన చెప్పినాడు. కాని ఈ దొంగనల్లమందు వ్యాపారం ఆసాము లోయలోనే కాక, ఆసాము సరిహద్దులుకూడా దాటి వ్యాపించినందున కాంగ్రెసు సంయుక్తప్రభుత్వం ప్రారంభించిన ఈ ఉద్యమం, ఆసాంలోయ అంతటిలోనూ ప్రవేశపెట్టబడవలెనని ఆయన సలహాయిచ్చాడు. కర్నల్ హెట్సెరులో వ్రాసిన నివేదిక అనేక

విషయాలను తెలియచేస్తూ మంచి ఉత్సాహజనకంగా ఉన్నది. 10,300 మందికి పైగా చికిత్స చేయబడింది. వారిలో 20 యేళ్ల యువకులు మొదలు 70, 80 యేండ్ల వృద్ధులుకూడా ఉన్నారు. ఈ చికిత్సలో ఒక్క మరణంకూడా కలుగలేదు. నలుగురైదు గురు చచ్చిపోయినట్లు తెలిసింది. కాని వారు ఈచికిత్సనుండి విడుదలైన కొన్నాళ్ళకు మరొకరోగంతో చనిపోయినారు. నూటికి 70, 80 మందికి మళ్ళీ నల్లమందు అలవాటుచేసుకో వడమంటే పూర్తిగా అసహ్యం పుట్టింది.

అలవాటుచొప్పున నల్లమందు తినడం మానినందువలన శరీరంలో కలిగే వికాసాలు ఒకవారం రోజులవరకూ ఉండేవి. ముఖ్యంగా మూడోరోజున, నాలుగోరోజున, విరోచనాలు, వణకుతో వళ్ళుకుంగడం మరీ ఎక్కువగా ఉండేవి. 10 రోజులలో రోగికి మంచి హుషారు గలిగి కొంచెం కండకూడా పట్టేది. సాధారణంగా నల్లమందు లక్షణమైన ఒడలి నలుపు మారిపోతూండేదికూడాను.

మేము రాజీనామా యిచ్చిన తరువాత వచ్చిన సర్ సాదుల్లా మంత్రివర్గం, వెనుక మాకు ప్రతికూల పక్షంలో నున్న నాటి విమర్శననే తిరిగీ వారి బడ్జెట్టు ఉపన్యాసంలో చేశారు. కాంగ్రెసుకూ ఆ ఉద్యమానికీ వ్యతిరేకంగా నేటి యూరోపియన్ పక్షనాయకుడు మూరుగారు, అనవసర అప నిందలను ఆరోపించారు. కాబట్టి వారు కాంగ్రెసు కార్య క్రమాన్ని మానివేస్తారనే మాట నిశ్చయం. కాని ఈమంత్రి వర్గంలో కొంతమంది కాంగ్రెసు సంయుక్త మంత్రివర్గానికి

మంచి పేరు రావడానికి కారణమేమని విచారిస్తూన్నట్లున్నూ, నల్లమందు నిషేధోద్యమమే అందుకు కారణమని కొంత మంది ఉద్యోగులు చెప్పినట్లున్నూ వింటూన్నాము. జపాను, అమెరికా దేశీయ లీగుద్యమ ఫలితాలను గూర్చి అడుగుతూన్న ప్రశ్నలకు జవాబుగా కర్నల్ చోప్రా ఒక నివేదికను తయారుచేయ నుద్దేశిస్తూన్నట్లుగా ప్రస్తుత ప్రభుత్వానికి తెలిసింది. అందువలన నల్లమందు అమ్మకమును తొందరగా తగ్గించడానికి మేము ప్రారంభించిన ఉద్యమాన్ని ఆలాగే నడిపిస్తామనీ, 1941 మార్చి తరువాత సాధారణ జనానికి నల్లమందు లభించిందనీ, వారొక ప్రకటన చేశారు. ఈ ప్రకటన ఎప్పుడో చేయవలసింది. ఇక మే మవలంబించిన చికిత్సా విధానమును గాని, దొంగనల్లమందు రాకుండా కనిపెట్టడానికి చేసిన అదనపు యేర్పాట్లను గానీ వారు మాని వేసిగా రనడానికి సందేహం లేదు. అయితే ఈ మార్పు అంత పెద్దమార్పుగా కనిపించక పోవచ్చును. కాని ఈ చిన్నమార్పు నిజమైన సంస్కర్తకూ, అయిష్టంగాను అజాగ్రత్తగానూ, పనిచేసే మనిషికీ గల దృష్టిభేదాన్ని బాగా తెలియ చేస్తుంది. నిజమైన సంస్కర్త, దురభ్యాసపరు డెంత పడిపోయినప్పటికీ వాని కర్మం వానిదని విడిచిపెట్టడు. వాడా దుర్వృత్తిని విడిచిపెట్టడానికి తగిన బలం చేకూర్చి, ఆ వ్యసనానికి సావకాశ మిచ్చే పరిసరాలకు కూడా పోని ఏర్పాట్లను చేస్తాడు. ఈ పిశాచం అప్పాయును విడిచిపెట్టిపోక తప్పదు. కాని కాని ప్రస్తుత విధానంవలన అధమం అయిదేండ్లవరకయినా

అక్కడక్కడా గ్రామాలలో మారు మూలల నక్కినక్కి ఉంటుందేమోనని మాకు భయం.

3

ఉప్పు

హిందూదేశపు సముద్రతీరం పొడవు 48,00 మైళ్ళు. సింధులోనూ పాంచాలంలోనూ ఉప్పుగనులూ, గుట్టలూ ఉన్నవి. సముద్ర తీరంలోని పల్లపు ప్రదేశాలలో సహజంగానే ఉప్పురాసులు తయారవుతవి. పాంచాలంలో ఉప్పునీటి నూతులు కలవు. దేశంలో అనేకచోట్ల చవిటిలోనుండి గ్రామస్థులు ఉప్పును తయారు చేయగలరు. అటువంటి ఈ దేశంలో పశు, మానవ జీవితాల కత్యవసరమైన ఉప్పుమీద పన్ను విధించబడడం ఆశ్చర్యకరంగా లేదా?

ఉప్పుపన్ను మొట్టమొదట 1836 లోని సాల్టు కమీషన్ నియామక ఫలితంగావిధింపబడింది. హిందూదేశమునకువచ్చే సీమపడవలకు తగినబరువులేక, ఒక్కొక్కప్పుడవి ఆరువారాలు కూడా లివరుపూల్ హార్బరులో ఆగిపోవలసివచ్చేది. వాటికి అధమం సముద్రతరంగాలమీదతల్లక్రిందులుగాకుండాసవ్యంగా ప్రయాణంచేయడానికి తగినంత బరువైనా చూపించేటందుకీ కమీషన్ పార్లమెంటు సభ్యులతో యేర్పాటు చేయబడింది. బ్రిటను ఓడ లప్పటికప్పుడే ఇండియానుండి ముడిసరుకులను తీసికొనిపోయి, తయారైన వస్తువులను ఇండియాకు దిగుమతీ

చేయడం ప్రారంభించినవి. కాని ముడిసరుకులను తీసుకొని పోయే పడవలు తయారైన వస్తువులను తీసికొనివచ్చే పడవల కంటె ఎక్కువ వైశాల్యంగా ఉంటవి. ఒక వేగన్ పత్తి ఒక పెట్టెడు బట్టయే అవుతుంది. ఒకబండెడు జీడిమామిడి గింజలు వేరుసెనగ కాయలు, బిస్కట్లుగా తయారుచేస్తే చిన్న పెట్టె లోకి సరిపోతవి. కనుక బ్రిటను నుండి వచ్చే తయారైన వస్తువులు ఓడలలో ఆక్రమించేస్థలం, బ్రిటనుకు పోయే ముడి పదార్థా లాక్రమించే స్థలంకంటె చాలా తక్కువగా ఉండేది. మొదటి దానికి రెండోది తేలికగా 10 రెట్లు ఉండవచ్చును. కాబట్టి ఇండియాకు వచ్చే 10 ఓడలలో తొమ్మిది, సరుకు లేమీ లేకుండా ఉత్తుంగ సముద్ర తరంగాలపైన ప్రయాణం చేస్తూ రావలసివచ్చేది. వట్టి పడవ అలా సముద్రంపైన రావడం చాలా ప్రమాదకరం. కనుక 1836 వరకు, లండను కోస్తాలోని మట్టిని బరువుగా వేసుకొని కలకత్తాకు వచ్చేవారు. ఈ మట్టితోనే హుగ్లీనుండీ కాళీఘట్టము గుడికి పోయేకాలువ పూడ్చబడిందని ప్రతీతి. అంతేకాదు చౌరంఘీ రోడ్డుగానీ, లేక చుట్టురోడ్డులలో ఒకటిగానీ, లండనుమట్టితోనే వేసి ఉంటారనికూడా వింటూన్నాము. అయినప్పటికీ ఈ పని వట్టి దండుగ అని తేలింది. కాబట్టి 1836 లో నియమింపబడిన సాల్టు కమీషన్ వారు ఈ సంగతులన్నిటినీ గమనించి, లండనునుండి మట్టి తీసుకొనిరావడం కంటె ఉప్పు తీసుకొని రావడం ఉపయోగకరమనీ, చెషైరు లివరుపూలు కోస్తాల నుండి తెచ్చిన ఉప్పు ఇండియాలో అమ్ముడుపోవలెనంటే

ఇండియన్ ఉప్పును ప్రభుత్వంవారి సర్వాధికార యాజ మాన్యం కిందకు తెచ్చి, మణుగు 1 కి రు 2-8-0 చొప్పున పన్ను విధించవలెనని సిఫారసు చేశారు. ఇంపీరియల్ కౌన్సి లులో ఈ అన్యాయపు పన్నునుగూర్చి మొట్టమొదటనోరెత్తి మాట్లాడింది గోఖలే. అప్పుడు మణుగుకు రు 2-8-0 విధింప బడిన పన్ను రు 1-4 0 కు తగ్గింపబడింది. అప్పటినుండీ మణు గుకు ఒకరూపాయి, రెండురూపాయీలమధ్య పన్నువిధింప బడుతూవస్తున్నది. ఈపన్ను ఫలితాలను గూర్చి విచారి ద్దాము.

౧ సముద్రం దగ్గర నివసించే పల్లెవాళ్ళు తమ గంజిలోకి అక్కడపండే ఉప్పు తీసుకొనివెళ్ళడానికి వీలులేదు. అందువలన వాళ్ళు ఒకగడ్డి మోపును ఉప్పునీళ్ళలో తడిపి, దానిని ఇంటికి తీసికొనపోయేలోగా ఎండబెట్టి ఇంటిదగ్గర దానిని నిప్పులోతగలబెట్టి, ఆబూడిదను వాళ్ళ గంజిలో వేసుకొనేవాళ్ళు. ఈ నేరానికి వాళ్ళు రు 500 జరిమా నాకు 6 నెలల కఠినఖైదుకూ గురికావలసి వచ్చింది.

౨ సముద్రపు ఒడ్డునగల మట్టితో ఎండిన ఉప్పుచేపలను తయారు చేసే పల్లెకారీలు, ఆపని చేయడానికి వీలులేకుండా లైసెన్సు లేర్పాటుచేశారు. అందువలన లైసెన్సుకలవారు, లైసెన్సుగల ప్రదే శాలలో మాత్రమే ఉప్పుచేపలను తయారుచేసుకోవడాని కర్హు లైనారు.

3 పశువుల మేతకు కావలసిన ఉప్పు, ఖరీదెక్కువ కావడంవలన లేకుండా పోయింది.

४ ప్రతి మనిషి తినే ఉప్పు సగటున తగ్గిపోయింది. గోఖ్లేగారికృషి ఫలితంగా పన్ను తగ్గినందువలన మళ్ళీ హెచ్చింది.

౫ 1836 కు పూర్వం కోరమండలం కోస్తానుండి పడవలు, బెంగాలుకు ఉప్పు తీసుకొని పోతూండేవి. బెంగాలునుండి తిరిగీ బియ్యం తెచ్చుకొంటూండేవి. 1836 తరువాత బెంగాలుకు చౌకగా వచ్చే ఇండియా ఉప్పు పోయింది. దక్షిణదేశానికి బెంగాలు బియ్యం రావడం తగ్గింది.

౬ సముద్రం ఉచితంగా నీరిస్తుంది. కోస్తాలో ఉన్న పల్లపు ప్రదేశాలు కూడా అద్దెలేకుండా సముద్రపు నీరును నిలవచేసి పెడతవి. వసంతకాలపు సూర్యుడు ఉచితంగానే ఆ నీటిని ఎండకడతాడు. తెల్లగా తళతళలాడే ఉప్పుగడ్డలు తయారవుతవి. వీటిని బురదలో కలిపి పాడుచేసేటందుకు ఒకచోట దాదాపు సంవత్సరానికి రు 3000 ల వరకూ గల పెద్ద పెద్ద మొత్తాలను సాల్టుడిపార్టుమెంటువారు ఖర్చు చేశారు. 1836 పూర్వం సముద్రపు ఒడ్డున ఉన్న గ్రామస్థులు ఉచితంగా ఉప్పుపోగుచేసుకొని, వాళ్ళకు కావలసింది ఉపయోగించుకొంటూ మిగిలింది చుట్టుపట్ల గ్రామాలలో అమ్ముకొంటూండేవాళ్ళు. ఇప్పుడా వృత్తి పోయింది వాళ్ళకు.

౭ స్థానికంగా ఉప్పు తయారుచేసుకొనేవారు, పంజాబు నూతులలోని ఉప్పునీటిని తోడివేస్తూన్నందువలన, చుట్టుపట్ల భూములలో ఉప్పుపోయి భూసారం బాగుపడుతూండేది. ఉప్పుచట్టం, అలానీరు తోడి ఉప్పుచేయడం నిషేధించింది. కనుక ఉప్పునీరు నూతులలోనే ఉండిపోతూన్నది. అందువల్ల ఆ నీరు పొంగుతూన్నకొద్దీ చుట్టుపట్ల భూములు వ్యవసాయానికి పనికిరాకుండా చవుడుకిపోతూన్నవి.

సింధులోని ఉప్పుగని ప్రపంచ మంతటికి 250 యేండ్ల వరకూ కావలసిన ఉప్పును సప్లయిచేయగలదనీ, ఒక్క ఇండియా దేశానికే అయితే 1250 సంవత్సరాలవరకూ అది

సరిపోతుందనీ అంచనా వేయబడింది. పాంచాలంలోని ఉప్పు కొండలో ప్రపంచానికి వేయి సంవత్సరాలకు సరిపోయే ఉప్పున్నది. అటువంటి దేశంలో బ్రిటన్ దేశపు నౌకా వ్యాపారలాభం కోసం ఉప్పుపన్ను విధింపబడినది. ఉప్పువలన ఇండియాగవర్నమెంటుకు 6 కోట్ల రూపాయీల ఆదాయవస్తుంది. ఓడలలో తూకం కోసం, కేవలం ఉప్పుఒక్కటే రావడం లేదు. పాతవార్తాపత్రికల బేళ్ళు, పింగాణి పెంకులు, ఇటాలియన్ చలువరాళ్ళు, ఉరలగడ్డలు, ఇటీవల జపానునుండి యాపిల్సు, సయాము నుండి నూకలూకూడా వస్తూన్నవి. ఇవన్నీ ఇండియా ఆర్థికస్థితిని కల్లోలపఱచి లక్షలాది ప్రజల వృత్తులను నాశనం చేసినవి.

అందువలననే ఉప్పు, నల్లమందు, తాగుడుల వలన ప్రభుత్వానికి వచ్చేడబ్బును పాపపుడబ్బనడం. స్వరాజ్యంలో ఈ పద్ధతి ఒక్కరోజుకూడా కొనసాగకూడదు.

అధ్యాయం 18

స్వరాజ్యంలో ఇండియా దృశ్యం

స్వరాజ్యంలో ఇండియా ఎలాఉంటుందిఅని ఊహించడం ఒక మోజుగా కనిపిస్తుంది. స్వపరిపాలనలో ఇండియా స్థితిని భావించడమనగా ఇండియా స్వరూపాన్ని భావించడంకాదు. ఇండియాపరిణామాన్ని భావించడం, మనిషిరూపంలోగానీ రాజ్యాంగలక్షణాలలోగానీ, సభ్యతా విశేషములలోగానీ గలిగేమార్పులు దృష్టిగోచరములుకావు. నిరంతరమూ కలసి మెలసిఉంటూన్న స్నేహితుల వయోపరివర్తనాన్ని గ్రహించడం కష్టం. సంఘంలో సంచరిస్తూన్నవారు, వివిధసాంఘిక సంస్థలలో కలుగుతూన్న నిరంతర క్రమాభివృద్ధిని కనిపెట్టలేరు. ప్రభువులుగానీ, ప్రజలుగానీ ఒక రాజ్యంతో సన్నిహిత సంబంధం కలిగి, అందులో కలుగుతూన్న అవస్థాంతరాలను కళ్ళారా చూస్తూన్నవారు, శకాంతరములలో కానవచ్చే విశాల వివర్తనములను ఒక్కసారిగా ఊహించనుకూడా ఊహించజాలరు. కాని మార్పులు మాత్రం ఉండనేఉంటవి. వాటి ప్రాబల్యంకిందనున్న దేశాన్నీ, సంఘాన్నీ సభ్యతనూ సింహావలోకనం చేయగలిగినవారి కవి గోచరమౌతూనే ఉంటవి.

స్వరాజ్యమొక ఫలితమనడం కంటె పరిణామవిధానమనడం ఎక్కువ ఉచితమని మేమిదివరకనేక పర్యాయ

ములు చెప్పుచున్నాము. కాని స్వరాజ్యం స్థాపించబడిందని చెప్పే ఒకరోజు వస్తుందని మేము భావించగలము. ఆరోజు నుండీ స్వరాజ్యప్రాబల్యము స్వరాజ్యసంస్థలూ ప్రారంభమవు తవని చెప్పవచ్చును. యుక్తవయస్సు వస్తూవస్తూన్నప్పుడు, వచ్చినప్పుడూ మనిషియొక్క శారీరక లక్షణాలలోగాని మానసిక ప్రవృత్తులలోగానీ భేదం కనిపెట్టలేనట్లే ఒక దేశం స్వాతంత్ర్యం పొందేముందు, పొందినప్పుడూ కల గుణ భేదాలనుకూడా గ్రహించడం చాలాకష్టం. అయినప్పటికీ మనం స్వరాజ్యవాంఛలతో జీవిస్తూన్నప్పుడు, ప్రజలకు స్వరాజ్యం వలన కలిగేలాభాలనుగూర్చి నిరంతరమూ ప్రబో ధిస్తూన్నప్పుడు స్వరాజ్యంలో వివిధ ప్రభుత్వ వ్యవస్థలలోనూ శాఖలలోనూ కలుగబోయే మార్పులనుగూర్చి కానీ, అధ మము ఏయే సంస్థలలో యేయే శాఖలలో మార్పులు రావ చ్చునో ఆసంగతిగానీ వివరించి చెప్పడం మనధర్మం.

నూతన స్వరాజ్య ప్రాబల్యంకిందకు రావలసిన దాదాపు మొట్టమొదటిసంస్థ గ్రామంఅయిఉండాలని మాఆశయం. నేడు భారతీయ గ్రామనిర్మాణం, సంపూర్ణంగా సంక్షుభితమై విచ్ఛి న్నమైపోయింది. దాని నిక భారతీయసభ్యతకుగానీ, భారత రాజ్యాంగమునకుగానీ పునాది అనడానికి వీలు లేదు. హిందూ మహమ్మదీయుల శీలస్వభావాలకుగానీ, వ్యక్తిత్వ వైజ్ఞానిక లక్షణాలకుగానీ, మనము గ్రామజీవితపద్ధతులను ఉదాహర ణంగా తీసుకోవడం లేదు. పల్లెలనుండి ఒక్కుమ్మడిగా పట్ట ణాల కెక్కిన జనసమూహానికి పట్టణజీవితపద్ధతు లలవాటు

కావడంవలన వారి వ్యక్తిజీవితంలోనేగాక, జాతీయజీవితం లోకూడా ఎంతో మార్పువచ్చింది. ప్రజలు పట్టణాలంటే చాలా మోజుపడుతూన్నారు. పట్టణస్థుల వేషభాషలు పల్లెటూరివారికి అనుకరణాలైనవి. భోగాసక్తి వలనగానీ వృత్తి కోసంగానీ, పల్లెలనుండిపట్టణాలకు జనం నిరంతరప్రవాహంగా వస్తూపోతూ ఉన్నారు. ఈపట్టణాలచుట్టూ తిరిగేవారే పల్లెటూరిప్రజలకు వరవడి, వీరికి పట్టణాలే తమ సొంతఊళ్ళని చెప్పుకోవడంఇష్టం. గ్రామాలలోని తమఇళ్లంటేఅసహ్యమూ అశ్రద్ధా, అందువల్ల వీరికి యేమైనా పౌరఆదర్శాలు ఉన్నప్పటికీ వారి శక్తిసామర్థ్యాలనూ అభిమానాన్ని వారు నివసిస్తూన్న పట్టణశ్రేయస్సుకోసం వినియోగిస్తారు. కాబట్టి గ్రామాలు విద్యలోనూ ఆరోగ్యంలోనూ సహకారంలోనూ వెనుకబడిపోతూన్నవి.

ఒకప్పుడు మన దేశంలో దాదాపు ప్రతిగ్రామంలోనూ ఒక పాఠశాల ఉండేది ; ఒక్క వంగరాష్ట్రంలోనే 80,000 పాఠశాల లున్నట్టు ఋజువయింది. అటువంటి ఈ దేశంలో నూటికి ఏడుగురుమాత్రం అక్షర జ్ఞానం కలిగి తక్కిన తొంభై ముగ్గురు నిశానీదారులుగా ఉండే దుస్థితి పట్టింది. ప్రాచీన ఆయుర్వేద యూనానీ వైద్య పద్ధతులు పూర్తిగా అశ్రద్ధ చేయుబడడంవలన, గ్రామస్థులు దేశీయ వైద్యసహాయము కోల్పోయి, చిన్న జబ్బుకుగానీ, పెద్దజబ్బుకుగానీ పట్టణాలకు పరుగెత్తుకొని పోవలసి వస్తూన్నది. కాలువలు విస్తారంగా తవ్వించడం వలన వ్యవసాయానికి ఉపయోగంగా

ఉన్న మాట నిజమేకాని, నీళ్ళనుండి కలిగే అంటుజాడ్యాలు దేశమంతా వ్యాపించి, తగిన వైద్య సహాయం లేనందున, ఎక్కడా ఆగకుండా తాలూకాలకు తాలూకాలు, జిల్లాలకు జిల్లాలు నాశనమవుతూన్నవి. రైలుమార్గాల నిర్మాణం పూర్వం నుండీ మురుగునీరు పోతూన్న మామూలు దారుల కష్టం కలిగించినందున బెంగాలువంటి రాష్ట్రాలలో ఎక్కువ నీరు నిలవ ఉండి నిరాటంకంగా మలేరియా చెలరేగడానికి వీలు కలుగుతూన్నది. ఆరోగ్యమూ, విద్యా ఈ విధంగా లోపించినవి. ఇక కోర్టులు న్యాయపరిపాలన అనే పేరుతో ప్రవేశ పెట్టిన కైతవ, సంపర్గ భావాలవలన, దేశంలో కలహాలెక్కువై గ్రామ ప్రజలలో సహకార తత్వం సర్వనాశన మయింది. వ్యాజ్యమొక కాలక్షేపంగా పరిణమించింది. ఇక కోర్టులకు పోయగా మిగిలిన డబ్బునూ కోర్టులచుట్టూ తిరుగగా మిగిలిన కాలమునూ అప్పుడప్పుడూ వచ్చే ఎన్నికల లో వినియోగించడం మరిగారు గ్రామస్థులు. పాశ్చాత్య ప్రజాస్వామ్య పద్ధతిలోని దురాచారాలు లంచగొండితనమూ ఇంత తొందరగా ఈ దేశంలో వ్యాపించడం చాలా దుర దృష్టం. మనకు లభించిన ప్రజాపరిపాలన నిజానికి చాలా తక్కువ. కాని అందువలన మనకబ్బిన దురభ్యాసాలు మాత్రం చాలా ఎక్కువ.

ఆధునిక కృత్రిమ నాగరిక జీవిత పరిస్థితుల వలన దేశం లోని సంఘజీవితం లోపించి ప్రజల భౌతిక వాంఛలకూ శారీరకాభివృద్ధికీ తగిన పని జరగడం లేదు. 36 కోట్ల

ప్రజలకు 9 కోట్ల టన్నుల ఆహారము కావలసి ఉంటే 6 కోట్ల టన్నులు మాత్రమే సప్లయి చేయబడుతూన్నది. అనగా నూటికి 40 వంతులు తక్కువ ఆహారం సప్లయిఅవుతూన్నది. ఇందువలన వ్యక్తుల శక్తి యెంతో క్షీణిస్తూన్నది. ప్రతి మనిషి 1.8 మిలియనుల క్యాలరీల ఉష్ణం కలిగిఉండడానికి బదులు .87 మిలియనులు క్యాలరీల ఉష్ణమును మాత్రమే పొందగలుగుతూన్నాడు. ఇంగ్లాండులోని మనిషి సగటున 58 సంవత్సరాలు జీవిస్తూన్నాడు. ఇండియాలో 24, ఫ్రాన్సు, జర్మనీలలో 48, ఇండియాలో మనిషి 1 కి సగటాదాయం సంవత్సరానికి దాదాపు రు 40, అమెరికాలో 2,250, ఇంగ్లాండులో 750. జరిగిన యాభై, అరవై సంవత్సరాల నుండీ ఇండియా జనసంఖ్య క్షీణిస్తూన్నదని తెలుసుకోవలెనంటే జనన, మరణముల, లెక్కలను పోల్చిచూస్తే అర్థమవుతుంది. ఇండియాలో సంవత్సరంలోపు పిల్లలు నూటికి 20 మంది వంతున చనిపోతూన్నారు. ఇది మరీ ఘోరం. యూరపు దేశాలలో సంవత్సరంలోపు పిల్లల మరణసంఖ్య చాలా తక్కువ.

ఇక మన భూముల పంటవిషయం: వరి పంటగాని, పత్తి పంటగాని ఆలోచిద్దామా అంటే ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్సు, జపాను, బెల్జియం, హాలెండు దేశాలలో పండేపంటకంటెచాలా తక్కువ. ఈ అన్ని కారణాలు ముఖ్యంగా ఈ 20వ శతాబ్దంలో అనేక క్షామములకు హేతువులయినవి. వీటి వలన లక్షలాది ప్రజలునశించారు. వేలకొలదీ చదరపుమైళ్ళ దేశం పాడుపడింది.

అంటు జాడ్యాల వలెనే కఱువులుకూడా ఇండియాలో అప్రతిహతంగా వ్యాపిస్తూన్నవి. కఱువులను, రోగాలను కలుగచేసే వివిధ కారణాలు విజృంభిస్తూన్న సంగతి తెలిసికూడా ప్రభుత్వంవారు తెల్లమొగంవేసి చూస్తూ ఊరుకొంటున్నారు, సర్ ఛార్లెస్ ఇల్లియట్, సర్ విల్లియం విల్సన్ హంటరుగార్లు ఇండియాలోని అయిదోవంతుజనులు రోజుకొకసారిమాత్రమే భోజనం చేస్తున్నారని వ్రాసినప్పటికీ, 1929 లో ఎంపైరు మార్కెటింగు బోర్డువారున్నూ, ఇండియా హైకమీషనరు సర్ అతుల చటర్జీగారున్నూ, కావలసినదానికంటె ఇండియాలో ఎక్కువబియ్యం ఉన్నవని చెప్పడం సాహసం. అదే నిజమైతే ఆయా దేశాలవారు మనబియ్యం తీసుకొని అందుకు సరిపోయేబట్టను ఇక్కడకు దిగుమతిచేశారని అర్థంవస్తుంది. మన బట్టను మనం తయారుచేసుకోగలిగి, ఆసొమ్మును పరాయిదేశాలకు పంపకుండా ఉంటే, దానితో మన దేశపు ఆకలిగొన్న ప్రజకు మనబియ్యం కొనుక్కొనేశక్తి కలిగించవచ్చునన్నసంగతి తేలికగా గ్రహించతగినది. అందువలన మన బియ్యంకూడా ఎగుమతికానక్కరలేదు. మన దేశంలో నిరంతరం ప్రవహించే జీవనదులఒడ్డున ఉన్న కొన్నిపట్టణాలకు తాగేటందు కొక చుక్కయినా నీరులభించడంలేదు. ఏమిటి దీనికి కారణం? ఎక్కడఉన్న దీదోషం? ఈదోషం మున్సిపాలిటీలదన్నారుకొందరు. సరే! పోనీయండి! లక్షలాదిప్రజలు అన్నంలేక అల్లాడుతూంటే కోట్లకొలదీ విలువగల బియ్యం ఎగుమతీ అవుతూన్నవి. ఈ తప్పెవరిది? ఈతప్పుతప్పకుండా

ప్రభుత్వానిది, ఇక్కడ ఆకలితో బాధపడుతూన్న జనం ఉండగా బియ్యం పైకిపోనీయడం తప్పు వారిదికాక మరెవ్వరిది? మనుష్యులకు కావలసిన ముఖ్యపదార్థాలు అన్నవస్త్రాలు. విలాసవస్తువులను దిగుమతీ చేసుకొంటూన్నప్పటికీ అన్నవస్త్రాలను దిగుమతీ చేసుకోవడాని కంగీకరించిన దేశం మాత్రం పూర్తిగా క్షీణించకతప్పదు. ఆహారపదార్థాలను దిగుమతీ చేసుకొనే ఇంగ్లాండు దేశమే కానీయండి వస్త్రాలను విదేశాలనుండి దిగుమతీ చేసుకొనే ఇండియా కానీయండి, ఈ రెండూకూడా శిథిలం కాకతప్పదు ఈ రెండు దేశాలు కూడా ఆహారంవిషయంలో ఒకప్పుడు స్వయం సంతృప్తి కల దేశాలే. రెండు దేశాలూకూడా వ్యాపారంలోనరుకులు తిరుగుతూండడంచూచి నిజమైన ఐశ్వర్యంగా భ్రమించినవి. సంకటస్థితిలో ఈదేశాలు తాముచేసిన ప్రమాదానికి తగిన ప్రతిఫల మనుభవించక తప్పదు. ఇంగ్లాండు దేశంలో విస్తీర్ణములైన అడవులను వ్యవసాయయోగ్యము లయిన భూములుగామార్చినప్పు డా దేశంలో ఆహారానికికొదవ ఉండదు. అలాగే ఇండియాలోని లక్షలాది రాటాలు, మగ్గాలూ పనిచేసినప్పుడూ ఈదేశంలో బట్టలకు కొదవఉండదు.

కాబట్టి స్వరాజ్యస్థాపన కాగానే మొట్టమొదట ప్రభుత్వం చేయవలసినపని, ఇండియానుండి ఆహారపదార్థాలను వెలుపలికి పోకుండానూ, వస్త్రాలను ఇండియాలోకి దిగుమతి కాకుండానూఆపి, మగ్గాలను, రాటాలనూ ప్రాచీనౌన్నత్య స్థితిలోకిదెచ్చి, నేసేవాళ్ళకూ, వడికేవాళ్ళకూ జీవనాధారం

కల్పించడం, గ్రామపాలనను పునరుద్ధరించి, గ్రామంలోని తగాదాలు అక్కడే పరిష్కరింపబడేటట్లు చూడాలి? గ్రామ వృత్తులకు పూర్వపుమర్యాద గ్రామపరిశ్రమలలో పూర్వపు నైపుణ్యమూ ఉండేటట్టుచూడాలి. బ్రిటిష్ ప్రభుత్వంకింద పాడుపడిన చెఱువులనూ, తదితర నీటి సరఫరా మార్గాలనూ పునరుద్ధరించి, వ్యవసాయమునకు తగి ఉన్నప్పటికి బంజరుగా నిలచిపోయిన 47% భూమినీ పంటభూమిగా చేయాలి. వంతెనలు లేకుండా కాలువలు తవ్వి బ్రిటిష్ ఇంజనీర్లు చేసిన అపచారాన్ని సరిచేయాలి. గ్రామ రహదారీలను, రాకపోకల సౌకర్యాలను బాగుచేయాలి. అందువలన సరుకులు ఒకచోట నుండి మఱొక చోటికి తేలికగానూ, తొందరగానూ పోవడానికి వీలవుతుంది. బెంగాలులో వంతెనలను విశాలంచేసి, మురుగు కాలవల అడ్డంకులను తీసివేయాలి. సాధ్యమైనంత వరకు వ్యాజ్యాలు తగ్గించే సదుపాయం చేయాలి. గృహ పరిశ్రమలను అభివృద్ధిచేసి, వ్యవసాయకులకు తీరికకాలంలో లాభప్రదంగానూ, గౌరవ ప్రదంగానూ ఉండే ప్రవృత్తులను కల్పించాలి. ప్రజాసామాన్యాన్ని విద్యావంతులనుగా చేయడంలో శ్రద్ధవహించాలి. అందుకుగాను సంచార గ్రంథాలయాలు, సంచార సినీమాలు, సంచార ప్రదర్శనాలూ యేర్పాటు చేయాలి. వీలుంటే పరీక్షలను రద్దుచేయాలి. నేటిపట్టణ విద్యావిధానం వలన హరింపబడుతూన్న గ్రామస్థుల ఆరోగ్యైశ్వర్యములను రక్షించి, వాళ్ల క్షేమాన్నీ శక్తి సామర్థ్యాలనూ అభివృద్ధిచేయాలి. ప్రతిగ్రామంలోను ఒక

పాఠశాలా ఒక సహకారసంఘము, ఒక కోఆపరేటివ్ స్టోర్సు ఉండాలి. భూమితనఖాబ్యాంకింగు సదుపాయాలుండాలి. గ్రామస్థులను షాహుకారుచేతులలో చిక్కకుండా చూడాలి. జరిగినయాభై యేండ్లనుండీ వట్టి భాషాజ్ఞానం వలన కలిగిన దుష్ఫలితాలను తొలగించాలి. ప్రజలలో సుహృద్భావంపోయి వట్టి భౌతిక సిద్ధాంతం వ్యాపిస్తూన్నది; దానిని నిర్మూలించి ప్రజలకు మంచిభావాలు, మంచి ఊహాలూ అభివృద్ధి అయ్యేటట్టు చేయాలి. ప్రజల జాతీయ సంప్రదాయాలకూ, తత్వశాస్త్రానికీ, మతవిశ్వాసానికీ సన్నిహిత సంబంధం కలిగి ఉండాలి వారి జీవితం. సాంఘిక కలహాలు పోసగడానికి వీలున్నచోట్ల పంచాయితీ సంఘాలను నియమించి, సంఘాంతర సుహృద్భావాన్ని పెంపొందించాలి. ఆసుపత్రులను ఆరోగ్యమందిరాలనూ దేశమంతటా నిర్మించాలి. వాటిలో రోగం రాకుండా ఆపే మందులశాఖకూడా ఉండి, ఆరోగ్యసూత్రాలను, ఆరోగ్యరక్షణ మార్గాలనూ రేడియోలో ప్రచారం చేస్తూండాలి. పేదవాడిపైన పన్నుల భారం తొలగేటట్లూ, చిన్నరైతులపైన ఎక్కువ పన్ను పడకుండా ఉండేటట్లూ, భూమి పన్నులవిధానం న్యాయ్య పద్ధతిని సంస్కరించబడాలి. భీమా విధానాన్ని జాగ్రత్తగా ప్రభుత్వంవారు పరిశీలనచేయాలి. సాధారణభీమా, పశువుల, పంటలభీమా, జీవితఆరోగ్యభీమా, రుజువర్తనము, విశ్వాసములభీమా, భవనముల, నౌకలభీమా, దొంగతనాల,దురదృష్టముల (accidents) భీమా-వీటన్నిటినీ యేర్పాటుచేసి

ప్రజలలో పరస్పర సహకార భావాన్ని పెంపొందించాలి. ఋణంచేసిన వానికీ ఋణమిచ్చిన వానికీకూడా గౌరవకరమైన పద్ధతిని బ్యాంకింగు ఏర్పాటు చేయాలి. అనగా అప్పిచ్చే పని కేవలం సహకారసంఘాలకు వదిలివేయాలి. అప్పులిచ్చే వ్యక్తులను లైసెన్సు తీసుకోమనాలి. చేతిపనులూ - వృత్తి విద్యలూ వీటిని సామాజిక సంస్థల స్వాధీనంచేసి సాంప్రదాయమునకు చట్టమునకూ అనుగుణంగా పనిచేసే గంటలను నేర్పరితనమును పోటీవిధానమును ప్రోత్సహించాలి. భారతీయశిల్ప సౌందర్యాలు తిరిగీ ప్రాచీనౌన్నత్యమును పొందాలి. పరిపాలనా వ్యవహారములుగానీ విద్యాబోధనము గానీ భారతరాష్ట్రీయభాషలలోనే జరగాలి. హిందీ, హిందూస్థానీ భారత జాతీయభాషగా ఉండాలి. అన్ని సంఘాలవారూ దేవాలయాలలో ప్రవేశించడానికి హక్కు గలదని తీవ్రంగా ప్రచారంచేసి బోధించాలి. అప్పటికీ అంటరానితనం పోక పోతే, ఆ మచ్చను ఒక్కసారిగా శాసనంచేసి తుడిచి వేయాలి. అహింసాత్మక రాజ్యాన్ని ఆచరణలోకి తీసుకొని రావడానికి వీలుగా, నేటిహింసాత్మక సైన్యానికి బదులుగా, శాంతిసైన్యమును సమకూర్చాలి. నౌకా వ్యాపారం యావత్తూ దేశీయపెట్టుబడితో నడవాలి. ముఖ్య పరిశ్రమ లన్నీ జాతీయ ప్రభుత్వ వశంకావాలి. గ్రామాలలోకాని పట్టణాలలోకాని పనిదొరకని వారంటూ ఉండకూడదు. అందుకుగాను గ్రామ పరిశ్రమలను, పెద్ద పెద్ద పరిశ్రమలనూ కూడా స్థాపించాలి. శిల్పకళకు చోటులేని పెద్ద పరిశ్రమలన్నీ

యంత్రముల ద్వారా ప్రభుత్వ గ్రాంటులతో పెంపొందాలి. కనీసపు కూలీ అందరికీ గ్యారంటీచేయాలి పొలం లేనివాళ్లకు పొలమీయాలి. దేశాన్ని అంతకంతకు పేదరికంలోకి దించుతూ, ప్రతిసంవత్సరమూ విదేశాలకు పోతూన్న 60 కోట్ల రూపాయిాలను పోనీయకుండా, భావిదేశాభ్యుదయాని కనుగుణంగా సాధ్యమైనంత తొందరలో అరికట్టాలి. 'పాపపుడబ్బు' మూలాన కలిగిన నైతిక పతనాన్ని వెంటనే తుడిచివేయాలి. సాంఘిక సమస్యల విషయంలో అప్పుడు విదేశీ శాసనసభలకు జోహారుచేయవలసిన అవసరముండదు. సంఘంలోని పెద్దలకే అందుకు తగిన అధికారాలిచ్చివేసిన యెడల సంఘ సంస్కరణవిషయంలో ఎన్నో మంచిపనులుజరుగ గలవు. స్త్రీలస్థితిని అభివృద్ధి పరచడం ప్రభుత్వానికి ప్రథమ కర్తవ్యం. విడాకులు పుచ్చుకునే హక్కు స్త్రీలకుండవలసిందే. కాని బహుజాగ్రత్తగా పరిశీలించి విడాకుల చట్టంలోని షర తులను తయారుచేయాలి. వారికి సాంఘిక ఆర్థిక సౌకర్యా లను సమకూర్చాలి. స్త్రీ పునర్వివాహాలను సర్వజన సమ్మ తంగా ఉండేటట్లు ప్రచారం చేయాలి. స్త్రీలకు భర్తల ఆస్తి లోనూ, తల్లి దండ్రుల ఆస్తిలోనూ కూడా భాగముండాలి. పిల్లలను హింసించడం దేశంలో ఒక ఆచారమై పోయింది. అది నిర్మూలింప బడాలి. తప్పుచేసినవాళ్ళు దయాపాత్రులను కోవాలి. కాని వాళ్ళనుచూచి అసహ్యించుకో కూడదు. తాగుడును నిర్మూలించి, నేరాలను నిరోధించి, నేరంచేసిన వాడు సాంఘికంగా పాపి అనుకోవడంకంటె, మానసిక

రోగిగా భావించి చికిత్సచేయడం మంచిది. అతర్జాతీయ సంస్కార వాణిజ్యములవలని ప్రయోజనములనుగూర్చి ప్రజలకు బోధించాలి. ప్రపంచంలోని ప్రతి దేశమూ తదితర దేశాల పండితులను ఆచార్యులను పిలిపించుకొని, ఆయా దేశాల సంస్కృతితో సన్నిహిత సంబంధం కలిగిఉండాలి; స్వరాజ్యంలో, ఆంగ్లేయుడు మన దేశంలోని తక్కిన జనంతో ప్రభుభావంతోగాక, భ్రాతృభావంతో మెలగడానికి వీలున్నదను కోవాలి. అప్పుడతను పెట్టిన పెట్టుబడికి మొప్పుఉండదు. కరెన్సీలోనూ, నాణెములు వేయడంలోనూ, చేసేమార్పులు ఆంతరంగిక వర్తకానికీ అంతర్జాతీయ వ్యాపారానికీ భంగం కలిగించేవిగా ఉండకూడదు. ఇండియా, ఒకేపెడ రేషణ్, ఒకేచట్టాలు, ఒకేనాణెం, ఒకేపోస్టేజిస్టాంపు ఉండేపద్ధతిని 'స్వరాజ్యసమిష్టి ప్రజాతంత్రిమును' (common wealth of nation) స్థాపించడానికి ఇండియా ఎక్కువగా కృషిచేయాలి. అప్పుడే దూరవ్యాప్తమైన, దైవసంఘటమనదగిన, సార్వజనీన శాసనసభా (Parliament of Man) ప్రపంచసమాఖ్య (Federation of the world) లాచరణలోకి వేగంగా రాగలవు.

ఈ విధంగా నూతనసాంఘిక వ్యవస్థా ప్రారంభంతో కొత్తశకం వస్తుంది. అప్పుడు భాగ్యవంతుల పరిపాలనఉండదు. ప్రజా పరిపాలన అనగా, ఏవో కొన్నికుటుంబాలు గుమికూడి చేసే గూడుపుఠాణీరాజ్యం అనిపించదు. ప్రభుత్వం కొన్ని ప్రాచీనవంశముల సొంతసొత్తు అనుకోవడానికి వీలులేకుండా

పోతుంది. రాజుల యశస్సుకోసంగానీ సిపాయీలకు పని కల్పించడానికిగానీ యుద్ధాలు ఉండవు. ప్రభుత్వం కేవలం శాంతి భద్రతలను కాపాడేనిమిత్త మేర్పడిన పరికరంగా ఉండదు. కార్మికవర్గంతో సంపూర్ణంగా సహకారంచేస్తూ వారికి కావలసిన ఆహారాన్ని సకాలంలో సప్లయిచేస్తుంది. దేశంలో ప్రతిచోట ఆహారోత్పత్తిగానీ, ఆహారమును కొనుక్కొనేటందుకు ద్రవ్యంగానీ కొరవడకుండా చూస్తూంటుంది. ప్రభుత్వ శాఖలుగానీ, ప్రజాసంస్థలుగానీ ధనవంతులకూ సాహసికులకు చేతిలోని పనిముట్లుగా ఉండవు; అవి దేశంలోని నలువైపులనుండీ ప్రజాభిప్రాయాన్ని ప్రతిధ్వనింపచేస్తూంటవి; బాధితుల కష్టనివారణకు ప్రయత్నిస్తూంటవి; దారిద్ర్యాన్ని రూపుమాపి, ప్రతియింటినీ ఆరోగ్యానందములకు నిలయంగా చేసి, అందరికీ అన్నం, వస్త్రం, ఇల్లూ లభించేటట్టు చూస్తవి.

అధ్యాయము 19

ముగింపు

౧

విశాలజీవిత విధిపరంపర

జీవితం అనేక హద్దులలో పనిచేస్తూంటుంది. అది మామూలుకంటికి సాధారణంగా కనిపించదు. కంటిలోని పాప వెలుతురునూ దూరాన్నీ సరిపుచ్చుకోవడానికి నిరంతరమూ చిన్నదిగానూ పెద్దదిగానూ అవుతూంటుందని శారీరక శాస్త్రజ్ఞునకు తెలుసును. సూక్ష్మదర్శినీ యంత్రం (Microscope) తో పనిచేసే భౌతిక శాస్త్ర విద్యార్థిగానీ, వైద్యవిద్యార్థిగానీ అతిసున్నితమైన సమాహారమధ్యము (Focusser) ను ఎప్పుడూ సరిచేసుకొంటూనే ఉంటాడు. రేడియో వినే మనిషీ అంతే. మోటారు కారును రోడ్డుమీద తిన్నగానడిపించేటందుకుగానీ ఎడమ ప్రక్కగానడిపేటందుకుగానీ డ్రైవరు చేతులెప్పుడూ స్టీరింగుమీదనే పనిచేస్తూ ఉంటవి. హృదయం నిమిషానికి 72పర్యాయములు కుంచించుకొని విస్తరిస్తూంటుందనీ ఊపిరితిత్తులు నిమిషానికి 17సార్లు ముడుచుకుపోయి వికసిస్తూంటవనీ తెలుసుకొన్నప్పుడు, జీవబిందువుల నిరంతరనిర్మాణ నిర్మూలన క్రమములవలన వాటిలో కలిగే మార్పునూ, తద్వారా శరీరస్థితిలో కలిగే పరిణామాన్నీ

గ్రహించ గలిగినప్పుడు, మెదడులోని జీవనాడులు ఒకప్పుడు వివిధభావాలను ప్రేరేపించి మఱొకప్పుడు భావమాంద్యమును కలిగిస్తవనీ, ఒకప్పుడు విస్మయానంద దుఃఖలక్షణాలను గ్రహించి, మఱొకప్పుడు విజృంభింప చేస్తవనీ, ఊహించగలిగినప్పుడు, పేగులలోని అంతర్నాళాలు జీవ ద్రవాలను లీనం చేసుకొంటూన్న విధానమునూ, సంచలిస్తూన్న రక్తం ప్రాణవాయువును గ్రహించి, ప్రాణవాయు మిశ్రిత ద్రవ్యములను త్యజిస్తూన్న పద్ధతులనూ చిత్రించుకొన్నప్పుడు, ఆకాశంలోని గ్రహమండలాలు, ఒకదాని కొకటి ఎంతో దూరాన ఆకర్షణ సూత్రానుగుణంగా ఉన్నచోటనే ఉండడం మాలోచించుకొన్నప్పుడు ఈ చిన్నిమానవ శరీరము, మహా విశ్వంలోని సంకీర్ణత విభాగములను కలిగియుండడమేకాక, అణువులోని అత్యల్పాంశములన్నీ ఇందులో ఉన్నవని అర్థం చేసుకోగలము. రాగినాణెములో పదిలక్షలలో ఒకవంతుమాత్రమే ఘనపదార్థాణువులు ఉన్నవనీ తక్కినదంతా అంతరమనీ (space) మనం చూడగలమా? మహామేధాశాలియొక్క క్రియారంగం పరిమితంగానే ఉండవచ్చును. కాని విశాల హృదయం గల మనిషియొక్క గ్రహణశక్తి విస్తృతంగా ఉంటుంది. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అనే ఉపనిషద్వాక్యానుగుణంగా, మహాకన్న పెద్దదిగానూ, అణువుకన్న చిన్నదిగానూ ఉంటుంది. అందువల్లనే గాంధీ ఒకప్పుడు ఉన్నతాకాశ పథములలో విహరిస్తూ, మఱొకప్పుడు రాటంవంటి చిన్న విషయాలనుగూర్చి ఆలోచిస్తూంటాడు. ప్రపంచ

సమస్యల పరిష్కారమునుగూర్చి భావించనూగలడు. సేవా గ్రామంలో ఇటీవల డాక్టరు ఫ్రీడ్‌మన్ కనిపెట్టిన ధనుష్ చర్ఖాలోని లోపాన్ని తెలుసుకోనూ గలడాయన. మన ప్రాచీన ఋషులు నిర్మించిన భారతీయగ్రామంలో ఆయన కత్యధిక విశ్వాసం. అందువలన ఆయనను సంకుచితవర్గ దృష్టి కలవానిగా భావించకూడదు. నిజంగా ఆయన అటు వంటి వాడే అయితే భారత జాతీయ నాయకత్వంతో సమా ధానపడే ఉండేవాడు. అంత జయప్రదంగా ఉన్న ఆయన నాయకత్వాన్ని అనేక పర్యాయములు తనంతటతాను విడిచి పెట్టుకోవలసిన అవసరమే తటస్థించేదికాదు. ఆయన కెన్నడూ ప్రతికక్షి అంటే ద్వేషంలేదు. అంతేకాదు ప్రతి పక్షుల అభిప్రాయాన్ని ఎల్లప్పుడూ ఆయన గమనిస్తూనే ఉంటాడు. తన విశ్వాసాన్నీ సిద్ధాంతాలనూ ఎదుర్కొం టూన్న భారత రాజకీయవేత్తల విషయంలోనేగాక భారత జాతికే "శత్రువైన" ఆగ్లేయుని విషయంలోకూడా ఇంత దాక్షిణ్యంగానూ ఉంటాడాయన. భావిసంతానానికాయన ఒకదివ్య తేజస్సు. అంతేకాదు, ఒక దేశానికీ ఒక జాతికీ మాత్రమేగాక ప్రపంచమంతకూ సంబంధించిన మతప్రవక్త.

గాంధీజ మొక జీవిత విధానం

అందువలననే 'నేటి కల్లోల ప్రపంచమున, గాంధీ జీవిత కాలంలోనే, ఆయన పేరు ఒక వ్యక్తిఅర్థంలోగాక ఒక జీవిత విధానార్థంలో ప్రయోగింపబడుతూన్నది' అని పెరల్‌బక్కు

అన్నది. ఆయన మాటిమాటికీ బ్రిటిష్‌వారి స్నేహితుడననీ, వారియెడల తనకు ద్వేషం లేదనీ, వారి కష్టకాలంలో సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించి వారిని చీకాకు పరచననీ అంటూండడం, సామాన్యులైన ఆయన అనుచరులకు చాలా కష్టంగా ఉంటుంది. 'తత్వవేత్త పక్షపాతిగా ఉండరాదు. ఆయన కలహాలకు అతీతుడుగా ఉండాలి' అని హోకింగు అన్నాడు, ప్రతిపక్షి యెడల ఆయనచూపే ఈ దాక్షిణ్యమే అతనిని నిరాయుధునుగా చేస్తూన్నది. గాంధీ ఆత్మచరిత్రలో జనరల్ స్మట్సు చాలావరకు తన మార్గాలవైపుకు ఆకర్షింపబడినాడని నిరూపించాడు. స్మట్సు కార్యదర్శులలో ఒకరు గాంధీతో అన్నమాట లిదివరకే మేమొకచోట ఉదహరించి ఉన్నాము.

1934 అక్టోబరులో గాంధీ నాలుగణాల సభ్యుడుగా చేరడం మానుకొన్నంత మాత్రాన కాంగ్రెసులో ఆయన కభిమానం క్షీణించలేదు. ఈ ఆరుసంవత్సరాలూ ఆయన కాంగ్రెసుకు అనధికార మధ్యవర్తిగా, న్యాయాధ్యాధిపతిగా, సచివునుగా వ్యవహరించాడు. స్వరాజ్య ప్రభుత్వంలో హిందూదేశరక్షణ అహింసాత్మకంగా ఉండవలెనన్న విషయంపైన, 1940 జూన్‌లో వార్ధాలోనూ, 1940 జులైలో ఢిల్లీలోనూ తనకూ వర్కింగు కమిటీకి వచ్చినభేదాభిప్రాయాలనూ, 1940 జూలైలో వార్ధా, ఢిల్లీ వర్కింగు కమిటీ నిర్ణయాలను బలపరుస్తూ పూనాలో అఖిలభారత కాంగ్రెసు సంఘం, కొన్ని షరతులతో యుద్ధానికి భౌతిక సహాయంచేయడాని కంగీకరించిన

తీర్మానమునూ గాంధీ ఉపేక్షించి ఉండవచ్చును. కాని ఆయన అలా ఊరుకోలేదు. ఆయనకు హింసమీద ఆధారపడ్డ నాయకత్వమే కాదు స్వరాజ్యంకూడా అక్కరలేదు. ఆయన ఒక నూతనమతానికి మూలపురుషుడు. ప్రపంచప్రవక్త. ఆయన తత్త్వాన్ని సిద్ధాంతాలనూ సంపూర్ణంగా అనుసరించ గలిగిన సంస్థద్వారా వాటిని లోకంలో వ్యాపకం చేయదలచుకొన్నాడు. అంతేకాని దానిసరిహద్దులలో అణగిమణగి ఉండలేదు. కమిటీలు, కాన్ఫరెన్సులు, కాంగ్రెసులు వీటిని అతిక్రమించి అభివృద్ధి అవుతున్నాడాయన. ఆయనకీ ప్రపంచంలో సొంతమని చెప్పుకోదగిన సొత్తులేదు. సబర్మతీ ఆశ్రమం ఆయనకు ముద్దుబిడ్డ. 1933 లో హరిజనాభివృద్ధికి దానిని ఆయన ఇచ్చివేసిన సంగతి ఇదివరకే చెప్పి ఉన్నాము. 1930 లో ప్రభుత్వంవారు స్వాధీనపరచుకొన్న యంగిండియా ముద్రాశాలను మళ్ళీ కావాలని ఆయన కోరనేలేదు. ఆయనకు ప్రేమాస్పదమైన గాంధీసేవాసంఘ సభ్యత్వసంఖ్య 180 నుండి 9 కి తగ్గిందిప్పుడు. వారుకూడా నేడు సత్యాహింసల పరిశోధనతో తమ యావత్కాలాన్నీ వినియోగిస్తూన్నారు.

గాంధీ సిద్ధాంతం యేదో ఒక దేశక్షేమంకోసం మేర్పడినది కాదు. ఏదో ఒక స్థానిక కష్టానికి నివారణోపాయంగా అది భావింపబడలేదు. విశ్వకల్యాణార్థ ముద్దేశింపబడిన చికిత్సావిధానమది. అవసరంకోసం యెప్పుడూ తన శాశ్వత సిద్ధాంతాలను ఆయన వదులుకోలేదు. అంతమాత్రంతో ఆయన నిఘంటులో రాజీ అనే మాట లేదని అర్థంచేసుకోకూడదు.

సత్యాగ్రహంలో యెప్పుడూ ఉన్నది రాజీ. కాని ఆయన తత్వం కానీ సిద్ధాంతాలు కానీ నైతిక వ్యవహారాలలో యేవిధమైన రాజీనీ అంగీకరించవు. "ఇతరులు వ్యక్తిగత శిక్షణగా ఉపదేశించిన విషయాన్నే గాంధీ ప్రపంచ మోక్షంకోసం సాంఘిక కార్యక్రమంగా చేశాడు" అన్నాడు హోమ్స్. ఇటువంటి మహాదుద్యమంలో కొంతమంది లఘుబుద్ధులకు, కొంత విప్రతిపత్తి, కొంత అసాంగత్యతా కనుపించవచ్చును. కాని సోఫియా వాడియా చెప్పినట్లు "ఆయనను 'ఆత్మ' గా గ్రహించగలిగినప్పుడు, తన హృదయానికీ బుద్ధికీ మధ్యస్థంగా నడుచుకోవడానికి ఆయన యిష్టపడడని తన అంతరాత్మకు విరుద్ధంగా ఆయన పోడని ఆయన అన్ని సంఘటనలనూ ప్రాపంచిక దృష్టితోగాక తన విషయంలో ఆత్మజ్ఞాన పథములుగానూ ఇతరుల విషయంలో ఆత్మోపకార మార్గములుగానూ భావిస్తూంటాడని గమనించగలిగినప్పుడు మనకు కనపడే ఈ అసందర్భాలూ అసంభావ్యాలూ చక్కగా అర్థం కాగలవు.

స్వప్రయోజన పరులతో పోరాటం

గాంధీ కార్యక్రమం అనేకమంది స్వప్రయోజన పరులకు గాంధీకీ కాంగ్రెసుకూ విరోధులనుగా చేసింది. వారికి ఈ దిగువ ఉదాహరింప బడిన విధంగా వివిధ వర్గాలతో-

అస్పృశ్యతా నివారణోద్యమంవలన సవర్ణ హిందువులతోనూ,

సనాతన బ్రాహ్మణులతోనూ,

విశ్వవిద్యాలయ సంస్కరణంవలన ప్రొఫెసర్లతోనూ,
మద్య నిషేధంవలన ఈడిగ వారితోనూ,
జాతీయ విద్యవలన ఉపాధ్యాయులతోనూ,
పంచాయతీలవలన లాయర్లతోనూ, బౌటులతోనూ,
ఖద్దరువలన మిల్లు యజమానులతోనూ,
అమ్మకవు పన్నులవలన వర్తకులతోనూ:
ఆస్తి పన్నువలన ధనవంతులతోనూ,
కుటీర పరిశ్రమలవలన పెట్టుబడిదారులతోనూ,
ఋణవిమోచన చట్టంవలన ఋణదాతలతోనూ,
జిరాయితీ చట్టాలవలన జమీందారులతోనూ,
దంపుడుబియ్యంవలన వడ్లమరల యజమానులతోనూ,
కార్మికాభివృద్ధివలన భూ ఖామందులతోనూ,
జీతాల తగ్గింపువలన ఉద్యోగస్థులతోనూ,
భారతీయోద్యోగ నియామకంవలన యూరోపియనులతోనూ,
హిందీవలన జస్టిసు పక్షంతోనూ,
బిరుదులను నిరాకరించడం వలన ధనికవర్గంతోనూ,
మతసంస్థల యాజమాన్యంవలన పీఠాధిపతులతోనూ, మహంతుల తోనూ, విరోధంవచ్చింది.

కాని గాంధీ ఉచిత జీవితం అందఱినీ సమాధానపఱిచింది

తన ఆదర్శాలను జంకూ గొంకూ లేకుండా ప్రకటిస్తూ అవసరమైనప్పుడు రాజీకంగీకరిస్తూ, యావద్భారత జాతినీ సంకుచిత స్వప్రయోజనముల కతీతులనుగాచేసి జాతీయ స్వాతంత్ర్యమార్గమునకుగల ఆటంకములను తొలగించుటలో

గాంధీ విజయం పొందాడు. ఉచిత జీవిత సిద్ధాంతములను సరిగా గ్రహించడం వలననే గాంధీ కావిజయం కలిగింది.

ఉచిత జీవితమనగా ఎలా ఉండాలో కొంచెమాలోచిద్దాము. రాజకీయంలో కుడిపక్షమంత పూర్వాచార పరాయణులుగానూ ఉండకూడదు. ఎడమపక్షమంత తీవ్రవాదమూ పనికిరాదు. దీనినే ఇంకోవిధంగాకూడా చెప్పవచ్చు; ఎప్పుడూ అధికారవర్గంతో కలసిఉండడమూ పనికిరాదు; వెనుకపడి ఉండి వినేదిక్కు లేకుండానూ ఉండకూడదు; రెండు వ్యతిరేక పక్షాలను సమన్వయ పరచగలిగిన స్థితిలో ఉండాలి. ఇందుకు యుక్తాయుక్త వివేకంగల నిరాకుల చిత్తవృత్తి కావాలి. ఒక్కొక్కప్పుడు మనిషికిగల సుగుణాలే అవగుణాలుగా పరిణమిస్తవి. నూతనభావాలు కలిగిఉండడం సుగుణమే. కాని ప్రతిపక్షితో సమాధానం కుదుర్చుకోలేకపోవడం అవగుణం. ఒకమనిషి తన అభిప్రాయాలకు అంటిపట్టుకొని ఉండడం సుగుణము కావచ్చును; సిద్ధాంత ప్రకారంచూస్తే నూటికి నూరుపాళ్ళు అతనిది ఒప్పే కావచ్చునుకూడా. కాని సంఘంలో అతనొక్కడే మనిషికాదు. అలాగేఅయితే అభిప్రాయాలనేవే ఉండవు. అభిప్రాయాలనగా మనుష్యులయొక్కగానీ విషయాలయొక్కగానీ, లేక మనుష్యులూ విషయాలయొక్కగానీ బాంధవ్యాన్నిగూర్చిన సిద్ధాంతాలు. కాబట్టి, అభిప్రాయాలు అనే మాటలోనే సంఘజీవితం అనేది ఇమిడి ఉన్నది. సంఘజీవితంలో, రాజీలు, సమాధానాలు, 'ఇచ్చి పుచ్చుకోవడాలు' ఉండకతీరదు.

మనిషికి యదార్థగ్రహణశక్తి ప్రమాణజ్ఞానం, ఉచితజ్ఞతా ఉండాలి. నీవెక్కడ ఏపరిస్థితులలో ఎంతవరకు మాట్లాడాలి. అని గ్రహించడానికి సునిశిత బుద్ధి కావాలి. మనిషి దాతగా ఉన్నంతమాత్రంతో దుబారాఖర్చు చేసేవాడుగా ఉండకూడదు. లెక్క ప్రకారం ఖర్చుపెట్టేమనిషి కటికిలోభిగానూ ఉండకూడదు. స్వతంత్రాభిప్రాయాలు కలవాడు పెంకెతనంగా ప్రవర్తించరాదు. ప్రతిపక్షితో సమాధానపడడ మనగా అతనికి లొంగిపోవడంకాదు. విధేయత ఎన్నడూ దాసత్వం కాజాలదు. ఆత్మగౌరవం దౌష్ట్యమనిపించుకోదు. తనకులోబడిన వానిపైన దౌర్జన్యంచేసే మనిషి సాధారణంగా తనకంటె పైవానికి బానిసగా ప్రవర్తిస్తాడు. నూరురూపాయిల రైలుటికెట్టు కొన్నమనిషి, భోజనానికి అర్థరూపాయి వెచ్చించడానికి గానీ, కూలీకి పావలా ఈయడానికిగానీ లోభిస్తాడు. కాబట్టి మనిషి జీవిత మనేక విచిత్ర విరుద్ధ మార్గాల నడుస్తూంటుంది. వీటిని సమన్వయం చేసుకోవడమే జీవితలక్షణం.

గాంధీ పూర్ణపురుషుడు

ఒక ప్రత్యేకశక్తి అభివృద్ధి పొందినప్పుడు తక్కినశక్తులు తగ్గిపోవడం మన అందరి అనుభవంలోనూ ఉన్నది. ఈ విషయం శారీరకశాస్త్రంలో ఎక్కువగా ఋజువౌతూన్నది. కుంటివాని చేతికండలూ, తక్కినశరీరమూ లావుగాఉంటవి. ఒకచేయి లేకపోయినట్లయితే రెండోచేయి రెండింతలు

బలంగా ఉంటుంది. మనిషి తన వాక్కౌశలముతో బుద్ధినైపుణ్యమునూ, భావోద్రేకమును అభివృద్ధిపరచుకొన్న కొద్దీ, పాముకున్న శ్రవణశక్తీ, వేటకుక్కలకుగల పసిపట్టే శక్తీ, పక్షుల అవలోకనాశక్తీ అతనికి లేకుండా పోయినవి. అదేవిధంగా శారీరకంగా బాగా బలిసినమనిషికి బుద్ధిమాంద్యం ఉంటుంది. కృశీభూత శరీరంలో అత్యుదాత్తములైన ఆధ్యాత్మిక శక్తులు కనిపిస్తవి. గాంధీ శరీరాన్ని కఠిన నియమాలలో పెట్టుకొంటూన్నప్పటికీ దానిని నిరాహారంగా ఉండనీయదు. ఆయన బుద్ధి భావోద్రేకాలను నియమంతో ఉంచుతుంది. భావోద్రేకాలు బుద్ధిని సునిశితంగా చేస్తవి. ఈరెండింటి పరస్పర సంయోగ సంఘట్టనము ఆయన ఉచితజ్ఞత్వమునకూ పూర్ణత్వమునకూ తోడ్పడుతూన్నవి. ఇదీ గాంధీవ్యక్తిత్వంలోని గొప్పతనం. ఆయన నియమాలు కఠినములుగా ఉండేమాట నిజమే. కాని వాటిలో ప్రత్యపకారబుద్ధి యొంతమాత్రమూ ఉండదు. తప్పుచేసినవానిపైన ఆయనకు చాలా దయ. కాని దానిని చిన్నదిగా చేయడంకానీ, యేదోసాకుచెప్పి తోసివేయడం కానీ ఆయనకు పనికిరాదు. ఆయన ఔదార్యంగా ఉంటాడు; కాని లోబడడు. గట్టిగా ఉంటాడు; కాఠిన్యం వహించడు. ప్రపంచాన్ని జయించగల తన సంకల్పంతో స్వర్గాభిలాషి యగు తన ఆత్మను తేలికగా జోడించగల డాయన. ఆయన జీవిత విధానం సత్యబద్ధమై ఉంటుంది. తన సునిశిత సత్యం వలన తగిలిన గాయాలను శమింపచేయడానికి ఆయన శత్రుల

పైనను మిత్రులపైననూ కూడ అహింసా పాత్రనుండి అను రాగామృతధారలను జాలువారుస్తాడు. సత్యం కఠినంగానూ భయావహంగానూ ఉంటుంది. అహింస మృదువుగానూ ఆర్ద్రంగానూ ఉంటుంది. సత్యనిష్ఠ గలవాడు కదా అని ఆయనను క్రూరుడనుకోకూడదు; అహింసాపరుడుకదా అని అతిసౌమ్యుడనుకోనూకూడదు. ఈ రెండు గుణాల ఉచిత సమన్వయమే సత్యాగ్రహాన్ని ఆదర్శపూర్వక సిద్ధాంతంగా చేస్తూన్నది. మానవోదారభావమున్నూ, నిరంతర దైవచింతనమూన్నూ కలసి దాదాపు పూర్ణ పురుషు డనతగిన మొట్ట మొదటి సత్యాగ్రహి గాంధీ అయినాడు. దైవ మానుషగుణముల మిశ్రమమే గాంధీని ఇంతవానిగా చేసినది. బార్కరు అన్నట్లుగా "ఆయన భారతీయ తత్వశాస్త్ర సంప్రదాయముల యొక్కయు, పౌర, రాజకీయస్వాతంత్ర్యానుగుణములైన పాశ్చాత్య సంప్రదాయముల యొక్కయు మిశ్రమము."

గాంధీ ఇతరులను గౌరవించి ఆత్మగౌరవాన్ని ఆర్జించు కొన్నాడు. డాక్టరు బెసెంటు ఆయన కడకు వచ్చినప్పుడెల్ల ఆమె కెదురుపోయి తీసుకొనివచ్చేవాడు. ఈనాటి వరకూ ఆయన గోఖేల్ పేరును గురుభావంతోనే మన్నిస్తూంటారు. పండిత మదనమోహన మాలవ్యా ఆయనకు కులపతి. ఆయన సలహాను గాంధీ అమూల్యంగా భావిస్తాడు. ఆలీసోదరులంటే ఆయన కత్యంత గౌరవం. వారిపేరును తలపెట్టినప్పుడల్లా వలీ రసూలులకు చూపేటంత గౌరవం చూపిస్తాడు. పెద్దల

యెడ పూజ్యభావము, సమానులయెడ గౌరవము, చిన్న వాళ్ళ యెడల అనురాగమూ కలిగి ఉండడమే దాక్షిణ్యమని గ్రంథాలు చెబుతూన్నవి. జీవిత రమణీయతలను ఇంత శ్రద్ధగాను, పరిపూర్ణహృదయంతోనూ గమనించే మహోక ప్రజానాయకుణ్ని చూడజాలము.

ఆయన సిద్ధాంతంలో ఆయన కచంచలవిశ్వాసం. అందువలన తానోక యువకుడనని అనుకుంటాడు. ఆయన అత్యంత సన్నిహితానుయాయులలో కొందఱు, ఆయనలో వృద్ధత్వ చిహ్నములు కనిపిస్తూన్నవనీ, ఆయన అభిప్రాయాలేతప్ప యితర అభిప్రాయాలను ఆయన గమనించడం లేదనీ అన్న మాట అనాలోచితంగా అన్నమాట. నిజానికాయన చిరంజీవత్వమును కనుగొన్నాడు. తాను చేస్తూన్నపని విశ్వమానవాభ్యుదయంకోసమనీ, తన ఆదేశాలు ఆదర్శానికి మార్గములనీ ఆయనకు ధృఢ ప్రత్యయం. అదే ఆయన జీవితమును నిలబెట్టి కృషిని కొనసాగింప చేస్తూన్నది. గాంధీ జైభయేండ్ల భక్తి జీవితమును గడపికూడా భావికార్యక్రమాన్ని నిర్ణయిస్తూనే ఉన్నాడు. అది రేపే ఫలించవచ్చును. లేదా ఎంతో కాలానికిగాని ఫలించక పోవచ్చును. స్వాతంత్ర్యయాత్ర మొదటికంటె రానురాను సుకర మవుతుందని ఆయనవిశ్వాసం. సత్యాగ్రహికి మొట్టమొదట దూరం దూరంగా పోతూన్నట్లు కనిపించిన ఆదర్శం, రానురాను ఎదురుగా వస్తూన్నట్లు తోస్తుంది. అహింసా సిద్ధాంతంలో విశ్వాసమున్న సత్యాగ్రహికి ఆత్మవిశ్వాసమెప్పుడూ,

కొఱవడదు. హింసా వ్యాపారంలో నమ్మకమున్న మనిషి తన దౌర్బల్యాలు, తన సందేహాలు, తన చిక్కులు, తన చంచలత్వమూ ఈ అన్నీ ఇతరులకుకూడా ఉన్నట్లు భావిస్తాడు.

న్యూయార్కు 'కమ్యూనిటీ' చర్చికి సంబంధించిన జె. హెచ్. హోమ్స్ చెప్పినదానికంటె ఎక్కువ సుకరంగాను వివరంగాను, గాంధీనిగూర్చి మరొకరెవ్వరూ చెప్పజాలరు. ఆయన ఇరవై ఏండ్లకిందటనే అమెరికా ప్రజకూ ప్రపంచానికి కూడా 'గాంధీ లోకోత్తర పురుషుడని' ప్రకటించాడు. ఆయన ఇంకా యిలా అన్నాడు. 'ఆయన వినయసంపన్నుడు. సౌమ్యస్వభావుడు; దయార్ద్రహృదయుడు; ఆయనహాస్యం అమోఘం. ఆయన నిరాడంబర ప్రకృతి ఆకర్షవంతము. పరమ శాంతమూర్తి. ఆయనపద్ధతు లతిమార్దవములు; దృఢ సంకల్పమూ అచంచల ధైర్యమూ కలవాడాయన. ఆయన ఋజువర్తనము నిష్కల్మషం. ఆయన సత్యవ్రత మతికఠోరము. ఆయనకు పోగొట్టుకొనేది ఏమీలేదు. కనుక ఆయనను ఎదుర్కోవడం అత్యంత దుర్లభం. ఆయన అన్నీ త్యజించిన వాడు గనుక ఇతరులను ఏదైనా అడుగగలడు. భౌతికా లోచనలు, ప్రాపంచక సుఖదుఃఖాలూ, వాంఛలూ, యెన్నడో ఆయన జీవితంలోనుండి వైదొలగిపోయినవి. ఆయన సత్యప్రేమల మూర్తి. నామతం దైవసేవ-అనగా మానవసేవ అన్నాడు, గాంధీ. ఆయన సేవకు అర్థం పవిత్రత, ప్రేమ.'

ఆ రసిను (తెల్లవానిని) రైతు పరలోకలోకంనుంచి దిగివచ్చి నట్లుగా భావిస్తాడు; ఆయనను ప్రకృతిని జయించగల దైవశక్తులున్న వని తలుస్తాడు. ఆయనను చూచి భయభక్తులతో దాదాపు దాసుడు లాగున గజగజలాడుతూ వినయవిధేయతలుగలిగి ప్రవర్తిస్తాడు. తెల్ల వానిని చూచినప్పుడు గలిగే ఈ భయభ్రాంతిని పోగొట్టడమే గాంధీ తన సోదర దేశీయులకు ప్రసాదించిన పారితోషికమని అన్నమాట బహు సమంజసంగా ఉన్నది. ఆయన భారతీయులనికి ముఖ్యంగా భారతీయ రైతుకు, తెల్లవానియెదుట ధైర్యంగా నిలబడి అతని ఉత్తరువులు దేశాని కనర్థదాయకములని తోచినప్పుడు వాటిని లెక్క లేకుండా తృణీకరించడం బాగా నేర్పినాడు. భయం అంటువ్యాధ్యం నిర్భయత్వం కూడా అలాగే పాకుతుంది. గాంధి అభయమూర్తి. అంతేకాదు, తన నిర్భయత్వాన్ని ఇతరులకు వ్యాపింప చేయడంలో ఆయన శక్తి అద్భుతం. అన్యాయ్యంగావిధింపబడిన భూమిపన్నులను, జిల్లా ఉద్యోగస్థుల చర్యలను లెక్కపెట్టకుండా నిరాకరించగల శక్తి గలిగించాడాయన భారతదేశపు రైతుకు. భయాన్ని జయించడంలో ఆయన వ్యక్తిత్వమెంత ఆశ్చర్యంగా పనిచేసిందో ఇండియాను ఎరిగిఉన్న వారందరికీ బాగా బుజువయ్యే ఉంటుంది.

ఇంద్రియ నిగ్రహం గలవారికి సంపూర్ణ సమభావం కలుగుతుంది. వారి మనస్సు నిరాకులంగానూ ప్రసన్నంగానూ ఉంటుంది. వారికి ధైర్యోత్సాహాలూ, శౌర్యసాహసాలు ఉంటవి.

అగ్ని పర్వతంవంటి ప్రచండ శక్తితో తమ అభిప్రాయాలనూ, ఆదర్శాలనూ, సిద్ధాంతాలనూ, వారెంత దూరమైనా విజృంభింప చేయగలరు. వారి ఆత్మశక్తికి ప్రశాంత, ప్రచండ గుణములు ఉన్నవి. వారి ప్రేమ అనంతము. దానిని గూర్చి 'రూఫస్ యమ్. జోన్సు' వ్రాసిన మాట లివి. "ఆ ప్రేమ ప్రత్యుపకారమును కోరదు. దానికి పూజా గౌరవములతో పనిలేదు. సర్వతోముఖంగా వ్యాపించడమే దాని కోరిక తనను కావలెనన్నవారంటికీ అది శుభానందములను చేకూరుస్తుంది. కాబట్టి అది క్రోధ పాపములను, ద్వేషపోరాటములనూ, వెలుతురు చీకటిని ఎదుర్కొన్నట్లుగా ఎదుర్కొంటుంది. శత్రుని కోపము గానీ, మిత్రుని ద్రోహము గానీ, తదితర దోషములు గానీ, ఆ ప్రేమ భావము పెంపొంది ఇంకను ఎక్కువ శ్రేయోదాయకమై జయము పొందే టందుకే దోహదం చేస్తున్నవి." గాంధీ మన నౌకా మార్గదర్శకుడు. ఆయన చుక్కాని దగ్గర ఉన్నాడు. మన మాయన యాత్రికులము. వర్కింగు కమిటీ మెంబర్లు మన పడవను ముందుకు నడుపుతూన్న నావికులు. ప్రశాంతంగా లోపల కూర్చొని పడవ దిగమన్నప్పుడు దిగడమే యాత్రికులమైన మనము చేయవలసిన పని. మనము కంగారు పడి పడవను అటూ ఇటూ ఊగేటట్లు చేయకూడదు. ఎటువంటి భావోద్రేకాలు

కలగడానికి కారణమున్నప్పటికీ కదలకుండా మన స్థలాలలో నెమ్మదిగా ఉండాలి. లేకుంటే పడవ తలకిందులై అందఱమూ మునిగిపోతాము. చుట్టుపట్ల చాలా దూరంవరకూ లోతుగాను గట్టిగానూ వేళ్లుపాతుకోని జొంపాలూ, కొమ్మలూ, పూవులూ, కాయాలుకల పెద్ద చెట్టుమాను వంటివాడు గాంధీ. ఆయన నాయకత్వాన్ని, ఆయన అనుచరులు మహాబలిష్ఠంగా చేశారు. వర్కింగుకమిటీ సభ్యులు వేళ్లవంటివారు. అందులో కొన్ని మఱీ ముఖ్యమైన వేళ్లు. అవి మానుకు మఱింత ఎక్కువ స్థయిర్యాన్ని చేకూరుస్తూన్నవి. ప్రజాసామాన్యమూ కాంగ్రెసు ప్రతినిధులు, ప్రేక్షకులు, వోటర్లు, అనుచరులు, ప్రశంసకులు, ఆశ్రితులు, సభ్యులు —వీరంతా జొంపాలు, రెమ్మలూ కొమ్మలూ, చిగుళ్ళు, ఆకులూ, మొగ్గలూ, పూవులూ, పిందెలూ, కాయాలూను.

౨

గాంధీమతము ఎక్కడ ఉన్నది?

గాంధీమతమంటే ఏమిటి. అది ఎక్కడ ఉన్నది? మానవ జీవితంలో పైకి కనబడుతూన్న రూపాలలో అనగా దేశ భాషలలో ఎక్కడా లేదు. ఆశ్రమాలలో గానీ కాంగ్రెసు వేదికలలోగానీ లేదు. నదీ తీరములలోగానీ ప్రాచీన విపిన భూములలోగానీ లేదు. అది హృదయంలో ఇల్లు కట్టుకొన్నది. అది ఇరువైభాషలలో మాట్లాడుతుంది; కాని ఒక్కటేజిహ్వాతో మాట్లాడుతుంది. ఒకే గమ్యస్థానమును చేరడానికది ఒక వంద ఉపాయాలను సూచిస్తూంది; ఒకే ఆదర్శం కోసం సహస్ర

విధాల పనిచేస్తుంది. అది గ్రామాలలో నివసిస్తూన్నది--కాని ప్రాచీన నిర్మలత్వంతో కాదు——ఆధునిక సభ్యతా కళంకంతో.

పట్టణాలన్నీ వలసవచ్చిన పల్లెటూరిజనంతో నిండి ఉన్నవి. వారు తమ ఇళ్లనూ వాకిళ్లనూ విడిచిపెట్టుకొని రావడమే గాక ప్రాచీన జాతీయాభిమానాలను కూడా జారవిడిచుకొన్నారు. గ్రామవాసులు పట్టణవాసులైన పిమ్మట గ్రామాల యెడల వారి వైఖరి మారింది. వారి వేషభాషలూ, వారి వృత్తులూ, వారి అభిరుచులూ, వారి దృక్పథం, వారి సంఘనిర్మాణమూ, వారి ఆచారాలూ అన్నీ మారినయి. అయినప్పటికీ ఇంకా గ్రామాలలో భారతజాతీయత కనుపిస్తూనే ఉన్నది. దానిలోని ఉత్తమోత్తమ లక్షణాలను పునరుద్ధరించడమే గాంధీ సిద్ధాంతముయొక్క ప్రధానోద్దేశం. భారతదేశమిప్పటికీ అయిదు పాళ్లలో నాలుగుపాళ్లు, రచన నిర్మాణములలో గానీ ఆదర్శంలో గానీ గ్రామీణమని చెప్పవచ్చును. తరతరాలనుండీ భారతీయ సభ్యతా సంస్కార వాహినులు నిరంతరాయంగా ప్రవహిస్తూన్నవి. మధ్యలో అనేక ఉపనదులు కలసి వాటిని అత్యంత విశాలములుగా చేసినవి.

గాంధీ ఇరవయ్యోశతాబ్దంలో అవతరించిన లోకోత్తర పురుషుడు. ప్రపంచంలో న్యాయ్యస్వాతంత్ర్యములను, ప్రజాధర్మమానవత్వములను నిలబెట్టటానికి నల్భైయేళ్లు కృషి చేసిన మహానుభావుడు. ఒక పక్కను పరాధీన దేశముల మోక్షంకోసమూ మరొక వంక అల్పసంఖ్యాక జాతుల

రక్షణకోటకూడా పడరాసిపోట్లు పడ్డాడు. ఈ రోజున యూరోపు ఖండము అంతనూ ఒక్క కుటుంబముగా భావించు కొన్నట్లయితే అందు పేదచుట్టాలు చుట్టుకొనిఉన్న ఐశ్వర్యవంతులెందరో కనిపిస్తారు. కాని వారిని భాగ్యవంతులు బయటకు తోసివేస్తూన్నారు. అయితే ఇండియాకు సంబంధించినంత వరకు బ్రిటిషువారి యాజమాన్యము నుండి స్వాతంత్రతను సంపాదించవలెనని మాత్రమే గాంధీ ఉపదేశిస్తూన్నాడు.

అటువంటి ఉపదేశకుని నాయకత్వం కింద, కాంగ్రెసు సేవా ఆదర్శంతో రాజకీయాలను ప్రస్ఫుటం చేయడానికి ప్రయత్నించింది. ఉన్నతవర్గాలలో ఇంకనూ ఎక్కువ దేశాభిమానమూ, విశాల సంస్కృతీ ఉండవలెనని నచ్చచెప్పినది. గ్రామ నాయకత్వాన్ని స్థాపించడానికి కృషిచేసింది. విడిగా కాంగ్రెసాక నూతన మతాన్ని స్థాపించింది. —అది రాజకీయ మతము. మానవ సమస్య యేదీ కూడా మతమునకు దూరంగా ఉన్నదనడానికి వీలులేదు. అలా అనడం మతద్రోహం. మతమొక ప్రత్యేక సిద్ధాంతాన్ని గానీ ప్రత్యేక పూజావిధానాన్ని గానీ ఉపదేశించదు. అదిఉదారజీవితమునూ, త్యాగబుద్ధినీ, ఆత్మార్పణ చింతనూ ప్రభోధిస్తుంది, మేము రాజకీయ మతమని అన్నప్పుడు నేటి క్షుద్ర రాజకీయాలను పవిత్రంగానూ నేటి ప్రత్యేక రాజకీయాలను సమగ్రంగానూ, నేటి స్పర్థా రాజకీయాలను సహకార భూయిష్ఠములుగానూ చేయడమని అర్థం.

ఈ దృష్టీ, చిత్తవృత్తీ కల మేము భారతజాతీయతకు సత్యమూ ధర్మమూ పునాదులుగా ఉండాలని వాంఛించాము. మానవ జీవితంలో చాలా పర్యాయములు అసత్యం తేలికగానూ, తొందరగానూ విజయం పొందింది. కపట వృత్తమూ, ఆడంబరమూ, న్యాయధర్మములపైన తఱచుగా ఆధిక్యతను పొందినవి. ఇంతవరకూనూ, తర్క, చట్టములు జీవితాన్ని స్వాధీనపరచుకొన్నవి. కాని ఇటువంటి విజయాలు సంపూర్ణములూ కావు. శాశ్వతములూ కావు. పైపెచ్చు విజేతలకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టినవి. వెనుకటి ఐరోపా యుద్ధంలో గెలిచినవారికి, ఓడినవారిపైన శాశ్వతవిజయం కలుగలేదు. ఇండియాను జయించినా మనుకొనే ఇంగ్లీషువారికిగూడా నిరంతరానందం చేకూరలేదు. బ్రిటిష్ రాజకీయవేత్త లేర్పాటుచేసిన రౌండుటేబిలు సమావేశముల వలన, ఇండియా ఇంగ్లాండుకు శాశ్వతంగా మొగసాలయైపోలేదు. వారినిర్బంధవిధానములవలన ప్రజలలో నిరోధ శక్తులు విజృంభించి, శాసనోల్లంఘనోద్యమ రూపంలోనూ అంతకంటెనూ తీవ్రతరరూపంలోనూ ప్రజ్వలిస్తూన్నవి. మన అసహాయోద్యమం అపజయం పొందిన దనడం, వారికోరికను తెలియచేస్తూన్నదే కాని వివేకాన్ని తెలియ చేయడంలేదు. ప్రతి అపజయమూ విజయానికొక మెట్టు. అనేక అపజయాల అంతిమ పరిణామమే విజయం.

ఈ దృక్పథంతోనే మనము కాంగ్రెసు కార్యక్రమాన్నిగూర్చి ఆలోచించాలి. ఆ కార్యక్రమం రెండు

విధాలు. పోరాట విధానంలో మనము బ్రిటిష్ ప్రభుత్వం పైన సాగించిన దండయాత్రలను కాదనగల నాగరిక ప్రభుత్వం లేదు. త్రికరణ శుద్ధిగా అహింసావలంబకులమై పోరాటాన్ని సాగించాము. ఇండియాలో శాంతిరక్షణకు గాంధీ అగ్రగామి అని పేరు పొందాడు. ప్రభుత్వంవారాయన సత్యాగ్రహ సిద్ధాంతానికి అయిష్టతను వెల్లడించ వచ్చునుగాక; కాని ప్రజల అనురాగములపైన సత్యాహింసలకున్న పలుకుబడిని యెవ్వరు నిరసించగలరు? రాజకుటుంబాలు నిర్మూలింపబడి చక్రవర్తిత్వాలు తలక్రిందులై ప్రజాప్రభుత్వాలు పాడయిపోతూన్న ఈ కాలంలో, పాతకాలంనాటి వివిధ రాజకీయ పక్షాలకూ స్థానంలేకుండాచేసి రాజకీయ ప్రతికక్షులను ఎన్నికలలో ఓడించడానికి బదులుగా కేవలం హత్యచేస్తూన్న ఈ రోజులలో, అహింసనుగూర్చి మాట్లాడడం హాస్యాస్పదంగా తోచవచ్చును. ఇటీవల మనకు కలిగిన అనుభవాలను బట్టి రక్తపాతంతో పొందిన విజయాలు రక్తపాతంతోనే రక్షింపబడుతూ ఇంకనూ ఎక్కువ రక్తపాతంతో నాశనమౌతవని అర్థమయింది. అంతేకాదు, రెండుజాతుల మధ్య వచ్చిన విభేదాలను పరిష్కరించడానికి దౌర్జన్యం తప్ప గత్యంతరం లేక పోయినప్పుడు, రెండు సంఘాలమధ్యగానీ చిట్టచివర కిరువురు వ్యక్తులమధ్యగానీ వచ్చిన తగాదాల విషయంలోకూడా, పశుబలమే అధిష్ఠాన దేవత కావచ్చునని తోస్తూన్నది. దీనిని మనము సకాలంలో గమనించ దగిన సదుపదేశముగా భావించాలి.

ఇక కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమం అతినిరాడంబరం. విదేశీ ప్రభుత్వాన్ని సేవిస్తూ, విదేశీభాషలోనే మాట్లాడుతూ, విదేశీ వస్త్రాలను ధరిస్తూ, పట్టణాలలోనూ నగరాలలోనూ నివసిస్తూన్న కృత్రిమ తార్కికుల కిది నచ్చకపోవచ్చును. పట్టణాలలో నివసించే వారిలో సగంమంది జీవనమూ, అభివృద్ధీ, కీర్తీ అన్నీకూడా విదేశీ ప్రభువుల దయాదాక్షిణ్యములపైన ఆధారపడి ఉన్నవి. పట్టణాల జనాభా లెక్కలను పరిశీలిస్తే ఈ సంగతి విశదమౌతుంది. కాని ఇటువంటి సంగతులను తొందరగా తెలుసుకోవడం కష్టం. ఎందువల్లనంటే మనపైన నిజముగా అధికారం చలాయిస్తూన్న దెవరో మనకే తెలియదు. పోలీసుజమాదా మొదలుకొని ఎక్సైజు ఇన్స్పెక్టరు, బ్యాంకు ఏజెంటు, ఇంగ్లీషు దర్జీవాడి వరకూ ఏదో ఒక విధంగా మనపైన యాజమాన్యం వహిస్తూనేఉన్నారు. పి. డబ్లియు.డి. లస్కరు, రెవిన్యూ కలెక్టరు, బెంచి మేజస్ట్రేటు, బిల్లు డిస్కౌంటరు- వీరంతా బ్రిటిష్ ఎంపైరు లిమిటెడుకు జీతమూ బత్తెమూ లేని యేజెంట్లే. ఇండియా ప్రభుత్వంవారు ఆకంపెనీకి స్థానిక డైరెక్టర్లు. రాష్ట్రీయ ప్రభుత్వాలన్నీ వారి సబ్ ఆఫీసులు. సైన్యము, పోలీసు తదితర ఉద్యోగులు, కోర్టులు, కౌన్సిళ్ళు కళాశాలలు, స్థానికసంస్థలు, బిరుదాంకితులు - అనే ఈయేడు ప్రాకారాలమధ్య బ్రిటిష్ ప్రభుత్వం సురక్షితంగా ఉన్నది. గ్రామాలలోని నూటికి 80 వంతుల జనసమూహమూ, రెవిన్యూ ఉద్యోగులంటే భయభక్తులతో ప్రవర్తిస్తూంటారు,

పట్టణాలలో ఉండేతక్కిన 20 వంతులూ మున్సిపాలిటీలు లోకల్ బోర్డులు, ఇన్‌కంటాక్సు ఆఫీసర్లు ఎక్సైజు పోలీసు ఉద్యోగుల భయంతో బ్రతుకుతూన్నారు.

కాబట్టి బలాన్నీ అధికారాన్నీ చూచి భయపడే స్వభావాన్ని పోగొట్టి దానికి బదులుగా నిజమైన అహింసా ప్రేమ నుండి ఉద్భవించిన ఆశాధైర్యాలను ప్రతిష్ఠించాలి. అందు కోసం కాంగ్రెసు వాదులకు ప్రజాసామాన్యంలో సన్నిహిత సంబంధం కలుగచేసే నిర్మాణకార్యక్రమ మేర్పాటు చేయ బడింది. కనుక మన ఖద్దరు పేదల కొక ఉపవృత్తినీ జీవనోపాధినీ కలిగించడమేకాక, వారి నావేశించి ఉన్న బానిసత్వమును పారద్రోలి, ఆత్మగౌరవమును పెంపొందించుకొనే టందుకుకూడా అవకాశాన్ని కల్పిస్తూన్నది. అంతేకాదు పనివాడు తన కుటుంబ మర్యాదకు భిన్నంలేని పద్ధతిని జాతీయ సభ్యతా చిహ్నమనదగిన తన వృత్తిని చేసుకొంటూ తన పనితనము వలన కలిగినఆనందాన్ని అనుభవించగలడు. ఎక్కువ వెలపెట్టి ఖద్దరును కొంటూన్నవారు జాతీయ పరిశ్రమకు ప్రభుత్వం చేయవలసిన ధనసహాయం చేయకపోవడం వలన, తమంతటతాము ఆర్థికంగా దానికి తోడ్పడుతూన్నట్లు భావించకోరుతూన్నాము. ఈ సందర్భంలో మేము ప్రబోధిస్తూన్న నిరాడంబర జీవితంద్వారా, ప్రజలలో ఉదారాశయాలూ, ఆత్మగౌరవ, స్వయంసంపూర్ణ స్వయం పోషక, స్వయంవర్ధక భావాలూ వ్యాపిస్తూన్నవి. ఖద్దరు ద్వారా ఆర్థికరంగంలో సాధించదలచుకొన్న ఫలితాలవంటి

ఫలితాలనే మద్య నిషేధంద్వారా నైతికరంగంలోనూ, అస్పృశ్యతా నివారణద్వారా సాంఘికరంగంలోనూ సాధించ వూనుకొన్నాము. ప్రజల మద్యనిషేధ ప్రచారమున కడ్డు తగిలే ప్రభుత్వంలో, ఏదో చెప్పడానికి వీలులేని చెడుగు ఉండి తీరాలి. దీనిని తెలుసుకోవడ మంతకష్టమైన పనికాదు. భారత దేశంలో ఉన్న రెండు ముఖ్యమతాలవారూ, హిందువులూ, మహమ్మదీయులూ కూడా మద్యపానం మంచిది కాదని నిషేధించేవారే. వారి మత సిద్ధాంతాలు తాగుడును ఒప్పుకోవు. ఈ సత్యాన్ని ఆధారం చేసుకొనియే దేశంలో మితపానోద్యమం నడుస్తూన్నది. కాని కాంగ్రెసు తీరా దీనిని జాతీయకార్యక్రమంలో భాగంగాచేసి పికెటింగు ప్రారంభించేసరికి, ప్రభుత్వం మందపైన తోడేలుపడ్డట్టు పడుతూన్నది. కాంగ్రెసు ప్రభుత్వాలు మద్యనిషేధమును ప్రవేశపెట్టినప్పుడు ముఖ్యంగా ఆయా కుటుంబాలలోని ఆడవాళ్ళే కాక ఆబాలగోపాలమూ సంతోషించారు. కాని కాంగ్రెసు మంత్రులు విరమించిననాటినుండీ, బొంబాయి, బీహారు, మద్రాసు రాష్ట్రాలలో 'ఎప్పటాటే కాటన్నా' అయింది.

అస్పృశ్యతా నివారణ విషయంలోకూడా ప్రభుత్వవైఖరి ఇలాగే బయటపడింది. హరిజనులను ప్రత్యేక నియోజక వర్గంలో చేర్చాలని బ్రిటిష్ ప్రధాని నిర్ణయించాడు. భారత దేశ మహానాయకుని 'ప్రాయోపవేశము' అవాంఛనీయ నిర్ణయమునుండిహిందూసంఘైకమత్యమును కాపాడగలిగింది. బ్రిటిష్‌ప్రధాని సమాఖ్యను మార్పుచేశాడు. కాని ఇంకనూ

అందులో కొంత విభజన లేకపోలేదు. హరిజనుల దేవాలయ ప్రవేశానికి గల అడ్డంకును తొలగించవలెనని మేము ప్రయత్నించినప్పుడు, అందుకు పరిసర ప్రదేశాలలోని ప్రజలు, తమ అంగీకారమును తెలిపి దేవాలయ ధర్మకర్తలను బలపఱచినప్పటికీ, ప్రభుత్వంవారు మధ్యలో జోక్యం కలిగించుకొని, ప్రతిబంధకంకాని ఆ సంఘసంస్కార శాసనము మొగ్గలోనే తుంచివైచినారు.

'విభజించి పరిపాలించు' అనే మానసికప్రవృత్తితోనూ 'పరిపాలించి విభజించు' అనే రాజనీతితోనూ వ్యవహరిస్తూన్న బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం ఇండియాకు చాలా చిక్కు సమస్య. వారు గ్రామాలకు పోటీగా పట్టణాలను నగరాలను, ప్రజాసామాన్యమునకు ఎదురుగా ఉన్నత వర్గాలనూ ప్రోత్సాహపరుస్తూ, ఖద్దరుకు సాంఘిక సామరస్యమునకూ, నైతికాభివృద్ధికీ, ఈ అన్ని సామాన్య సంస్కరణములకూ అడ్డుతగులుతూన్నారు. దీనినిబట్టి ఆంగ్ల విద్యాసంపన్నుల వలనగాని, పారిశ్రామిక వర్తక ప్రముఖులవలన గాని, రాజ్యం సాధన అసంభవమని స్పష్టంగా తేలిపోయింది. కాబట్టి మన దృక్పథమును మార్చుకోవలసి వచ్చింది. గ్రామాలలోనున్న ప్రజాసామాన్యంలో జాతీయ చైతన్యమును పెంపొందించి, జాతికి బలం చేకూర్చవలసి వచ్చింది. పట్టి ఉపన్యాసములతోనూ, పత్రికావ్యాసముల తోనూ గ్రామస్థుల విశ్వాసమును చూరగొనజాలము. జన సామాన్యమునకు నిరంతరము సేవచేయడంవలననే వారికి

మనలో నమ్మకం కలుగుతుంది. ఒక్కసారి వారికి నమ్మకం కలిగిందంటే, దేశవిముక్తికి కాంగ్రెస్ ఏర్పాటుచేసిన కార్యక్రమమును అక్షరాలా అనుసరిస్తారు. కాని ఇంతమాత్రంతో స్వరాజ్యం చెట్టునుండి ముగ్గిన పండువలె చేతిలో ఊడి పడక పోవచ్చును. కాని మనంచేసిన ప్రజాసేవ స్వరాజ్యమునకు శంఖుస్థాపనయై మన సాంఘిక ఆర్థిక సంస్థలలో ఒక్కొక్క లోపం తొలగింపబడినప్పుడొక్కొక్క అంతస్థు మన స్వరాజ్య సౌధానికి పెరుగుతూంటుంది. ఈ పని ఒక్కసారిగా జరుగదన్నమాట నిజమే. కాని దీని ఫలితాలుమాత్రం నిశ్చయమైనవీ శాశ్వతమైనవి. ఇది గ్రహించి కాంగ్రెసు, గ్రామాలలోకి గాంధీ సందేశాన్ని తీసికొనిపోయి, మే మిది వరకు చెప్పిన గ్రామనాయకత్వాన్ని స్థాపించింది.

3

గాంధీ ప్రాచీన వస్తు శాస్త్రజ్ఞుడు

గాంధీ కేవలం ఋషీ, తత్వవేత్తా అనడానికిగానీ, ఆర్థిక శాస్త్ర విశారదుడు రాజకీయవేత్తా అనడానికిగానీ, లోక హితాభిలాషి, మానవసేవాపరతంత్రుడూ అనడానికిగానీ, వీలు లేదు. ఆయన చరిత్ర, భూ తత్వశాస్త్రం, ప్రాచీన వస్తు శాస్త్రం, ఇవన్నీ తెలుసుకొంటాను. తరతరాలనుండీ భూగర్భంలో, బంగారు, వెండి, వజ్రాలగనులవలె అణగిమణగి, చెక్కుచెదరకుండా ఉజ్వలంగా ఉన్న అమూల్య భారతీయ సంస్కృతీనిక్షేపములను తవ్వి పైకితీశాడాయన. గాంధీ కేవలం

చరిత్రపరిశోధకుడు మాత్రమే అనడానికివీలు లేదు. ఆయన ప్రాచీన చరిత్రను పునర్విమర్శ చేసి నూతన వ్యాఖ్యాన మిస్తూన్న ఆధునిక చరిత్ర విధాత. ఆయన సృజిస్తూన్న చరిత్ర - తేదీలతో, సంఘటనలతో, రాజులతో రాజవంశా లతో,యుద్ధాలతో,సంధులతో,సంబంధం లేని చరిత్ర - అవన్నీ ద్వేషాహింసల దుశ్చేష్టితములు. "ఆత్మబలముయొక్క లేక ప్రేమశక్తియొక్క ఒడిదుడుకులు లేని కార్యవిధానమున కడ్డుకలిగించిన విఘ్నపరంపరలను వివరంగా చూపే చరిత్ర" అది. మేము దానిని "శరీరమునకూ రాగద్వేషాలకూ సంబంధించిన చరిత్ర" అంటాము. భావోద్వేగములకు భోగ లాలసత్వముకూ లోనుగాక, సుశిక్షితచిత్తంతో ఆత్మనిగ్రహం కలిగి ఉండడమే, సభ్యతా, సంస్కృతీ అని చెప్పవచ్చును. వేద వేదాంగములు, శాస్త్రషడ్దర్శనములు, ఇతిహాసపురాణ ములు, యోగపురుషులగాథలు, మహర్షుల కథలు, మతప్రవ క్తల తత్వవేత్తల, మహావీరుల స్వధర్మార్థత్యక్తజీవనుల చరి త్రయే, అత్యుదార భారత చరితము. ఈ జాతీయ జీవన నిష్క ళంక తత్వ ప్రబోధకులలో గాంధీ ఉత్తమోత్తముడు. అతి నవీ నుడు. గాంధీ యెంత పరిపూర్ణుడో ఆయన ఉపదేశా లంత ఉదాత్తములు. అయినప్పటికీ తానొక సామాన్య మానవుడని గాంధీఅభిప్రాయం.ఆయన తన సమానులలో ప్రథముడు. కాని క్రియారూపమైన సత్య మనదగిన యుగయుగాలనాటి సంస్కార మాయనకు లభించింది. దానిని సత్యాహింసల తత్వాన్వేషణకు మార్గదర్శకంగా ఉపయోగించుకొంటూన్నాడు. కనుక నే

"గాంధీజ మనే కొత్త మతాన్ని ఆచరణలోకి తెచ్చాడని" ఎడ్వర్డు థాంప్సన్ ఆయనను గూర్చి అన్నాడు. ప్రపంచ మహాపురుషులు కొందరాయన సహచరత్వమును కోరినవారు న్నారు. గాంధీ రెండవ రౌండు టేబిలు మహాసభకు ఇంగ్లాడుకు పోయినప్పుడు ఆహ్వానింపబడి అనేక పాఠశాలలను, విద్యాలయాలను, సెటిల్ మెంట్లను, ఫ్యాక్టరీ సెంటరులను, క్రైస్తవ దేవాలయాలను ధర్మసంస్థలనూ దర్శించాడు. డాక్టర్ మేరియా మోంటెస్సోరీ పాఠశాలలోని పిల్లలు ఆయనను ఆహ్వానించి గౌరవించారు. అనేకమంది పెద్దకుటుంబాలలోని స్త్రీలు చలిగా ఉన్నప్పటికీ ఆయన ఉదయ ప్రార్థనలలో పాల్గొన్నారు. లండను తూర్పుకొనలో ఉన్న ఆయనబసకు కింగ్లీ హాలుకు, తండోపతండాలుగా ప్రేక్షకులు వచ్చేవారు. శాంకీ ప్రభువు తనఎడమప్రక్కను ఆయనకు మొదటి స్థానమిచ్చి, అత్యంత గౌరవంతో చూచాడు. 'గాంధీ విశేషంగా అంతర్వాణి ఆదేశానుసారంగా నడుచుకొంటూన్నట్లు తోస్తుంది' అన్నాడాయన. గిల్బర్టుముర్రే, సర్ మైకేల్ శాడ్లర్, పి సి. లయోన్ వంటి విద్వాంసులాయనను మూడు గంటలసేపు తర్కించారు. ఆయనమాత్రం నిరాకులంగానే ఉన్నాడు, రోములలో, ఇటలీరాజు కనిష్ఠకుమార్తె ఆయనను ప్రత్యేకంగా సందర్శించింది. 'నాజీవిత తత్వంలోను, నాజీవిత విధానంలోనూగూడా గాంధీ ప్రభావం చాలా ఉన్నది.' అన్నాడు హావర్ఫోర్డు కళాశాలాంధ్యాపకుడు డాక్టరు రూఫస్ యమ్. జోన్సు (పెన్సిల్వేనియా). ఇంగ్లాండురాజు, గాంధీని

ఆయన మామూలు దుస్తులతోనే ఆహ్వానించి సత్కరించాడు. సీమలోని పేదలు ఆయన చుట్టూ మూగారు. లంకాషైరు లోని నూలువడికేవారు, బట్టలు నేసేవారు, కూలికూడి తమవస్త్రాలను ఇండియాలో కొనిపించవలసిందని కోరారు. ఎవరికి తగినట్లుగా వారికాయన ప్రత్యుత్తరమిచ్చాడు. బకింగ్ హాం మందిరంలో, ఆయన ఆస్థాన మర్యాదలను మన్నించి రాజుగారితో ప్రతివాదం చేయలేదు. మాంచెస్టరులో పనిలేక బాధపడుతున్న వారితో మంచిమాటలాడాడు. "సోక్రటీస్ తరువాత ఇంత ఆత్మనిగ్రహం కలిగిన మనిషిని ప్రపంచం చూడలేదు" అని ఎడ్వర్డుథాంప్సన్ అన్నమాటలో ఎంత సత్యమున్నది!

గాంధీకిమతం ప్రధానమని మేమిదివరకే అనేక సార్లు చెప్పిఉన్నాము. అయితే ఆయన మతము ఇతర మతాలన్నిటినీ సమానంగా మన్నిస్తుంది. అహింస సత్యముయొక్క ఆత్మ అనీ, అది ఉత్తమోత్తమమైన మతమనీ, గాంధీ అనేక సార్లు ఉపదేశించాడు. ఈ దిగువ వాక్యాలలో ఆయన ధర్మోపదేశం సంక్షేపించబడింది.

"నీవు నీ ప్రేమను అనగా అహింసను నీ శత్రువనుకొన్న వానిపైన మాసిపోనంతగా ప్రసరింప చేసినట్లయితే, అతడు మరల అటువంటి ప్రేమను నీ పైన చూపించి తీరుతాడు." ఇటువంటి మత విశ్వాసం గల గాంధీని గూర్చి ల్యూయిలిన్ పోదిస్ 'అవమానించినా, ప్రహరించినా, బెదిరించినా, గుద్దినా చిట్టచివరకు దర్బాన్ తెల్లమూక ఆయనను దాదాపు ప్రాణావశిష్టుణ్ని గా చేసినా, ఆయన ఆగ్రహ పడలేదు' అని

వ్రాశాడు. అంత చిన్న శరీరంలో అంత పెద్ద ఆత్మ ఉన్నందుకు నిజంగా ప్రపంచం ఆశ్చర్యపడక తీరదు. గాంధీని అనేకమంది పాశ్చాత్య మతోపదేశకులు పూజిస్తారు. మిస్. మాడేరాయిడెన్ "నేడు ఉత్తమోత్తముడైన క్రైస్తవుడొక హిందువు" అన్నది ఆయననుగూర్చి. "ఒకే ఒక క్రైస్తవుండేవాడు. ఆయన సిలువమీద మరణించాడు." అన్న నీషే (Neitzche) వాక్యానికి అసమ్మతి తెలుపుతూ, స్విట్జర్లాండు దేశీయుడు ల్యూయిలిన్ పోవిస్,(Llewylyn powys) నీషే ఇంతవరకూ జీవించి ఉన్నట్లయితే, "పూర్వమొకే ఒక క్రైస్తవుడున్నాడు ఆయన సిలువమీద మరణించాడు. ఇప్పుడూ ఒకే ఒక క్రైస్తవుడున్నాడు. ఆయన సేవ గ్రామంలో జీవించియే ఉన్నాడు." అని వ్రాసి ఉండేవాడన్నాడు.

క్రైస్తు మరణించిన 1900 సంవత్సరాలకు క్రైస్తవ నాయకులలోని పలుతావులనుండి వార్ధాకు యాత్రికులుగా వచ్చి గాంధీకడ జ్ఞానోపదేశం పొందకోరడం కంటె అద్భుత దృశ్యమే మున్నది? అంతర్జాతీయ యుద్ధాలలో చిక్కుకొన్న క్రైస్తవ జాతులకు, క్రీస్తు ఉపదేశాన్ని ఎలా వర్తింపచేయువలెనో, ఆయన దగ్గరనుండి తెలుసుకోగోరుతున్నారువారు. "క్రైస్తవుడనయిన నేను అంతర్జాతీయ శాంతికి ఎలా తోడ్పడగలను? శాంతి స్థాపనకు అహింస ఏవిధంగా ఫలప్రదం కాగలదు?" అని ప్రశ్నిస్తే "మీరు క్రైస్తవులుగా అహింస జయప్రదం కావడానికి ఎంతో పని చేయవచ్చును.

అయితే మీరు మీ సర్వస్వమూ వదులుకోవడానికి సంసిద్ధంగా ఉండాలి. పెద్ద రాజ్యాలు ఆయుధ విసర్జనం చేస్తేనే గాని శాంతి లేదు ప్రపంచానికి. ఇటీవల సంఘటనలనుచూస్తే పెద్ద రాజ్యాలవారా పని చేయకతప్పదన్నట్లు కనిపిస్తూన్నది.'' ''అహింసను యాభై సంవత్సరాలు ఎడతెగకుండా ఆచరణలో పెట్టిన నాకు, అహింస వలననే మానవలోకమునకు రక్షణ ఉందనే విషయం, మరింత ఎక్కువ ప్రకాశవంతంగా ప్రత్యక్షమౌతూన్నది నేడు. బైబిలులోని సారాంశమదేగదా! అధమం బైబిలునుండి నేనర్థం చేసుకొన్నదది.'' అని ప్రత్యుత్తరమిచ్చాడు గాంధీ. గాంధీ నల్లవాడు కావడం చేత ఆయనను అనుమానించి ఒకనూరు మూలస్టేషనులో రైలునుండి దింపివేసినప్పుడు చలిలో బాధపడుతూ, తెల్లవాళ్ళకింద ఉన్న క్రైస్తవ దేశంలో తనకు జరిగిన ఈ అపచారాన్నిగూర్చి తీవ్రంగా ఆలోచించినందువలన సత్యాగ్రహం ఆయనకు స్ఫురించింది.'' ఆయన మొట్ట మొదట ఈ సిద్ధాంతాన్ని తన భార్య పెంకెతనమును మాన్పడానికి ప్రయోగించి చూచాడు. తరువాత స్థానిక కష్టాలకు నివారణోపాయంగా చాంపరాణ్, బోర్సాదు, కైరాలలో దానిని ఉపయోగించాడు. అహమ్మదాబాదు మిల్లుకూలీల కోరికలను మన్నింప చేయడానికి ప్రాయోపవేశం ప్రారంభించినప్పుడది ఆయన చేతులలో రాటు తేలింది. పిదప జాతీయ సమస్యల విషయంలో క్రమక్రమంగా దేశముయొక్క చిట్టచివరి పొలిమేరలకుకూడా దాని ప్రయోగాలను విస్తరింప చేశాడు.

ఈ అన్ని సందర్భాలలోనూ ఆయన కొంత విజయం పొందు తూనే ఉన్నాడు. కాని ప్రపంచం మాత్రం ఈ సిద్ధాంతాన్ని ఒక రాజకీయ నినాదమనిగానీ, ధర్మ ప్రవచనమనిగానీ గూఢార్థ భాషణమనిగానీ మతవ్యామోహామనిగానీ అనుకోక శాస్త్రీయ శిల్పంగా భావిస్తూన్నది. అయన చికాగోకో లండనుకో దయచేసినట్లయితే, ఆయన పాదాలకడ క్రైస్తు ఆ దేశాలను గ్రహించ కోరుతూన్నాడనడంకంటె క్రైస్తవ పీఠాధిపతులుగానీ క్రైస్తవ మతోపాసకులుగానీ ఆయనను ఎక్కువగా ప్రశంసింప గలిగిన దేమున్నది? ఆయనకు మానవదృష్టికి గోచరంగాని ఒకానొక మహోన్నత శక్తిలో అచంచల విశ్వాసమున్నది. అందువలన పేదరికమును బుద్ధి పూర్వకంగా స్వీకరించి, అనంతమైన ప్రేమతో నిరంతర మానవసేవ చేయగలుగుతూన్నాడు. కనుకనే ప్రపంచ గురు పీఠ మాయనకు లభించినది. గాంధీ భూమండలానికి అధిపతి అయినాడు - కేవలం ఆయన వినయసంపన్నత వలన అయి నాడు. ఆయనకు ప్రాపంచకాధికారమేమీ లేదు. కాని అధి కారంగల వానివలె ఆదేశిస్తాడు. లక్షలాది ప్రజలాయన అడుగుజాడల ననుసరించడంవలన ఆయనకంత అధికారమూ ఉన్నట్లే. గాంధీ యెన్నడు ప్రతిష్ఠకు లొంగిపోలేదు. 1919లో సత్యాగ్రహాన్ని ప్రారంభించడంలో హిమాలయ పర్వత మంత ప్రమాదం చేశానని అంగీకరించాడు. తన రాజకోట ప్రాయోపవేశం హింసాకళంకితమైనదని ఒప్పుకొన్నాడు. తన లోపాలను ఒప్పుకోవడమే కాకుండా తన అనుచరుల తప్పు

లను బయటపెట్టడంలోకూడా ఆయన ఎన్నడూ సందేహించ లేదు. మన దేశములో అప్పుడప్పుడు జరిగే కొట్లాటలను దౌర్జన్యాలను ఎప్పటికప్పుడాయన విమర్శిస్తూ ఖండిస్తూనే ఉన్నాడు. జలియన్‌వాలాబాగు దురంతములకు కారణ మైన అమృతసరపు మూకల అరాచకత్వము, 1922 ఫిబ్రవరిలో చౌరీచౌరాలో ఒక సబిన్స్పెక్టరూ 21 మంది పోలీసుజవానులతో సహా పోలీసుస్టేషను తగులబెట్ట బడిన ఘోరకృత్యము, కోహాట్, ముల్తాన్, సహరన్‌పూరు, కాశీ, కాన్పూరు, కలకత్తా, ఢిల్లీ, బెంగుళూరు, గుల్బర్గా, సికందరాబాదు, అల్లహాబాదు, బొంబాయి మొదలయిన అనేక ప్రదేశాలలోనూ, ఇటీవల బన్ను, సుక్కూరు పట్టణ ములలోనూ జరిగిన హిందూ మహమ్మదీయ కొట్లాటలు, ఈ అన్నీ ఆయన అసందిగ్ధ విమర్శనలకు గుఱియైనవి. 1919 లో అమృతసరం కాంగ్రెసువిషయ నిర్ధారణసభ, మూకల దౌర్జన్యాన్ని నిరసిస్తూ తీర్మానించడాని కంగీకరించలేదు. అప్పుడా తీర్మానంచేస్తేనేగాని తాను కాంగ్రెసులో ఉండ నన్నాడు గాంధీ. అందువలన ఆవిషయ నిర్ధారణసభ తననిర్ణ యాన్ని మార్చుకోక తప్పిందికాదు. ఆలీ సోదరులు, 1921 లో హింసాహింసలకు మధ్యస్థంగా ఉండే ఉపన్యాసం చేసి నప్పుడు, వారికి హింసా ఉద్దేశంలేదని ప్రకటన చేయు మన్నాడు గాంధీ. ఆయన ఎన్నడూ శత్రువుల కష్టాలవలన ప్రయోజనం పొందవలెనని ఆలోచించడు. అంతేకాదు. తన అనుచరులలోని లోపాలను ప్రకటించిన యెడల శత్రు

వుకు లోకువ అవుతామని కూడా ఆలోచించము. 1934 ఎప్రిల్ 7 వ తేదీని శాసనోల్లంఘనమును ఆపి వేస్తూ ఆయన చెప్పినమాటలు చూడండి:-

ప్రజాసామాన్యం సత్యాగ్రహ సందేశాన్ని సరిగా అర్థం చేసుకో లేదని నా అభిప్రాయం. దీనికి కారణం వారికది చేరడంలోనే కొంత కల్తీ తో చేరింది. అధార్మిక మార్గాలద్వారా ధార్మిక సాధనాల ఉపయోగము బోధింపబడినప్పుడు వాటిశక్తి తగ్గిపోతుంది. కాబట్టి ధార్మిక సందేశాలు వాటంతటవే వ్యాపించాలి.'

గాంధీ తన అనుచరుల పొగడ్తలనేగాక తన విమర్శకుల స్తోత్రములను, ఆమోదములనూ కూడా పొందగలగడం చాలా అదృష్టం. ఆయనను శ్లాఘించినవారిలో యోగిపుంగవులు, తత్త్వవేత్తలు, మతాధిపతులు ఇంకా ఎందరెందరో ఉన్నారు. అయితే ఆయనతో పాటు పోరాటంలో దుమికిన అనుచర వర్గమున్నూ, నిష్పాక్షిక సాక్షీభూతులుగా ఉన్న వారున్నూ ఆయనపైన ప్రశంసావాక్యాలను గుప్పించడ మొక ఎత్తు. ఇండియా ప్రభుత్వం బహిరంగంగా ఆయన గొప్పతనాన్ని శ్లాఘిస్తూ ప్రభుత్వ పత్రాలలో ప్రకటించడం మరొక యెత్తు.

ఇండియా గవర్నమెంటువారు ప్రకటించిన 1919 "ఇండియా" లోని ఈదిగువ వాక్యాలను పరిశీలించండి:-

గాంధీజీ ఉన్నతా దర్శములూ, సంపూర్ణస్వార్థ త్యాగబుద్ధిగల టాల్స్టాయి వర్గములోని వాడని ప్రతీతి. ఆయన దక్షిణ ఆఫ్రికాలో భారతీయుల పక్షాన నిలబడ్డనాటినుండి, సర్వసంగ పరిత్యాగిగా

ప్రసిద్ధి వహించిన మహర్షి యెడల, ప్రాచ్య దేశీయులు సంప్రదాయ సిద్ధంగా చూపే యావత్తు గౌరవమూ హిందూ దేశస్థు లాయన యెడల చూపుతూనే ఉన్నారు. ఈయన విషయంలో మరొక విశేషం కూడా ఉన్నది. ఈయనను శ్లాఘించేవారిలో ఏ ఒక్క ప్రత్యేక మతమునకు చెందినవారు ఈయనమాత్రమే కాక వివిధ మతస్థు లున్నారు. ఈయన అహమ్మదాబాదులో అడుగు పెట్టినది మొదలు అనేక సాంఘిక సమస్యలతో సన్నిహిత, సంబంధం కలిగి పనిచేస్తూ న్నారు. ఒకవ్యక్తిగాని ఒక వర్గంగానీ పీడింప బడుతూన్నట్లు తోచినప్పుడు, ఆయన కత్తి దూయక మానడు. అందువలననే భారత దేశంలోని ప్రజాసామాన్యానికి ఆయన అంటే అంత ప్రేమ. బొంబాయి రాజధానిలోని పటణస్థులలో గాని గ్రామస్థులలోగాని ఆయనపలుకుబడి అప్రతిహతం. ఆయనను అక్కడ దైవంగా కొలుస్తారని చెబితే ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు. భౌతికశక్తి కంటె ఆత్మశక్తి బలవత్తరమైనదని ఆయన విశ్వాసం. ఆ విశ్వాసంతోనే, తాను దక్షిణ ఆఫ్రికాలో జయప్రదంగా ప్రయోగించిన సాత్విక నిరోధమును, రౌలట్టు శాసనానికి వ్యతిరేకంగా ప్రయోగించడం ధర్మమని ఆయన అభిప్రాయ పడ్డాడు. రౌలట్టు చట్టం అంగీకరింప బడినట్లయితే తాను సత్యాగ్రహం ప్రారంభించబోతూన్నానని ఫిబ్రవరి 24 వ తేదీని ఆయన ప్రకటించాడు గాంధీజీ భౌతిక బలప్రయోగమును స్పష్టంగా ఖండించాడు. సివిల్ చట్టాలను శాంతంగా ఉల్లంఘింపజేసి, ప్రభుత్వాన్ని రౌలట్టుశాసనమును రద్దు చేసే టట్టుగా నిర్బంధించ వలెనని ఆయన విశ్వాసము. మార్చి 18 వ తేదీని రౌలట్టు శాసనమునుగూర్చి ఆయన ఈ క్రింది ప్రమాణ పత్రమును ప్రకటించాడు. 1919 ఒకటో నెంబరు ఇండియన్ క్రిమినల్ లా అమెండు మెంటు బిల్లున్నూ 1919 రెండో నెంబరు క్రిమినల్ లా ఎమెర్జెన్సీ పవర్సు బిల్లున్నూ - అధార్మికములు

> న్యాయ్యా, స్వాతంత్ర్య సిద్ధాంత విరుద్ధములు, సాధారణ వ్యక్తి స్వాతంత్ర్య వినాశన కరములు. కాబట్టి అవి యావద్భారత దేశ క్షేమమునకూ ప్రభుత్వ క్షేమమునకూ కూడాభయంకరములు. ఇది మాదృఢ విశ్వాసం. రెండు బిల్లులూ శాసనం చేయబడినట్లయితే, అవి రద్దయ్యే అంతవరకూ శాసనములనూ, ముందు నియోగింపబడే కమిటీ వారిని ఉచితమని తోచిన ఇతరత్ర శాసనములనూ శాంతంగా ఉల్లఘించగలమనీ, పోరాటంలో సత్యాన్ని అక్షరాలా అనుసరిస్తూ, ప్రాణానికీ దేహానికీ ఆస్తికీ యేవిధమైన హాని కలిగించమనీకూడా ఇందు మూలంగా ప్రమాణం చేస్తూన్నాము.

గాంధీ ఎల్లప్పుడూ మన పురాణాలలో వర్ణించబడిన ధర్మయుద్ధమే చేశాడు. కనుక ఆయనను శత్రువులు ఆక్షేపించక పోవడంలో ఆశ్చర్యమేమున్నది? కాని మిత్రులాయనను అనేకవిధాల ఆక్షేపించారు. అందువల్లనే గిల్బర్టు ముర్రే "అంతజన సమూహంపైన నిరాయుధుడైన ఒక మనిషికి అటువంటి ఆధ్యాత్మికాధికారం ఉండడమే ఆశ్చర్యం. అందులో హింసను త్యజించడం పైగా శత్రువులకు కష్టకాలంలో సహాయం చేయడం, మానవమాత్రుడుగా తాను చేసిన తప్పును ఒప్పుకోవడం, ఇవన్నీ తెలిసిన ప్రపంచం ఆయనను స్తుతించక తీరదు"

గాంధీ విజయం కొలబద్దతో కొలవదగినదికాదు. సత్యాగ్రహంలో జయాపజయములు సంబంధవాచకములు. గీతాశాస్త్రప్రకారమవి గణింపదగినవే కావు. విజయం యావత్తూ కాలంపైన ఆధారపడి ఉంటుంది. మన ఉద్యమం మంచిదనే

విశ్వాస ముండడమే మనకు ముఖ్యం. అటువంటి విశ్వాసంతోనే ఆయన అన్నిపోరాటాలలోనూ అగ్రగామియైనాడు. రాజీపక్షంలో ఆయన మధ్యస్థుడుగా ఉంటాడు. "జాతి యావత్తూ ఒకే అభిప్రాయాన్ని అనుసరించవలెనంటే ఒక్కసారిగా జరుగదు. క్రమక్రమంగా జరగాలి. ప్రాచీనకాలంలో ఒక చోటినుండి మఱొక చోటికి కదలిపోతూ ఉండే కొండ గుంపుల గమనంవలె ఉంటుంది జాతినడక. సంసారపు చిక్కులు, సామానులు ఎన్నో ఉంటవి. అనుకోని కొత్త యిబ్బందు లనేకం రావచ్చు. ఒకప్పుడసలు ప్రయాణమే ఆగిపోవచ్చు. లేదా మొట్టమొదట ఉద్దేశించిన తోవనుగాక మఱొక తోవకు పోవలసి రావచ్చు. ఏదైనా అభ్యంతరం కలగడంవలన గానీ లేదా తాత్కాలిక సౌకర్యము నపేక్షించిగానీ, అనుకొన్న గమ్యస్థానానికి చాలా యివతలనే నిలచిపోవచ్చు. నడిపేవాళ్ళు లేకనో, ఐక్య సంకల్పం లేకపోవడం వలననో అసలు గుంపే చీలిపోవచ్చు. కాని అనుభవమునుబట్టి చూస్తే నడిపేనాయకుడు మాత్రం ప్రతి ఉద్యమంలోనూ, చివరగానీ మధ్యగానీ ఉండవలెగాని మొగను ఉండకూడదని గ్రహించాలి. మధ్యస్థంగా ఉండగలిగిన వాని నాయకత్వమే శాశ్వతంగా ఉంటుంది." ఈ విషయాలను గాంధీ అహింసా పోరాటాలలో గమనించ లేదనడానికి ఆయన వాటన్నిటిలోనూ అగ్రగామిగా ఉండడమే సాక్ష్యం. కాని పోరాటాల అనంతరంవచ్చే రాజీలలో ఆయన దీనిని గమ-

వారు రెండింతల అదృష్టవంతులు. ఆయనతత్వ ప్రచారం చేసినవారి అదృష్టం చెప్పనే అక్కరలేదు గాంధీ మృతి పొందవచ్చును. గాంధీజం శాశ్వతంగా ఉంటుంది. కాదు, గాంధీజం మరణించవచ్చును. గాంధీ చిరంజీవి.

అనుబంధము ౧.

గోసంరక్షణ

మానవ పరిణామంలో గోసంరక్షణ అద్భుత లోకోత్తర విషయమని నా అభిప్రాయం. మానవుణ్ని అది తన జాతి భేదాన్ని అతిక్రమింప చేస్తుంది. ఆవు అంటే మానవలోకానికి దిగువనున్న యావత్తు ప్రపంచము అని నా అర్థం. ఆవు ద్వారా మానవుడు సర్వజీవైక్యభావమును పొందవలెనని ఆదేశింపబడినది. ఆవుకే ఎందువలన దైవత్వమాపాదింపబడినదో నాకు స్పష్టంగా అర్థమవుతూన్నది. భారత దేశంలో గోవు సాహచర్యం ఉత్తమోత్తమము. ఆమె ఐశ్వర్య ప్రదాత. అది పాలీయడమే కాదు వ్యవసాయానికి సావకాశం కల్పించింది. ఆవు కరుణాగీతం. ఆ సాధు జీవిలో కరుణ ముద్రితమై ఉంది. కోట్లకొలదీ భారత ప్రజలకది మాతృదేవి. గోసంరక్షణ అంటే దేవుడు సృజించిన నోరులేని యావత్తు జీవలోకాన్నీ సంరక్షించడమన్నమాట. ఆ ప్రాచీన ద్రష్ట యెవ్వడోగాని ఆయన లోకసంగ్రహావృత్తం ఆవుతో ప్రారంభమయింది. నోరులేని జంతువులను గూర్చి చేసిన ప్రబోధము మఱింత శక్తివంతంగా ఉంటుంది. గోసంరక్షణ, హిందూమతం ప్రపంచానికి కర్పించిన పారితోషికం. గోసంరక్షకు లున్నంత కాలమూ హిందూమతం సజీవంగా ఉంటుంది—

(యంగిండియా అక్టోబరు 6, 1921.

నేనిదివరకే పుటలలో వివరించినట్లుగా మానవ లోకానికి దిగువ మెట్టులోనున్న ప్రపంచంలో ఆవుకంటే పరమపవిత్రమైన జాతి మఱొకటి లేదు. ప్రాణులలో అగ్రస్థానమలంకరిస్తూన్న మానవుడు, తనకు దిగువ మెట్టులోనున్న యావత్తు జీవలోకము నెడలను న్యాయ్యంగా ప్రవర్తించవలెనని, ఆవు మన అందరినీ అడుగుతూన్నది. అది మనతో తన కళ్లతో మాట్లాడుతూన్నట్లు కనిపిస్తుంది. (పాఠకుడు వాటిని దృష్టితో చూడమని కోరిక) "మమ్ములను చంపి మా మాంసమును భుజించేటందుకు గానీ, మమ్ములను మఱొక విధంగా హింసించే టందుకుగానీ నీవేర్పాటు కాలేదు. మాకు మిత్రముగానూ రక్షకుడుగానూ ఉండాలి నీవు" అంటూన్నది చూడండి! (యంగిండియా జూన్ 26, 1924)

గోసంరక్షణకు కావలసిన నియమాలను ఇదివరకు నేను వ్రాసినవి యిక్కడ ఉదాహరిస్తూన్నాను.

1. అటువంటిసంస్థ ప్రతిదీ బహిరంగ ప్రదేశంలో ఉండాలి. కావలసినవి సమృద్ధిగా దొరకాలి — అనగా పశువులకు కావలసినంత పచ్చిక పెరిగేటందుకు, అవి కాలికొద్దీ తిరిగే టందుకూ వేలకొలదీ ఎకరాల భూమి ఉండాలి. ఈ గోశాలల పైన నాకు యాజమాన్యం ఉంటే, ఇప్పుడున్న భూములలో చాలా భాగం లాభానికమ్మివేసి, దగ్గరలోనే తగిన పొలాలు కొంటాను. మొదట చేర్చుకొనేటందుకు పనికివచ్చే కొన్ని చోట్లు మాత్రం అమ్మకుండా అలాగే ఉంచుతాను.

2. ప్రతి గోశాలా ఆదర్శ ప్రాయమైన (Dairy) క్షీరోత్పత్తిశాల గానూ తోళ్లు ఊనే పరిశ్రమాలయం గానూ ఉండాలి. చచ్చిపోయిన ప్రతి పశువు తలకాయను నిలవచేసి శాస్త్ర ప్రకారం ఉపయోగంలోకి తీసికొని రావాలి. తోలు, బొమికలు, పేగులు, అన్నీ కూడా ఉపయోగ పడేటట్టు చూడాలి. చచ్చిన పశువుల చర్మం నేను పవిత్రంగా భావించి ఉపయోగిస్తాను. కటికి వాళ్లు చంపిన పశువుల చర్మం మానవుల ఉపయోగమువరకు, అధమం హిందువుల ఉపయోగానికి పనికి రాదని నా భావం.

3. గోమయ గోమూత్రములను చాలా గోశాలలో పారవేస్తూన్నారు. ఇది క్షమించరాని తప్పిదం.

4. గోశాల లన్నీ శాస్త్రీయ పద్ధతుల ప్రకారం, నడపబడాలి.

5. జాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రతి గోశాలా స్వయంపోషకంగా ఉండడానికి వీలుంది. ప్రజల దగ్గరనుంచి తీసికొన్న చందాలను దానిఅభివృద్ధికి ఉపయోగించవచ్చును. ఈ సంస్థల నుండి లాభంతీసే ఉద్దేశం ఉండనే కూడదు. లాభాలుతో, అంగ వైకల్యం పొందిన పశువులను ఎత్తు పడిన పశువులను, కటికి దుకాణాలకు పోతూన్న పశువులనూ కొనడానికి ఉపయోగించాలి.

6. గోశాలలు, బఱ్ఱెలూ, మేకలూ వగైరాలను కూడా చేర్చుకొన ప్రారంభించినట్లయితే ఈ పని చాలా కష్టమవుతుంది. హిందూదేశంలో అందరూ శాకాహారులైతేనే గాని

గొఱ్ఱెలూ మేకలూ కటికివాని కత్తికి గురి కాకుండా ఉండవని నా అభిప్రాయం. ఇందుకు భిన్నంగా జరగడం నాకెంతో యిష్టం. గేదెపాలు తాగకుండా ఆవుపాలే త్రాగవలెననే నియమం పెట్టుకొంటే, గేదెలను రక్షించవచ్చును. కాని బొంబాయిలో ఎందువల్లనో ఆవుపాలకు బదులుగా బఱ్ఱెపాలు తాగడం అభ్యాసం. బఱ్ఱెపాలకంటే ఆవుపా లెక్కువ శ్రేష్ఠమని వైద్యులంతా ఏకగ్రీవంగా ఒప్పుకొంటూన్నారు. పాల విషయం బాగా తెలిసినవారు, జాగ్రత్తగా వ్యవహరిస్తే ఆవుపాలను ఇంకా శ్రేష్ఠంగా చేయవచ్చు నంటూన్నారు. ఆవులనూ గేదెలనూ కూడా కాపాడవచ్చునని నా అభిప్రాయం. బఱ్ఱెలు అభివృద్ధి కాకుండా ఆపివేసినట్లయితేనే ఆవు సంరక్షింపబడుతుంది. ఎక్కువ విస్తీర్ణమైన వ్యవసాయానికి బఱ్ఱెజాతి పనికి రాదు. ఈ జాతి ఇంకా అభివృద్ధి కాకుండా జాగ్రత్తపడితే ఉన్నంత వరకూ రక్షించ డానికి వీలవుతుంది. ఆవులనుగానీ, బఱ్ఱెలను గానీ అభివృద్ధి అయ్యేటట్టు చూడడం మతంలో భాగం కాదు. మన ఉపయోగం కోసం అవి అభివృద్ధి అయ్యేటట్లు చేస్తూన్నాము. బఱ్ఱెల సంఖ్య పెరిగేటట్లు చూడడం, ఆవులయెడలనూ బఱ్ఱెల యెడలనూ కూడా క్రూరంగా ప్రవర్తించడమే. హిందూగొల్లవాళ్ళు దున్నపోతులనుమేపడం గిట్టుబాటుకాదని చిన్నప్పుడే వాటిని క్రూరంగా చంపివేస్తారు.ఇది ఇప్పుడుకూడా జరుగుతూన్నది.జీవహితైషులీ సంగతి గమనించాలి. ఆవునూ దాని సంతానాన్ని కాపాడడమొక్కటే సాధ్యమైనపని. అందుకోసం హిందువులు, గో

వ్యాపారంపైన గానీ, గోక్షీరం వగైరా వ్యాపారంమీద గాని వచ్చే లాభాలను వదులుకోవాలి. అది చేయలేకపోతే ఈపని జరుగదు. మతం ఆచరణయోగ్యంగా ఉండవలెనంటే, లోకహిత కార్యముల అర్థశాస్త్రమునకు అనుగుణంగా ఉండాలి. అనగా ఆదాయవ్యయాలు రెండూ సరిపోవాలి. ఒక్క ఆవు విషయంలోనే అది సాధ్యమౌతుంది. అప్పుడు కూడా కొంతమంది పుణ్యాత్ములయిన హిందువుల ద్రవ్యసహాయం కొన్నేళ్ల వరకూ కోరక తప్పదు. గోమాంస భక్షక ప్రపంచాన్ని ఎదురుగా పెట్టుకొని మన మీ మహా పుణ్య కార్యాన్ని ప్రారంభించామనే మాట మఱచిపోగూడదు నేను పైన చెప్పిన పరిమితులను దాటిపోవడానికి ప్రపంచంలో అత్యధిక భాగం శాకాహారులైతేనే తప్ప సాధ్యం కాదు. ఇప్పుడు నేను చెప్పినంతవఱకైనా చేయగలగడం భావి సంతానానికి తరువాతి పనికి దారి చూపడం. ఈహద్దులను అతిక్రమించడం- బఱ్ఱెలు వగైరా జంతువులతో పాటు ఆవును కూడా కసాయివాని కత్తికి బలిచేయడం.

హిందువులున్నూ తదితర జీవ కారుణ్య సంఘాల వారున్నూ వివేకంగలవారైతే, ఈ గోసంరక్షణ నియమాలను మనస్సులో ఉంచుకొని వాటిని వెంటనే ఆచరణలోకి తీసికొని వస్తారు.

యంగిండియా (మార్చి 31, 1927)

కేవలం ఆవు అనే జంతువును రక్షించినంత మాత్రంతో మనిషి మోక్షం పొందుతాడని నేను నమ్మను. మోక్షంపొందవలెనంటే, రాగద్వేషాలనూ, క్రోధాసూయలనూ ఈ అన్ని

నీచ భావాలనూ పూర్తిగా త్యజించాలి. కాబట్టి మోక్షమును గోసంరక్షణతో ముడి పెట్టినప్పుడు గోసంరక్షణకు మనం మామూలుగా అనుకొనే అర్థంకంటె ఎక్కువ విస్తృతార్థమూ, ఎక్కువ సమగ్రార్థమూ ఉండితీరాలి. కనుక మనిషికి మోక్షమిప్పించ గోసంరక్షణలో సహజంగా స్పర్శజ్ఞానంగల ప్రతి ప్రాణి రక్షణా ఇమిడిఉండాలి.

అనుబంధం ౨

[దాదాపు ఒక అర్ధశతాబ్దంకిందట ఇరువురు ప్రాజ్ఞ పురుషులు వ్రాసిన ప్రమాణ వాక్యాల నీకింద ఉదాహరిస్తున్నాము]

౧

యంత్రము; భారత దేశంలోని హస్తకళా కౌశలము.

సర్ జార్జి బర్డు ఉడ్డు

ఇండియాలో ప్రతి పనికోసమూ యంత్రమును ప్రవేశ పెట్టడమంటే ముఖ్యంగా భయపడ వలసిన విషయం. కళను కాపాడవలెనని ఏమాత్రమైనా కోరిక ఉన్న మేము ఏవస్తువులు యంత్రముల మీద తయారు కావాలి, ఏవస్తువులను చేతితోనే చేయాలి అనే విషయాన్ని యూరపులో ఇప్పుడిప్పుడే గ్రహించడం ప్రారంభించాము.

కాని ఏదైనా కొన్ని ఆర్థిక కారణాలవల్ల హిందూదేశంలో అనూచానంగా చేతితో చేసే వస్తువులను నిర్మించడానికి క్రమంగా యంత్రములను ప్రవేశ పెట్టవలసి వచ్చిన యెడల పారిశ్రామిక విప్లవం రాక తప్పదు. దానిని వివేకమూ విజ్ఞానమూగల నాయకులు, ప్రజల లలితాభిరుచుల కనుగుణంగా నడిపించ లేకపోయినచో పరంపరాగతములైన దేశీయ శిల్పకళలు నిత్య జీవితంలో ఉపయోగపడక చిక్కులలో పడే మాట వాస్తవము. ఇంగ్లాండులోనూ, పశ్చిమోత్తరయూరోపు ఖండంలోనూ, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనూ

యిదే విధంగా అలంకారిక శిల్పకళలు మూడుతరాలనుండి కనిపించకుండా పోయినవి.

యంత్రప్రవేశమువలన సాంఘికంగానూ నైతికంగానూ కలిగే చెడుగులు, ఇండియాలో ఇంకా యెక్కువగా ఉండవచ్చును. మాంచెస్టరు మిల్లులయొక్కయు రాజధాని మిల్లుల యొక్కయూ పోటీకి ఆగలేక చేతిమగ్గపు నేతపని సన్నగిల్లుతూన్నప్పటికీ, ప్రస్తుతం దేశీయ పరిశ్రమలు భారత దేశమంతటా నడుస్తూనే ఉన్నవి. అంతేకాదు, ఇండియాలోని ప్రతిగ్రామంలోనూ తరతరాల నాటినుండీ వస్తూన్న చేతిపనులు జరుగుతూనే ఉన్నవి. గ్రామానికి వెలుపలి మిట్టపైన కూర్చొని, కుమ్మరి గిరగిరా తనసారె తిప్పుతూ, అతని సహజ హస్తకౌశలంతో రేగడ మట్టికి రూపకల్పనం చేస్తూ ఉంటాడు. వంకరగా ఉన్న పల్లపు వీధిలోని యిళ్లవెనుక చెట్లకింద వ్రేలుతూన్న రెండు మూడు మగ్గాలు, నీలం, ఊదా, పసిడిరంగుల పడుగుపైన, పువ్వులు రాలుతూండగా నేత సాగిస్తూ ఉంటవి.

వీధిలో కంచర బత్తులు, ఇత్తడి బిందెలు రాగి కాగులు అరివాణాలు. సిబ్బిరేకులూ తయారుచేస్తూఉంటారు. ఇంకా దిగువకు పోయి చూస్తే కలవారి ఇంటి వసారా కింద కంసాలి వెండి బంగారు నాణెములను కరిగించి, చెవిపోగులు, చంద్రవంకలు, కంకణాలు దండ కడియాలు, ముక్కరలూ, రక్షరేకులూ, అందెలు,కడియాలూ, కాలిమువ్వలు చేస్తూఉంటాడు. అతడుతనకు కావలసిన నమూనాలను, తన చుట్టూఉన్న పూవులనూ కాయలనూ చూచి అనుకరిస్తాడు. ఒక్కొక్కప్పుడు వీధి

కొసనుఉన్న తామర చెఱువు గట్టుమీంది మామిడితోపులో కొబ్బరి చెట్లమధ్య దేవుడి గుడిపైన చెక్కబడిన శిలా ప్రతిమల నగలను అనుకరిస్తూఉంటాడు.

సాయంకాలము మూడున్నర, నాలుగు గంటలమధ్య, ఒక్కొక్కరు రెండు మూడు కడవలు నెత్తినిపెట్టుకొని, చెఱువుకు నీళ్లకోసంపోయేస్త్రీల చీరలరంగులతో వీధివీధి అంతా వెలిగి పోతూంటుంది. వాళ్లు ఒక్కటేవరుసలో వచ్చి పోయే దృశ్యం సీతాకోక చిలుకలూ మెరుగుడు పువ్వులూ బారులు తీర్చి పోతూన్నట్లు కనిపిస్తుంది.

పొద్దుకూకేసరికి పశువుల కాపరు లావులను ఇంటికి తోలుకొని వస్తూంటే పచ్చికబయళ్లు చిన్న బుచ్చుకొంటయి. మగ్గాలు ముడుచుకొంటయి. కంచర దుకాణాలు మూగపోతయి. పెద్దలందఱూ ఊరిమొగము చేరుతారు. చీకటినీడలు వ్యాపిస్తూన్న కొద్దీదీపాలు మిలమిల లాడుతూంటయి. అన్నివైపులా గ్రామం ఆటపాటలతో ఆనందంగాఉంటుంది. పొద్దు పోయినతరువాత రాత్రివేళ మహాభారతమునుండిగానీ, రామాయణము నుండి గానీ కీర్తనలు వినిపిస్తూంటవి.

మరునాడు సూర్యోదయంకాగానే ఇంటిముంగిట వీధిలో మామూలు పూజా పురస్కారాలు జరుపుకొని ఎవరిపనికి వారు వెళ్లిపోతారు. ఇదే పశ్చిమ ఇండియాలోని దక్షిణాపథ వర్తులైన గ్రామస్థుల ఆనందమయ నిత్యజీవితం. వారి ఆచారాలు అకృత్రిమాలు. వారిజీవితపద్ధతి నిరాడంబరం. వారిసంస్కారం మూడువేల సంవత్సరాలనుండి చెక్కుచెదరని శిల్ప

నాగరిక సాహిత్యములను మనోహరంగా ప్రబోధిస్తూన్న పరం పరాగత ప్రాచీన మతగ్రంథములనుండి గ్రహింపబడినది.

ఎవరిపనితనానికి మోహించి ప్రపంచం మూడు వేల సంవత్సరాలు ఇండియాకు ఎడతెగకుండా బంగారాన్ని ప్రవ హింపచేసిందో, ఎవ్వరు నదీప్రవాహాలను మురికిచేయక, మనోజ్ఞదృశ్యాలను పాడొనర్పక గాలిని విషపూరితము కావిం పక, ఆశ్చర్య కరములైన నగిషీపనుల నేకంచేయగలిగినారో, అసంఖ్యాకములైన తరతరాలనాటిసుశిక్షితవిద్య,ఎవరివ్యక్తిత్వ కళాకౌశలములలో పరమావధిని పొందినదో, ఆ పరంప రాగత శిల్పకారులు నేడు తమ ప్రజాపాలిత గ్రామాలను విడచి, ఎక్కువ కూలి కాశపడి మ్యాంచెస్టరుకు పోటీగా బట్టలను ఉత్పత్తి చేయపూనుకొన్న బొంబాయి మిల్లులలో దాస్యంచేయడానికి వందలకొలదీ వేలకొలదీ గుంపులు గుంపులుగా వచ్చి పడుతూన్నారు. ఇక్కడ వారి తెలివి తేటలూ, కళానైపుణ్యం అంతా వ్యర్థం.

ఆధునిక నాగరిక ప్రపంచలో యంత్రాలు చేయతగిన పనిని కించ పఱచవలెనని నా అభిప్రాయం కాదు. యంత్రం మనిషికి పరికరంగా ఉండాలి.కాని యజమానిగా ఉండరాదు. జీవితంలో ఆనందసౌందర్యములకది ఏమాత్రమూసహాయ పడ జాలదు.జీవిత నిరంతరశ్రమను తగ్గించేటందుకు దాస్యం చేయ డానికి మాత్రం పనికివస్తుందది. అందువలన ఇండియాలోనూ ఇంగ్లండులోనూ కూడా యంత్రమును హద్దులు దాటకుండా గట్టిగా అదుపులో ఉంచాలి.

ఇంగ్లాండులోని శిష్టుల అభిరుచులకు అభిప్రాయాలకు అనుగుణంగా, యంత్రాలు కళావస్తు నిర్మాణ కార్యరంగంలో అడుగు పెట్టకుండా, దానిని ప్రత్యేకం సుశిక్షిత హస్త నైపుణ్యము బుద్ధి కౌశలమూ గల శిల్పకారుల వ్యక్తిత్వమునకు వదలివేసిన యెడల, సంఘమంతటిలోనూ ఇంతకంటె ఎక్కువ సమానంగా ఐశ్వర్యం వ్యాపిస్తుంది. తమ దైనందిన వృత్తి యొక్క ఉదార ప్రభావము వలననూ, తమ సామర్థ్యము, పని తనము సంస్కారముల యెడల క్రమాభివృద్ధి పొందుతూన్న ప్రజా గౌరవము వలననూ, కార్మిక వర్గము పౌర రాజకీయ సాంఘికౌన్నత్యమును పొంది తమతో పాటు దేశమునంతనూ కూడా అత్యున్నత వర్గాలతో సమాన ప్రతిపత్తికి కొని పోగలరు. అంతే కాక ఆధునిక సభ్యతా సంపర్కంలేని ప్రాచ్య దేశ జీవితంలో నేటికిని నిలచి ఉన్నట్టిన్నీ గ్రీసులోనూ రోములోనూ ఒకప్పుడు కనిపించినట్టిన్నీ సంతోషానందములను, యూరపు కొంతవరకైనా నాడు చవి చూడగలదు.

'బి'

[భారతీయ శిల్పవృత్తిని అధికారులణచి వేసినవిధానం]

ఇ. బి. హావెల్

యూరపులో మధ్య యుగాలనాటి గొప్పగొప్ప భవన నిర్మాతలవలంబించిన శాస్త్ర పద్ధతులలో అంత చక్కని పని తనమూ చూపగలవారు, ఇండియాలో ఇప్పటికీ అనేక మంది శిల్పకారులున్నారు. వారేవిశ్వవిద్యాలయమునూ ప్రవేశించి

మెరుగరు. అసలిండియాలోని విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ యంత్రమున కవసరమైన మనుష్యులను తయారు చేయుడానికి మాత్రమే నిర్మింపబడినవి. వాటిలో శిల్పానికి గానీ మతానికి గానీ స్థానంలేదు. కాని వారి ప్రాచీనులు తాజమహాలును ఆబూపర్వత దేవమందిరాలనూ, అసంఖ్యాకములైన ఉత్తమోత్తమ నిర్మాణములనూ సృజించారు. మొగలాయి ప్రాసాదములు, ప్రభుత్వ భవనములు, వ్యావసాయిక, జలాశయాలు, అవీ ఇవీ ఏమిటి వాస్తుశాస్త్రంలో పేర్కొనబడిన ప్రజోపయోగకర నిర్మాణములన్నీ వారు కట్టినవే.

ఈ నాడు మన ప్రభుత్వశాఖ లీపనులేవిధంగా నిర్వర్తిస్తూన్నవి ? శిల్ప, కళా, శిక్షణ నైపుణ్యములు లేని కొంత మంది యువకులు, ఒక ఇనుప దూలం మోయగల అత్యధిక భారమును అంచనా వేసేటందుకు, గోడను పడకుండా ఎంత వఱకు తగ్గించ వచ్చునో ఆకనీస పరిమాణాన్ని లెక్కకట్టే టందుకు, ప్రభుత్వ సంవత్సరాదాయ వ్యయపట్టీకి లోబడి కారుచౌకగా భవనములను నిర్మించే టందుకూ కొన్నిసూత్ర సంగ్రహాలను కంఠస్థం చేసికొని ఉంటారు. ఒక ప్రభుత్వశాఖ తమకు కావలసిన భవనముయొక్క నమోనాను కాగితం మీాదగీసి స్థిరపరచినతరువాత, ఈ ఇంజనీర్లలో ఒకరు బయలు దేరి తన ప్రాచీనవస్తుశాస్త్రబుద్ధితో, దానికి కళాకాంతులు లేని ఒక ముంగిలిని ఆయాశాఖల అభిరుచుల కనుగుణంగా అమర్చి వారిగౌరవప్రతిపత్తులకు తగినట్లేదో కొంతఅలంకారంచేస్తాడు. ఎన్ని శతాబ్దాలనుండో పైతృక ధనంగా సంక్రమించిన భవన

నిర్మాణ కౌశలంగల భారతీయ శిల్పకారునకీ పాశ్చాత్య ప్రజ్ఞా నిధినుండి, కాగితపు నమోనాలను అనుకరించ వలసిన అవస్థ పట్టింది. నేత్ర పీడాకరమైన కళకంటెకూడా ప్రాచీనవస్తు శాస్త్రంలో చేయబడిన అపరాధం కొందఱికెక్కువ బాధకలిగిస్తుంది. అటువంటివారు కళ యెంత పాడవుతూన్నదో గ్రహించలేరు. కాని ఈపద్ధతివలన వ్యర్థంగా యెంత దుర్వ్యయం జరుగుతూన్నదీ తేలికగా తెలియజెప్పవచ్చును. ఇటీవల కలకత్తాలో ఒకానొక అత్యుత్తమప్రాచీన(వస్తు) శాస్త్రీయభవన నిర్మాణమునకు అనేకమంది భారతీయ శిల్పకార వృత్తిపరులు నియమింపబడినారు. వారిలో చాలామంది భవనాలకు నమోనాలు గీయకలవారు, భవనాలను కట్టగలవారు, చెక్కడపు పని చేయగలవారూ కూడా ఉన్నారు. వారు మంచి హస్త కౌశలము కళా నైపుణ్యమూ కలవారు. అయితేనేమి? ప్రభుత్వశాఖవారు తయారు చేసి పెట్టిన నమోనాను అనుసరించి పని చేయాలి వారు. అంతకుమించి వారేమీ జోక్యం కలిగించుకోకూడదు. అందులో కూడా కొంత నగిషీ పని ఉన్నది కాని, అది ఇటలీ దేశపు కళ కావడంచేత, వారిని ముట్టుకోనీయలేదు. ఐరోపా దేశపు ప్రాచీన శిల్పకళను అభ్యసించిన వారిని కొంత మందిని బొంబాయి నుండి పిలిపించి, ఈ కాగితపు నమోనాలను యంత్రప్రాయంగా అనుకరించ వలసిందని అనుజ్ఞ యిచ్చారు. వీరికి రోజుకు రెండురూపాయీలు మజూరీ ఈయబడినది. కలకత్తాకు దగ్గరగాఉన్న ఒరిస్సా జిల్లా దేశీయశిల్ప కళ కెంతో ప్రసిద్ధి వహించింది. అక్కడ ఎంత

మా ప్రచురణలు

1 హైద్రాబాదు రాజ్యాంగ సంస్కరణలు - శాసనసభ

రు 0-8-0

రచయిత :- శ్రీ కోదాటి నారాయణరావు

"ఇది చక్కని భాషలో సుబోధముగు శైలిలో వ్రాయబడి మన రాజ్యాంగ సంస్కరణలలోని వివరములను అందలి దోషములను వ్యక్త పరచజాలి యున్నది. నిజాంరాష్ట్ర ఆంధ్ర ప్రాంతములోని వారీ యుత్తమ రచనను బాగుగా చదివి లాభము పొందెదరని నమ్ముచున్నాను"

ఆంధ్ర పితామహులు

శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు

2 హైద్రాబాదు రాజ్యాంగ సంస్కరణల పాటలు.

వెల 0-1-6

"సంస్కరణల బహిష్కరణను విజయవంతం చేసిన ప్రచారగేయాలు"

3 నల్లగొండ జిల్లా ప్రజల దురవస్థలు వెల. 0-4-0

రచయిత ;- శ్రీ ద్వారకానాథ కక్రూ

'నల్లగొండ జిల్లా ప్రజలపై ప్రభుత్వం సాగించిన మిలటరీ దాడుల గాథ'

4. ధర్మయ్యబాబు (బుర్రకథ) వెల. 0-6-0

రచయిత :- శ్రీ కూరపాటి వెంకటరాజు

సం: 2
తేది: 4.12.00
హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్

త్వరలో రానున్న మా ప్రచురణలు

1. గాంధీజీ నిర్మాణ కార్యప్రణాళిక
2. హైదరాబాదు రాజ్యాంగ సంస్కరణలు-స్థానికస్వపరిపాలన
3. రికార్డు ఆఫ్ రైట్సు - రైతులు
   (వరంగల్లు - నల్లగొండ జిల్లా రైతులు ముఖ్యంగా గమనించ వలసిన విషయం)
4. హైదరాబాదుస్టేటు కాంగ్రెసు చరిత్ర
5. సత్యాగ్రహోద్యమ తత్వము - విధానము

మందో తాపీ పనివాళ్లు, భవన నిర్మాతలూ ఉన్నారు. వారు జరిగిన ఇరువై యేండ్లలో యూరపులోని మధ్యయుగం నాటి అత్యంత మనోహర భవనములతో తులతూగ గల శిల్పాలంకారముల నెన్నిటినో చిత్రించి నిర్మించారు. అవి అన్నీ కూడా, పైన నేను ఉదహరించిన ప్రాచీన ఇటలీ కలానుకరణం కంటెఎంత ఎక్కువ సౌందర్యంగా ఉన్నవి. ఈ శిల్పుల సగటాదాయము రోజుకు నాలుగణాలు——అనగా ప్రభుత్వం వారిచ్చే మజూరీలలో ఎనిమిదో వంతు. వారూ, వారి సహచర శిల్పకారులూ భారత దేశమంతటా పనిలేక బాధపడుతూన్నారు. ప్రభుత్వ శాఖలకు వారి పని పనికిరాదు. భారతీయ శిల్పం 'అన్నమో రామచంద్రా' అని అల్లాడు తూన్నది. మ్యూజియములు, ప్రదర్శనాలూ, ప్రాచీన వస్తువులూ, యిస్తూన్నాము దానికి.